

'ప్రజల జీవన ప్రమాణాలు ఇంకా మెరుగు పడాలి. అందుకు అధికారులు నిబద్ధత, పారదర్శకత, కార్యదీక్షతో పనిచేయాలి.'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 325

మంగళవారం 8-8-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఎదురులేని భారత్

ఆసియా చాంపియన్స్ హాకీ టోర్నీలో కొరియాపై గెలుపుతో సెమీస్‌లోకి -12లో



రాణించిన ఫార్మా, ఐటీ షేర్లు


సెన్సెక్స్ 232 పాయింట్ల లాభం.. 19,600 చేరువలో నిఫ్టీ - 13లో



ఎంపీగా లోక్‌సభలోకి రాహుల్

కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ దాదాపు నాలుగు నెలల తర్వాత మళ్లీ లోక్‌సభలో ఎంపీ హోదాలో అడుగుపెట్టారు.

వివరాలు 6లో ▸



మణిపూర్‌పై సుప్రీంకోర్టు కమిటీ

మణిపూర్‌లో బాధితులకు అందే సహాయం, పునరావాసం, పరిహారంపై పర్యవేక్షణకు సుప్రీంకోర్టు ఓ కమిటీని నియమించింది.

వివరాలు 6లో ▸



కాంగ్రెస్ అర్థం చేసుకోలేదు

పంచాయతీరాజ్ అవసరాన్ని కాంగ్రెస్ పార్టీ తెలుసుకోలేకపోవడం వల్లే గ్రామాల్లో వెనుకబాటుతనం ఉందని ప్రధాని మోదీ అన్నారు.

వివరాలు 6లో ▸



ఢిల్లీ బిల్లు నెగ్గింది

'గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ (సవరణ) బిల్లు' సోమవారం రాజ్యసభలో ఆమోదం పొందింది.

వివరాలు 6లో ▸

వాయువేగంతో వెలిగొండ

దాదాపుగా పూర్తి కావస్తున్న రెండో సొరంగం పనులు

- ఇప్పటికే 17.924 కి.మీ పొడవున తవ్వకం
- మిగిలిన 876 మీటర్ల పనులు అక్టోబర్‌లోగా పూర్తి
- మొదటి సొరంగాన్ని 2021 జనవరి 13 నాటికే పూర్తి చేసిన సీఎం జగన్
- నల్లమలసాగర్‌కు నీటి తరలింపు ఫీడర్ ఛానల్ ఇప్పటికే పూర్తి
- వైఎస్సార్ హయాంలోనే పూర్తయిన నల్లమలసాగర్
- శ్రీశైలం నుంచి కృష్ణా జలాలను ఈ ఏడాదే నల్లమలసాగర్‌కు తరలించేలా అడుగులు
- నాడు వెలిగొండ సొరంగాలకు మించి ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబు

- వివరాలు 14లో





సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరంలో వీఆర్‌పురం, కూనవరం మండలాల వరద బాధితులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

నిర్వాసితుల చేతుల్లో చెయ్యి కలిపి..

గొమ్ముగూడెంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన

2లో


- గతంలో ఎన్ని కష్టాలు వచ్చినా గ్రామం వైపు చూడని సీఎంలు
- తొలిసారిగా గ్రామానికి వచ్చిన సీఎం.. వైఎస్ జగనే
- గ్రామంలో వీధివీధీ తిరిగిన ముఖ్యమంత్రి
- ప్రజల కష్టసుఖాలు ఆలకించి, వారిలో భరోసా నింపిన సీఎం

2025 ఖరీఫ్‌కు పోల'వరం'

మన జీవనాడిపై కేంద్రానికి గట్టిగా అర్థమయ్యేలా చెప్పాం: సీఎం జగన్

- ఈ నెలాఖరుకు కేంద్ర కేబినెట్ ఆమోదంతో రూ.17 వేల కోట్లు రావచ్చు.. 41.5 కాంటూర్ పరిధిలో నీటినిల్వ కోసం ఆర్‌అండ్‌ఆర్ పూర్తిగా ఇస్తాం
- భూసేకరణ కింద కేంద్రం రూ.6.8 లక్షలు, మనం రూ.3.2 లక్షలు కలిపి ఇస్తాం
- గత సర్కారు కాంట్రాక్టర్లకు లబ్ధి చేకూర్చేందుకు ఇష్టం వచ్చినట్లు పనులు చేసింది
- స్పిల్‌వే పూర్తి చేయకుండా డయాఫ్రమ్‌వాల్ కట్టారు
- ఆ తప్పులన్నింటినీ సరిచేస్తూ ముందుకు సాగుతున్నాం.. అల్లూరి, ఏలూరు జిల్లాల్లో వరద ప్రాంతాల్లో బాధితులను కలుసుకున్న సీఎం

13లో



"పోలవరం నిర్మాణంలో మా ప్రభుత్వం క్రెడిట్ కోసం ఆలోచించదు. ప్రజలకు మంచి చేయడమే మా సంకల్పం. ప్రధాని నరేంద్ర మోదీకి రాసిన లేఖలో నేను ఒకటే చెప్పా.. అయ్యా! మీరే బటన్ నొక్కండి.. నేరుగా మీరే నిర్వాసితుల బ్యాంకు ఖాతాల్లోకి డబ్బులు పంపించండి..! మేమే చేయాలని ఆరాట పడటం లేదు. క్రెడిట్ ఎవరికి వచ్చినా ఫర్వా లేదు. నాకు కావాల్సిందల్లా మంచి జరగాలి. ఇంతకన్నా నాకు వేరే అవసరం లేదని చెప్పా. - సీఎం వైఎస్ జగన్

డబ్బులు మిగుల్చుకోవాలని కాదు.. అర్హులు మిగిలిపోకూడదనే తపన

2లో

మన ప్రభుత్వానికి డబ్బులు ఎలా మిగుల్చుకోవాలనే ఆరాటం లేదు: సీఎం జగన్

గుండె బరువుతో పాటకు సెలవు..



హైదరాబాద్‌లోని గన్‌పార్క్ వద్ద గద్దర్ అంతిమయాత్రకు తరలివచ్చిన అభిమానులు

ఆటపాటలు, అశ్రునయనాలతో సాగిన గద్దర్ అంతిమయాత్ర

- అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు
- బౌద్ధమత ఆచారం ప్రకారం సమాధి
- ప్రజా గాయకుడి పార్థివ దేహానికి వివిధ రంగాల ప్రముఖులు, కళాకారుల నివాళి
- గద్దర్ కుటుంబ సభ్యులకు పరామర్శ

10లో

అంతిమయాత్రలో విషాదం



సియాసత్ మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ మృతి

మళ్లీ ఉక్కపోత..

రాష్ట్రంలో వాతావరణం సెగలు కక్కుతోంది. దీనికి ఉక్కపోత కూడా తోడైంది. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడిన తర్వాత రాష్ట్రంలో ఈ వాతావరణం నెలకొంది. ఈ పరిస్థితి మరో వారం రోజులపాటు ఉండవచ్చని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.



3లో



యువ కార్మికులు(ఫైల్)

అమ్మో... భూగర్భ గనులు

సింగరేణిలో ఈ గనుల్లోనే గైర్హాజరీలు ఎక్కువ | **కారుణ్య నియామకాల్లో వచ్చిన యువతలో అనాసక్తి**

చిన్నచిన్న అనారోగ్య కారణాలు సాకుగా చూపుతూ విధులకు డుమ్మా

వీరిలోనూ ఉన్నత విద్యావంతులే అధికం.. ఒక్క వకీల్‌పల్లిగనిలోనే 60 మంది దాకా

గైర్హాజరుతో ఉద్యోగాలు కోల్పోవద్దంటున్న అధికారులు

ఆర్జీ-1 ఏరియా జీడీకే-11గనిలో ఓ యువ కార్మికుడు 2022 ఏప్రిల్‌లో ఉద్యోగంలో చేరాడు. 15 నెలల్లో 19రోజులు మాత్రమే డ్యూటీ చేశాడు. గైర్హాజర్ కౌన్సెలింగ్‌కు హాజరై తన తల్లిదండ్రుల ఆరోగ్యం బాగోలేక డ్యూటీకి రావడం లేదని కారణంగా చెప్పాడు. దీంతో గైర్హాజర్ కార్మికుల జాబితాలో ఆయన చేరాడు.

జీడీకే-11గనిలో బదిలీ వర్కర్‌గా 2015లో సింగరేణి విధుల్లో చేరాడు. ఐదేళ్ల నుంచి కనీసం వంద మస్టర్లు చేయలేదు. దీంతో ఉద్యోగం నుంచి డిస్మిస్ చేసే పరిస్థితి ఏర్పడింది. కుటుంబ సభ్యుల ఆరోగ్యం బాగోలేకే తాను డ్యూటీకి రావడం లేదని చెబుతున్నాడు.

'ఆర్జీ-2 ఏరియా వకీల్‌పల్లిగనిలో పనిచేస్తున్న యువ కార్మికుడు 2015లో కారుణ్య నియామకం ద్వారా సంస్థలో చేరాడు. డిగ్రీ పూర్తి చేసిన యువకుడికి సంబంధించి గడిచిన 8 ఏళ్లలో వంద మస్టర్లు మాత్రమే నమోదయ్యాయి. తల్లి ఆరోగ్యం బాగోలేకపోవడం వల్లే డ్యూటీకి రాలేకపోతున్నానని అంటున్నాడు.

..ఆర్జీ-2 లో వకీల్‌పల్లిగనికి చెందిన ఒకరు 2018లో ఉద్యోగంలో చేరారు. కనీసం అతను 60 డ్యూటీలు కూడా చేయలేదు. దీంతో సింగరేణి యాజమాన్యం గైర్హాజర్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని నోటీసు జారీ చేసింది. ఇటీవల గనిలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు హాజరయ్యాడు.

గోదావరిఖని: సింగరేణి భూగర్భగనుల్లో పనిచేసేందుకు యువత ఎక్కువగా మక్కువ చూపడం లేదు. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన వారే గైర్హాజరు అవుతున్న వారిలో అధికంగా ఉన్నారు. బీటెక్, ఎంటెక్, పీజీ, ఎంబీఏ, ఎంసీఏ లాంటి ఉన్నత చదువులు చదివి ప్రస్తుతం వచ్చిన ఉద్యోగాన్ని నామోషీగా భావించేవారు కొందరయితే, ఇక్కడ వర్క్ కల్చర్ ఇష్టం లేక, సిగరేణి ఆఫీసుల్లో అవకాశం రాక, లైట్ జాబ్‌ల కోసం పరుగులు తీసేవారు మరికొందరు. మూడు షిఫ్ట్‌ల విధానానికి ఇష్టపడినవారు ఇంకొందరు. సింగరేణిలో చేరిన కొద్దిరోజులకే విధులకు డుమ్మా కొట్టేవారి సంఖ్యా క్రమక్రమంగా పెరుగుతోంది. పలువురు కుటుంబసభ్యులు, తల్లిదండ్రుల అనారోగ్య కారణాలు సాకుగా చూపుతూ గైర్హాజరవుతున్నారు. ఒక్క వకీల్‌పల్లిగనిలో గైర్హాజరు అయిన వారు 60 మంది దాకా ఉన్నారు.

కారుణ్య నియామకాలు ఇలా

సింగరేణిలో పనిచేసే కార్మికుడు మెడికల్ ఇన్వాలిడేషన్ (అనారోగ్య కారణం)తో విధుల నుంచి తప్పుకుంటే వారి స్థానంలో కొడుకుకు కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం ఇస్తున్నారు. తెలంగాణ వచ్చాక 2015 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభం కాగా, ఇప్పటివరకు 11,541మంది యువత ఉద్యోగాల్లో చేరారు. విధుల్లో చేరిన నాటి నుంచి మూడేళ్ల పాటు పనిచేస్తే వారి ఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయి. అయితే సింగరేణిలో 12 ఏరియాల్లో గత మూడేళ్లలో కనీసం 100 మస్టర్లు కూడా చేయని కార్మికులు 1377 మంది ఉన్నారు.

పూర్తిస్థాయి యాంత్రీకరణ ఉన్నా..

పదేళ్ల కిందట అయితే భూగర్భగనిలోకి దిగి పైకి ఎక్కడమే ఎంతో శ్రమగా ఉండేది. తట్టాచెమ్మస్ పూర్తిగా కనుమరుగైపోయింది. సెమీ మెకనైజ్డ్, ప్రస్తుతం పూర్తిస్థాయి యాంత్రీకరణ కొనసాగుతోంది. మ్యాన్‌రైడింగ్, చైర్‌కార్, చైర్ లిఫ్ట్‌లాంటి విధానం ద్వారా భూగర్భగనిలోని పనిస్థలాల వద్దకు కార్మికులను తీసుకెళ్లి, తిరిగి తీసుకొస్తున్నారు. దీంతో కార్మికులకు నడక శ్రమ చాలా తగ్గింది. అయినా చాలామంది యువ కార్మికులు ఆఫీస్ కార్యాలయాలు, ఓసీపీలు, గనిపైన ఉన్న లైట్‌జాబ్ కోసం పైరవీలు చేస్తున్నారు.

ఏటా వంద మస్టర్లు తప్పనిసరి

సంస్థలో బదిలీ వర్కర్లుగా ఉద్యోగంలో చేరిన కార్మికులకు ఏటా భూగర్భ గనుల్లో అయితే 190 మస్టర్లు, సర్ఫేజ్‌లో అయితే 240 మస్టర్లులు ఉండాలి. అవి ఉంటేనే వారి ఉద్యోగాలు పర్మనెంట్ అవుతాయి. ఏటా వంద మస్టర్ల చొప్పున మూడేళ్ల పాటు 300 మస్టర్లుంటే ఉద్యోగానికి గ్యారెంటీ. లేనిపక్షంలో యాజమాన్యం నిబంధనల ప్రకారం ఉద్యోగం నుంచి డిస్మిస్ చేస్తుంది.



కౌన్సెలింగ్‌కు కుటుంబ సమేతంగా హాజరైన యువత



వాస్తవ కారణాలు ఉంటే సంస్థ సహకరిస్తుంది

ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగాలకు విపరీతమైన పోటీ ఏర్పడింది. సింగరేణిలో చేరిన యువత చిన్నకారణాలతో విధులకు గైర్హాజరవుతూ ఉద్యోగాలు పోగొట్టుకోవద్దు. ఏదైనా వాస్తవ కారణాలుంటే సంస్థ కూడా సహకరిస్తుంది. సంస్థలో యువకార్మికులు పెరుగుతున్న క్రమంలో సంస్థ మరింత లాభాల బాటలో పయనించాలి. కారణాలేవైనా సంస్థ ఉద్యోగం పోగొట్టుకుని ఉద్యోగితో పాటు కుటుంబం వీధిన పడటం సరికాదు.

-బలరాం, డైరెక్టర్(పా), సింగరేణి

కొబ్బరి పొట్టు.. లాభాలు పట్టు

కొబ్బరి పొట్టుకు పెరిగిన ధర

5లో

రకాన్ని బట్టి టన్ను రూ.2,500 నుంచి రూ.26 వేల వరకు.. కోకోపీట్ బ్లాక్ ధర కేజీ రూ.25 నుంచి రూ.55

ఉత్తరాది నర్సరీల్లో మట్టికి బదులుగా కొబ్బరి పొట్టు వినియోగం

ఇతర దేశాలకూ ఎగుమతి



ఎంఎస్ఎంఈల్లో రికార్డు స్థాయిలో ఉపాధి

- 2022-23లో లక్ష్యాన్ని మించి 231 శాతం అదనంగా ఉద్యోగావకాశాలు
- 1,56,252 మందికి ఉపాధి లక్ష్యం కాగా
- 3,61,172 మందికి ఉద్యోగాలు
- గతేడాది 92,707 యూనిట్ల ద్వారా 9,677 కోట్ల పెట్టుబడులు

5లో

'ఫల'ప్రదం





- ఏజెన్సీ సీతాఫలాలకు పెరిగిన మార్కెట్
- దివాన్ చెరువుకు తీసుకొచ్చి వ్యాపారం
- చాగల్నాడు ప్రాంతంలో తగ్గిన సాగు

రాజానగరం: సీతాఫలం.. రుచిలో ప్రత్యేకం. అందుకే అందరికీ అమితమైన ఇష్టం. ఈ మధుర ఫలాలకు ఒకప్పుడు చాగల్నాడు ప్రధాన కేంద్రం. ఇక్కడ లభించే సీతాఫలాలు రూపంలో ఆకర్షిస్తూ, రుచిలో మైమరపిస్తుంటాయి. ఈ కాలంలో వీటి కొనుగోలుకు అందరూ ఆసక్తి చూపుతూంటారు. రియల్ ఎస్టేట్ పుణ్యామా అని చాగల్నాడు ప్రాంతంలో సీతాఫలాల సాగు చాలా వరకూ తగ్గిపోయింది. దీంతో ఏజెన్సీ సీతాఫలాలను ఇక్కడకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం, రంగంపేట, గండేపల్లి, రాజమహేంద్రవరం రూరల్, కోరుకొండ మండలాలు చాగల్నాడు ప్రాంతంలోకి వస్తాయి. ఇక్కడ పండిన సీతాఫలాలను విశాఖ, విజయవాడ, కాకినాడ, అమలాపురం, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాలతో పాటు దేశ రాజధాని ఢిల్లీ వరకూ బుట్టల్లో ప్యాక్ చేసి రవాణా చేసేవారు. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న దివాన్ చెరువు ఈ సీజన్లో సీతాఫలాల కొనుగోలు, అమ్మకందారులతో కిక్కిరిసిపోయేది. ఈ కారణంగానే ఈ ప్రాంతం పండ్ల విక్రయ కేంద్రంగా పేరొందింది. ఆ గ్రామం నేడు వివిధ రకాల పండ్ల హోల్‌సేల్ వ్యాపార కేంద్రంగా కూడా అభివృద్ధి చెందింది. దాదాపు 15 ఏళ్ల కిందట ఈ సీజన్‌లో (వంద ఫలా లు రూ.100 నుంచి రూ.150 ఉన్న రోజులు) దివా న్ చెరువు పరిసర ప్రాంతాల్లో రూ.3.5 కోట్ల వ్యా పారం జరిగేది. ఇప్పుడు రియల్ ఎస్టేట్ ప్రభా వంతో ఇక్కడ తోటలు తగ్గిపోయాయి. ఫలితంగా ఏజెన్సీ ప్రాంతాల నుంచి సీతాఫలాలను తీసుకు వచ్చి ఇక్కడ చాగల్నాడు మార్కెట్లో విక్రయిస్తున్నారు.

జూలై నుంచి అమ్మకాలు

ఏజెన్సీలో వర్షాలు అధికంగా కురుస్తూండటంతో జూన్ నెలాఖరు నుంచి అక్కడ సీతాఫలాలు లభిస్తూంటాయి. వీటిని స్థానిక వ్యాపారులు జూలై నుంచి ఇక్కడకు తీసుకువచ్చి విక్రయిస్తారు. అక్టోబర్ వరకూ వీటి దిగుబడి ఉండడంతో సుమారు రూ.8.50 కోట్ల వరకూ అమ్మకాలు జరుగుతున్నాయి. అక్టోబర్‌లో చాగల్నాడు ఫలాలు లభించినప్పటికీ మార్కెట్లోకి రాకుండానే తోటలోనే వాటి అమ్మకాలు జరిగిపోతూంటాయి. ఈవిధంగా సుమారు రూ.కోటిన్నర వరకూ స్థానిక ఫలాల అమ్మకాలు ఉంటాయి.

ఆ రుచే వేరు

చాగల్నాడు సీతాఫలాలపై ఆధారపడిన చిరు వర్తకులు సీజన్‌లో ఖాళీగా ఉండలేక ఈ సమయంలో ఏజెన్సీలో విరివిగా దొరికే పండ్లను ఇక్కడకు తీసుకువచ్చి, సొమ్ము చేసుకుంటున్నారు. చాగల్నాడులో పండే సీతాఫలాలు పక్వానికొచ్చిన తరువాతే చెట్ల నుంచి కోస్తారు. దీంతో ఇవి కొనుగోలుదారులను ఆకట్టుకుంటాయి. నిల్వకు పనికిరావు. ప్రస్తుతం ఏజెన్సీ నుంచి వస్తున్న సీతాఫలాలు కాయలుగా ఉండి, నిల్వకు పనికి వస్తాయి. కొనుగోలు చేసి, ఇంటికి తీసుకువెళ్లిన తరువాత ఒక్కొక్కటిగా ముగ్గుతూంటాయి. ప్రస్తుతం ఏజెన్సీ సీతాఫలాలకు దళారులు చెప్పిందే ధరగా పలుకుతోంది. రాజానగరం నుంచి రాజమహేంద్రవరం వరకూ ఈ సీజన్‌లో సుమారు 3,500 మంది చిరు వ్యాపారులకు ఇవే జీవనాధారం. రోడ్డు పక్కన స్టాల్స్ ఏర్పాటు చేసి, కాయలను సైజుల వారీగా గ్రేడింగ్ చేసి, డజను రూ.200 నుంచి రూ.400 వరకూ విక్రయిస్తున్నారు.

అలవాటు మానుకోలేక..

సీజన్ వారీగా లభించే పండ్లు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాం. సుమారు పాతికేళ్లుగా ఈ సీజన్‌లో సీతాఫలాలను విక్రయిస్తున్నాం. అలవాటైన ఈ పని వదులుకోలేక, మరో పని చేయలేక ఏజెన్సీలో సీతాఫలాలు కొనుగోలు చేసి, ఇక్కడ వ్యాపారం చేస్తున్నాం.

– చాట్ల తాతారావు, వెలుగుబంద, రాజానగరం మండలం

గిట్టుబాటు కావడం లేదు

రోజంతా సీతాఫలాల విక్రయాల కోసమే స్టాల్ పెట్టుకుని కూర్చుంటే దినసరి కూలీ కూడా గిట్టుబాటు కావడం లేదు. ఏజెన్సీ నుంచి వచ్చే కాయలను దళారులు చెప్పిన ధరకు కొనుగోలు చేసినా, విక్రయించే సమయంలో ఒక్కోసారి అయినకాడికే అమ్ముకోవాల్సి వస్తోంది.

– పసల సురేష్, కలవచర్ల, రాజానగరం మండలం

మా కన్నీళ్లు తుడిచేది మీరే



వరదకు ముందే మా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర అధికారులందరూ వచ్చి మమ్మల్ని సురక్షిత ప్రాంతాలకి పంపించారు. అవసరమైన నిత్యావసరాలు అన్నీ ఇచ్చారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా వరద నీళ్లలో వచ్చి మరీ సాయం అందించడం జగనన్న వచ్చాకే జరుగుతోంది. మా కన్నీళ్లు తుడిచేది మీరే.

– కె.లక్ష్మి, కూనవరం మండలం, శబరికొత్తగూడెం గ్రామం

ఇంటింటికీ వచ్చి సరుకులు ఇచ్చారు



వరద నీళ్లలోనే వలంటీర్లు మా ఊర్లో ఇంటింటికీ వచ్చి నిత్యావసర సరుకులను అందజేశారు. ఎమ్మెల్సీ అనంతబాబు, ఎమ్మెల్యే ధనలక్ష్మి కష్ట సమయంలో మాకు అండగా నిలబడ్డారు. పోలవరం ప్యాకేజీ త్వరగా ఇచ్చి మాకు న్యాయం చేయాలి. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీలందరికీ ఒకేచోట తాడ్వాయిలో ఇళ్లు ఇచ్చారు. మేము కూడా కూలీ చేసుకుంటూ బ్రతుకుతున్నాం. అందరికీ ఒకేచోట ఇవ్వడం వల్ల పనులు దొరకడం కష్టంగా ఉంది. అందుకని గోకవరం వైపు బీసీ నిర్వాసితులకు ఇళ్లు ఇవ్వాలని కోరుకుంటున్నాం. జగనన్న ఆశీర్వాదం మాకు కావాలి.

– రజనీ, గృహసారథి, చింతరేవుపల్లి, వీఆర్ పురం మండలం

అన్ని నిత్యావసరాలు అందించారు



మా కలెక్టర్ జగనన్నలాగే నవ్వుతూ మాకు సాయం అందిస్తున్నారు. వరదల్లో తిప్పలు పడుతున్న మాకు కొవ్వొత్తి నుండి నిత్యావసరాల వరకూ 12 రకాల వస్తువులను వలంటీర్లు అందించారు. నాడు మహానేత వైఎస్సార్ సర్వే చేసి ముంపు గ్రామాలను 275 నుండి 340 చేశారు. జగనన్న ప్రభుత్వం వచ్చాక మరికొన్ని గ్రామాలను కలిపారు. నాడు వైఎస్సార్ తెచ్చిన చట్టం కారణంగా **పోలవరం ముంపు ప్రాం**తాల్లో ఆదివాసీలకు భూములొచ్చాయి. ఆ భూములకు త్వరగా మ్యాపింగ్ చేసి, సాగులోకి తెస్తే ఆదివాసీలకు వెంటనే ఉపాధి దొరుకుతుంది. ఫారెస్ట్ రైట్స్ త్వరితంగా క్లియరెన్స్ చేసి ఆదివాసీలకు మేలు చేయాలి. నిర్వాసితుల కాలనీల్లో ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించి, రోడ్లు మెరుగుపరిస్తే బావుంటుంది.

– గాంధీబాబు, వీఆర్ పురం

కలెక్టర్ స్పందన

వి.ఆర్ పురం, కూనవరం మండలంలో 6 కొత్త రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. వీటికి ఫారెస్ట్ క్లియరెన్స్ కూడా పూర్తయిందని, వర్షాలు తగ్గగానే పనులు మొదలవుతాయని వివరించారు. 11 రోడ్లలో వీఆర్ పురం నుండి చింతూరు, కూనవరం నుంచి చింతూరు కనెక్టివిటీ కూడా త్వరలో పూర్తవుతుందని చెప్పారు.

అందరికీ డబ్బులు అందాయి



వరదల సమయంలో జగనన్న పంపిన డబ్బులు అందరికీ అందాయి. కలెక్టర్, రెవెన్యూ, పోలీస్, ఎమ్మెల్యే అందరూ ఎంతో బాగా పనిచేసారు. కష్టకాలంలో మా గ్రామాలను ఆదుకున్నారు. మా కూనవరం మండలంలో 6 గ్రామాలే ఆర్ అండ్ ఆర్ సర్వేలో ఉన్నాయి. మిగిలిన గ్రామాలను కూడా సర్వేలో భాగం చేయాలి. చుట్టూ నీళ్లు ఉండటం వల్ల ఎటూ వెళ్లలేకపోతున్నాం. ఏ పనీ చేసుకోలేకపోతున్నాం. అందరూ చిన్న రైతులే. జూన్ నుండి ఆగస్టు లోపు పంట వేస్తేనే పండుతుంది. లేకుంటే వ్యవసాయం చేసే పరిస్థితి లేదు. కనుక త్వరగా మాకు ఆర్ అండ్ ఆర్ అందించి ఆదుకోవాలి.

– పార్వతి, జగ్గవరం గ్రామ సర్పంచ్

సానుకూలంగా స్పందించిన సీఎం

ముంపు మండలాల్లో సర్వే గురించి కొన్ని గ్రామాల ప్రజల విజ్ఞప్తులపై సీఎం జగన్ సానుకూలంగా స్పందించారు. 41.15 మీటర్ల దాకా నీరు వచ్చినప్పుడు ఏ గ్రామాల నుంచి నీళ్లు వెళతాయో లైడార్ సర్వే ద్వారానే నిర్ణయిస్తారని తెలిపారు. గతంలో ఒక్క గ్రామమే ఉన్న చోట లైడార్ సర్వేతో 10 గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటించారన్నారు. కాస్త ఆలస్యం అయినప్పటికీ మిగిలిన గ్రామాలనూ సర్వేలో చేర్చే ప్రయత్నం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు.

భూములకు వెళ్లడానికి దారి చూపండి



లింగాలపల్లిలో మాకు ఇచ్చే భూములను చూపించారు. అవి చాలా బావున్నాయి. కానీ ఆ గ్రామాల వాళ్లు మేము వెళ్లకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. మాకు దారి చూపండి.

– కన్నమ్మ, వెంకన్నగూడెం గ్రామం

కలెక్టర్ స్పందన

నిర్వాసితులకు సంతృప్తికరంగా ఉండేలా, వ్యవసాయానికి అనుకూలమైన మంచి పంట భూములను అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. భూముల యజమానులకు పరిహారం పూర్తిగా ఇచ్చాకే భూములను నిర్వాసితులకు అందిస్తామని తెలిపారు.

మాటిస్తే చేస్తారు



జగనన్న అంటే నాకెంతో అభిమానం. ఆయన ఫొటోను నా ఫోన్‌లోనే కాదు, గుండెల్లోనూ పెట్టుకుంటాను. ఆయన కులం, మతం, పార్టీ చూడకుండా అందరికీ సంక్షేమాన్ని అందిస్తున్నారు. ఎక్కడా ఒక్క రూపాయి అవినీతి, లంచం లేవు. నేను గతంలో ఆటో నడిపేవాడిని. జగనన్నవల్లే సర్పంచ్ అయ్యాను. మా ముంపు మండలాల ప్రజలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ త్వరగా **అందాలి. జగనన్న మాటిస్తే** చేస్తారు. ఆయన్నే అడగాలని ప్రజలంతా అంటున్నారు. వైఎస్సార్ 15 ఏళ్ల క్రితం పోలవరం కోసం భూములు తీసుకున్నప్పుడు రూ.1.15 లక్షలు పరిహారం ఇచ్చారు. వారికి కూడా జగనన్న మరో రూ.5 లక్షలు ఇస్తానని చెప్పడం మాకు చాలా సంతోషంగా ఉంది. పరిహారం విషయంలో మ్యుటేషన్ సమస్యలను తొలగించాలని కోరుతున్నాం.

– సున్నం అభిరాం, చిన్నారకూర్ సర్పంచ్

అవినీతికి ఆస్కారం లేకుండా అందరికీ లబ్ధి



వరదల సమయంలో మాకోసం నాయకులు, అధికారులు ఎంతో బాగా పనిచేసారు. ఏ కొరతా లేకుండా చూసుకున్నారు. ప్రపంచంలో అవినీతి లేని వ్యవస్థ లేదు. రాష్ట్రంలో మాత్రం ఏమాత్రం అవినీతి జరక్కుండా బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారులకు మేలు చేసే వ్యవస్థని జగనన్న సృష్టించారు. మా వీఆర్ పురం, కూనవరం, చింతూర్, ఏటపాక మండలాల నిర్వాసితుల తరపున ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు. ఆర్ అండ్ ఆర్ తీసుకోవడంలో వారసులకు ఎదురవుతున్న మ్యుటేషన్ సమస్యను ప**రిష్కరిస్తామని కలెక్టర్ హామీ** ఇచ్చారు. గ్రామ సభల్లో వలంటీర్లు దరఖాస్తులు, వినతులు అన్నిటినీ నమోదు చేస్తారని, ఆ సమయంలోనే గ్రామ సర్పంచ్, ఇతర అధికారుల సంతకాలను తీసుకుంటామన్నారు. దీనివల్ల మ్యుటేషన్ కోసం డెత్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలనే నిబంధన ఉండదని తెలిపారు.

– పిట్టా రామారావు, సర్పంచ్



గోదావరి నది కోత ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్

నిర్వాసితుల చేతుల్లో చెయ్యి కలిపి..

గొమ్ముగూడెంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పర్యటన ● ప్రజల కష్టసుఖాలు ఆలకించి, వారిలో భరోసా నింపిన సీఎం జగన్



ఏలూరు జిల్లా గొమ్ముగూడెంలో వరదల ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సీఎం వైఎస్ జగన్



గొమ్ముగూడెంలో ఓ అవ్వతో సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: నిరుపేదలకు అండగా ఉండటంలో, వారిలో భరోసా నింపడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎవరూ సాటిరారు. సోమవారం ఏలూరు జిల్లా పర్యటనలో ఈ విషయం మరోసారి నిరూపితమైంది. జిల్లాలోని కుకునూరు మండలం గొమ్ముగూడెం గ్రామానికి ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రీ రాలేదు. ఇక్కడి ప్రజలకు ఎన్ని కష్టాలు వచ్చినా ఏ సీఎం గ్రామానికి రాలేదు. తొలిసారిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ గ్రామానికి వచ్చారు. నిర్వాసితుల చేతుల్లో చేయి కలిపి గ్రామంలో వీధి వీధీ నడిచారు. కిలోమీటరున్నర దూరం కాలినడకన గ్రామంలో తిరిగారు. కష్టాల్లో ఉన్న గ్రామస్తులను పలకరించారు. వారి కష్టాలు విన్నారు. వారిలో మనోధైర్యాన్ని నింపారు.

సీఎం వైఎస్ జగన్ సోమవారం మధ్యాహ్నం 3.15 గంటలకు హెలిప్యాడ్ నుంచి నేరుగా గ్రామానికి వెళ్లారు. కాలినడకన గ్రామంలో తిరిగారు. గోదావరి వరద బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రతి ఒక్కరితో మాట్లాడారు. వారికి అందుతున్న ప్రభుత్వ సాయం గురించి తెలుసుకున్నారు. కందిపప్పు, బియ్యం, పాలు, కూరగాయలు, రూ.2 వేల నగదు అందరికీ అందాయా? ఇంకా ఎవరైనా అందని వారున్నారా? అధికారులు పూర్తిగా సాయం చేస్తున్నారా? లేదా? అని ప్రజలను సీఎం ప్రశ్నించగా.. అందరూ ముక్తకంఠంతో అన్నీ బాగా అందాయని చెప్పారు. ఈ గ్రామంలో మొత్తం 250 కుటుంబాలున్నాయి. వీరందరికీ ఆర్ అండ్ ఆర్ వ్యక్తిగత పరిహారం రూ.6.36 లక్షలు, ఇంటి విలువలు (స్ట్రక్చర్ వాల్యూస్) మొత్తం రూ.18 కోట్లు వారి ఖాతాల్లో జమ అయ్యాయి.

అన్నీ ఇచ్చారు



మా గ్రామం మారుమూల ప్రాంతం. ఏ ముఖ్యమంత్రీ రాలేదు. ఈ రోజు మీరు వచ్చినందుకు పాదాభివందనాలు. మీరు సీఎంగా వచ్చిన తర్వాత నాలుగేళ్లగా వరదల సమయంలో మమ్మల్ని ముందుగానే ఆదుకుంటున్నారు. మీరు చేపట్టిన చర్యల వల్ల మాకే నష్టం జరగలేదు. మాకు అన్నీ వస్తున్నాయి. వరదలకు ముందే ట్రాక్టర్లు పంపించి మా సామాన్లు మొత్తం రాయకుంట కాలనీ, ఆర్ అండ్ ఆర్ కాలనీకి తరలించారు. అక్కడ మాకు అన్ని సదుపాయాలు వచ్చాయన్నా. కూరగాయలు, నిత్యావసర సరుకులు, రూ.2 వేల డబ్బు ఇచ్చారు. భోజనాలను ఆర్డీవో, పీవో దగ్గరుండి వండించి పెట్టారు. రెండు నెలలకు సరిపడా బియ్యం, నిత్యావసరాలు అందించారు. మంచి నీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు. అన్నీ సమకూర్చుతున్న మీరే ఎప్పటికీ ముఖ్యమంత్రి కావాలి.

– కె.ప్రమీల, గొమ్ముగూడెం

ఇంతలా ఎవరూ పట్టించుకోలేదు



మమ్మల్ని ఇంతలా ఎవరూ పట్టించుకోలేదు. సంతోషంగా ఉంది. ఈ రోజు ఆర్ అండ్ ఆర్, స్ట్రక్చర్ వాల్యూ అన్నీ పడ్డాయి. అందరి తరపునా మీకు ధన్యవాదాలు తెలుపుతున్నా. గత ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వలేదు. కనీసం ప్రజలు ఎలా ఉన్నారో కూడా పట్టించుకోలేదు. ఇప్పుడు మీరు వరద బాధితుల కోసం వచ్చారు. మీరు అందించే ప్రతి ఒక్కటీ మాకు అందుతోంది. వరద ముంపు బాధలు మాకు లేవు. గతంలో వైఎస్సార్ హయాంలో నష్టపరిహారం అందింది. మళ్లా ఇప్పుడు మీ హయాంలో అందింది. 18 సంవత్సరాలు ఉన్నవారికి పరిహారం ఇస్తామని చెప్పారు. ఇదే సమయంలో 41 కాంటూరు లెవల్‌లో ఉన్న సుమారు 10 గ్రామాలు వరద ముంపునకు త్వరగా గురవుతున్నాయి. వాటిని ఫస్ట్ ఫేజ్‌లో తీసుకోవాలి. 45 లెవల్‌లో ఉన్న వాటిలో మౌలిక వసతులు కల్పించుకునేలా మాకు అవకాశాలు కల్పించండి. రోడ్లు, డ్రెయిన్‌లు ఏమీ లేవు. మేము ఉన్నంత వరకు ఆ సౌకర్యాలు ఏర్పాటు చేయాలి.

– రావు మీనా, కుకునూరు, సర్పంచ్

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి: ముంపు గ్రామాలకు సంబంధించి లైడార్ సర్వే చేశారు. కేంద్ర ప్రభుత్వం లైడార్ సర్వే ప్రకారం పరిహారం చెల్లిస్తారు. ఒక సంవత్సరం ఆగితే రెండో ఫేజ్‌లో సమస్య పూర్తవుతుంది. అలాగే 45 లెవల్ ఉన్న వాటిపై పరిశీలిస్తాం.

నా కష్టాలు తీర్చారు



అమ్మ ఒడి, ఆసరా, సున్నా వడ్డీ, డ్వాక్రా, వెలుగు, రైతు భరోసా పథకాలతో ఆనందం ఇచ్చావు. నాకు కష్టాల్లో ఆదుకుంది ఇద్దరే ఇద్దరు. నన్ను కన్న నా తల్లి, మా అన్న జగనన్న. నా కష్టాలు తీర్చారు.

– ధరాల తరుణ, గొమ్ముగూడెం

ఉద్యోగాలు వచ్చాయంటే ఆ ఘనత మీదే సార్



వేలేరుపాడు వచ్చినప్పుడు మా సమస్యను మీ దృష్టికి తెచ్చాం. ఏడు మండలాల్లో మున్నూరు కాపు రిజర్వేషన్ కోల్పోయి ఉద్యోగాలన్నీ కోల్పోతున్నామని మీకు చెప్పాం. ఆ రోజు స్టేజ్ మీదే అమలు చేయించారు. ఈరోజు ఉద్యోగాలు వచ్చాయంటే అది మీ ఘనతే సార్. మాకు ఒకటే నమ్మకం. మీ దృష్టికి సమస్య వస్తే అది క్షణాల్లో పరిష్కారమవుతుందని మా నమ్మకం. భద్రాచలం – అశ్వారావుపేట రోడ్డు సమస్య మీ దృష్టికి తీసుకువచ్చాం. తక్షణమే జీవో పాస్ చేసి చేశారు. ఈ విషయంలో మీకు రుణపడి ఉంటాం.

– మాదిరాజు వెంకన్నబాబు, కుకునూరు

న్యాయం చేయండి



నాన్ రెసిడెంట్ పేరుతో గత ప్రభుత్వంలో పేర్లు తీసివేశారు. చదువు కోసం, ఉపాధి కోసం వేరే చోటికి వెళ్లాం. గత ప్రభుత్వంలో కక్ష సాధింపుగా పేర్లు తీసివేశారు. కట్కూరు, కొయిదా, చిగురుమామిడి తదితర ప్రాంతాలకు చెందిన వారిని పరిహారానికి అనర్హులుగా డిక్లేర్ చేశారు. వారికి ఇక్కడే ఆధార్, రేషన్‌కార్డు, ఇతర పత్రాలు ఉన్నాయి. కటిక పేదరికంతో ఉన్న కుటుంబాలు. వారికి న్యాయం చేయండి.

– కాసగాని శ్రీనివాస గౌడ్, వేలేరుపాడు

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి: ఆధారాలు అన్నీ సక్రమంగా ఉంటే రీవెరిఫికేషన్ చేయండని సీఎం జగన్ అధికారులను ఆదేశించారు. మానవతా దృక్పథంతోనే ఉండాలని, వారికి న్యాయం జరిగేలా చూడండని చెప్పారు.

డబ్బులు మిగుల్చుకోవాలని కాదు.. అర్హులు మిగలకూడదనే తపన!

- మన ప్రభుత్వానికి డబ్బులు ఎలా మిగుల్చుకోవాలనే ఆరాటం లేదు: సీఎం జగన్
- అర్హులందరికీ సాయం అందాలని తపించే ప్రభుత్వమిది..
- అధికార యంత్రాంగాన్ని ఫొటోల కోసం నా చుట్టూ తిప్పుకోకుండా బాధితుల వద్దకు ముందే పంపించా
- అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో వరద ప్రాంతాల్లో సీఎం పర్యటన
- బాధితులను కలుసుకుని సహాయ చర్యల అమలును స్వయంగా పరిశీలించిన సీఎం



అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరంలో మాట్లాడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: 'మనందరి ప్రభుత్వానికి డబ్బులు ఎలా మిగుల్చుకోవాలనే తాపత్రయం లేదు. అర్హులు ఏ ఒక్కరూ మిగిలిపోకూడదనే తపన మాత్రమే ఉంది. మీ జగన్‌లో కల్మషం లేదు.. ఎప్పుడైనా సరే మంచి చేయడం కోసమే ఆరాట పడతాడని, పోరాటం చేస్తాడని తెలియజేస్తున్నా. దేవుడు ఆశీర్వదిస్తే ఎన్నికలకు వెళ్లేలోపు ఆరేడు నెలల్లో పోలవరం నిర్వాసితులకు కేంద్రం నుంచే కాకుండా రాష్ట్రం నుంచి కూడా ప్యాకేజీ అందుతుంది. మీ బిడ్డ మీకోసం గట్టిగా కృషి చేస్తున్నాడు. లైడార్ సర్వేతో కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాడు. గత పాలకులకు జ్ఞానోదయం కలిగిస్తున్నాం..' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సోమవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సీఎం జగన్ బాధితులను కలుసుకుని పరామర్శించారు. క్షేత్రస్థాయిలో సహాయ చర్యలను స్వయంగా పరిశీలించారు. సీఎం జగన్ తొలుత ఉదయం 10.50 గంటలకు కూనవరం మండలం కోతులగుట్టకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. వరద నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. సహాయక చర్యలపై అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. అనంతరం కూనవరం బస్టాండ్ సెంటర్‌కు వెళ్లి కూనవరం, వీఆర్‌పురం మండలాల వరద బాధితులతో సమావేశమయ్యారు. ఆ తరువాత పోలవరం నియోజకవర్గం కుకునూరు మండలంలో పూర్తిగా దెబ్బతిన్న గొమ్ముగూడెం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఏమన్నారంటే..

ఫొటోల కోసం నా చుట్టూ తిప్పుకోకుండా..

వారం క్రితం గోదావరి పొంగి ప్రవహించడంతో దాదాపు 16 లక్షల క్యూసెక్కుల వరద వచ్చింది. కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ముందుగానే అప్రమత్తం చేశాం. అధికారులకు కావాల్సిన వనరులను సమకూర్చి వారం పాటు సహాయ కార్యక్రమాలను ఏమాత్రం అలసత్వం లేకుండా నిర్వహించాలని చెప్పాం. కలెక్టర్లకు సదుపాయాలు కల్పించి గ్రామ సచివాలయాల నుంచి వలంటీర్ల దాకా అందరినీ యాక్టివేట్ చేశాం. ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా సహాయం అందేలా చర్యలు తీసుకున్నాం. వరదలు వచ్చినప్పుడు అప్పటికప్పుడు హడావుడిగా పర్యటించి ఫొటోలు దిగి వెళ్లిపోవడం కాకుండా కలెక్టర్లకు తగినన్ని నిధులు, సమయం ఇచ్చి సహాయ చర్యల్లో యంత్రాంగాన్ని పూర్తిగా నిమగ్నం చేశాం. వారం రోజుల్లో వారంతా ప్రతి గ్రామంలోకి వెళ్లి ఏ ఒక్క ఇల్లూ మిగిలిపోకుండా బాధితులందరికీ సహాయం అందించే కార్యక్రమాలు జరిగాయి. అధికార యంత్రాంగాన్ని నా చుట్టూ తిప్పుకోకుండా బాధితుల వద్దకు పంపించి సహాయ చర్యలను సమర్థంగా పర్యవేక్షించాం. ఇంతకు ముందూ ఇదే చేశాం.. ఇప్పుడూ చేస్తున్నాం.

సాయం అందకుంటే చెప్పండి

మీ కలెక్టర్ బాగా పని చేశారా? అని మిమ్మల్నందరినీ అడుగుతున్నా. ఎవరైనా నిర్భయంగా ముందుకు రావచ్చు. మీకు జరగాల్సిన మంచి జరగని పరిస్థితి ఎక్కడైనా ఉంటే నేరుగా నాకు చెప్పవచ్చు. ఇంత గొప్పగా, పారదర్శకంగా ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని తాపత్రయపడే ప్రభుత్వం మనది. మనందరి ప్రభుత్వానికి డబ్బులు ఎలా మిగుల్చుకోవాలనే తాపత్రయం లేదు. అర్హులు ఏ ఒక్కరూ మిగిలిపోకూడదనే తపన, తాపత్రయమే ఉంది. ఇళ్లలోకి నీళ్లు వస్తే బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులన్నీ ఇవ్వడమే కాకుండా రూ.2 వేలు చొప్పున అందించాం. అలా జరగకపోతే నాకు చెప్పవచ్చు. ఇళ్లలోకి నీళ్లు రాకపోయినప్పటికీ గ్రామాలు కటాఫ్ అయిపోయి ఉంటే ఆ ఇళ్లకు రేషన్ ఇవ్వాలని ఆదేశాలిచ్చాం. 25 కేజీల బియ్యం, కందిపప్పు, పామాయిల్, పాలు, కూరగాయలు లాంటి ఐదు రకాలు కలిపి ఇవ్వాలని సూచించాం. బాధితులు ఎవరికైనా అందకపోతే చెప్పవచ్చు. ప్రభుత్వం దానికి జవాబుదారీతనం తీసుకుంటుంది.

పొరపాటున పేరు లేకపోతే..

కచ్చా ఇళ్లు పాక్షికంగా లేదా పూర్తిగా దెబ్బ తిన్నాయనే వ్యత్యాసం ఉండకూడదని చెప్పాం. పేదల పట్ల ఎలాంటి వ్యత్యాసం చూపవద్దని, నష్టపోయిన ప్రతి ఇంటికీ రూ.10 వేలు చొప్పున ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చాం. గ్రామ సచివాలయాల్లోనే అర్హుల జాబితాలు పెడుతున్నాం. ఒకవేళ ఎన్యూమరేషన్ ఖాతాలోకి రాకపోయి ఉంటే అది కూడా తప్పే అవుతుంది. నష్టం జరిగినా పొరపాటున జాబితాలో పేరు లేకపోతే వెంటనే అందులో చేర్చి మంచి జరిపించే కార్యక్రమం చేయడం కోసమే మీ జగన్ మీ దగ్గరకు వచ్చాడు.

ఏ ఒక్కరికి ఏ కష్టమొచ్చినా..

ఈ ప్రభుత్వం మీది అని తెలియజేస్తున్నా. మీరంతా తోడుగా ఉన్నారు కాబట్టే మీ బిడ్డ ఈరోజు సీఎం స్థానంలో కూర్చున్నాడు. మీలో ఏ ఒక్కరికి ఏ కష్టమొచ్చినా దాన్ని తీర్చడం కోసం ఎల్లవేళలా కృషి చేస్తా. పోలవరానికి సంబంధించిన విషయాలన్నీ ఈ పద్ధతిలోనే జరిగిపోతాయి. వరద సమయంలో మీకు ఎలా సాయం అందింది? కలెక్టర్ ఎలా చేశారో మీరే చెప్పారు. కూనవరం ఎస్‌ఐ వెంకటేశ్ గురించి మంచి విషయాలు విన్నా. గొప్పగా ఆదుకున్నారని విన్నా. ఆగస్టు 15న ఇచ్చే పతకాల్లో ఆయన పేరు ఉండాలని కలెక్టర్‌కు సూచించా.

అధికారులను నిలదీసేందుకు రాలేదు

నేను ఇక్కడకు అధికారులను నిలదీయడానికి రాలేదు. అధికారులను శభాష్ అని వెన్ను తట్టేందుకు, మీ దగ్గర నుంచి మంచి సమాధానాలు వస్తాయని వినడం కోసం వచ్చా. కలెక్టర్ మాత్రమే కాకుండా ఎస్పీ నుంచి ఎస్‌ఐ దాకా సచివాలయ సిబ్బంది నుంచి వలంటీర్ దాకా రెవెన్యూ సిబ్బంది నుంచి మొత్తం అందరూ బాగా కష్టపడ్డారు. సకాలంలో స్పందించిన అధికార యంత్రాంగాన్ని అభినందిస్తున్నా. ఇంత కష్టాల్లో ఉన్నప్పటికీ నాపై ప్రేమాభిమానాలు చూపుతున్న ప్రతి అక్కకు చెల్లెమ్మకు, ప్రతి అవ్వకు తాతకు, ప్రతి సోదరుడికి స్నేహితుడికీ చేతులు జోడించి కృతజ్ఞతలు తెలియచేస్తున్నా. సీఎం పర్యటనలో హోంమంత్రి తానేటి వనిత, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్ సిన్హా తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరానికి సీఎం జగన్

- ముగిసిన తొలిరోజు వరద ప్రభావిత ప్రాంతాల పర్యటన
- సాయంత్రం రాజమండ్రి రాక.. రాత్రికి అక్కడే బస
- ఇద్దరు బాధితులకు సీఎం ఆసరా
- నేడు కోనసీమ జిల్లాలో పర్యటన

సాక్షి, రాజమహేంద్రవరం: గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో రెండు రోజుల పర్యటనలో భాగంగా సీఎం వైఎస్ జగన్ తొలి రోజు సోమవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు జిల్లాల్లో పర్యటించారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో పర్యటించనున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో వరద బాధితులను పరామర్శించిన అనంతరం సీఎం వైఎస్ జగన్ సోమవారం సాయంత్రం 6.24 గంటలకు హెలికాప్టర్‌లో రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ సీఎం వైఎస్ జగన్‌కు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి సీఎం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌కు చేరుకొన్నారు. రాత్రి అక్కడే బస చేశారు.

బాధితులకు అండగా..

హెలిపాడ్ నుంచి గెస్ట్ హౌస్‌కు వచ్చే మార్గంలో సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు ప్రజలు బారులు తీరారు. రోడ్లకు ఇరువైపులా నిలుచొని ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. సీఎం జగన్ వారికి అభివాదం చేశారు. దారిలో ఇద్దరు అనారోగ్య బాధితులను పలకరించారు. వారి సమస్య విని తక్షణం సహాయం చేయాలని జిల్లా కలెక్టర్ మాధవిలతను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో కలెక్టర్ ఆ కుటుంబాలకు వైద్య సేవల నిమిత్తం ఒక్కొక్కరికీ రూ. లక్ష సాయం అందజేశారు.

కోనసీమ జిల్లాలో పర్యటన ఇలా..

సీఎం జగన్ మంగళవారం ఉదయం 9 గంటలకు రాజమహేంద్రవరంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం నుంచి ఆర్ట్స్ కళాశాలకు చేరుకుంటారు. 9.10కి ఆర్ట్స్ కళాశాల వద్ద హెలికాప్టర్‌లో బయలుదేరి 9.40కి బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గురజపులంక చేరుకుంటారు. 10.25 వరకు గ్రామంలో వరద ప్రభావిత గ్రామాల ప్రజలతో ముఖాముఖి నిర్వహిస్తారు. 10.35కు రామాలయపేటకు రోడ్డు మార్గానికి చేరుకుని, 11.10 వరకు రామాలయపేటలో వరద బాధితులతో మాట్లాడతారు. 11.10 గంటలకు అక్కడి నుంచి అయినవిల్లి మండలం కొండుకుదురు గ్రామానికి చేరుకుంటారు. 11.20 నుంచి 11.50 గంటల వరకు అక్కడ వరద బాధితులతో మాట్లాడతారు. 11.50 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి రోడ్డు మార్గంలో గురజపు లంక గ్రామానికి 12.15 గంటలకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో తాడేపల్లికి వెళతారు.

క్లుప్తంగా...

నేతన్నలకు జాతీయ చేనేత దినోత్సవ శుభాకాంక్షలు: సీఎం జగన్

సాక్షి,అమరావతి: చేనేత మన సాంస్కృతిక వారసత్వంలో అంతర్భాగం. నా పాదయాత్రలో వాగ్దానం చేసినట్టుగా వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రారంభించాం.. అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. నేత కార్మికులకు సంవత్సరానికి రూ.24 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాం. చేనేత కార్మికుల అభ్యున్నతే మా నిబద్ధత. రాష్ట్రంలో చేనేతకు స్వర్ణయుగాన్ని తెచ్చాం. నేతన్నలకు గత వైభవాన్ని పునరుజ్జీవింపచేస్తున్నాం. వారికి సుసంపన్నమైన భవిష్యత్తును అందిస్తున్నాం.. అంటూ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం జగన్ నేతన్నల ఘనతను కొనియాడారు. వారికి శుభాకాంక్షలు తెలిపారు. చేనేత పరిశ్రమ మనదేశ సంస్కృతికి ప్రతిబింబమని, స్వదేశీ ఉద్యమం ద్వారా జాతిని ఏకం చేసిన చరిత్ర చేనేతలదన్నారు. చేనేతల అభ్యున్నతికి చిత్తశుద్ధితో ఉన్నామంటూ సోమవారం సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

గిరిజన యువతకు స్ఫూర్తి సాకే భారతి

ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు



ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన సాకే భారతి

సాక్షి, అమరావతి: పేదరికాన్ని జయించి రసాయన శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టాను సాధించిన సాకే భారతి గిరిజన యువతకు స్ఫూర్తిగా నిలిచిందని ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు తెలిపారు. సోమవారం విజయవాడలోని కమిషన్ కార్యాలయానికి సాకే భారతి వెళ్లి చైర్మన్ శంకరరావును కలిశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ భారతికి ఎస్టీ కమిషన్ అవసరమైన సహకారం అందిస్తుందన్నారు. భారతి మాట్లాడుతూ తనకు ప్రభుత్వం రెండెకరాల పొలం ఇచ్చిందని కృతజ్ఞత తెలియజేసింది. తనకు జూనియర్ లెక్చరర్ పోస్టు ఇస్తానని అధికారులు చెప్పారని, కానీ కృష్ణదేవరాయ యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టు ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. ఈ కార్యక్రమంలో ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్, కమిషన్ సెక్రటరీ ఎంఎం గంగాధర్ ఉన్నారు.

పోలవరం నిర్వాసితులకు పునరావాసం కేంద్రం బాధ్యత

జంతర్‌మంతర్ వద్ద సీపీఎం ధర్నాలో సీతారాం ఏచూరి



సాక్షి, న్యూఢిల్లీ: పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలంటే నిర్వాసితులకు పునరావాసం, పరిహారానికి ప్రాధాన్యత ఇవ్వాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అయినందున పునరావాసం, పరిహారం కోసం అవసరమైన వనరులను సమకూర్చడం కేంద్రం బాధ్యతని చెప్పారు. పోలవరం నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని, పరిహారం చెల్లించాలని కోరుతూ సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీపీఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితులకు పరిహారం, పునరావాసంపై సమస్యలు ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించుకోవాలని సూచించారు. సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హనీట్రాప్‌లో స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్

ఉక్కునగరం: దేశ రహస్యాల కోసం జరిగే హనీట్రాప్‌లో ఓ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ చిక్కాడు. అతను పనిచేసిన ప్రాంతంలోని రహస్యాలను తెలుసుకునేందుకు పాకిస్తాన్ మహిళ విసిరిన వలలో చిక్కడం ద్వారా దేశ రహస్యాలు తరలివెళ్లాయని ఇంటెలిజెన్స్ వర్గాలు భావిస్తున్నాయి. 2022లో స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్‌గా బదిలీపై వచ్చిన కపిల్‌కుమార్ జగదీష్‌భాయ్ మురారీ అంతకు ముందు భారత డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్)లో పనిచేశారు. అతడికి పాకిస్తాన్‌కు చెందిన తమీషాతో సోషల్ మీడియాలో పరిచయం అయింది. అతడు రహస్య సమాచారాన్ని చేరవేసినట్లు ఇంటెలిజెన్స్ అధికారులు తెలపడంతో స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ అధికారులు కపిల్ కుమార్ మూడు మొబైళ్లను స్వాధీనం చేసుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అతనిపై స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేశారు.

విశాఖలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురు మృతి

ఎంవీపీకాలనీ (విశాఖ): విశాఖ బీచ్‌రోడ్డులో సోమవారం రాత్రి జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృత్యువాత పడ్డారు. ఏసీపీ మూర్తి తెలిపిన వివరాల మేరకు నగరానికి చెందిన ఐదుగురు యువకులు మద్యం సేవిస్తూ సాగరనగర్ వైపు నుంచి రుషికొండ వైపు కారులో అతివేగంగా వెళ్తున్నారు. రాడిషన్ బ్లూ హోటల్ టర్నింగ్ వద్ద డివైడర్‌ని, చెట్టుని ఢీకొని బైక్‌ను ఢీకొట్టారు. దీంతో బైక్‌పై వస్తున్న భార్యాభర్తలు రాయగడకు చెందిన సింగారపు పృథ్వీరాజ్ (28), ప్రియాంక్ (21) అక్కడికక్కడే మృతి చెందారు. కారులో వెనుకవైపు కూర్చున్న యువకుడు పీఎం పాలెంకు చెందిన మజ్జి మణికుమార్ మరణించాడు. గాయపడిన మరో యువకుడిని కేజీహెచ్‌కు తరలించారు.

మళ్లీ ఉక్కపోత..

సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు

వారం రోజులు ఇదే పరిస్థితి



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో వాతావరణం మళ్లీ సెగలు కక్కుతోంది. కొద్దిరోజుల నుంచి ఉష్ణ తీవ్రత అధికమై పగటి పూట ఎండ చుర్రుమంటోంది. వర్షాకాలంలో ఇలాంటి వాతావరణం అరుదుగా కనిపిస్తుంది. మరోవైపు ఉష్ణతాపానికి ఉక్కపోత కూడా తోడవుతోంది. ఇది ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తోంది. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలహీనపడిన తర్వాత రాష్ట్రంలో ఈ వాతావరణం నెలకొంది. వారం రోజులుగా ఇదే పరిస్థితి ఉంటోంది. ఉదయం 9 గంటలు దాటితే చాలు.. ఎండ ఊపందుకుని సాయంత్రం వరకు కొనసాగుతోంది. కొన్నాళ్లుగా రాష్ట్రంలో తేలికపాటి జల్లులే తప్ప ఆశించిన స్థాయిలో వర్షాలు కురవడం లేదు. పైగా మేఘాలు కూడా అంతగా ఏర్పడటం లేదు. ఫలితంగా సూర్యుడి నుంచి నేరుగా కిరణాలు పడటం వల్ల ఉష్ణోగ్రతలు పెరిగి ఎండల ప్రభావం కనిపిస్తోందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితి మరో వారం రోజులపాటు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు. సాధారణంగా ఆగస్టు మొదటి వారంలో అల్పపీడనాలు ఏర్పడి వర్షాలు విస్తారంగా కురుస్తాయి. కానీ.. అందుకు భిన్నంగా ఇప్పుడు వానలకు బదులు ఎండలు కాస్తున్నాయి. ప్రస్తుతం రాష్ట్రంపైకి నైరుతి గాలులు వీస్తున్నాయి. ఈ గాలుల్లో వర్షాలు కురిపించేటంత తేమ ఉండటం లేదు. దీంతో వానలకు ఆస్కారం ఉండకపోగా ఉక్కపోత కూడా ఇబ్బంది పెడుతోంది.

40 డిగ్రీలకు చేరువలో..

రాష్ట్రంలో ప్రస్తుతం సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఫలితంగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు చేరువలో రికార్డవుతున్నాయి. సోమవారం బాపట్లలో అత్యధికంగా 39 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. ఇది సాధారణం కంటే 5.2 డిగ్రీలు అధికం. ఇంకా పలుచోట్ల 35నుంచి 38 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో ఉష్ణతీవ్రత కొనసాగుతుందని, అసౌకర్యంతో కూడిన వాతావరణం ఉంటుందని భారత వాతావరణ శాఖ సోమవారం తెలిపింది. సాధారణం కంటే 3–5 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అదే సమయంలో కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఒకట్రెండు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా జల్లులు గాని కురిసే అవకాశం ఉందని వివరించింది.

29 నుంచి పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

- మొత్తం 14,989 మందికి ఆరు విడతలుగా శిక్షణ
- ప్రతి బ్యాచ్‌కు ఆరు రోజులు... ఆరు కీలక అంశాలపై తర్ఫీదు
- జిల్లా, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో నిర్వహణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న 14,989 మంది కార్యదర్శులకు ఈ నెల 29వ తేదీ నుంచి ఏపీ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ శిక్షణ సంస్థ (ఏపీ ఎస్ఐఆర్‌డీపీఆర్) ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. గ్రేడ్–1 నుంచి గ్రేడ్–5 కార్యదర్శుల వరకు అందరికీ ఆరు కీలక అంశాలపై శిక్షణ ఇస్తారు. ప్రతి బ్యాచ్‌కు ఆరు రోజులు చొప్పున ఆరు వారాలపాటు జిల్లా, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో ఈ శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ మేరకు ఏపీ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఏపీ పంచాయతీరాజ్ చట్టంలోని అంశాలతోపాటు గ్రామ పంచాయతీల పరిధిలో కొత్తగా లే అవుట్ల ఏర్పాటు–అమలులో ఉన్న నిబంధనలు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు–భూ రక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ కంఠాల పరిధిలోని ఇళ్ల యజమానులకు హక్కు పత్రాల జారీకి సంబంధించిన అంశాలు, క్షేత్ర స్థాయిలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన, ఉపాధి హామీ పథకం అమలు, ఉద్యోగుల విధి నిర్వహణ–క్రమశిక్షణ చర్యలు తదితర ఆఫీసు నిబంధనలపై శిక్షణ ఇస్తారు. ఒక్కో మండలంలో ఉన్న మొత్తం పంచాయతీల్లో మూడో వంతు కార్యదర్శులను (గరిష్టంగా 50 మంది) ఒక బ్యాచ్‌గా ఎంపిక చేసి ఎక్కడికక్కడ జిల్లా, రెవెన్యూ డివిజన్ కేంద్రాల్లో శిక్షణ ఇస్తామని ఏపీ ఎస్ఐఆర్‌డీపీఆర్ అధికారులు వెల్లడించారు. ఇందుకోసం మాస్టర్ ట్రైనర్స్‌గా పంచాయతీరాజ్ శాఖలో కొందరిని ఎంపిక చేసి ఇప్పటికే శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. మాస్టర్ ట్రైనర్స్‌కు ఐదు అంశాలపై శిక్షణ పూర్తయిందని, వైఎస్సార్ జగనన్న భూ హక్కు–భూ రక్షకు సంబంధించిన అంశంపై సోమవారం నుంచి పదో తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.

ఈ దారుణానికి బాధ్యులెవరు?

- టీడీపీ దాడుల్లో కంటిచూపు కోల్పోయిన కానిస్టేబుల్
- శస్త్రచికిత్స చేసి చూపురాదని తేల్చిన వైద్యులు
- మరో కన్ను కూడా చూపు కోల్పోవచ్చంటున్న డాక్టర్లు
- హేయమైన చర్యగా పుంగనూరులో టీడీపీ విధ్వంసకాండ



అరవింద్ ఐ హాస్పిటల్లో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ రణధీర్

చిత్తూరు అర్బన్: చిత్తూరు జిల్లా పుంగనూరు పట్టణంలో మూడ్రోజుల క్రితం టీడీపీ నేతల మారణహోమ పథకం బెడిసికొట్టినా.. వాళ్లు చేసిన గాయాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. ఇప్పటికే ఏఎస్పీ, డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలతో సహా 27 మంది గాయపడ్డ ఈ ఘటనలో.. సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన రణధీర్ అనే స్పెషల్ పార్టీ పోలీస్ (ఎస్టీఎఫ్) కానిస్టేబుల్ మాత్రం తన కంటిచూపును కోల్పోయారు. మరో కన్ను కనిపిస్తున్నా చూపు కోల్పోయే ప్రమాదముందని వైద్యులు చెప్పడం కంటనీరు తెప్పిస్తోంది. ప్రస్తుతం తిరుపతి అరవింద కంటి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రణ్‌ధీర్ గురించి 'సాక్షి' సేకరించిన వివరాలు.. అనంతపురానికి చెందిన రణధీర్ ఖాకీ యూనిఫామ్‌పై ఉన్న ఆసక్తితో 2013లో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. సత్యసాయి జిల్లాలో ఉద్యోగం చేస్తూ ఈనెల 3 నుంచి చంద్రబాబు పర్యటనలో తన సహచరులతో కలిసి పుంగనూరులో బందోబస్తు డ్యూటీకి వచ్చారు. నాలుగో తేదీ శుక్రవారం టీడీపీ కిరాయి సేనలు మద్యం మత్తులో పోలీసులపై చెప్పులు, బాటిళ్లు విసురుతున్నారు. విధుల్లో ఉన్న రణధీర్, ఇతర పోలీసులు తమ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు టీడీపీ కార్యకర్తలను సర్దిచెప్పి పంపే ప్రయత్నం చేస్తున్నారు. కానీ, ఒక్కసారిగా అల్లరిమూకలు రాళ్లతో దాడిచేయడంతో రణధీర్ బృందం వెనక్కు వచ్చేసింది. ఉన్నతాధికారులకు దెబ్బలు తగలకుండా అడ్డుగా నిలిచారు. ఒక్కసారిగా టీడీపీ కార్యకర్తలు రాళ్లు, మద్యం బాటిళ్లు, టపాకాయ బాంబులు విసురుతున్నారు. దీంతో ఓ డీఎస్పీకి అడ్డుగా నిలబడి తీసుకెళ్తున్న రణధీర్‌కు ఓ రాయి వచ్చి నేరుగా కంటిని తాకింది. కంటి నుంచి రక్తం ధారలుగా కారిపోతూ, భరించలేని నొప్పిని అనుభవించాడు. రెండు కళ్లు కనిపించలేదు. హుటాహుటిన పోలీసులు రణధీర్‌ను పుంగనూరు ఆసుపత్రికి తీసుకెళ్తే పరిస్థితి బాలేదని, తిరుపతికి వెళ్లాలని సూచించారు. తిరుపతి అరవింద కంటి ఆసుపత్రిలో రణధీర్‌కు ఎంఆర్ఐ స్కాన్ తీశారు. రాయి కంటిని తీవ్రంగా తాకడంతో ఎడమకంటి నల్లగుడ్డు, తెల్లగుడ్డు దెబ్బతిన్నాయి. లోపలున్న సున్నితమైన నరాలు తెగిపోయాయి. ఫలితంగా ఓ కన్ను కనిపించదని వైద్యులు తేల్చిచెప్పేశారు. నరాలు తెగిపోవడంవల్ల కుడి కన్ను సైతం చూపు కోల్పోయే అవకాశముందని.. దీనికి మందులిచ్చి, ఆ ప్రమాదం రాకుండా ప్రయత్నం చేస్తున్నామని వైద్యులు చెప్పారు. రణధీర్ తన దుఃఖాన్ని దిగమింగుకుని.. ''సార్, మా అమ్మ, నాన్న ఇద్దరూ పేషెంట్లు. నేను ఉద్యోగం చేసి, కుటుంబాన్ని పోషించాలి. పోలీసు ఉద్యోగమంటే గౌరవం పెంచాలని ఖాకీ డ్రెస్ వేసుకున్నాను. ఇప్పుడు చూపుపోయింది. ఇప్పుడు నా బాధంతా నాకు కంటిచూపు పోయిందని నా ఇద్దరు పిల్లలకు ఎలా చెప్పాలో అర్థంకావడంలేదు సర్..'' అంటూ కన్నీటి పర్యంతమవుతున్నారు. పోలీసులపై దాడిలో పైశాచిక ఆనందం పొందిన టీడీపీ నేతలు.. రణధీర్ జీవితాంతం అనుభవించే బాధకు ఏం బదులిస్తారు? కళ్లెదుటే పోలీసు వాహనాలను పచ్చమూకలు తగులబెడితే ప్రమాదవశాత్తు కాలిపోయాయని పిచ్చి రాతలు రాసిన 'ఈనాడు'కు రణధీర్ లాంటి పోలీసుల కన్నీళ్లు కనిపించకపోవడం ఆ కంటికి పచ్చ కామెర్లు వచ్చినట్లే అవుతుంది.

రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు 50 శాతం రిబేటుపై చేనేత వస్త్రాలు

రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత వెల్లడి



చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత

సాక్షి, అమరావతి: రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు 50 శాతం రిబేటుపై చేనేత వస్త్రాలను సచివాలయంలోని ఆప్కో విక్రయశాల ద్వారా ఈ నెలాఖరు వరకు విక్రయించనున్నట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత ప్రకటించారు. సోమవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేనేత కార్మికులను ప్రోత్సహించేందుకు ఉద్యోగులు ప్రతి శనివారం చేనేత వస్త్రాలను తప్పనిసరిగా ధరించాలనే విధానాన్ని అమలు పరిచారని గుర్తు చేశారు. అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఇకపై ప్రతి శుక్రవారం ఉద్యోగులు అంతా చేనేత వస్త్రాలను ధరించాలని ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ ఎంఎం నాయక్, రాష్ట్ర సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కె.వెంకట్రామిరెడ్డి మాట్లాడారు. చేనేత వస్త్రాలు ధరించేందుకు ఉద్యోగులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో చేనేత వస్త్రాలు ధరించిన మహిళా, పురుష ఉద్యోగులను లాటరీ ద్వారా ఎంపిక చేసి సరళ, కనకదుర్గ, సునీత, ఇమామ్ వలీ, మోహనరావు, ప్రసాద్‌కు బహుమతులను అందజేశారు.

నేతన్నలను ఆదుకున్న ప్రభుత్వం

రాష్ట్రంలో చేనేత రంగాన్ని ఆదుకునేలా ప్రభుత్వం అనేక చర్యలు చేపట్టిందని.. ప్రధానంగా 'వైఎస్సార్ నేతన్న నేస్తం' పథకం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మరింత ఊతమిచ్చారని చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి కె.సునీత స్పష్టం చేశారు. చేనేత జాతీయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజయవాడ స్టెల్లా కాలేజీ ఆడిటోరియంలో చేనేత వారోత్సవాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సునీత మాట్లాడుతూ.. సేంద్రియ పద్ధతుల్లో తయారైన చేనేత వస్త్రాలకు విదేశాల్లో సైతం మంచి ఆదరణ ఉండటంతో ఆ దిశగా పత్తి రైతులు, చేనేత కార్మికులను సన్నద్ధం చేస్తున్నామన్నారు. ప్రపంచంలో వినియోగిస్తున్న చేనేత వస్త్రాల్లో 95 శాతం మన దేశంలోనే తయారైనవేనని, చేనేతలో దేశంలో ఆంధ్రప్రదేశ్ 6వ స్థానంలో ఉందని వెల్లడించారు. చేనేత వస్త్రాలకు జీఎస్టీ మినహాయించేలా కేంద్రంతో రాష్ట్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోందన్నారు. ఈ నెల 12 వరకు నిర్వహిస్తున్న చేనేత ప్రదర్శన, సబ్సిడీపై విక్రయాలను ప్రజలు ఉపయోగించుకోవాలని సునీత కోరారు.

1.75 లక్షల మందికి ఉపాధి

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మాట్లాడుతూ..రాష్ట్రంలో చేనేత రంగం 1.75 లక్షల మందికి ఉపాధి చూపుతోందన్నారు. ఈ రంగాన్ని ఆదుకోవడంలో సీఎం వైఎస్ జగన్ చేపట్టిన చర్యలు మంచి ఫలితాలిచ్చాయన్నారు. చేనేత, జౌళి శాఖ కమిషనర్ ఎంఎం నాయక్ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేతకు ఎంతో మద్దతునిస్తూ ప్రతి జిల్లాలో ఒక ముఖ్యమైన ఉత్పత్తిని గుర్తిస్తూ వన్ డిస్ట్రిక్ వన్ ప్రొడక్ట్ అనే కార్యక్రమాన్ని చేపట్టాయన్నారు. ఏపీ ఫైబర్ గ్రిడ్ చైర్మన్ పి.గౌతంరెడ్డి, ఆప్కో మాజీ చైర్మన్లు గంజి చిరంజీవి, చిల్లపల్లి మోహనరావు, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, ఆప్కో జీఎం తనూజారాణి మాట్లాడారు.

ఓటమి భయంతోనే చంద్రబాబు విధ్వంసకాండ

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు మల్లాది విష్ణు



నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే విష్ణు తదితరులు

పాయకాపురం (విజయవాడ రూరల్): ఓటమి భయంతోనే టీడీపీ అధినేత చంద్రబాబు తన పార్టీ శ్రేణులను విధ్వంసకాండకు ఉసిగొల్పుతున్నాడని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. పుంగనూరులో టీడీపీ శ్రేణుల దుశ్చర్యను ఖండిస్తూ విజయవాడలోని పైపులరోడ్డు జంక్షన్‌లో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ పుంగనూరులో పక్కా ప్లాన్‌తోనే పోలీసులపై టీడీపీ కార్యకర్తలతో చంద్రబాబు దాడులు చేయించాడని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాను దాడులు చేయించి, ఇతరులపై ఆ నెపాన్ని నెట్టడం చంద్రబాబుకు కొత్తేమీ కాదన్నారు. రానున్న ఎన్నికల్లో ఘోర ఓటమిని ముందే పసిగట్టిన చంద్రబాబు ఉద్దేశపూర్వకంగానే ప్రాజెక్టుల సందర్శన పేరుతో రాష్ట్రంలో అలజడులు సృష్టించేందుకు కుట్ర పన్నినట్లు స్పష్టమవుతోందన్నారు. శ్రీకాళహస్తి ఘటనపై రాద్ధాంతం చేసిన జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్.. పుంగనూరులో 40 మంది పోలీసులకు తీవ్రగాయాలైతే కనీసం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. డిప్యూటీ మేయర్ శ్రీశైలజారెడ్డి, కార్పొరేటర్లు విజయలక్ష్మి, రమాదేవి వెంకట్రావ్, ఉండి షాహినా సుల్తానా హఫీజుల్లా, ఇసరపు దేవి రాజారమేష్, యరగొర్ల తిరుపతమ్మ, మోదుగుల తిరుపతమ్మ, అనిత రమేష్, బాలి గోవింద్, లక్ష్మీపతి, జానారెడ్డి, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ విధ్వంసకాండపై నిరసన

విశాఖలోని తాటిచెట్లపాలెం జంక్షన్‌లో మానవహారం



తాటిచెట్లపాలెం జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణుల మానవహారం

తాటిచెట్ల పాలెం (విశాఖ): రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడంతో పాటు ఇటీవల పుంగనూరులో జరిగిన విధ్వంసకాండకు కారణమైన చంద్రబాబు, టీడీపీ వైఖరిని నిరసిస్తూ సోమవారం విశాఖ నగర శివారు తాటిచెట్లపాలెం హైవే జంక్షన్ వద్ద వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో భారీ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయ కర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజు మాట్లాడుతూ.. విచక్షణ, నిబద్ధత, నిజాయితీ ఏ మాత్రం లేని వ్యక్తి చంద్రబాబు అన్నారు. ఏదోవిధంగా కుట్రలు పన్నుతూ అధికారంలోకి రావాలనే ప్రయత్నాలు చేస్తూ రాష్ట్రంలో అల్లర్లు సృష్టిస్తున్నారన్నారు. తమ నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రం అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో శాంతికాముకుడిగా ఉండబట్టే వీళ్ల ఆటలు సాగుతున్నాయన్నారు. తమ నాయకుడు కనుసైగ చేసినా, చిన్నమాట చెప్పినా టీడీపీ నాయకులు ఎక్కడో ఉండేవారని హెచ్చరించారు. ఇప్పటికైనా చంద్రబాబు రాష్ట్రాభివృద్ధికి ఆటంకం కలిగించకుండా హుందాగా రాజకీయాలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్రావు, యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిరణ్‌రాజు పాల్గొన్నారు.

ఏఐ ఆధారిత విద్యాబోధనపై కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయండి

విద్యా శాఖ అధికారులకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశం



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో విద్యాశాఖలో కృత్రిమ మేధస్సు ఆధారిత విద్యాబోధన అంశం, దాని కార్యాచరణపై సోమవారం రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) జవహర్‌రెడ్డి రాష్ట్ర విద్యా శాఖ అధికారులతో సమీక్షించారు. సీఎస్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సును విద్యాబోధనలో ఏ విధంగా అమలు చేయాలనే దానిపై పాఠశాల, కళాశాల విద్యా శాఖలు తగిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. దీని అమలుకు సంబంధించి ఇటు విద్యార్థుల్లోనూ, అటు తల్లిదండ్రుల్లోనూ పూర్తి స్థాయిలో కెపాసిటీ బిల్డింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించి టెక్నికల్ బోర్డులను కూడా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని, దానిపై తగిన ప్రతిపాదనలను పంపాలని సీఎస్ ఆదేశించారు. ప్రస్తుతం మొబైల్ యాప్‌ల నుంచి ఆన్‌లైన్ కోర్సుల వరకు విద్యలో కృత్రిమ మేధస్సు వినియోగం విపరీతంగా పెరుగుతోందన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు విద్యా వ్యవస్థలో ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్)అమలుపై ఆసక్తి చూపుతున్నారని, వారికి కృత్రిమ మేధస్సు గురించి అవగాహన కలిగించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి శ్యామలరావు మాట్లాడుతూ కృత్రిమ మేధస్సుపై అన్ని విశ్వవిద్యాలయాల్లోను ప్రత్యేకంగా సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ కేంద్రాన్ని, టెక్నికల్ ల్యాబ్, పరిశోధనకు సంబంధించి వీఆర్, ఏఆర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు హేమచంద్రారెడ్డి, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో పులివెందులలో బనానా ప్రాసెసింగ్ క్లస్టర్

వైఎస్సార్ జిల్లా పులివెందులలో త్వరలో బనానా ప్రాసెసింగ్ క్లస్టర్ ఏర్పాటు కానుందని సీఎస్ జవహర్‌రెడ్డి తెలిపారు. ఇందుకు రూ.121 కోట్లు వ్యయమవుతుందన్నారు. బనానా ప్రాసెసింగ్ క్లస్టర్‌పై ఆయన సోమవారం రాష్ట్ర సచివాలయంలో అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ సూక్ష్మ, చిన్నతరహా, మధ్యతరహా పరిశ్రమల విభాగానికి చెందిన సాంప్రదాయ పరిశ్రమల పునరుత్పత్తి కోసం నిధి పథకం ఆధ్వర్యంలో క్లస్టర్ ఏర్పాటవుతుందన్నారు. ఈ క్లస్టర్‌లో ఏడాదికి లక్షా 8 వేల మెట్రిక్ టన్నుల అరటి పండ్లను వివిధ రూపాల్లో ప్రాసెస్ చేయొచ్చన్నారు. ముఖ్యంగా యూనిట్ ద్వారా స్థానికంగా లభించే అరటి పండ్లు, వాటి కాండాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. వాటిని వివిధ రూపాల్లో తయారు చేసి.. వాటికి మరిన్ని విలువ ఆధారిత సేవలు జోడించడం ద్వారా రైతులకు అదనపు ఆదాయం వచ్చేలా చేయడమే లక్ష్యమని వెల్లడించారు. అరటి కాండాల నుంచి ఫైబర్ తీసే యంత్రాలను రైతుల వద్దకు పంపాలని ఆదేశించారు. రాష్ట్ర ఆహారశుద్ధి శాఖ కార్యదర్శి చిరంజీవి చౌదరి మాట్లాడుతూ స్థానిక రైతుల నుంచి అరటి పండ్లను సేకరించి వాటిని బనానా పౌడర్, బనానా స్టెమ్ జ్యూస్, తేనె డిప్ చేసిన డ్రై బనానా స్లైసెస్‌గా తయారుచేసి మార్కెటింగ్ చేస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆహారశుద్ధి సొసైటీ సీఈవో ఎల్.శ్రీధర్ రెడ్డి, డిప్యూటీ సీఈవో డి.రమేశ్, పులివెందుల బనానా ప్రాసెసింగ్ యూనిట్ కన్సల్టెంట్ స్వపన్ సిద్ధాంత్, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ జీఐఎస్ కన్సల్టెంట్ లిఖిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈడీది కోర్టు ధిక్కారం కాదా?

- మా ఆధ్వర్యంలో జరిగిన వేలంలో వ్యక్తులు కొన్న ఆస్తులను ఎలా జప్తు చేస్తారు?
- ఇది కోర్టు పాలనలో జోక్యం చేసుకోవడమే
- ఈడీ తీరును తీవ్రంగా ఆక్షేపించిన హైకోర్టు
- అగ్రిగోల్డ్ ఆస్తుల జప్తుపై ముగిసిన వాదనలు

సాక్షి, అమరావతి: స్వయంగా హైకోర్టు ఆధ్వర్యంలో, స్వీయ పర్యవేక్షణలో జరిగిన వేలంలో ప్రైవేటు వ్యక్తులు కొనుగోలు చేసిన అగ్రిగోల్డ్ ఆస్తులను సైతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జప్తుచేయడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఈ ఆస్తులను ఎలా జప్తు చేస్తారని ఈడీని ప్రశ్నించింది. ఇది కోర్టు ధిక్కారం కాదా? అని నిలదీసింది. ఓ రకంగా చెప్పాలంటే ఇది కోర్టు పాలనలో జోక్యం చేసుకోవడమేనని స్పష్టం చేసింది. హైకోర్టు వేలంలో ఆస్తులు కొన్నవారు మీరు (ఈడీ) జప్తు చేసిన ఆస్తులను విడుదల చేయాలంటూ అధికారుల చుట్టూ తిరుగుతూ ఉండమంటారా? అని ప్రశ్నించింది. ఇది కొనుగోలుదారులను ఇబ్బందులకు గురిచేయడం తప్ప మరొకటి కాదని తేల్చిచెప్పింది. ఈ మేరకు డిపాజిటర్లకు చెల్లింపులు ఎగవేయడంతో సీఐడీ గతంలో జప్తు చేసిన అగ్రిగోల్డ్ సంస్థ ఆస్తులను ఈడీ మరోసారి జప్తుచేస్తూ జారీ చేసిన ప్రాథమిక ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పలు వ్యాజ్యాల్లో వాదనలు ముగిశాయి. అలాగే అగ్రిగోల్డ్ కుంభకోణానికి ముందే గతంలో తాము కొన్న ఆస్తులను సీఐడీ జప్తు చేయడాన్ని సవాల్ చేస్తూ పలువురు దాఖలు చేసిన వ్యాజ్యాల్లో కూడా వాదనలకు తెరపడింది. సీఐడీ, ఈడీ, బ్యాంకుల తరపు న్యాయవాదుల వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తీర్పు వెలువరించేంతవరకు ఈడీ అడ్జుడికేటింగ్ అథారిటీ ముందున్న ప్రొసీడింగ్స్‌ను నిలిపేస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగిస్తున్నట్లు పేర్కొన్నారు.

జప్తు చేసే అధికారం మాకు ఉంది: ఈడీ


ఈడీ న్యాయవాది భాస్కరరావు వాదనలు వినిపిస్తూ.. ఏపీ డిపాజిటర్ల పరిరక్షణ చట్టం కింద సీఐడీ జప్తు చేసిన ఆస్తులను తిరిగి జప్తు చేసే అధికారం మనీలాండరింగ్ చట్టం కింద తమకు ఉందన్నారు. అగ్రిగోల్డ్ యాజమాన్యం తరపు న్యాయవాది సురేష్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. తమ సంస్థ పేరు మీద ఉన్న ఆస్తులను విక్రయించడం గానీ, ఆ ఆస్తులపై థర్డ్‌పార్టీ హక్కులు సృష్టించడంగానీ చేయరాదని హైకోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు. తాము సైతం ఆస్తులను విక్రయించబోమని హైకోర్టుకు హామీ ఇచ్చామని చెప్పారు. ఆ ఆస్తులను ఇప్పటికే సీఐడీ సైతం జప్తుచేసిందని.. అలాంటప్పుడు వాటిని తిరిగి ఈడీ జప్తుచేయాల్సిన అవసరం లేదన్నారు. బ్యాంకుల న్యాయవాది ద్యుమని వాదనలు వినిపిస్తూ.. భూమి కొనుగోలు కోసం తాము రుణం ఇచ్చామని, అందువల్ల ఆ భూములపై తమకు హక్కు ఉంటుందని చెప్పారు. వాటిని జప్తు చేయడం తగదని తెలిపారు.

డిపాజిటర్ల ప్రయోజనాలే ముఖ్యం: సీఐడీ

చివరగా సీఐడీ తరఫున రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ) ఎస్.శ్రీరామ్ వాదనలు వినిపిస్తూ.. డిపాజిటర్ల ప్రయోజనాలను కాపాడేందుకు ఏపీ డిపాజిటర్ల పరిరక్షణ చట్టం తీసుకొచ్చామన్నారు. తమకు డిపాజిటర్ల ప్రయోజనాలు మాత్రమే ముఖ్యమన్నారు. మనీలాండరింగ్‌తో తమకు ఏమాత్రం సంబంధం లేదని తెలిపారు. ఈడీ జప్తు చేయడానికంటే చాలా ఏళ్ల క్రితమే తాము అగ్రిగోల్డ్ ఆస్తులను జప్తు చేశామన్నారు. అలాగే బ్యాంకులిచ్చిన రుణాలతో కూడా తమకు సంబంధం లేదన్నారు. అగ్రిగోల్డ్ ఆస్తులపై తమకే మొదటి హక్కు ఉంటుందని చెప్పారు.

'కనక'దుర్గమ్మ

- ఇంద్రకీలాద్రికి బంగారు, వెండి కానుకల వెల్లువ
- బ్యాంక్ డిపాజిట్‌గా 195 కిలోల బంగారం
- అలంకరణకు మరో 28 కిలోల బంగారు ఆభరణాలు
- లాకర్‌లో 1,415 కిలోల వెండి నిల్వలు
- మింట్‌కు మరో 320 కిలోల వెండి తరలింపు



ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భక్తులు సమర్పించిన బంగారం, వెండి ఆభరణాల కానుకలు రికార్డు స్థాయికి చేరాయి. తమ కోర్కెలు తీర్చిన చల్లని తల్లికి ముక్కుపుడకలు, బులాకీలు, ఆభరణాలు, గాజులు, హారాలు, ఇలా ఒకటేమిటి భక్తులు తమకు తోచిన రీతిలో బంగారపు వస్తువులను తయారు చేయించి ఇస్తున్నారు. వాటిని వివిధ ఉత్సవాలలో అలంకరిస్తున్నారు. ఇక వినియోగంలో లేని ఆభరణాలను దేవస్థాన అధికారులు కరిగించి వివిధ బ్యాంకులలో డిపాజిట్ చేస్తున్నారు.. అలా అమ్మవారికి 195 కిలోల బంగారం మొత్తం 11 గోల్డు బాండ్స్ రూపంలో డిపాజిట్ చేశారు. ఇక అమ్మవారి మూలవిరాట్‌తో పాటు ఉత్సవ మూర్తులు, ఉత్సవాలలో ప్రత్యేక అలంకరణ నిమిత్తం మరో 28 కిలోల బంగారు ఆభరణాలు దేవస్థానం వద్ద ఉన్నాయి. బ్యాంక్‌లో డిపాజిట్ చేసిన బంగారం నుంచి ప్రతి ఆరు నెలలకు ఒక సారి వడ్డీ రూపంలో కొంత దేవస్థానానికి అందుతుంది.

హుండీలోనూ బంగారం, వెండి ఆభరణాలు:

దేవస్థానం ప్రతి 15 నుంచి 20 రోజులకు ఒక సారి హుండీలను తెరుస్తుంది. హుండీలను తెరిచిన ప్రతి సారి అరకిలో నుంచి ముప్పావు కిలో వరకు బంగారం, నాలుగు నుంచి ఐదు కేజీల వెండి లభిస్తోంది. ఇలా లభించిన బంగారు, వెండి వస్తువులను దేవస్థాన ఆవరణలోని లాకర్‌లో భద్రపరిచి ప్రతి ఆరు నెలలకు ఒక సారి కరిగించేందుకు మింట్‌కు అప్పగిస్తున్నారు. ఇలా కరిగించిన బంగారాన్ని డిపాజిట్ గాను, వెండిని లాకర్‌లో భద్రపరుస్తున్నారు. ప్రస్తుతం దేవస్థానం హైదరాబాద్‌లోని ఐజీ మింట్‌లో కరిగించిన సుమారు 1,415 కిలోల వెండి బ్యాంక్ లాకర్‌లో భద్రపరిచారు. ఇటీవల హుండీల ద్వారా లభించిన మరో 320 కిలోల వెండి కరిగించేందుకు చర్యలు చేపట్టారు. దేవస్థానంలో వివిధ వస్తువులు, సామగ్రి రూపంలో మరో నాలుగు వందల కేజీల వెండి వినియోగంలో ఉన్నట్లు ఆలయ అధికారులు పేర్కొన్నారు.

> వివేకవంతుడైన పాలకుడు తన మాటలను జాగ్రత్తగా ఎంచుకుంటాడు. తన చర్యలతో యోగ్యతను సాధించుకుంటాడు. అలాంటి పాలకుడి కింద ప్రజలు తమను తామే పాలించుకుంటున్నామని అనుకుంటారు.
>
> – తావోయిజం

సాక్షి

మంగళవారం, 8 ఆగస్టు 2023

పాక్‌లో మళ్ళీ పాత కథే!

నేతల పేర్లు మారవచ్చు... ఆరోపణలు మారవచ్చు... పాక్‌లో మాత్రం ఒకే కథ పునరావృత మవుతూ ఉంటుంది. ప్రధాని పీఠమెక్కినవారు సైన్యం అనుగ్రహం కోల్పోయాక ఏదోక ఆరోపణలో జైలుపాలవుతారు. అదృష్టం బాగుంటే బతికిబట్టకడతారు. లేదంటే శంకరగిరి మాన్యాలు పడతారు. జుల్ఫికర్ అలీ భుట్టో నుంచి బెనజీర్, నవాజ్ షరీఫ్‌ల దాకా ఇదే పరిస్థితి. ఇప్పుడు మాజీ ప్రధాని ఇమ్రాన్ వంతు. తీవ్రవాదానికి ప్రోత్సాహం, సైనిక స్థావరాలపై దాడులకు పథకరచన లాంటి తీవ్ర ఆరోపణల నుంచి వచ్చిన కానుకల్ని అక్రమంగా అమ్ముకున్నారనే 'తోషా ఖానా' కేసు దాకా 150 దాకా కేసులున్న ఇమ్రాన్‌ను ఊహించినట్టే జైలులో పెట్టారు. ఎప్పటిలానే మిగతా వ్యవస్థంతా పరోక్ష మద్దతు నివ్వగా, పాక్ కోర్టు మరో పాపులర్ నేత రాజకీయ జీవితానికి తెరదించేందుకు తెగించింది.

తోషాఖానా కేసులో పాకిస్తానీ కోర్ట్ ఆగస్ట్ 5న ఇమ్రాన్‌కు మూడేళ్ళ గరిష్ఠ శిక్ష వేసింది. రాజ్యాంగం ప్రకారం శిక్షపడ్డవారు అయిదేళ్ళ పాటు ఎన్నికల్లో పాల్గొనరాదు గనక, ఈ మాజీ ప్రధానిని అలా బరిలో లేకుండా చేసింది. చివరకు సొంత పార్టీ పాకిస్తాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ (పీటీఐ)కి అధినేతగానూ ఇమ్రాన్ కొనసాగరాదు. వెరసి, షరీఫ్‌లు, జర్దారీలు, మౌలానా ఫజల్ ఉర్ రెహ్మాన్ లాంటి సైన్యం ఆశీస్సులున్న వారికి ఎన్నికల బరిలో మార్గం సుగమం చేసింది. ఇమ్రాన్ జైలు పాలయ్యీ కాగానే, ఈ క్షణం కోసమే ఆగినట్టున్న ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆగస్ట్ 9న పార్లమెంట్‌ను రద్దు చేయనున్నారు. నవంబర్ మధ్యలో జరగాల్సిన ఎన్నికలు ఓటర్ల జాబితా సవరణ, నియోజకవర్గ విభజన సాకులతో ఆరు నెలల దాకా వాయిదా పడతాయని అంచనా. ప్రస్తుతం ప్రజాభిప్రాయ సేకరణల్లో అగ్రస్థానంలో ఉన్న ఇమ్రాన్ జైలులో ఉంటారు గనక ఆ లోగా ఓటర్లలో తాము పట్టు సంపాదించాలన్నది షెహబాజ్ సారథ్యంలోని అధికార పార్టీ, మిత్రపక్షాల వ్యూహం.

ఇమ్రాన్‌పై మోపింది పెద్దగా పసలేని అభియోగమైనా, విధించినది మాత్రం కఠిన శిక్షే! చరిత్ర చూస్తే పాకిస్తాన్ మాజీ ప్రధానులు షాహిద్ ఖకాన్ అబ్బాసీ, నవాజ్ షరీఫ్, బెనజీర్ భుట్టో, జుల్ఫికర్ అలీ భుట్టో, హుస్సేన్ షహీద్ సుహ్రావర్దీలకు కూడా రాజ్యవ్యవస్థ చేతిలో ఇదే పరిస్థితే ఎదురైంది. వారంతా ఊచలు లెక్కపెట్టాల్సి వచ్చింది. అయితే, చివరకు వారిపైన మోపిన అభియోగాలేవీ కాల పరీక్షకు నిలబడలేదు. గతంలో జీతం విషయంలో నేరం మోపి, నవాజ్ షరీఫ్ రాజకీయ ఆకాంక్షలకు గండి కొట్టారు. ఇప్పుడు ఇమ్రాన్‌కూ సరిగ్గా అలాగే చేశారు. ప్రధానిగా ఉన్నప్పుడు అందుకున్న కానుకల వివరాలను ఇమ్రాన్ సరిగ్గా వెల్లడించలేదనే మిష చూపారు. షరీఫ్, ఇమ్రాన్‌ల ఇద్దరి విషయంలోనూ చేసిన నేరానికీ, వేసిన శిక్ష తాలూకు తీవ్రతకూ పొంతన లేదన్నది బహిరంగ రహస్యం.

వచ్చిన కానుకల రికార్డులు, ఆస్తుల ప్రకటన విషయంలో నిబంధనల్ని పాటించకుండా ఇమ్రాన్ తప్పు చేసిన మాట నిజమే. కానీ, తోషాఖానా రికార్డుల్ని నిశితంగా పరిశీలించి, అధికారిక హోదాలో కానుకలు అందుకున్న ఎవరెవరు సరిగ్గా ఆ వివరాలు అందించారనే లెక్కలను గనక ఇంతే కఠినంగా బయటకు తీస్తే మునుపున్న ఎవరూ నిర్దోషులుగా మిగలకపోవచ్చు. అలాంటప్పుడు ఇమ్రాన్‌కు మాత్రం అదే నేరానికి కోర్టు గరిష్ఠ శిక్ష విధించడమేమిటి? అసలీ మొత్తం వ్యవహారంలో విచారణ జరిగిన తీరు, ఎక్కడ లేని హడావిడితో కోర్టు తీర్పు ప్రకటించిన వైనం ప్రశ్నలకు తావిస్తోంది. విధించిన కఠినశిక్షపై ఇమ్రాన్ పై కోర్టుకు వెళ్ళే వీలు, అక్కడ ఊరట దక్కే అవకాశం లేకపోలేదు. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. తీవ్రనేరాలను సైతం నిత్యం ఉపేక్షించే రాజ్యవ్యవస్థ ప్రజానేతలపై మాత్రం మామూలు అంశాలపైనా అభియోగాలతో, శిక్షలు విధించడమే గమనార్హం.

ఇమ్రాన్ తన ముందువారిలా ఆర్మీ ఆదేశాలకు తలాడించకపోవడం తప్పయింది. 2022 ఏప్రిల్‌లో పార్లమెంట్‌లో మెజారిటీ కోల్పోయినప్పటి నుంచి సైనిక నాయకత్వాన్ని సవాలు చేశారు. ర్యాలీలు చేశారు. మొన్న మేలో ఆయనను అరెస్టు చేసినప్పుడు జరిగిన భారీ కల్లోలాల్లో సైనిక స్థావరాలపై దాడులు జరిగాయి. దీన్ని అందిపుచ్చుకున్న ఆర్మీ ఛీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్ నిరసన కారుల్ని అణచివేశారు. మీడియా నోరునొక్కారు. ఇమ్రాన్ సొంత పార్టీ నుంచి ఫిరాయింపులు చేయించారు. ఇప్పుడు ఇమ్రాన్ జైలు పాలయ్యేలా చూశారు. ఎన్నడూ పెద్దగా ప్రజాస్వామ్యం పరిఢవిల్లని పాక్‌లో అంతకంతకూ సైనిక జోక్యం పెరుగుతున్న తీరుకు ఇది తాజా ఉదాహరణ. నిజానికి, 2017లో నవాజ్ షరీఫ్‌ను దించి, ఇమ్రాన్‌ను గద్దెనెక్కించిందీ సైన్యమే. 2018 జనరల్ ఎన్నికల్లో ఫలితాల్ని అనుకూలంగా మలిచి, ఆనక పార్లమెంట్‌లో ఇమ్రాన్‌కు మెజారిటీ వచ్చేలా చేసిందీ సైన్యమే.

అధికారంలో ఉండగా ప్రజాస్వామ్యంపై గౌరవమే చూపని ఈ మాజీ క్రికెటర్ ఇప్పుడు ఫలితం అనుభవిస్తున్నారు. కొత్త ఆర్మీ ఛీఫ్ మునీర్ పట్టు బిగిస్తున్నారు. అయితే సాంకేతిక కారణాలతో పోటీకి అనర్హులుగా ప్రకటించినంతనే జనాకర్షక నేతల కథకు తెరపడుతుందనుకోలేం. నవాజ్, బెనజీర్‌ల విషయంలో ఇదే జరిగింది. రేపు ఇమ్రాన్‌నైనా అంతే! సైన్యమేమో తన స్వార్థం కోసం రాజకీయ నాయకత్వాన్ని అదిలించి, బెదిరించి పబ్బం గడుపుకుంటూ ఉంటే, కోర్టులేమో పక్షపాత ధోరణితో ప్రవర్తిస్తున్నాయి. రెంటి మధ్య పాకిస్తాన్ రాజకీయాలు చిక్కుకుపోయాయి. ప్రతీకారాలతో నిలువునా చీలిపోయాయి. దేశంలో ఆర్థిక సంక్షోభానికి తోడు రాజకీయ అలక్ష్యంతో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో కావాల్సింది – దేశాన్ని ఆర్థిక పురోగతి పథంలో నడిపించే దీర్ఘదృష్టి. పాలకులు, వ్యవస్థలు అది మర్చిపోయి, ప్రత్యర్థుల్ని వేటాడే పనిలో మునిగిపోవడమే విచారకరం. వ్యవస్థలు రాజకీయమయమైతే ఇలాంటి దురవస్థలే దాపురిస్తాయి.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: బ.సప్తమి ఉ.9.42 వరకు తదుపరి అష్టమి, నక్షత్రం: అశ్విని ఉ.7.23 వరకు తదుపరి భరణి, వర్జ్యం: సా.4.46 నుండి 6.23 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.15 నుండి 9.06 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.44 వరకు, అమృతఘడియలు: రా.8.12 నుండి 9.34 వరకు.

సూర్యోదయం : 5.44
సూర్యాస్తమయం: 6.28
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

జవ సత్వాలున్న జన గళం

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

ప్రజా గాయకుడిగా, ప్రజా ఉద్యమ గేయ రచయితగా దశాబ్దాల పాటు శ్రామిక, ఉత్పాదక రంగాలలోని పీడితుల్ని, అధికార వర్గాల పీడనల్ని ప్రతిబింబించిన నెత్తుటి, నిలువెత్తు మట్టి మనిషి గద్దర్. ఆయన ఆలోచన, రచనలు... ఆధునాతనంగానూ, గ్రామీణంగానూ రెండు విధాలుగా సాగాయి. గద్దర్ అంబేద్కరిజంలోకి మారాక కుల వ్యవస్థ, అంటరానితనాలకు వ్యతిరేకంగా అనేక జానపద గేయాలు రాశారు. స్త్రీ జీవితం, ఆమె పడుతున్న శ్రమ, మానవత్వాలపై లోతైన తాత్వికతతో పాటలు కూర్చారు. ఆయన భౌతికకాయం, అందులో మిగిలి ఉన్న తుపాకీ తూటా సహా 'మహాబోధి' ప్రాంగణంలో ఖననం అయినప్పటికీ... విముక్తి పోరాటానికి ఆయన రాసిన పాటలు ఎప్పటికీ సజీవంగా జనంలో ఉండిపోతాయి.

న్యాయం కోసం తనకు తానుగా ఒక ప్రజా గీతంగా, ఒక ప్రజాయుద్ధ నౌకగా అవతరించిన గద్దర్ (75) – గుమ్మడి విఠల్ – ఆగస్టు 6న కన్నుమూశారు. ప్రజా గాయకుడిగా, ప్రజా ఉద్యమ గేయ రచయితగా దశాబ్దాల పాటు శ్రామిక, ఉత్పాదక రంగాలలోని పీడితుల్ని, అధికార వర్గాల పీడనల్ని ప్రతిబింబించిన నెత్తుటి, నిలువెత్తు మట్టి మనిషి గద్దర్. ప్రజా గేయ రచయితగా ఎదుగుతున్న క్రమంలో 1970లలో గద్దర్ రాసిన పాట తెలుగునాట మోతెత్తిపోయింది.

సిరిమల్లె సెట్టు కింద లచ్చుమమ్మో లచ్చుమమ్మా /
నీవు సినబోయి గూసున్న వెందుకమ్మో ఎందుకమ్మా


రాడికల్ విద్యార్థి ఉద్యమం వైపు మళ్లి, తర్వాత ఒక జాతీయ బ్యాంకులో క్లర్కుగా చేసి, కొంతకాలానికే ఆ ఉద్యోగాన్ని వదిలి, తిరిగి ఉద్యమంలోకి వెళ్లిపోయారు. ఆ తర్వాత, నక్సలైట్ ఉద్యమంగా ప్రసిద్ధి చెందిన కమ్యూనిస్టు విప్లవోద్యమంలో పూర్తి సమయం గాయకుడిగా మారారు. చిన్న చిన్న సభల్లో, కొన్నిసార్లు వీధుల్లో పాటలు పడుతూ, జనాన్ని సమీకరిస్తూ సీపీఐ-ఎంఎల్ (పీపుల్స్ వార్)లో అందరికీ తెలిసిన వ్యక్తి అయ్యారు. పీడిత వ్యవసాయ ఉత్పాదక రంగ ప్రజానీకం మీద; భూస్వాముల దోపిడీలు, దౌర్జన్యాల మీద తనదైన శైలిలో పాటలు రాసి, పాడి, భారతదేశ సాంస్కృతిక రంగాన్ని కదం తొక్కించారు. సాయుధ విప్లవం మాత్రమే ప్రస్తుత వ్యవస్థకు ప్రత్యామ్నాయాన్ని నిర్మించగలదని చాలాకాలం పాటు నమ్మికతో ఉన్నారు.

గద్దర్ అనే తన పేరును ఆయన అమెరికా గదర్ ఉద్యమం నుంచి తీసుకున్నారు. చివరికి ఆ పేరు మావోయిస్టు పోరాటాలకు భారతీయ చిహ్నంగా మారింది. 1997లో గద్దర్ అజ్ఞాతం నుంచి జన జీవన స్రవంతిలోకి వచ్చినప్పుడు ఆయనపై జరిగిన కాల్పులలో ఐదు తూటాలు ఆయన శరీరంలోకి దిగబడ్డాయి. వైద్యులు నాలుగు తూటాలను బయటికి తీయగలిగారు. మిగతా ఒక తూటా మొన్నటి రోజున ఆయన అంతిమ శ్వాస తీసుకునే వరకు పాతికేళ్లకు పైగా ఆయన శరీరం లోపలే ఉండిపోయింది.

ధైర్యం, దృఢచిత్తం, వివేకం, వినయం... అదే సమయంలో చిన్న పిల్లవాడి మనస్తత్వం. ఇవీ గద్దర్‌లోని గుణాలు. క్రమంగా ఆయనకు తెలిసి వచ్చినదేమంటే... మావోయిస్టు విప్లవం ఎక్కడికీ దారి తీయడం లేదని. దాంతో దళిత ఉద్యమం వైపు మళ్లి, ప్రజాదరణ పొందే విధంగా పాటలు రాయడం, పాడటం మొదలుపెట్టాడు. 1985లో కారంచేడు కమ్మ భూస్వాములు ఎనిమిది మంది దళితులను దారుణంగా హత్య చేసినప్పుడు ఆయన రాసిన పాట ఇది:

కారంచెడు భూస్వాముల మీద
కలబడి నిలబడి పోరుచేసిన దళిత పులులమ్మా

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని యావత్ దళితులను ఏకం చేసేందుకు ఈ పాట ఆయుధంగా మారింది. అక్కడి నుంచి ఆయన అంటరానితనం, అంబేద్కరిజం, రాజ్యాంగవాదంపై పాటలు రాయడం ప్రారంభించారు.



1990లో మండల్ వ్యతిరేక ఉద్యమం దేశమంతటా వ్యాపించింది. సామాజిక న్యాయం, ప్రతిభ అన్నవి మండల్ అనుకూల, మండల్ వ్యతిరేక శక్తుల సైద్ధాంతిక లంగర్లు అయ్యాయి. కమ్యూనిస్టు విప్లవకారులు కూడా తమ అగ్రవర్ణ నాయకుల నేతృత్వంలో స్పష్టమైన వైఖరిని తీసుకోడానికి వెనుకంజ వేస్తున్నారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' అప్పటి ఎడిటర్ అరుణ్‌శౌరీ మేధోపరమైన మండల్ వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఆ సమయంలో గద్దర్ రాసిన పాట మండల్ అనుకూల శక్తులకు ఆయుధంగా మారింది.

అరుణ్‌శౌరిగో నీకు ఆకలి బాధేమెరుక
నెయ్యి కాడ నువ్వుంటే పియ్యికాడ మేముంటం

ఈ పాట చాలామంది అగ్రవర్ణ విప్లవకారులకు నచ్చలేదు. కానీ మండల్ రిజర్వేషన్లు అమలు చేయాలని పోరాడుతున్న ఓబీసీ/ ఎస్సీ/ ఎస్టీలకు స్ఫూర్తినిచ్చేందుకు గద్దర్ ఆ పాటను బహిరంగ సభలలో పాడుతూనే ఉన్నారు.

1990వ దశకం చివరిలో ప్రత్యేక తెలంగాణ ఉద్యమాన్ని ఉద్ధృతం చేయాలని మావోయిస్టులు నిర్ణయించుకున్నారు. మెల్లిగా గద్దర్ ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి మూల శక్తిగా మారారు.

పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా
పోరు తెలంగాణమా... బలే.. బలే.. బలే...

ఈ పాట తెలంగాణ ఉద్యమానికి ప్రతీకగా నిలిచింది. గద్దర్ ఎప్పుడూ టీఆర్ఎస్‌కు బహిరంగ మద్దతుదారు కానప్పటికీ మావోయిస్టుల మద్దతుతో సమాంతర రాడికల్ తెలంగాణ అనుకూల గ్రూపులను నడిపించారు.

ఈ క్రమంలో మావోయిస్టు భావజాలంతో గద్దర్ వ్యతిరేకించారు. వర్గపోరు మాత్రమే సరిపోదు, కులపోరాటాన్ని చేపట్టాలని భావించారు. అనేక విముక్తి బలాలను కలిగి ఉన్న భారత రాజ్యాంగాన్ని గుర్తించడం ప్రారంభించారు. భారత రాజ్యాంగం పట్ల, అంబేద్కర్ పట్ల తమ దృక్పథాన్ని మార్చుకోవాలని మావోయిస్టులను ఒప్పించేందుకు పార్టీతో అంతర్గతపోరును సాగించారు. అయితే సహజంగానే వారు తమ పాత వర్గ పోరాట పంథాను మార్చుకోడానికి నిరాకరించారు. దాంతో పార్టీ నుంచి బయటికి వచ్చి నేటి భారత రాజ్యాంగాన్ని సమర్థించిన, సమర్థిస్తున్న అనేక ఇతర శక్తులతో కలిసి పని చేశారు.

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత విభిన్న రాజకీయ, సైద్ధాంతిక శక్తులతో సన్నిహితంగా మెలిగారు. అప్పటికే గద్దర్‌పై ఆయన మావోయిస్టుగా ఉన్నప్పటి కేసులు అనేకం ఉన్నాయి. ఆరోగ్యం కూడా క్షీణించడం మొదలైంది. ఆ సమయంలోనే కొంత కాలం గద్దర్, నేను... సీపీఎం మద్దతు ఉన్న బహుజన్ లెఫ్ట్ ఫ్రంట్‌లో కలిసి పని చేశాం. మరోవైపు ఆయన కాంగ్రెస్‌తోనూ సత్సంబంధాలు కొనసాగించారు. తెలంగాణలో రాహుల్ గాంధీ ప్రసంగించిన కొన్ని బహిరంగ సభల్లో పాల్గొన్నారు. ఢిల్లీలో రాహుల్‌ను, సోనియాగాంధీని కలిశారు.

గద్దర్ జీవితం వీరోచిత పోరాటాల అవిశ్రాంత గాథ. ఒక్క రెండు పాటలు తప్ప మిగతా ముఖ్యమైన పాటలన్నీ తనే రాసి, పాడినవి. గద్దర్ పాడటంతో ప్రాచుర్యం పొందిన '**బండెనక బండి కట్టి**' పాట 1940లలో నిజాంకు, రజాకర్లకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా పోరాటంలో యాదగిరి రాసినది. రెండో పాట: **ఈ ఊరు మనదిర, ఈ వాడ మనదిర / దొర ఏందిరో, వాని పీకుడేందిరో.** ఈ పాటను మరో ప్రముఖ దళిత గాయకుడు, రచయిత గూడ అంజయ్య రాశారు. గద్దర్ తన గళంతో ఆ పాటను ఆంధ్రప్రదేశ్‌లోని దాదాపు ప్రతి పల్లెకు తీసుకెళ్లారు.

గద్దర్ ఆలోచన, రచన... ఆధునాతనంగానూ, గ్రామీణంగానూ రెండు విధాలుగా సాగాయి. గద్దర్ అంబేద్కరిజంలోకి మారాక కుల వ్యవస్థ, అంటరానితనాలకు వ్యతిరేకంగా అనేక జానపద గేయాలు రాశారు. స్త్రీ జీవితం, ఆమె పడుతున్న శ్రమ, మానవత్వాలపై లోతైన తాత్వికతతో పాటలు కూర్చారు. వంటపని, వీధుల పారిశుద్ధ్యం, ఇంటిని శుభ్రంగా ఉంచే హింసాత్మక శ్రమలలోని నొప్పిని పాటలుగా మలిచారు. ఇంటికి చీపురు చేసే సేవలోని గొప్పతనంపై ఆయన రాసి, పాడిన పాట అత్యంత తాత్వికమైనది.

అంబేద్కర్ అడుగుజాడల్లో గద్దర్ తన పూర్వపు కమ్యూనిస్టు నాస్తికత్వాన్ని పక్కనపెట్టి సరైన బౌద్ధేయుడు అయ్యారు. గద్దర్ భౌతికకాయం, అందులో మిగిలి ఉన్న తూటా సహా 'మహాబోధి' (పేద పిల్లల కోసం ఆయనే స్థాపించిన పాఠశాల) ప్రాంగణంలో ఖననం అయినప్పటికీ, మానవ సమానత్వంపై ఆయన ప్రేమ, విముక్తి పోరాటానికి ఆయన రాసిన పాటలు ఎప్పటికీ సజీవంగా జనం జీవనంలో ఉండిపోతాయి.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

అదే ధైర్యం



సామాజిక మాధ్యమాల్లో ట్రోలింగ్‌కు పాల్పడేవాళ్లలో చాలామంది ముఖ రహితంగా, నామరహితంగా ఉంటారు. నిజమైన పేర్లు, నిజమైన ఫొటోలతో ఉన్నవాళ్లు సిగ్గులేకుండా ట్రోల్ చేయడానికి సంశయిస్తారు. – అనూ సెహగల్, ఇమేజ్ కన్సల్టెంట్

ఒకటి ఒకసారి



ఒకేసారి చాలా పనులు చేస్తూ, తమ శాయశక్తులా ఒకసారి ఒక్కపనినే చేస్తున్న వారిని ఓడించగలం అనుకోవడం అహంకారం అవుతుంది. దానికి బదులుగా ఒకటే ఎంపిక చేసుకోండి. దానిలోకి సర్వశక్తులూ ఒడ్డండి. అప్పుడు మాత్రమే మీరు అజేయులు కాగలరు. – అలెక్స్ హొర్మోజీ, రచయిత

భాషల నెలవు



నిన్న ఒక రెండేళ్ల చిన్నారిని కలిశాను. కన్నడ, జర్మన్‌తోపాటు కొంచెం హిందీ కూడా మాట్లాడుతోంది. ఇంగ్లీష్ గురించి పేరెంట్స్ కొంచెం ఆందోళన చెందుతున్నారు. నాకు ఆరేళ్లప్పుడు మొదటిసారి ఆంగ్లంతో పరిచయం కలిగింది. అప్పటికే నాకు మరాఠీ, కన్నడం, కొంకణీ వచ్చు. హిందీ, ఇంగ్లీష్ తర్వాత వచ్చాయి. దక్షిణాదిలో పెరిగినందుకు నేను గర్వపడతాను. – సమర్ హలరంకర్, జర్నలిస్ట్

మూలానికి చికిత్స



అధిక రక్తపోటు అనేది ఒక లక్షణం. డిప్రెషన్ అనేది ఒక లక్షణం. ఆందోళన అనేది ఒక లక్షణం. మీరు అనారోగ్యంతో సతమతం అవుతుంటే వాళ్లు మీ మీద మాత్రల్ని ఎగజల్లుతారు. అంతేగానీ సమస్య మూలకారణాన్ని రూపు మాపే జీవన విధాన సూత్రాలను బోధించరు. అంతా తల్లకిందుల వ్యవహారం. – జాన్ కాన్‌స్టాస్, వైద్యరంగ యాక్టివిస్ట్

గొప్ప న్యాయమూర్తి



జస్టిస్ మురళీధర్ ఇవ్వాళ (ఆగస్ట్ 7) పదవీ విరమణ చేస్తున్నారు. ప్రస్తుతం మనకున్న అత్యుత్తమ న్యాయమూర్తుల్లో ఆయనొకరు. కానీ బాధాకరంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి కానివారి క్లబ్బులో ఆయన కూడా చేరుతున్నారు. అయినప్పటికీ ఆయన తన సాహసోపేత తీర్పులకు గుర్తుండిపోతారు. – అరీబ్ ఉద్దీన్, న్యాయవాది

ప్రజాకవి



విప్లవ కవి గద్దర్ పోయారని తెలిసింది. కులవ్యతిరేక, కమ్యూనిస్టు ఉద్యమంలో గద్దర్‌ది ప్రముఖ గొంతుక. తర్వాత ఆయన తెలంగాణ ఆకాంక్షలను బలంగా సమర్థించారు. ఆయన నిజమైన ప్రజాకవి. వసంత కన్నాబిరన్ అనువదించిన 'మై లైఫ్ ఈజ్ ఎ సాంగ్' ద్వారా నాకు గద్దర్ పాటలు పరిచయం అయ్యాయి. – సబహ్ గుర్‌మత్, జర్నలిస్ట్

విషాదకర వాస్తవం



ఇండియాలో మీరు నెలకు 25,000 రూపాయల కంటే ఎక్కువ సంపాదిస్తున్నట్టయితే, మీరు మధ్యతరగతికి చెందిన వాళ్లు కాదు. పైనున్న పది శాతం భారతీయుల్లోకి మీరు కూడా వస్తారు. విషాదం, కానీ వాస్తవం. ఎందుకంటే కేవలం 10 శాతం భారతీయులు మాత్రమే నెలకు 25,000 కంటే ఎక్కువ సంపాదించగలుగుతున్నారు. – అమితభ బంధ్యోపాధ్యాయ, ప్రొఫెసర్

అగ్గినౌక

సముద్రం గుండెల్లో
వేలెడంత తూటా.
ఎవరు వీడు ?
ఆకాశాన్ని, భూమిని
గజ్జెలు చేసిన వీరబాహుడు.
నేత్రం సూర్యునిలో
దుమ్ము కొట్టానన్న చంద్రిగాడ్ని
మడంతో మట్టేశాడు
ఎవడు వీడు?
అడవి సింహనాదాన్ని
భాగమతి గుండెల్లో నినదించిన
బెబ్బులికి
విభూది కుక్కల కొరుకుళ్ళా?
ఒరేయ్! గద్దరంటే
ఈ యుగం నల్లసముద్రంలో
నడుస్తున్న అగ్గి నౌక.
గుంపు పాటల్లో పుట్టిన
యుగ గీతిక.
అది సంస్కృతి – అది సంఘర్షణ.
గుండె పొరల్నిండా
మంటలు మంటలు.
మూడు రోజులే కాదు
మూడు గంటలకే లేచి
నేను రెండోసారి వచ్చాను కాచుకోండి
ఇక ముద్దాయిలందరూ
బారులు తీరండి.
శిలువనెక్కిన వానిదే
అంతిమ తీర్పు.

– డాక్టర్ కత్తి పద్మారావు
('దళిత రాజ్యం' 1997 మే సంచికలో ప్రచురితం)

బలపడుతున్న భారత్-నాటో బంధం?

నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) ఉత్తర అమెరికా, ఐరోపా దేశాల పరస్పర రక్షణ కూటమి. ఇటీవలి వరకు చాలా మంది నాటోను ప్రచ్ఛన్న యుద్ధ అవశేషంగానే భావించారు. (ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయేల్ మెక్రాన్ అయితే 2019లో ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో నాటో బ్రెయిన్ డెత్ గురించి ప్రముఖంగా ప్రకటించారు కూడా). కానీ ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధం నాటో కూటమిలో సరికొత్త ప్రయోజనాత్మక లక్ష్యాన్ని నింపింది. గత సంవత్సరంలో ఫిన్లాండ్‌ను నాటోలో చేర్చుకున్నారు. సభ్యులందరి ఆమోదానికి లోబడి స్వీడన్ కూడా కూటమిలో చేరుతుందని భావిస్తున్నారు.

నాటో 2022 వ్యూహాత్మక భావన అనేది రష్యాపై దృష్టిని తిరిగి కేంద్రీకరించడం, కూటమి సభ్యత్వ విస్తరణను చేపట్టడంతో సహా చైనా ప్రజా రిపబ్లిక్‌కు (పీఆర్‌సీ) కొంత ప్రాధాన్యమిచ్చింది. మారుతున్న ప్రపంచ వాస్తవాలకు అనుగుణంగా దాని వ్యూహాత్మక ప్రాధాన్యాలు ఉంటున్నాయి. భారతదేశం సాంప్రదాయికంగా నాటోతో వ్యవహారంలో జాగరూకతతో వ్యవహరిస్తోంది. కూటమి చారిత్రక లక్ష్యం, భారతదేశ సన్నిహిత సైనిక భాగస్వామి రష్యాపై దాని వైఖరిని దృష్టిలో ఉంచుకుంటే ఈ మౌనం కొంతవరకు అర్థం చేసుకోదగినదే. ఇంత స్పష్టమైన అభ్యంతరాలు ఉన్నప్పటికీ, భారత్ గత రెండు దశాబ్దాలుగా నాటోతో ఆశ్చర్యకరమైన రీతిలో అధికారిక అన్యోన్యతను కలిగి ఉంది.

భారత్, నాటో మధ్య ప్రారంభ వ్యవహారాలు... ఆయుధాల నియంత్రణ, తీవ్రవాద వ్యతిరేక సమస్యలతో నడిచాయి. వాటి మొదటి అధికారిక ఒడంబడిక 2005లో జరిగింది. తరువాతి రెండేళ్లలో, అంటే 2006, 2007లో ఇండియా తరఫున ప్రణబ్ ముఖర్జీ రక్షణ, విదేశీ వ్యవహారాల మంత్రిగా ఇరు హోదాల్లో నాటో సెక్రటరీ జనరల్‌తో సమావేశమయ్యారు. నాటో డిప్యూటీ సెక్రటరీ జనరల్ 2007లో భారత్‌ను సందర్శించారు. 2019లో నాటో–భారత్ మధ్య జరిగిన రాజకీయ చర్చల్లో చైనా, తీవ్రవాదం, పాకిస్తాన్ వంటి అంశాలు చోటు చేసుకున్నాయి. రెండు సంవత్సరాల తరువాత, నాటో సెక్రటరీ జనరల్ జెన్స్ స్టోల్టెన్‌బర్గ్ న్యూఢిల్లీలో యేటా జరిగే 'రైజీనా డైలాగ్'ని ఉద్దేశించి ప్రసంగించారు.

హిందూ మహాసముద్రంలో దొంగతనాల(పైరసీ) విషయంలో ఉమ్మడి భాగస్వామ్య సవాలుపై భారత్, నాటో మధ్య ఆచరణాత్మక సహకారం చాలా స్పష్టంగా ఉంది. 2009, 2011 మధ్య, బీజింగ్‌లో చైనా రక్షణ మంత్రిత్వ శాఖ ఆతిథ్య భేటీలోనూ, బ్రస్సెల్స్‌లో నాటో నిర్వహించిన సమావేశంలోనూ గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో పైరసీ వ్యతిరేక ప్రయత్నాలను సమన్వయం చేయడంలో భారత్, నాటో అధికారులు పాల్గొన్నారు. భారత నౌకాదళం వాలెన్సియాలోని నాటో ర్యాపిడ్ డిప్లాయబుల్ కోర్‌తో కూడా పరిచయాలను ఏర్పరచుకుంది. ఈ దశలు కొన్ని కచ్చితమైన ఫలితాలను అందించాయి. ఉదాహరణకు, 2011 మే నెలలో, అరేబియా సముద్రంలో సముద్రపు దొంగల దాడిని అడ్డుకోవడానికి భారత నౌకాదళం నాటో పెట్రోలింగ్ నౌకలతో సమన్వయం చేసుకుంది. రెండు సంవత్సరాల తరువాత, నాటో నౌకాదళ వాహనాలు గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో 14 మంది భారతీయ నావికులను రక్షించడంలో సహాయపడ్డాయి.



నాటో, భారత్ మధ్య కాలానుగుణమైన అధికారిక వ్యవహారాలు అఫ్గానిస్తాన్, సైనిక విద్య, శాంతి పరిరక్షక కార్యకలాపాలు, సైబర్ భద్రత వంటి ఇతర రంగాలకు విస్తరించాయి. 2007లో ఎస్తోనియాపై గణనీయమైన సైబర్ దాడుల తర్వాత భారత్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్–ఇన్) ఫిన్లాండ్‌తో, నాటోతో సహకరించింది. తర్వాత 2008లో ఉత్తర సముద్రంలో నాటో కసరత్తులకు భారత అధికారులను పరిశీలకులుగా ఆహ్వానించారు. ఇటీవల, కమాండెంట్ నేతృత్వంలోని భారత జాతీయ రక్షణ కళాశాల ప్రతినిధి బృందం, నాటో మారిటైమ్ ఇంటర్‌డిక్షన్ ఆపరేషనల్ ట్రైనింగ్ సెంటర్‌ను సందర్శించింది.

ఏదేమైనా, అతి వ్యాప్తి చెందుతున్న నాటో ఎజెండాల స్వరూపాలు నేడు మరింత సులభంగా స్పష్టంగా కనిపిస్తున్నాయి. సముద్ర భద్రత, సైబర్ భద్రత, ఇండో–పసిఫిక్‌లో రాజకీయ పరిణామాలు, వృత్తిపరమైన సైనిక విద్య, వాతావరణ మార్పులు, బహుశా ఆయుధాల నియంత్రణతోపాటు అణు ఎస్కలేటరీ డైనమిక్స్ ఇందులో ఉన్నాయి.

ఇటీవలి వరకు నాటో న్యూఢిల్లీతో కంటే బీజింగ్, మాస్కోలతో మరింత విస్తృతమైన సన్నిహిత సంబంధాలను కలిగి ఉంది. చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ అధికారులు నాటోతో విద్యా శిక్షణా కార్యకలాపాల్లో పాల్గొన్నారు. నవంబర్ 2021 వరకు, మాస్కోలో నాటో తన కార్యాలయం కూడా కలిగి ఉంది. వాటి మధ్య విభిన్న అనుకూలతలు ఉన్నప్పటికీ... ఇండో–పసిఫిక్‌లో పెరుగుతున్న వ్యూహాత్మక పోటీని నాటో అంగీకరించడం అనేది భారతదేశంతో విస్తృతమైన, లోతైన సంభాషణకు తలుపులు తెరుస్తుంది.

– ధ్రువ జైశంకర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఓఆర్ఎఫ్ అమెరికా; అమ్మార్ నైనార్, జూనియర్ ఫెలో, ఓఆర్ఎఫ్ అమెరికా
('ది హిందుస్తాన్ టైమ్స్' సౌజన్యంతో)

హస్త మస్తక సంయోగం

చేసే పని ఏదైనప్పటికీ అందులో రెండింటి పాత్ర తప్పనిసరిగా ఉండాలి. ఆ పనికి సంబంధించిన ఆలోచన ఆ రెండింటిలో మొదటిది. ఆ తరువాతిది చేతితో చేసే శ్రమ. ఈ రెండింటి సంయోగ సంయమనాల ఫలితంగానే ఏ సఫలీకృతమైన పని యైనా ఉంటుంది. అలా చేయని ఏ పనికైనా ఫలితం, దాని అంతిమ రూపం అనుకున్న విధంగా రావు. కొన్ని సందర్భాలలో పూర్తిగా విఫలం కూడా అవుతుంది. అందుకోసమే ఒక పని చేయడానికి పూనుకునే ముందు, ఆ పని గురించిన ఆనుపానులను పూర్తిగా తెలుసుకుని దిగాలి. ఒకసారి చేయడానికి నిర్ణయించుకున్న తరువాత, ముందుగా ఆలోచించి పెట్టుకున్న మార్గంలోనే ఆ పనికి సంబంధించిన అన్ని కార్యక్రమాలనూ నిర్వహించుకోవాలి. ఇది ఇప్పటి మాట మాత్రమే కాదు. శతాబ్దాల క్రితమే మన ఆలోచనలలో ఉండి, మట్ల అనంతరాయని (16వ శతాబ్ద) 'కకుత్థ్స విజయము' కావ్యంలో ప్రస్తావించ బడింది.



జ్యోతిర్మయం

ఆ కావ్యంలోని ప్రథమాశ్వాసంలో 'హస్త మస్తక సంయోగ మాచరించి/ తెన్ని విఘ్నంబులును నన్ను నేమి సేయు' అని మొదలయ్యే ఒక పద్యంలో, ఈ మొత్తం ఆలోచనను కేవలం రెండు మాటలలో ఒదిగిపోయే విధంగా, 'హస్తమస్తక సంయోగం' అనే చక్కని పదబంధంలో ఇమిడ్చి చెప్పాడు కవి. 'బుద్ధి చేసే ఆలోచనకు, చేయి చేసే పనికి సయోధ్యను, సంయోగాన్ని కుదిర్చి పనికి పూనుకున్నాను. ఇక నన్ను ఏ విఘ్నాలైనా ఏమి చేయగలవు?' అని నిస్సంశయంగా, ధైర్యంగా ప్రశ్నించడం పై పద్యభాగం భావం.

చెయ్యి శారీరకంగా పని చేస్తుంది. మస్తకం అనగా బుద్ధి తగిన విధంగా ఆలోచనను సమకూర్చుతుంది. ఈ రెండూ ఒకదానికొకటి సమానంగా తోడై, జోడు గుర్రాల వలె పరుగెడితే, బండి ఎంత దూరమైనా అవలీలగా ప్రయాణాన్ని సాగిస్తుంది. ఏ అడ్డంకులూ మధ్యలో రావు. వచ్చినా నిలవవు. అవిఘ్నంగా ప్రయత్నం కొనసాగి, చివరకు విజయం తప్పక సిద్ధిస్తుంది.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

ఆగమ సలహా మండలి ధర్మం కోసం నిలబడాలి

- విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర



ఆగమ సలహా మండలి సభ్యులకు సూచనలు చేస్తున్న స్వరూపానందేంద్ర

సింహాచలం: ఆగమ సలహా మండలి సభ్యులు ధర్మం కోసం నిలబడాలని విశాఖ శ్రీశారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సూచించారు. శాస్త్రబద్ధమైన నిర్ణయాలు మాత్రమే తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆగమ సలహా మండలి చైర్మన్ వేదాంతం శ్రీనివాస అయ్యంగార్ ఆధ్వర్యంలో పలువురు సభ్యులు సోమవారం ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని రుషికేష్ వెళ్లి పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతిని కలిశారు. వారితో ఆగమశాస్త్ర సంబంధిత అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఆగమ శాస్త్రానికి ఆదరణ కరువవుతోందన్నారు. ఆగమ పాఠశాలల్లో విద్యా విధానాన్ని సమీక్షించాలని సూచించారు. వార్షిక ఉత్సవాల సమయంలో శాస్త్రబద్ధంగా చేపట్టాల్సిన నియమాలను కచ్చితంగా పాటించేలా అధికారులకు తగిన సలహాలివ్వాలని తెలిపారు. ఆగమ సలహా మండలి సభ్యులు మామిళ్లపల్లి మృత్యుంజయ ప్రసాద్, ఖండవల్లి సూర్యనారాయణాచార్యులు, వారణాసి నాగభూషణం, కైతేపల్లి బాలసుబ్రహ్మణ్యం తదితరులు పీఠాధిపతులను కలిసిన వారిలో ఉన్నారు.

మృదంగం విద్వాంసుడు 'కేసానపల్లి' మృతి



జ్ఞానానందం(ఫైల్)

బీచ్‌రోడ్డు: ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం విశ్రాంత నిలయ విద్వాంసుడు కేసానపల్లి జ్ఞానానందం (72) సోమవారం మరణించారు. కుమార్తెకు మందుల కోసం కేరళ వెళ్లిన ఆయన ఉదయం ఏడు గంటల సమయంలో గుండెపోటుకు గురై అక్కడే మృతిచెందారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ముళ్లపూడి బాణీ అనుసరించే కేసానపల్లి కడప, విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రాల్లో 27 ఏళ్లు నిలయ విద్వాంసుడిగా సేవలందించారు. ఆయన విశాఖపట్నం ఆకాశవాణి కేంద్రం నుంచి 2011లో పదవీ విరమణ చేశారు. మృదంగంలో ఏ–గ్రేడ్, కంజీరాలో టాప్ గ్రేడ్ ఆర్టిస్టు అయిన జ్ఞానానందం ఎంతో మందిని మృదంగం కళాకారులుగా తీర్చిదిద్దారు. జ్ఞానానందం అంత్యక్రియలను మంగళవారం విశాఖలో నిర్వహిస్తారు.

చట్ట సవరణను సవాలు చేసుకోండి

టీటీడీ ప్రత్యేక ఆహ్వానితుల నియామకంపై పిటిషనర్లకు హైకోర్టు వెసులుబాటు

సాక్షి, అమరావతి: టీటీడీ బోర్డులో ప్రత్యేక ఆహ్వానితుల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్ట సవరణను సవాలు చేస్తూ అనుబంధ వ్యాజ్యాలు దాఖలు చేసేందుకు పిటిషనర్లకు హైకోర్టు అనుమతినిచ్చింది. తదుపరి విచారణను ఈ నెల 11కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. టీటీడీ బోర్డులో ప్రత్యేక ఆహ్వానితుల నియామకం, బోర్డులో నేరచరితులు ఉన్నారంటూ వారి నియామకాన్ని సవాలు చేస్తూ దాఖలైన వ్యాజ్యాలు సోమవారం మరోసారి జస్టిస్ ఉప్మాక దుర్గాప్రసాదరావు, జస్టిస్ ప్రతాప వెంకట జ్యోతిర్మయి ధర్మాసనం ముందుకు విచారణకు వచ్చాయి. పిటిషనర్ల తరఫు న్యాయవాదులు యలమంజుల బాలాజీ, పీవీజీ ఉమేష్ చంద్ర వాదనలు వినిపిస్తూ.. ప్రత్యేక ఆహ్వానితుల నియామకం గురించి దేవదాయ చట్టంలో ఎలాంటి నిబంధన లేకపోవడంతో హైకోర్టు వారి నియామక జీవోపై స్టే విధించిందన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రభుత్వం టీటీడీలో ప్రత్యేక ఆహ్వానితులకు స్థానం కల్పిస్తూ తెచ్చిన ఆర్డినెన్స్‌ను సవాలు చేశామన్నారు. ఆర్డినెన్స్ చట్ట రూపం దాల్చినందున చట్ట సవరణను సవాలు చేస్తూ అనుబంధ పిటిషన్ల దాఖలుకు అనుమతినివ్వాలని వారు కోర్టును కోరారు. ప్రస్తుత పాలక మండలి కాలపరిమితి ముగిసిందని తెలిపారు. కొత్త పాలక మండలిలో ప్రత్యేక ఆహ్వానితులను నియమించకుండా ప్రభుత్వాన్ని నిరోధిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. చట్ట సవరణను సవాలు చేస్తూ అనుబంధ పిటిషన్లు దాఖలు చేసేందుకు పిటిషనర్లకు అనుమతి ఇచ్చింది.

పేదరికం తగ్గడానికి సంక్షేమ పథకాలే కారణం

- మంత్రి మేరుగు నాగార్జున

పామర్రు: రాష్ట్రంలో గతంలో 11.5 శాతంగా ఉన్న పేదరికం ప్రస్తుతం 6.5 శాతానికి తగ్గిందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలే ఇందుకు కారణమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున అన్నారు. కృష్ణాజిల్లా పామర్రులోని స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ నివాస గృహంలో ఆయనతో కలిసి మంత్రి మేరుగు సోమవారం విలేకరులతో మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోరుకున్న పేదరిక నిర్మూలన కోసం సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని తమ ప్రభుత్వం అహర్నిశలూ కృషి చేస్తోందన్నారు.

కొబ్బరి పొట్టు.. లాభాలు పట్టు



కొబ్బరి పొట్టుకు పెరిగిన ధర

- రకాన్ని బట్టి టన్ను రూ.2,500 నుంచి రూ.26 వేల వరకు
- కోకోపీట్ బ్లాక్ ధర కేజీ రూ.25 నుంచి రూ.55
- ఉత్తరాది నర్సరీల్లో మట్టికి బదులుగా కొబ్బరి పొట్టు వినియోగం
- ఇతర దేశాలకూ ఎగుమతి

ఇరవై ఏళ్ల క్రితం కొబ్బరి పొట్టు నిరుపయోగ వ్యర్థ పదార్థం. దీనిని వదిలించుకోవడం పీచు పరిశ్రమల యజమానులకు తలకు మించిన భారంగా ఉండేది. కొబ్బరి పీచుకు ధర ఉంటేనే పరిశ్రమలు నడవడం.. లేదంటే మూసేయడంలా ఉండేది. కానీ.. ఆ వ్యర్థమే ఇప్పుడు బంగారమైంది. కొబ్బరి పొట్టును ఇటుకల తయారీలో వాడితే లాభమని గుర్తించారు. ఇటుక తేలిక కావడంతోపాటు ఆకర్షణీయమైన రంగు రావడంతో బట్టి యజమానులు దీని కొనుగోలు మొదలు పెట్టారు. ఆ తరువాత దీని నుంచి అత్యంత నాణ్యమైన కంపోస్టు తయారవుతోందని గుర్తించడంతో కంపోస్టును ఇటుక (కోకోపీట్ బ్లాక్)లుగా మార్చి విదేశాలకు ఎగుమతి చేస్తుండటంతో దీని దశ తిరిగింది. నష్టాల్లో ఉన్న పీచు పరిశ్రమల ఉనికిని ఇప్పుడు కొబ్బరి పొట్టు కాపాడుతోంది.

సాక్షి, అమలాపురం

రాష్ట్రంలో ఏడాదికి 24 వేల టన్నుల పొట్టు

రాష్ట్రంలో చిన్నాపెద్ద కలిపి సుమారు 950 వరకు కొబ్బరి పీచు పరిశ్రమలు ఉండగా.. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 550 వరకు ఉన్నాయి. సగటున 350 గ్రాముల బరువు ఉన్న ఎండు కొబ్బరి కాయ నుంచి 80 గ్రాములు పీచు వస్తే.. కొబ్బరి పొట్టు 160 గ్రాముల వరకు వస్తోంది. రాష్ట్రంలో ఏడాదికి 24 వేల మెట్రిక్ టన్నుల పొట్టు ఉత్పత్తి అవుతోందని అంచనా. ఇందులో విద్యుత్ వాహకత (ఎలక్ట్రిక్ కండెక్టివిటీ–ఈసీ) 6 నుంచి 8 శాతం వరకు ఉంటోంది. అధిక ఈసీ ఉన్న కొబ్బరి పొట్టును నేరుగా వినియోగిస్తే మొక్కలు దెబ్బతింటాయి. దీంతో వివిధ పద్ధతులలో ఈసీ శాతం తగ్గించి కంపోస్టుగాను, బ్రిక్స్ రూపంలో తయారు చేసి ఎగుమతి చేస్తున్నారు. ఈసీ ఎక్కువగా ఉన్న పొట్టును ఇటుక బట్టీలకు టన్ను రూ.2,500 చొప్పున విక్రయిస్తుండగా.. తక్కువ ఈసీ ఉన్న పొట్టును టన్ను రూ.5 వేలకు విక్రయిస్తున్నారు. కొబ్బరి పొట్టు నాణ్యమైన సేంద్రియ ఎరువుగా తయారైతే.. దాని ధర పొట్టు రూపంలో టన్ను రూ.14 వేల నుంచి రూ.20 వేల వరకు ధర ఉంది. అదే ఇటుకల రూపంలో అయితే టన్ను ధర రూ.22 వేల నుంచి రూ.26 వేలు పలుకుతోంది. ఆన్‌లైన్ మార్కెటింగ్ చేసే అమెజాన్, ఇండియా మార్ట్ వంటి సంస్థలు కేజీ రూ.25 నుంచి రూ.55 వరకు కోకో బ్రిక్ అమ్మకాలు చేస్తున్నాయి.



మంచి డిమాండ్ ఉంది



అంతర్జాతీయంగా కోకోపీట్ బ్లాక్స్‌కు మంచి డిమాండ్ ఉంది. కానీ.. ఎగుమతులకు వీలుగా కొబ్బరి పొట్టును తక్కువ ఈసీకి తీసుకువచ్చి బ్లాక్‌లుగా తయారు చేయడం వ్యయప్రయాసలతో కూడుకున్న వ్యవహారం. మాకు స్థానికంగా ఇటుక బట్టీలకు అధికంగా వెళుతోంది. పీచు ధర పాతాళానికి పడిపోయినా.. క్వాయర్ పరిశ్రమలు నడుస్తున్నాయంటే అందుకు కొబ్బరి పొట్టే కారణం.

– నందూరి ఫణికుమార్, క్వాయర్ పరిశ్రమ యజమాని, ఆలమూరు



విదేశాలకు కోకోపీట్ బ్లాక్స్

కొబ్బరి పొట్టు ఉత్తరాది రాష్ట్రాలకు అధికంగా ఎగుమతి అవుతోంది. వీటిలో గుజరాత్‌ది అగ్రస్థానం. ఇక్కడి నర్సరీలకు మట్టికన్నా కొబ్బరి పొట్టు మేలైన ప్రత్యామ్నాయంగా వినియోగిస్తున్నారు. మన రాష్ట్రంతోపాటు దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ), సింగపూర్, మలేసియా, చైనా, జపాన్, అమెరికా, నెదర్లాండ్, ఆస్ట్రేలియాలకు పొట్టుతో తయారు చేసిన బ్రిక్స్ ఎగుమతి అవుతున్నాయి. మొత్తం కొబ్బరి పొట్టు ఉత్పత్తిలో కేవలం 10% మాత్రమే బ్లాక్ రూపంలో వెళుతుండగా.. 20% కంపోస్టు రూపంలోను, 70% ఇటుక బట్టీలకు వెళుతోంది.

సామాన్యుల సేవే సంతృప్తినిచ్చింది

- తిరుమలలో సాధారణ భక్తులకే పెద్దపీట
- ఇందుకు వీఐపీ బ్రేక్ దర్శనంలో మార్పులు
- చివరి సమావేశంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి



పాలకమండలి సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి

తిరుమల: టీటీడీ చైర్మన్‌గా తాను పనిచేసిన నాలుగేళ్లలో ఎక్కువమంది సామాన్య భక్తులకు తిరుమలలో వేంకటేశ్వర స్వామి దర్శనం కల్పించడం సంతృప్తిని ఇచ్చిందని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. ఎల్1, ఎల్2, ఎల్3 టికెట్లు రద్దు చేయడంతోపాటు సామాన్యులు స్వామివారి తొలి దర్శనం చేసుకునేలా వారికి పెద్దపీట వేశామన్నారు. ఇందుకు వీఐపీ బ్రేక్ దర్శన సమయాన్ని మార్చుతూ తీసుకున్న నిర్ణయాలు అత్యంత సంతృప్తినిచ్చాయని చెప్పారు. సామాన్య భక్తులకు వసతి, ఇతర సదుపాయాలు మెరుగుపరచడం కోసం అనేక నిర్ణయాలు తీసుకున్నామని.. అయితే, ఈ రెండు మాత్రం ఎప్పటికీ మరువలేనివన్నారు. నాలుగేళ్లపాటు చైర్మన్‌గా పని చేసే అదృష్టం ప్రసాదించిన శ్రీవేంకటేశ్వరస్వామివారికి, తనకు అవకాశం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌కు, సహకారం అందించిన ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు, సిబ్బందికి వైవీ కృతజ్ఞతలు తెలిపారు. నూతన చైర్మన్‌గా నియమితులైన భూమన కరుణాకర్‌రెడ్డి అనుభవం టీటీడీ అభివృద్ధికి దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టీటీడీ ప్రస్తుత ధర్మకర్తల మండలి చివరి సమావేశం సోమవారం తిరుమలలో వైవీ సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అధికారులు ఆయన నాలుగేళ్ల పదవీకాలంలో తీసుకున్న ముఖ్యమైన నిర్ణయాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి తాజా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు నిధులతో రెండు తెలుగు రాష్ట్రాల్లో 26 ఆలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. అలాగే రూ.24 కోట్లతో తిరుమలలోని రెండు ఘాట్ రోడ్లలో రక్షణ గోడల నిర్మాణం చేపడతామని వెల్లడించారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం చెంత భక్తులు వేచి ఉండేందుకు తిరుమల వైకుంఠం క్యూ కాంప్లెక్స్ తరహాలో రూ.23.50 కోట్లతో యాత్రికుల వసతి భవనం నిర్మిస్తామని తెలిపారు. ఇవేకాకుండా సమావేశంలో పలు నిర్ణయాలను తీసుకున్నారు. ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

10న టీటీడీ చైర్మన్‌గా భూమన ప్రమాణ స్వీకారం

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) చైర్మన్‌గా భూమన కరుణాకర్‌రెడ్డి ఈ నెల 10వ తేదీ ఉదయం 11.44 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఆయన మొదటగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని అనంతరం శ్రీవారి గరుడ అల్వార్ సన్నిధిలో ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ మేరకు టీటీడీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా, భూమన రెండోసారి టీటీడీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించనుండటం విశేషం.

మహిళా సబ్ రిజిస్ట్రార్‌ను బెదిరించిన టీడీపీ నేత వరద

- బోరున విలపించిన సబ్ రిజిస్ట్రార్
- నిబంధనలకు వ్యతిరేకంగా ఓ స్థలానికి రిజిస్ట్రేషన్ చేయకపోవడమే కారణం



వరదరాజులరెడ్డి బెదిరింపులకు కన్నీరు పెట్టుకుంటున్న సబ్ రిజిస్ట్రార్ రామలక్షుమ్మ

ప్రొద్దుటూరు: టీడీపీ మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ రామలక్షుమ్మను బెదిరించారు. సోమవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో వరదరాజులరెడ్డి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి సబ్ రిజిస్ట్రార్‌తో పాటు సిబ్బందిని బయటికి రావాలని బెదిరించారు. అయితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం లోపలే ఉండి బయటికి రాలేనని బోరున విలపించారు. మీకూ ఆడ పిల్లలున్నారు కదా.. అని ఆమె ప్రాధేయపడ్డారు. రాజకీయాలతో తమకేం సంబంధం లేదని తెలిపారు. అయినా వినకుండా వరదరాజులరెడ్డి.. నువ్వు ఏడ్చినా వదిలేదిలేదు.. బయటకు రావాల్సిందే.. అంటూ భయభ్రాంతులకు గురిచేశారు. విధిలేని పరిస్థితిలో సబ్ రిజిస్ట్రార్ ఏడ్చుకుంటూ బయటకొచ్చారు. మహర్షి స్కూల్ స్థలం రిజిస్ట్రేషన్‌కు సంబంధించి వరద చెప్పినట్టు సబ్ రిజిస్ట్రార్ వినలేదు. నిబంధనలకు వ్యతిరేకంగా ఉండటంతో సబ్ రిజిస్ట్రార్ దానిని రిజిస్టర్ చేయకపోవడంపై వరదరాజులరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయంలో ఆస్తుల అమ్మకాలు, కొనుగోలుకు సంబంధించి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి కప్పం కట్టాలా అంటూ.. ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దాదాపు అరగంట పాటు విధులకు ఆటంకం జరిగి లావాదేవీలు నిలిచిపోయాయి.

పేదల గొంతుక గద్దర్

1,044వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



గద్దర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బహుజన పరిరక్షణ సమితి నాయకులు

తాడికొండ: పటేల్ పట్వారీలు, పెత్తందారీ వ్యవస్థపై పోరాటం చేసి, సినీ గేయ రచయితగా, గాయకుడిగా, బుర్రకథ, ఒగ్గుపాటల కళాకారుడిగా పేదల గొంతుక వినిపించిన ఉద్యమ ప్రజా యుద్ధనౌక గద్దర్‌ను కోల్పోవడం బాధాకరమని బహుజన పరిరక్షణ నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,044వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పేదల హక్కుల కోసం పోరాటం చేసిన యోధుడు గద్దర్ అని, ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విజయం సాధిస్తామన్నారు. పెత్తందారులు–పేదల మధ్య జరుగుతున్న ఈ యుద్ధంలో చివరికి విజయం సాధించేది బహుజనులని కులవాదులు గుర్తుంచుకుని మసలుకుంటే మంచిదని హెచ్చరించారు. చంద్రబాబు చేసిన ఆగడాలు అంతా ఇంతా కాదని, బాబు చేసిన అరాచకాలకు ఎందరో బహుజన ఉద్యమ కారులు అణచివేయబడ్డారన్నారు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలకు సుప్రీంకోర్టు పచ్చజెండా ఊపితే ఆ స్థలాల్లో నిర్మాణాలను అడ్డుకునేందుకు వందలాది పిటిషన్లు వేయించిన చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతామని తెలిపారు. విజయవాడ కేంద్రంగా గద్దర్ విగ్రహ నిర్మాణం కోసం త్వరలో కమిటీ వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు మాదిగాని గురునాథం, పులి దాసు, ఈపూరి ఆదాం, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

60 ఏళ్ల వృద్ధులకు చెవులు కుట్టిన 90 ఏళ్ల మేనమామ

- వేలూరు జిల్లా ఏరికొడి గ్రామంలో వేడుకగా తలనీలాల సమర్పణ



మునివేల్‌కు చెవులు కుడుతున్న మేనమామ

వేలూరు: అరవై ఏళ్ల వృద్ధులకు 90 సంవత్సరాల మేనమామ చెవులు కుట్టిన అరుదైన ఘటన వేలూరు జిల్లా అనకట్టు నియోజకవర్గంలోని మారుతువల్లి పాళ్యం పంచాయతీ పరిధిలోని ఏరికొడి గ్రామంలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... ఏరికొడి గ్రామంలో నివాసం ఉండే మునివేల్(60) కూలి. ఇతనికి ఐదుగురు అన్నదమ్ములు, ముగ్గురు అక్క చెల్లెళ్లు ఉన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో పుట్టు వెంట్రుకలు సమర్పించే సమయంలో మునివేల్, అతడి తమ్ముడు రాజా(58)కు చెవులు కుట్టించే కార్యక్రమాన్ని తల్లిదండ్రులు చేయలేదు. మిగిలిన బిడ్డలను మాత్రం తిరుమలకు తీసుకెళ్లి సంప్రదాయబద్ధంగా గుండు కొట్టించి చెవులు కుట్టించారు. దీంతో మునివేల్, రాజాను చెవులు కుట్టే కార్యక్రమానికి కూడా నోచుకోని చెవిటివారిగా స్నేహితులు, బంధువులు తరచూ ఆట పట్టించే వారు. ఈ నేపథ్యంలో వీరిద్దరికీ చెవులు కుట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని 60 ఏళ్ల అనంతరం కుటుంబ సభ్యులు తాజాగా నిర్ణయించుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం మునివేల్, రాజా కుటుంబ సభ్యులు, బంధువులను సొంత గ్రామానికి రప్పించి పూర్వీకుల ఆలయమైన పొన్నిగుడి వద్ద విశేష పూజలు చేశారు. అనంతరం మునివేల్, రాజాను 90 సంవత్సరాల మేనమామ తంగవేలు ఒడిలో కూర్చోబెట్టి గుండు గీయించి సంప్రదాయబద్ధంగా చెవులు కుట్టించారు. బంధువులకు భారీ స్థాయిలో విందు ఏర్పాటు చేశారు.

టీటీడీకి రూ.5.11 కోట్ల విరాళం



టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డికి చెక్కు అందజేస్తున్న దాతలు

- చెన్నై టి.నగర్‌లో ఆలయ విస్తరణకు వినియోగించాలని వినతి

తిరుమల: టీటీడీ చెన్నై స్థానిక సలహా మండలి అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి నేతృత్వంలో తొమ్మిది మంది దాతలు టీటీడీకి రూ.5.11 కోట్లు విరాళం సమర్పించారు. ఈ మొత్తానికి సంబంధించిన డీడీని తిరుమల అన్నమయ్య భవనంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి సోమవారం అందజేశారు. చెన్నై టి.నగర్‌లోని వెంకటనారాయణ రోడ్‌లో ప్రస్తుతం ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ విస్తరణ కోసం స్థలం కొనుగోలుకు ఈ మొత్తాన్ని అందించారు. ఈ ఆలయానికి ఆనుకుని ఉన్న రూ.35 కోట్ల విలువైన స్థలాన్ని చెన్నై స్థానిక సలహా మండలి గుర్తించింది. ఈ స్థలం కొనుగోలుకు గతంలో కొంతమంది దాతలు రూ.8,15,15,002 విరాళంగా అందించారు. కాగా, ప్రస్తుతం దాతలు ర్యాపిడ్ కేర్ గ్రూపు రూ.1.50 కోట్లు, కోయంబత్తూరుకు చెందిన వెంకట సుబ్రహ్మణ్యం, నాగరాజన్, సీఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు ఒక్కొక్కరు రూ.కోటి చొప్పున, శ్రీశరణ్, శెంబగమూర్తి ఒక్కొక్కరు రూ.20 లక్షలు చొప్పున, నరేష్ సుబ్రహ్మణ్యం, బలహా కెమికల్స్(పి) లిమిటెడ్ ఒక్కొక్కరు రూ. 10 లక్షలు చొప్పున, నీలాద్రి ప్యాకింగ్స్ రూ.లక్ష విరాళం అందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి, ట్రస్ట్ బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో తెలంగాణ రాష్ట్ర మంత్రి హరీష్ రావు, తెలంగాణ పర్యాటక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, జాతీయ బీసీ వెల్ఫేర్ చైర్మన్ హన్సరాజ్ గంగారం, తెలంగాణ ఎంపీ పార్థసారథి, సినీ దర్శకులు రాఘవేంద్రరావు, వీఎస్ ఆదిత్య తదితరులు ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు అందించగా, అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

విశాఖ ఉక్కు కోసం కేంద్రంపై ఒత్తిడి పెంచాలి

ఎంపీలను కోరిన ఉక్కు పరిరక్షణ పోరాట సమితి

సాక్షి, న్యూఢిల్లీ: విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేట్‌పరం చేయకుండా ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేందుకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలని ఉక్కు పరిరక్షణ పోరాట సమితి నాయకులు పలువురు ఎంపీలను కోరారు. 910 రోజులుగా పోరాటం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇది తెలుగు ప్రజలపై జరుగుతున్న దాడి అని, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన గనులు కేటాయించాలని, పూర్తిస్థాయి సామర్థ్యంతో కంపెనీ నిర్వహించేందుకు కేంద్రం సహకరించాలని సీపీఎం, ఆమ్‌ఆద్మీ పార్టీ, జేడీయూ తదితర ఎంపీలను ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు నారాయణ, రాజశేఖర్, అయోధ్యరామ్, శ్రీనివాసరావు, జెర్రిపోతుల ముత్యాలు తదితరులు కోరారు.

ఎంఎస్‌ఎంఈల్లో రికార్డు స్థాయిలో ఉపాధి

- 2022–23లో లక్ష్యాన్ని మించి 231 శాతం అదనంగా ఉద్యోగావకాశాలు
- 1,56,252 మందికి ఉపాధి లక్ష్యం కాగా 3,61,172 మందికి ఉద్యోగాలు
- గతేడాది 92,707 యూనిట్ల ద్వారా 9,677 కోట్ల పెట్టుబడులు

సాక్షి, అమరావతి: ఉపాధి కల్పనలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఈలు) సరికొత్త రికార్డులు నెలకొల్పుతున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరానికి ఎంఎస్‌ఎంఈల ద్వారా 1,56,252 మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. 231 శాతం అదనంగా 3,61,172 మందికి ఉపాధి లభించింది. ఎంఎస్‌ఎంఈలు ఒకే ఏడాది ఇన్ని ఉద్యోగాలు కల్పించడం ఇదే ప్రథమమని పరిశ్రమల శాఖ అధికారులు తెలిపారు. 2022–23 సంవత్సరంలో కొత్తగా 1,25,000 ఎంఎస్‌ఎంఈ యూనిట్లు ఏర్పాటు చేయడం ద్వారా రూ.15,625 కోట్ల పెట్టుబడులు తేవాలని లక్ష్యంగా పెట్టుకోగా.. 92,707 యూనిట్లు (లక్ష్యంలో 75 శాతం) ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా రూ.9,677 కోట్ల పెట్టుబడులు (లక్ష్యంలో 62 శాతం) వచ్చాయి. ఒక్కొక్క యూనిట్ ద్వారా సగటున 3.8 మందికి ఉపాధి లభించింది. అత్యధిక ఉద్యోగావకాశాలు కల్పించే ఎంఎస్‌ఎంఈలకు రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ నవోదయం, రీస్టార్ట్ ప్యాకేజ్, ఎస్సీ ఎస్టీ బడుగు వికాసం పేరుతో పెద్ద ఎత్తున ప్రోత్సాహకాలు ఇస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఈ రంగం వేగంగా విస్తరిస్తోంది. రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 3,94,525 ఎంఎస్‌ఎంఈలు ఉండగా, వీటిలో గడిచిన నాలుగేళ్లలోనే (2019 నుంచి 2023వరకు) 2,00,995 యూనిట్లు ఏర్పాటయ్యాయి. రాష్ట్రంలో ఎంఎస్‌ఎంఈల ద్వారా 34.83 లక్షల మందికి ఉపాధి లభిస్తే.. ఈ నాలుగేళ్లలో 12.61 లక్షల మందికి ఉపాధి లభించింది.

ఈ ఏడాది 7.50 లక్షల మందికి ఉపాధి లక్ష్యం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 1.50 లక్షల ఎంఎస్‌ఎంఈ యూనిట్లు ఏర్పాటు చేయించి, వాటి ద్వారా 7.50 లక్షల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ఎంఎస్‌ఎంఈలకు అన్ని సౌకర్యాలూ ఒకే చోట కల్పిస్తూ క్లస్టర్లను ఏర్పాటు చేసి, పెద్ద మొత్తంలో బ్యాంకు రుణాలు లభించేలా చర్యలు చేపట్టింది. ఉద్యం పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలు, పీఎంఈజీపీ, సీజీటీఎంఎస్ఈ వంటి పథకాలపై అవగాహన కల్పిస్తోంది. ఈ ఏడాది లక్ష్యాల సాధనకు పటిష్టమైన ప్రణాళికతో ముందుకు వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ రంగం పని తీరుపై సీఎస్ 15 రోజులకు ఒకసారి సమీక్షించి, అధికారులకు తగిన సూచనలిస్తున్నారు.

కారులో వస్తారు.. తుపాకులు చూపి దోచేస్తారు

- ఆరుగురు సభ్యుల ముఠా అరెస్ట్
- 2 తుపాకులు, 4 కత్తులు, నగలు, నగదు స్వాధీనం
- ముఠా సూత్రధారి సీఐఎస్‌ఎఫ్ మాజీ కానిస్టేబుల్
- రెక్కీలు నిర్వహించి మరీ దోపిడీలు



దొంగల ముఠా నేరాలను వివరిస్తున్న ఎస్పీ శ్రీధర్, ఏఎస్పీ ఖాదర్ బాషా

అమలాపురం టౌన్: వారిదో ఆరుగురు సభ్యుల ముఠా. సీఐఎస్‌ఎఫ్ మాజీ కానిస్టేబుల్ షేక్ రఫీ ఆ ముఠాకు సూత్రధారి. వాళ్లంతా కారులో వచ్చి రెక్కీ నిర్వహిస్తారు. తర్వాత తుపాకులు, కత్తులతో బెదిరిస్తారు. దొరికిన కాడికి నగలు, నగదు దోచుకుంటారు. ఇదే తరహాలో గత నెల 27న రాత్రి అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం క్రాపచింతలపూడికి చెందిన కొబ్బరి కాయల వ్యాపారి ఆర్ఎస్ చిరంజీవి ఇంట్లోకి ఈ దొంగలు చొరబడ్డారు. తుపాకులు, కత్తులతో బెదిరించి రూ.1.20 లక్షల నగదు, రూ.14 లక్షల విలువైన బంగారాన్ని దోచుకెళ్లారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ముమ్మిడివరం పోలీసులు ముఠాను అరెస్ట్ చేయడంతో ఈ ముఠా ఆగడాలు వెలుగుచూశాయి. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం మీడియా సమావేశంలో ఎస్పీ సుసరావు శ్రీధర్, ఏఎస్పీ ఎస్.ఖాదర్ బాషా, డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ వెల్లడించారు.

ముఠాగా ఏర్పడి..

ఈ ముఠాలో విజయనగరానికి చెందిన సీఐఎస్‌ఎఫ్ మాజీ కానిస్టేబుల్ షేక్ రఫీ పాత్రే కీలకం. ఇతడు సీఐఎస్‌ఎఫ్‌లో పని చేస్తున్నప్పుడు విధులకు సక్రమంగా హాజరు కాకపోవడంతో అధికారులు అతడిని ఉద్యోగం నుంచి తొలగించారు. సర్వీస్‌లో ఉన్నప్పుడు రఫీ జమ్మూ కశ్మీర్‌లో రివాల్వర్ లైసెన్స్ పొందాడు. గత ఏడాది పాయింట్ 32 పిస్టల్, 50 రౌండ్లు కొనుగోలు చేశాడు. రఫీ ఇంటి సమీపంలోనే చిన్ననాటి స్నేహితుడైన తుమ్మల సత్తిబాబు (సతీష్)తో జత కలిశాడు. సతీష్ కూడా ఓ నమూనా రివాల్వర్ కొన్నాడు. దీంతో పిల్లెట్లు పేల్చవచ్చు. చెడు వ్యసనాలకు బానిసలైన ఇద్దరూ సులువుగా డబ్బు సంపాదించేందుకు చోరీల బాట పట్టారు. రెక్కీలు నిర్వహించి, తుపాకులు, కత్తులతో బెదిరించి దోపిడీలకు పాల్పడేవారు. వీరికి పశ్చిమ గోదావరి జిల్లా అత్తిలికి చెందిన అద్దంకి కార్తీక్ (ఫ్రాన్సిస్), సబ్బితి సందీప్‌కుమార్ (టోనీ), కాకినాడ జిల్లా జగన్నాథపురానికి చెందిన కాటాడి లక్ష్మణ్, కాటాడి రాము కాకినాడలోని ఒక లాడ్జిలో పరిచయమయ్యారు. ఈ ఆరుగురూ ఓ ముఠాగా ఏర్పడి ఇప్పటివరకూ మూడుచోట్ల బెదిరింపులతో నగలు, నగదు దోపిడీలు, ఐదు చైన్ స్నాచింగ్‌లను చేశారు.

ఇదీ చోరీల చిట్టా

ఈ ముఠా పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి, తూర్పు గోదావరి జిల్లా నిడదవోలు, ఉండ్రాజవరం, కాకినాడ జిల్లా సర్పవరం అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడ్డారు. కాకినాడ జిల్లా జగ్గంపేట, సర్పవరం, అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో తుపాకులు, కత్తులతో బెదిరింపులకు పాల్పడి నగలు, నగదు దోచేశారు. వీరు కారులో వచ్చి మరీ బెదిరింపులకు పాల్పడతారు. జగ్గంపేట బెదిరింపు కేసులో వీరు ఒక వ్యక్తిని కారులో కిడ్నాప్ చేశారు. అతడిని విశాఖకు తరలించి మరీ నగదు కాజేశారు. ముమ్మిడివరం మండలం క్రాప చింతలపూడి బెదిరింపు కేసులో ఈ ముఠా నుంచి ఒక కారు, 3 మోటార్ సైకిళ్లు, ఒక పిస్టల్, 46 రౌండ్లకు చెందిన 4 ఖాళీ కేసులు, ఒక రివాల్వర్, 22 ఎంఎం పిల్లెట్ల బాక్స్, 4 కత్తులు, 7 సెల్‌ఫోన్లు, రూ.1.20 లక్షల నగదు, రూ.14 లక్షల విలువైన 6 బంగారు గొలుసులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాకు సంకెళ్లు వేయడంలో కీలక పాత్ర పోషించిన డీఎస్పీ అంబికా ప్రసాద్, ముమ్మిడివరం సీఐ ఎన్.కొండయ్య, క్రైం సీఐ డి.గోవిందరావు, రామచంద్రపురం సీఐ దుర్గారావు, ముమ్మిడివరం ఎస్సై కె.సురేష్‌బాబు, ఐడీ పార్టీ ఏఎస్సై అయితాబత్తుల బాలకృష్ణ, ఇతర పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ శ్రీధర్ అభినందించి రివార్డులు అందజేశారు.

క్లుప్తంగా...

'నీట్' ఏడాదికి రెండుసార్లు నిర్వహించే ప్రతిపాదన లేదు

సాక్షి, న్యూఢిల్లీ: ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే నీట్ యూజీని ఏడాదికి రెండుసార్లు నిర్వహించాలన్న ప్రతిపాదనేదీ పరిశీలనలో లేదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. 2023లో నీట్ యూజీకి 20,38,597 మంది అభ్యర్థులు హాజరయ్యారని సోమవారం లోక్‌సభలో ఒక ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుభాష్ సర్కార్ లిఖిత పూర్వక సమాధానమిచ్చారు.

కేవీల్లో ఎంపీల కోటా పునరుద్ధరణ యోచన లేదు


న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న కేంద్రీయ విద్యాలయాల్లో ప్రవేశాలకు పార్లమెంట్ సభ్యుల కోటాను పునరుద్ధరించే ప్రతిపాదనేదీ లేదని కేంద్రం తెలిపింది. రాజ్యసభలో సోమవారం కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి అన్నపూర్ణాదేవి ఒక ప్రశ్నకు ఈ మేరకు సమాధానమిచ్చారు. ఈ విద్యా సంస్థలను ప్రాథమికంగా రక్షణ, పారా మిలటరీ, కేంద్ర అటానమస్ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగుల పిల్లల కోసం ఏర్పాటు చేసినవని వివరించారు. ఎంపీలకు కోటా ఇవ్వడం వల్ల ఒక్కో సెక్షన్‌లో 40 మంది విద్యార్థుల పరిమితి దాటిపోతోందన్నారు. ఇది బోధనపై ప్రభావం చూపుతోందని వివరించారు. గతంలో ఒక్కో ఎంపీ ఒక కేవీలో 10 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించాలని సిఫారసు చేసేందుకు వీలుండేది. మొత్తం 543 మంది లోక్‌సభ, 245 మంది రాజ్యసభ సభ్యులు కలిపి కేవీల్లో ఏటా తమ కోటా కింద 7,880 మంది విద్యార్థుల ప్రవేశాలకు సిఫారసు చేసేవారు.

'బిల్కిస్ బానో' కేసులో దోషులను వదలొద్దు

న్యూఢిల్లీ: బిల్కిస్ బానో గ్యాంగ్‌రేప్ కేసులో దోషులు ఓ వర్గం ప్రజలను వెంటాడి, హత్య చేయడమే లక్ష్యంగా రక్తదాహం ప్రదర్శించారని బాధితురాలి తరఫు న్యాయవాది సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టొద్దని కోరారు. 2002 నాటి గుజరాత్ అల్లర్ల సమయంలో బిల్కిస్ బానో అనే గర్భిణిపై దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. అంతేకాకుండా ఆమె కుటుంబంలోని ఏడుగురిని హత్య చేశారు. ఈ కేసులో మొత్తం 11 మంది దోషులకు యావజ్జీవ శిక్షపడగా, గత ఏడాది గుజరాత్ ప్రభుత్వం వారికి క్షమాభిక్ష ప్రసాదించింది. దోషులను జైలు నుంచి విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ బాధితురాలు బిల్కిస్ బానో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

ఢిల్లీ బిల్లు నెగ్గింది

రాజ్యసభలో ప్రవేశపెట్టిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా
- అనుకూలంగా 131 మంది, వ్యతిరేకంగా 102 మంది ఓటు
- బిల్లు రాజ్యాంగవిరుద్ధమని ప్రతిపక్షాల ఆగ్రహం
- ఢిల్లీలో అవినీతిరహిత పాలన కోసమే బిల్లు తీసుకొచ్చామన్న అమిత్ షా


రాజ్యసభలో మాట్లాడుతున్న అమిత్ షా


వీల్ చైర్లో ఓటింగ్‌కు హాజరైన మన్మోహన్ సింగ్

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో ప్రభుత్వ సీనియర్ అధికారుల బదిలీలు, పోస్టింగ్‌లపై నియంత్రణ కోసం ఉద్దేశించిన 'గవర్నమెంట్ ఆఫ్ నేషనల్ క్యాపిటల్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ(అమెండ్‌మెంట్) బిల్లు–2023' సోమవారం రాజ్యసభలో ఆమోదం పొందింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా బిల్లును సభలో ప్రవేశపెట్టారు. సుదీర్ఘ చర్చ అనంతరం సభాపతి ఓటింగ్ నిర్వహించారు. బిల్లుకు అనుకూలంగా 131 మంది ఎంపీలు, వ్యతిరేకంగా 102 మంది ఎంపీలు ఓటువేశారు. ఢిల్లీ బిల్లు గత వారమే లోక్‌సభలో ఆమోదం పొందిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఎగువ సభ సైతం ఆమోద ముద్ర వేయడంతో ఇక రాష్ట్రపతి సంతకంతో బిల్లు చట్టరూపం దాల్చనుంది. ప్రస్తుతం రాజ్యసభలో మొత్తం సభ్యుల సంఖ్య 238. అధికార ఎన్డీయేతోపాటు ఈ బిల్లు విషయంలో ఆ కూటమికి అనుకూలంగా ఉన్న సభ్యుల సంఖ్య 131. వారంతా బిల్లుకు మద్దతు పలికారు. ఇక విపక్ష 'ఇండియా' కూటమితోపాటు ఇతర విపక్ష సభ్యుల సంఖ్య 104 ఉండగా, బిల్లుకు వ్యతిరకంగా 102 ఓట్లు మాత్రమే వచ్చాయి. మరో ముగ్గురు సభ్యులు ఎటూ తేల్చుకోలేదు. ఓటింగ్‌లో పాల్గొనలేదు.

సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీస్తారా?: విపక్షాలు

ఢిల్లీ బిల్లును రాజ్యసభలో ప్రతిపక్షాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. దీనిపై తొలుత సభలో చర్చను కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్ సింఘ్వీ ప్రారంభించారు. బిల్లు రాజ్యాంగవిరుద్ధమని, ప్రజాస్వామ్య వ్యతిరేకమని చెప్పారు. మనమంతా కచ్చితంగా వ్యతిరేకించాలని విపక్షాలకు పిలుపునిచ్చారు. సమాఖ్య స్ఫూర్తిని దెబ్బతీసేలా ఉన్న ఈ చర్య ఏదో ఒక రోజు మీ దాకా వస్తుంది అంటూ హెచ్చరించారు. సుప్రీంకోర్టు రాజ్యాంగం ధర్మాసనం ఇచ్చిన రెండు తీర్పులకు వ్యతిరేకంగా బిల్లును తీసుకొచ్చారని కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. కాంగ్రెస్ సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం మాట్లాడుతూ.. ఢిల్లీ బిల్లు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని ఆరోపించారు. అలాగే బిల్లుపై చర్చలో ఆమ్ ఆద్మీ పార్టీ, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీ, భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్), ఆర్జేడీ, సీపీఎం, జేడీ(యూ), కేరళ కాంగ్రెస్(ఎం), సీపీఐ తదితర పార్టీల సభ్యులు మాట్లాడారు. ఢిల్లీ ప్రభుత్వ అధికారాలను బలవంతంగా లాక్కోవడానికే బిల్లును తీసుకొచ్చారని దుయ్యబట్టారు.

అధికారాలు లాక్కోవడానికి కాదు: అమిత్ షా

బిల్లును తీసుకొచ్చింది కేవలం ఢిల్లీ ప్రజల హక్కులను కాపాడడం కోసమేనని, అంతేతప్ప ఆప్ ప్రభుత్వ అధికారాలను లాక్కోవడానికి కాదని అమిత్ షా తేల్చిచెప్పారు. ఢిల్లీ బిల్లుపై రాజ్యసభలో జరిగిన చర్చకు సమాధానమిచ్చారు. ఇది పూర్తిగా చట్టబద్ధమేనని, సుప్రీంకోర్టు తీర్పును ఏ కోణంలోనూ ఉల్లంఘించడం లేదని వ్యాఖ్యానించారు. ఇతర రాష్ట్రాల కంటే ఢిల్లీ చాలా భిన్నమని తెలియజేశారు. పార్లమెంట్, వివిధ దేశాల రాయబార కార్యాలయాలు, సుప్రీంకోర్టు ఇక్కడే ఉన్నాయని, వివిధ దేశాల అధినేతలు ఢిల్లీని తరచుగా సందర్శిస్తుంటారని, అందుకే ఈ నగరాన్ని కేంద్ర పాలిత ప్రాంతంగా చేసినట్లు పేర్కొన్నారు. పరిమిత అధికారాలున్న అసెంబ్లీతో కూడిన కేంద్ర పాలిత ప్రాంతం ఢిల్లీ అని అన్నారు.

ప్రజాస్వామ్య చరిత్రలో చీకటి దినం: ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ: 'దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చీకటి రోజు. ఢిల్లీ సర్వీసెస్ బిల్లు విషయంలో ఆప్‌నకు తోడుగా నిలిచిన రాజకీయ పార్టీలకు నా కృతజ్ఞతలు. ఢిల్లీలో నాలుగు పర్యాయాలు ఆప్ చేతిలో ఘోరంగా ఓటమిపాలైన బీజేపీ, దొడ్డిదారిన అధికారంలోకి వచ్చేందుకే ఈ బిల్లును తీసుకువచ్చింది. ఆప్ చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలతో బీజేపీ పోటీ పడలేకపోతోంది. నన్ను ముందుకు వెళ్లకుండా చేయడమే వారి ఏకైక లక్ష్యం. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో ఒక్క సీటును కూడా ప్రజలు బీజేపీకి దక్కనివ్వరు. ఢిల్లీ వ్యవహారాల్లో ప్రధాని మోదీ జోక్యం ఎందుకు చేసుకుంటున్నారు? 'అంటూ ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఒక వీడియో విడుదల చేశారు.

మణిపూర్‌పై సుప్రీంకోర్టు కమిటీ



న్యూఢిల్లీ: మణిపూర్ అల్లర్ల బాధితులకు అందే సహాయం, పునరావాసం, పరిహారంపై పర్యవేక్షించేందుకు సుప్రీంకోర్టు ముగ్గురు రిటైర్డు మహిళా న్యాయమూర్తులతో కమిటీ వేసింది. మణిపూర్ అల్లర్లకు సంబంధించి క్రిమినల్ కేసులపై దర్యాప్తు పర్యవేక్షణకు మహారాష్ట్ర పోలీస్ రిటైర్డు చీఫ్ దత్తాత్రేయ పడ్సల్గికర్‌ను నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో చట్టపాలనపై ప్రజలకు విశ్వాసం కల్పించడానికి ప్రయత్నిస్తున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది. అక్కడి పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించాలని కూడా అత్యున్నత న్యాయస్థానం నిర్ణయించింది. జమ్మూకశ్మీర్ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గీతా మిట్టల్, బాంబే హైకోర్టు రిటైర్డు జడ్జి జస్టిస్ షాలిని పి.జోషి, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆషాలతో కూడిన కమిటీ నేరుగా తనకు నివేదిక సమర్పిస్తుందని తెలిపింది. బాధితులకు సహాయం, పునరావాసం, పరిహారం, దెబ్బతిన్న నివాసాలు, ప్రార్థనా స్థలాలను పునరుద్ధరించడ వంటి వాటిని వీరు సహాయక శిబిరాలకు వెళ్లి, స్వయంగా తెలుసుకుంటారని వివరించింది. మణిపూర్‌లో పరిస్థితులు నానాటికీ దిగజారుతున్నాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం పేర్కొంది. 'అల్లర్లకు సంబంధించిన 11 కేసులు సీబీఐకి బదిలీ అవుతాయి. మిగతా వాటిని రాష్ట్ర పోలీసులే చూసుకుంటారు.11కే సుల దర్యాప్తులో సీబీఐకి అవసరమైన డిప్యూటీ ఎస్పీ ర్యాంకు అయిదుగురు అధికారులను వివిధ రాష్ట్రాల నుంచి డెప్యుటేషన్‌పై తీసుకుంటారు. వారిని సీబీఐ జాయింట్ సెక్రటరీ స్థాయి అధికారి మహారాష్ట్ర డీజీపీ దత్తాత్రేయ పడ్సల్గికర్ పర్యవేక్షిస్తారు'అని ధర్మాసనం తెలిపింది. సీబీఐకి ఇవ్వగా మిగిలిన కేసులను రాష్ట్ర పోలీసులతో కూడిన 42 సిట్‌లు దర్యాప్తు చేస్తాయని పేర్కొంది. ఈ సిట్‌లకు వేరే రాష్ట్రాలకు చెందిన ఆరుగురు డీఐజీ స్థాయి అధికారులు సారథ్యం వహిస్తారని వివరించింది. విచారణకు మణిపూర్ చీఫ్ సెక్రటరీ వినీత్ జోషి, రాష్ట్ర డీజీపీ రాజీవ్ సింగ్ హాజరయ్యారు. మణిపూర్‌లో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని, యంత్రాంగం విఫలమైందని ఈనెల ఒకటిన కోర్టు వ్యాఖ్యానించింది. మహిళలను నగ్నంగా ఊరేగించిన ఘటనపై ఆలస్యంగా స్పందించిన రాష్ట్ర డీజీపీ 7న స్వయంగా హాజరై సమాధానం ఇవ్వాలంటూ ఆదేశించిన విషయం తెలిసిందే.

ఎంపీగా లోక్‌సభలోకి రాహుల్

సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ నోటిఫికేషన్

రాహుల్‌కు స్వాగతం పలికిన 'ఇండియా' కూటమి ఎంపీలు • కాంగ్రెస్ పార్టీలో నూతనోత్సాహం


లోక్‌సభలో ఆసీనులైన రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాహుల్ గాంధీ దాదాపు నాలుగు నెలల తర్వాత లోక్‌సభలో ఎంపీ హోదాలో అడుగుపెట్టారు. పరువు నష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్ష పడడం వల్ల కోల్పోయిన లోక్‌సభ సభ్యత్వం సుప్రీంకోర్టు ఉత్తర్వులతో తిరిగి వచ్చింది. రాహుల్ సభ్యత్వాన్ని పునరుద్ధరిస్తూ లోక్‌సభ సెక్రటేరియట్ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ సమాచారం తెలిసిన అనంతరం రాహుల్ పార్లమెంట్‌కు చేరుకున్నారు. తొలుత గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పించి మధ్యాహ్నం ఎంపీగా లోక్‌సభలోకి అడుగుపెట్టారు. ఆయన వచ్చిన కొద్దిసేపటికే సభ వాయిదా పడింది. పార్లమెంట్ ప్రాంగణంలో రాహుల్‌కు కాంగ్రెస్, ఇతర విపక్షాల ఎంపీలు సాదర స్వాగతం పలికారు. మిఠాయిలు పంచుకున్నారు. మొత్తానికి రాహుల్ రాక సందర్భంగా పార్లమెంట్ ఆవరణలో పండుగ వాతావరణం కనిపించింది. కేంద్ర ప్రభుత్వంపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై త్వరలో పార్లమెంట్‌లో చర్చ, ఓటింగ్ జరుగనున్న నేపథ్యంలో రాహుల్ మళ్లీ ఎంపీగా సభకు రావడం తమకు లాభిస్తుందని కాంగ్రెస్‌తోపాటు విపక్ష 'ఇండియా' కూటమి ఆశాభావం వ్యక్తం చేసింది. రాహుల్ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించడంతో కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది.

'ఇండియా' కూటమిలో హర్షం

రాహుల్ గాంధీ లోక్‌సభ సభ్యత్వాన్ని పునరుద్ధరించడాన్ని స్వాగతిస్తున్నామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. కేరళలోని వయనాడ్ నియోజకవర్గంతోపాటు దేశ ప్రజలకు ఇదొక ఊరట అని పేర్కొన్నారు. బీజేపీ, మోదీ ప్రభుత్వం పరిపాలనపై దృష్టి పెట్టకుండా ప్రతిపక్ష నాయకులను లక్ష్యంగా చేసుకొని వేధిస్తున్నాయని మండిపడ్డారు. రాహుల్ రాక పట్ల విపక్ష 'ఇండియా' కూటమిలోని పలు పార్టీల అగ్రనేతలు హర్షం వ్యక్తం చేశారు.

రాహుల్ దోష విముక్తుడు కాలేదు: బీజేపీ

రాహుల్ గాంధీ దోషం నుంచి ఇంకా పూర్తిగా విముక్తుడు కాలేదని బీజేపీ ఎంపీ సుశీల్ కుమార్ మోదీ పేర్కొన్నారు. పరువు నష్టం కేసులో రాహుల్‌కు విధించిన రెండేళ్ల జైలు శిక్షపై సుప్రీంకోర్టు కేవలం స్టే మాత్రమే ఇచ్చిందని గుర్తుచేశారు. కేసు గుజరాత్ కోర్టులో పెండింగ్‌లో ఉందని చెప్పారు. రాహుల్ వ్యాఖ్యలను సుప్రీంకోర్టు తప్పుపట్టిందని సుశీల్ కుమార్ మోదీ వివరించారు. ఆయన మళ్లీ లోక్‌సభకు వచ్చినప్పటికీ ప్రజలకు గానీ, కాంగ్రెస్ పార్టీకి గానీ ఒరిగేదేమీ లేదని ఎద్దేవా చేశారు.

అవిశ్వాసంపై నేడు చర్చ

కేంద్రంపై విపక్షాలు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై మంగళవారం లోక్‌సభలో చర్చ ప్రారంభం కానుంది. రెండు రోజులపాటు చర్చ జరుగుతుందని అంచనా. అనంతరం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చర్చకు సమాధానమిస్తారు.

పంచాయతీ రాజ్ ప్రాముఖ్యాన్ని కాంగ్రెస్ అర్థం చేసుకోలేదు

అందుకే గ్రామాల్లో వెనుకబాటు: మోదీ


ఢిల్లీలో చేనేత ఎగ్జిబిషన్‌లో వస్త్రాన్ని పరిశీలిస్తున్న ప్రధాని మోదీ

చండీగఢ్: దేశానికి పంచాయతీ రాజ్ వ్యవస్థ ఎంత అవసరమైందో స్వాతంత్య్రం వచ్చిన నాలుగు దశాబ్దాల తర్వాత కూడా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అర్థం చేసుకోలేకపోయిందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థల బలోపేతానికి అప్పటి ప్రభుత్వాలు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. జిల్లా పంచాయతీ వ్యవస్థను సైతం కాంగ్రెస్ పాలకులు గాలికి వదిలేశారని మండిపడ్డారు. 'ఫలితంగా దేశ జనాభాలో గ్రామాల్లో నివసించే మూడింట రెండొంతుల మంది కనీస సౌకర్యాలైన రహదారులు, విద్యుత్, మంచినీరు, పక్కా ఇళ్లు వంటి వాటికి కూడా నోచుకోలేకపోయారు. ఈ నిర్లక్ష్యం ఫలితంగా స్వాతంత్య్రం సిద్ధించిన ఏడు దశాబ్దాలకు కూడా దేశంలోని సుమారు 18 వేల గ్రామాలకు విద్యుత్ సౌకర్యం సమకూరలేదు' అని ఆయన అన్నారు. ఇందుకు జమ్మూకశ్మీరే ప్రత్యక్ష సాక్ష్యమని చెప్పారు. ఫరీదాబాద్‌లోని సూరజ్‌కుండ్‌లో బీజేపీ ఆధ్వర్యంలో జరుగుతున్న 'హరియాణా క్షేత్రీయ పంచాయతీ రాజ్ పరిషత్' రెండు రోజుల వర్క్‌షాప్‌ను సోమవారం ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించి ప్రసంగించారు. అమృత్ కాల్ తీర్మానాల సాధనకు, అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యం దిశగా నేడు భారత్ ఐక్యంగా ముందుకు సాగుతోందని ప్రధాని చెప్పారు. ఆగస్టు 9వ తేదీన క్విట్ ఇండియా ఉద్యమ వార్షికోత్సవం రోజున యావత్ దేశం 'అవినీతి..ఆశ్రిత పక్షపాతం.. బుజ్జగింపు రాజకీయాలు క్విట్ ఇండియా' అని ఐక్యంగా నినదించాలన్నారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమం ప్రతి ఇంటికీ చేరేందుకు జిల్లా పరిషత్ సభ్యులు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ప్రతిపక్ష కూటమిపై ప్రధాని విసుర్లు

ప్రతిపక్ష 'ఇండియా'కూటమి భారత్ ప్రగతికి ప్రతిబంధకంగా, ప్రమాదకరంగా మారిందని ప్రధాని అన్నారు. ఢిల్లీ ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో సోమవారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవాలనుద్దేశించి ప్రధాని మాట్లాడారు.

ట్రాఫిక్‌తో ఏటా బెంగళూరుకు రూ.20 వేల కోట్ల నష్టం

అధ్యయనం వెల్లడి



బెంగళూరు: తీవ్రమైన ట్రాఫిక్ సమస్యల కారణంగా బెంగళూరు నగరం ఏటా రూ.20 వేల కోట్ల మేర నష్టపోతోందని ఓ అధ్యయనంలో తేలింది. 'నగర ఉత్పాదకత, ఆర్థిక వృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఫలితంగా ఉత్పాదకత గణనీయంగా తగ్గి, చిన్న, మధ్య తరహా సంస్థల రవాణా అవసరాలు ఆలస్యమవుతున్నాయి. ఇందుకు కాలుష్య సమస్య కూడా తోడవుతోంది'అని ఆ అధ్యయనం తెలిపింది.చాలా ఏళ్లుగా బెంగళూరు నగరం తీవ్ర ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతోంది. నగర ప్రణాళిక, మౌలిక సదుపాయాలు సరిగ్గానే ఉన్నప్పటికీ నష్టాలను చవిచూస్తోందని ట్రాఫిక్ నిపుణుడొకరు చేపట్టిన ఈ అధ్యయనం పేర్కొంది. ట్రాఫిక్ జామ్ సమస్య కారణంగా ఎక్కువగా నష్టపోయేది బెంగళూరుకు ఆర్థిక దన్నుగా నిలుస్తున్న ఐటీ రంగమేనని తేల్చింది. ఉద్యోగులు తమ విలువైన సమయాన్ని ట్రాఫిక్ సమస్యలతోనే గడుపుతున్నారని కూడా వివరించింది. ట్రాఫిక్ సంబంధ కారణంగా ఒక్క ఐటీ రంగమే సుమారు రూ.7 వేల కోట్ల మేర ఏటా నష్టపోతోందని తెలిపింది. పౌరులు కూడా నాణ్యమైన జీవితాన్ని గడపలేకపోతున్నారని పేర్కొంది. అధ్యయనంలో భాగంగా రోడ్ ప్లానింగ్, ఫ్లైఓవర్లు, ట్రాఫిక్ నిర్వహణ, మౌలిక సదుపాయాలను పరిగణనలోకి తీసుకున్నారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు నిపుణులు పలు సూచనలు చేశారు. ప్రజా రవాణా వ్యవస్థను మెరుగుపరచడం, కొన్ని ప్రాంతాల్లో ప్రయాణించేందుకు ఎక్కువ చార్జీలు వసూలు చేయడం(కంజెషన్ ప్రైసింగ్), కార్‌పూలింగ్ వంటివి ఇందులో ఉన్నాయి. కెమెరాలు, సెన్సార్ వ్యవస్థలను నెలకొల్పి, ఎక్కువ మంది ట్రాఫిక్ సిబ్బందిని నియమించి నిబంధనలను అమలు చేయడం, మెట్రోలు, ప్రభుత్వ బస్సు సర్వీసులు నడిపేందుకు భూగర్భమార్గాల ఏర్పాటు కూడా ఇందులో ఉన్నాయి. ప్రభుత్వం, పౌర సంస్థలు, పౌరులు కలిసి కట్టుగా పనిచేసి రహదారులపై భారం తగ్గించొచ్చని తెలిపింది.

'డిజిటల్ వ్యక్తిగత డేటా బిల్లు'కు లోక్‌సభ ఓకే

న్యూఢిల్లీ: మణిపూర్ అంశంపై ప్రతిపక్షాలు లోక్‌సభలో సోమవారం సైతం ఆందోళన కొనసాగించాయి. ప్రధాని మోదీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాయి. విపక్షాల నినదాలు, నిరసనల కారణంగా సభను పలుమార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. కీలకమైన 'డిజిటల్ వ్యక్తిగత డేటా పరరక్షణ బిల్లు'ను కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మణిపూర్ అంశంపై ప్రతిపక్షాలు చేపట్టిన ఆందోళన మధ్యే మూజువాణి ఓటుతో ఈ బిల్లును సభలో ఆమోదించారు. భారత పౌరుల వ్యక్తిగత గోప్యతను కాపాడేందుకు బిల్లును తీసుకొచ్చినట్లు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. పౌరుల వ్యక్తిగత డేటాను దుర్వినియోగం చేస్తే సంబంధిత సంస్థలకు రూ.250 కోట్ల వరకు జరిమానా విధించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ బిల్లుపై జరిగిన చర్చలో ప్రతిపక్షాలు పాల్గొనకపోవడం విచారకరమని అన్నారు. గోప్యత హక్కు అనేది ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు ఆరేళ్ల క్రితం తేల్చిచెప్పింది. వ్యక్తిగత డేటా దుర్వినియోగం కాకుండా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

చంద్రయాన్–3 కక్ష్య తగ్గింపు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గత నెల 14న ప్రయోగించిన చంద్రయాన్–3 మిషన్ ప్రస్తుతం లూనార్ ఆర్బిట్ (చంద్రుడి కక్ష్య)లో చంద్రుడికి దగ్గరగా 170 కిలోమీటర్లు, దూరంగా 4,313 కి.మీ. దీర్ఘ వృత్తాకార కక్ష్యలో పరిభ్రమిస్తోంది. సాంకేతిక పరిజ్ఞానంతో ఏకంగా చంద్రుడ్ని అత్యంత దగ్గరగా వీడియో తీసి భూ నియంత్రిత కేంద్రానికి పంపింది. ఆదివారం రాత్రి చంద్రునిపై మొదటి అర్బిట్ రైజింగ్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. ఆర్బిట్ రైజింగ్ చేసే క్రమంలో చంద్రయాన్–3 మిషన్ చంద్రుడి చుట్టూ తిరుగుతూ ప్రొపల్షన్ మాడ్యూల్‌లో అమర్చిన కెమెరాలు చంద్రుడికి దగ్గరగా వెళ్లినపుడు 45 సెకండ్లపాటు తీసిన వీడియోను ఇస్రో సోమవారం విడుదల చేసింది. లూనార్ ఆర్బిట్‌లో కక్ష్య దూరాన్ని తగ్గిస్తూ 23వ తేదీ నాటికి చంద్రుడికి 100 కిలోమీటర్ల వృత్తాకార కక్ష్యలోకి చంద్రుడి చెంతకు తీసుకొస్తారు.

చైనా తొలి చక్రవర్తి సమాధికి పాదరస రక్షణ!

బీజింగ్: చైనాను పాలించిన మొట్టమొదటి చక్రవరి కిన్ షీ హువాంగ్. ఆయన సమాధికి పాదరసం(మెర్క్యూరీ)తో రక్షణ కల్పించినట్లు తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. ద్రవ రూపంలో ఉండే లోహమే పాదరసం. ఇది విషపూరితమైంది. కిన్ క్రీస్తుపూర్వం 221 నుంచి 210 దాకా.. పదేళ్లపాటు డ్రాగన్ దేశాన్ని శాసించాడు. కిన్ సమాధిని కట్టుదిట్టంగా నిర్మించారు. షాన్‌షీ ప్రావిన్స్‌లో 1974లో రైతులు పొలం దున్నుతుండగా కిన్ షీ హువాంగ్ సమాధి బయటపడింది. చక్రవర్తి సమాధిని తెరిచే చూస్తే వినాశనం తప్పదన్న ప్రచారం బాగా వ్యాప్తిలో ఉంది. దీంతో, తెరిచే సాహసం చేయలేకపోయారు. సమాధికి సమీపంలో మట్టితో తయారు చేసిన సైనికులు, ఆయుధాలు, గుర్రాల విగ్రహాలు భారీగా బయటపడ్డాయి. మరణానంతరం కూడా చక్రవర్తిని కాపాడడానికి ఈ 'టెర్రకోట ఆర్మీ'ని ఏర్పాటుచేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, చక్రవరి సమాధి చుట్టూ మెర్క్యూరీ లోహం స్వేచ్ఛగా కదులుతున్నట్లు పరిశోధకులు ఇటీవలే తేల్చారు. సమాధిని ఎవరూ తాకకుండా ఇలాంటి ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు.

గ్రహ శకలాలతో భూమికి సౌర కవచం!

వాషింగ్టన్: భూగోళంపై ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతున్నాయి. భూమిపై జీవులు భద్రంగా మనుగడ సాగించే పరిస్థితులు కనుమరుగవుతున్నాయి. దీని పరిష్కారానికి నడుం బిగించారు. అధిక ఉష్ణోగ్రతల నుంచి సౌర కవచం(సోలార్ షీల్డ్)తో పుడమికి రక్షణ కల్పించవచ్చంటున్నారు. దీనికి స్పేస్ బేస్డ్ సోలార్ రేడియేషన్ మేనేజ్‌మెంట్ షీల్డ్ (ఎస్ఆర్ఎం) అని పేరుపెట్టారు. అమెరికాలోని 'యూనివర్సిటీ ఆఫ్ హవాయ్' ఈ ప్రయోగాన్ని తెరపైకి తెచ్చింది. భూమికి, సూర్యుడికి మధ్య భారీ పరిమాణంలోని గ్రహ శకలాలను గొడుగులా వాడి సూర్యకాంతి నేరుగా భూమిని తాకకుండా నిరోధించవచ్చని తేల్చారు. అయితే, సౌర కవచం కోసం గ్రహ శకలాలను (ఆస్టరాయిడ్లు) ఒకచోటుకి చేర్చడం పెద్ద సవాలేనని సైంటిస్టులు అంటున్నారు. ఈ పరిశోధన ఫలితాలను 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (పీఎన్ఏఎస్)'లో ఇటీవలే ప్రచురించారు.

కేంద్రం ప్రయత్నాలను ప్రశ్నించలేం

చీతాల మృతిపై సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లోని కునో నేషనల్ పార్కులో ఈ ఏడాది 9 చీతాల మృతి విషయంలో కేంద్రం ఇచ్చిన వివరణపై సుప్రీంకోర్టు సంతృప్తి వ్యక్తం చేసింది. దేశంలో చీతాల సంతతిని అభివృద్ధి చేసేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాలపై అనుమానాలకు అవకాశం లేదని పేర్కొంది. 1952 తర్వాత దేశంలో చీతాల సంతతి అంతరించిపోయింది. దీంతో, తిరిగి వాటి సంతతిని పెంచే ఉద్దేశంతో గత ఏడాది సెప్టెంబర్, ఈ ఏడాది ఫిబ్రవరిల్లో నమీబియా, దక్షిణాఫ్రికాల నుంచి 20 చీతాలను కునోకు తీసుకువచ్చింది. ఇక్కడ మరో నాలుగు కూనలు జన్మించాయి. వీటిలో మొత్తం 9 మృత్యువాతపడ్డాయి. దీనిపై సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కేంద్రం పిటిషన్ వేసింది. విదేశాల నుంచి తీసుకువచ్చిన చీతాలను ఇక్కడి వాతావరణ పరిస్థితుల్లో మనుగడ సాగించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపింది.

ప్రియుడిపై కోపంతో హైటెన్షన్ టవరెక్కిన బాలిక



రాయ్‌పూర్: ప్రియుడిపై కోపంతో ఓ బాలిక 80 అడుగుల ఎత్తయిన హై టెన్షన్ విద్యుత్ టవరెక్కింది. బుజ్జగించేందుకు ఆ బాయ్‌ఫ్రెండ్ కూడా ఆమె వెనుకే టవర్‌పైకి చేరుకున్నాడు. అయితే, వారిద్దరూ ఒకరి వెనుక మరొకరు టవర్ చివరిదాకా వెళ్లడం ఉద్రిక్తతకు దారితీసింది. మూడు రోజుల క్రితం జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ఘటన ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం గౌరెలా పెండ్రా మార్వాహి జిల్లా పెండ్రా పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఫోన్ కాల్ విషయమై ఓ బాలిక తన ప్రియుడితో గొడవపడింది. కోపంతో దగ్గర్లోని 80 అడుగుల ఎత్తున్న హైటెన్షన్ విద్యుత్ టవరెక్కింది. ఆమె ప్రియుడు కూడా ఆమె వెనుకే టవరెక్కాడు. బుజ్జగించి కిందికి దించే ప్రయత్నం చేశాడు. వినకుండా ఆమె చివరిదాకా ఎక్కింది. అతడు కూడా ఆమెను అనుసరించాడు. వీరి విషయం కుటుంబసభ్యులకు, గ్రామస్తులకు చేరింది. వారంతా టవర్ చుట్టూ పెద్ద సంఖ్యలో చేరి ఇద్దరికీ నచ్చజెప్పే ప్రయత్నాల్లో ఉండగా పోలీసులు అక్కడికి చేరుకున్నారు. వారితో మాట్లాడి అతికష్టమ్మీద సురక్షితంగా ఇద్దరూ కిందికి దిగేలా చేయగలిగారు. ఈ ఘటనకు సంబంధించి ఎలాంటి కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ఢిల్లీ ఎయిమ్స్‌లో అగ్నిప్రమాదం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని ప్రఖ్యాత ఎయిమ్స్ (ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్)లో విభాగంలో సోమవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రధాన భవనంలోని రెండో ఫ్లోర్‌లో ఓల్డ్ ఓపీడీ విభాగంలో ఉదయం మంటలు చెలరేగాయి. మంటలను ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ సిబ్బంది వెంటనే అదుపు చేశారు. మంటలు చెలరేగిన ఎండోస్కోపీ విభాగంలో 80 మందిని నుంచి ఖాళీ చేయించారు. ఏబీ 2 వార్డులోని ఐసీయూలో ఉన్న ఆరుగురు సహా 31 మందిని ఇతర భవనాల్లోకి తరలించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లోని పీడియాట్రిక్, ఎమర్జెన్సీ వార్డుల్లో 70 మందిని సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో జాయిన్ చేశారు. ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. కారణాలపై దర్యాప్తు జరుగుతోంది.


ఇండోనేసియా సంప్రదాయక వెదురు వాద్యపరికరం 'అంగ్లాంగ్'ను ఒకేసారి 15,110 మంది వాయించి నూతన గిన్నిస్ ప్రపంచ రికార్డును సృష్టిస్తున్న దృశ్యం. జకార్తా నగరంలోని గెలోరా బంగ్ స్టేడియంలో తీసిందీ ఫొటో.

నూహ్‌లో కూల్చివేతలు ఆపండి

అధికారులకు పంజాబ్–హరియాణా హైకోర్టు ఆదేశం

చండీగఢ్/గురుగ్రామ్: హరియాణాలోని నూహ్ జిల్లాలో మూడు రోజులుగా కొనసాగుతున్న అక్రమ కట్టడాల కూల్చివేతలను వెంటనే ఆపేయాలని పంజాబ్ హరియాణా హైకోర్టు అధికారులను ఆదేశించింది. కూల్చివేతలపై కోర్టు సుమోటోగా విచారణ చేపట్టి ఈ మేరకు సోమవారం ఉత్తర్వులిచ్చింది. గత వారం జరిగిన మత కలహాలకు ముందు దుండగులు రాళ్లు రువ్వినట్లుగా అనుమానిస్తున్న హోటల్ సహా కొన్ని భవనాలను అధికారులు బుల్‌డోజర్లతో కూల్చి వేశారు. జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల్లోగా 37 ప్రాంతాల్లోని 57.5 ఎకరాల్లోని ప్రభుత్వ జాగాల్లో ఉన్న 162 శాశ్వత, 591 తాత్కాలిక నిర్మాణాలను నేలమట్టం చేశామన్నారు. ఇలా ఉండగా, గురుగ్రామ్‌లోని ఖండ్సాలో ఉన్న ప్రార్థనాస్థలానికి గుర్తు తెలియని దుండగులు ఆదివారం అర్ధరాత్రి నిప్పుపెట్టారు. స్థానికులు వెంటనే మంటలను ఆర్పివేశారు. పూజా సామగ్రి కాలిందని పూజారి తెలిపారు. ఈ మేరకు గుర్తు తెలియని వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. సోహ్నాలో ఘటనలకు కారకులుగా అనుమానిస్తున్న 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు గురుగ్రామ్ పోలీసులు చెప్పారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
మంగళవారం । 8 । ఆగస్టు । 2023

పోస్టాఫీసులో స్వాహా?



పోస్టాఫీసు వద్ద ఖాతాదారులు

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం తాలూకా దిబ్బూరు పోస్టాఫీసును చిన్నమొత్తాల పొదుపు ఖాతాదారులు ముట్టడించారు. పోస్ట్‌మాస్టర్ వైష్ణవి, పోస్ట్ మ్యాన్ ఇందులో పనిచేస్తున్నారు. తపాలా బీమా, సుకన్య సమృద్ధి యోజన ఇలా పలు పథకాలలో గ్రామస్తులు లక్షలాది రూపాయలను చెల్లించారు. పోస్ట్‌మాష్టర్ వైష్ణవికి వారు కంతులు చెల్లించేశారు. అయితే ఇటీవల ఆన్‌లైన్ ఖాతాలోకి వెళ్లి చూస్తే డబ్బులు జమ కావడం లేదని తెలిసి పోస్ట్ మాస్టర్ వైష్ణవిని నిలదీశారు. సర్వర్ ఇబ్బంది వల్ల డబ్బులు జమ కాలేదని ఆమె చెప్పింది. ఉన్నతాధికారులు వచ్చి అందరి పాస్ బుక్కులను పరిశీలన చేపట్టారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు చిక్క రూరల్ పోలీసులు వైష్ణవిని అదుపులో తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

న్యూస్‌రీల్

ఐఏఎస్ కల నెరవేరక బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య



శృతి (ఫైల్)

మండ్య: సివిల్స్ పరీక్షల్లో విజేతగా నిలిచి ఐఏఎస్ కావాలి, సమాజంలో ఉన్నత స్థానంలో నిలవాలి అనుకున్న ఒక యువతి కల ఫలించలేదు. బ్యాంకు ఉద్యోగంతో తృప్తి పడలేక, ఐఏఎస్ కాలేక మనోవ్యథతో ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండ్య నగరంలో చోటు చేసుకుంది. కావేరి గ్రామీణ బ్యాంక్ ప్రాదేశిక కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేస్తున్న శృతి (30) స్వస్థలం చామరాజనగర జిల్లా కొళ్లేగాల. తండ్రి మల్లప్ప వ్యవసాయం చేసేవాడు. ముందు నుంచి ఆమె చదువులో చురుగ్గా ఉండేది. ఎలాగైనా ఐఏఎస్‌కు ఎంపిక కావాలని అనుకుంది. కానీ జీవితంలో ఉన్న ఇబ్బందుల వల్ల సాధ్యం కాలేదు. తరువాత ఉద్యోగ నియామకాల్లో ప్రతిభ చూపి ప్రస్తుత ఉద్యోగం సంపాదించింది. మండ్య నగరంలోని వినాయక లేఔట్‌లోని అద్దె ఇంటిలో ఆదివారం రాత్రి డెత్‌నోట్ రాసి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఆమెకు ఇంకా పెళ్లి కాలేదని సమాచారం. మండ్య గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

వ్యవసాయ మంత్రిపై ముడుపుల ఆరోపణలు

మండ్య: రాష్ట్ర వ్యవసాయ మంత్రి, మండ్య జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎన్.చలువరాయస్వామి వ్యవసాయ శాఖ అధికారులను ప్రతి నెలా డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారని, దాంతో వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారని ఒక లేఖ సోషల్ మీడియాలో వ్యాప్తి చెందింది. జిల్లాలోని మండ్య, మళవళ్ళి, కృష్ణరాజపేట, పాండవపుర, నాగమంగళ, శ్రీరంగపట్టణ, మద్దూరు తాలూకాలో ఉన్న సహాయ వ్యవసాయ డైరెక్టర్‌లు, సిబ్బంది ప్రతి నెలా రూ. 6- 8 లక్షలు ముట్టజెప్పాలని మంత్రి జాయింట్ డైరెక్టర్ ద్వారా ఒత్తిడి తెచ్చారని ఆ లేఖలో ఉంది. దీంతో కొందరు అధికారులు గవర్నర్ గెహ్లోట్‌ను కలిసి మంత్రిపై ఫిర్యాదు చేయగా, ఆయన ప్రధాన కార్యదర్శికి వివరాలు ఇవ్వాలని ఆదేశించారని జోరుగా ప్రచారం సాగుతోంది.

ఏనుగు దాడిలో రైతు మృతి



రైతు మృతదేహం

కెలమంగలం: ఇటీవల కాలంలో అడవి ఏనుగులు బెడద పెచ్చుమీరుతోంది. వివరాలు... జవళగిరి అటవీ ప్రాంతంలోని మిలిదిక్కి గ్రామానికి చెందిన రైతు తంగవేల్ (51) ఆదివారం ఉదయం మేకలు మేపేందుకు అడవి వెళ్లాడు. సాయంత్రం పొదల్లో దాగి ఉన్న ఒంటి ఏనుగు తంగవేల్‌పై దాడి చేసి తొక్కి చంపేసింది. అంచెట్టి పోలీసులు, అటవీ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

బొమ్మై ఢిల్లీ యాత్ర

శివాజీనగర: శాసనసభ ఎన్నికలు ముగిసి మూడు నెలలు కావస్తున్నా బీజేపీ శాసనసభా పక్ష అధ్యక్షుడు ఎవరు, రాష్ట్ర బీజేపీకి కొత్త సారథి ఎవరు? అనే ప్రశ్నలకు సమాధానం లేదు. ఈ సమయంలో బీజేపీ మాజీ సీఎం బసవరాజ బొమ్మై హఠాత్తుగా ఢిల్లీకి వెళ్లడం కుతూహలానికి కారణమైంది. ఆదివారం రాత్రి ఆయన హస్తినకు వెళ్లి సోమవారం కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి చర్చలు జరిపారు. కన్నడనాట రాజకీయ పరిస్థితుల గురించి మాట్లాడారు. ఇతర సీనియర్ నాయకులను కూడా ఆయన కలిసే అవకాశముంది. పై రెండు పదవుల భర్తీ గురించి ప్రస్తావనకు వచ్చింది. బీజేఎల్పీ స్థానానికి బొమ్మై, బసనగౌడ యత్నాళ్, అశ్వత్థనారాయణ్, అరగ జ్ఞానేంద్ర, సునీల్‌కుమార్ రేసులో ఉన్నారు.

ట్రాఫిక్ జాం.. పెనుభారం

- బెంగళూరుకు ఏటా సుమారు రూ.20 వేల కోట్ల నష్టం
- రోడ్లను, వంతెలను విస్తరించక తప్పదు
- ఓ సర్వేలో హెచ్చరిక



బెంగళూరు మారతహళ్లిలో ట్రాఫిక్ గందరగోళం. దీని వల్ల నగరవాసుల డబ్బు, సమయం వృథా



బనశంకరి: ఐటీ- బీటీ సిటీ బెంగళూరు ప్రపంచవ్యాప్తంగా ఆర్థికంగా దూసుకుపోతోంది. దేశం నలు మూలల నుంచి విద్యా, వ్యాపారాలు, ఉద్యోగాల కోసం నిత్యం వేలాది మంది తరలివస్తున్నారు. దీని వల్ల ఆర్థిక వ్యవస్థ మరింతగా విస్తరిస్తోంది. ఇదే సమయంలో నగరంలో ట్రాఫిక్ ఒత్తిడి రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతోంది. ఈ సమస్యతో నగరవాసులు ఏడాదికి రూ. 19,725 కోట్ల నష్టం భరించాల్సి వస్తోంది. ట్రాఫిక్‌తో వ్యాపారాలు, ఉద్యోగాలకు వెళ్లడం ఆలస్యం కావడం, సిగ్నల్స్‌లో నిలవడం, సమయం, ఇంధనం తదితరాల నష్టంతో కలిపితే బెంగళూరువాసులు ఏటా సుమారు రూ.20 వేల కోట్లను కోల్పోతున్నారు.

శ్రీహరి బృందం సర్వే

ప్రముఖ ట్రాఫిక్‌రంగ నిపుణుడు ఎంఎన్ శ్రీహరి బృందం నిర్వహించిన సర్వే ఈ మేరకు తేల్చిచెప్పింది. రోడ్ల పథకాలు, పై వంతెనలు, ట్రాఫిక్ నిర్వహణ, మౌలిక సౌకర్యాల సమస్యలను పరిశీలించిన శ్రీహరి బృందం నివేదికను విడుదల చేసింది. నగరంలో 60 పై ఓవర్లు పనిచేస్తున్నప్పటికీ కూడా రోడ్డు వినియోగదారులకు రూ.19,725 కోట్ల నష్టం వచ్చినట్లు నివేదికలో పేర్కొన్నారు.

అభివృద్ధికి మరోవైపు ఇలా

బెంగళూరు ఐటీ రంగం దూసుకెళ్లడం వల్ల నిర్మాణ రంగం, విద్య, ఇతర సౌలభ్యాలు కూడా ఎంతో అభివృద్ధి సాధించాయి. 1.45 కోట్ల జనాభా కలిగిన బెంగళూరులో 1.5 కోట్ల కు పైగా వాహనాలు ఉండటం ట్రాఫిక్ చిక్కుముడికి కారణం. 2023లో బెంగళూరు విస్తీర్ణం 985 చదరపు కిలోమీటర్లుగా ఉంది. ఈ విస్తరణ 1,100 చదరపు కిలోమీటర్లకు చేరాలని నివేదికలో ప్రస్తావించారు. ఇక రోడ్ల పొడవు వాహనాల పెరుగుదలకు అనుగుణంగా లేదు. నగరంలో మొత్తం రోడ్ల పొడవు సుమారు 11,000 కిలోమీటర్లు ఉంది. ఇది ఇప్పుడున్న అవసరాలకు ఏమాత్రం చాలదు. అంతేగాక ఆకస్మిక జనాభా పెరుగుదలకు- ఉద్యోగాల కల్పన, వసతుల అభివృద్ధికి పొంతన లేదని శ్రీహరి బృందం తెలిపింది.



నగరానికి ఏమేం కావాలి

రాజధానికి రేడియల్ రోడ్లు, రింగ్‌రోడ్లు, ఔటర్ రింగ్‌రోడ్లు, పీఆర్ఆర్, ఎస్‌టీ ఆర్ఆర్‌ల తో కూడిన నిర్దిష్ట రింగ్ రోడ్లు అవసరం ఉందని శ్రీహరి తెలిపారు. ప్రతి 5 కిలోమీటర్లకు ఒక వృత్తాకార మార్గం రేడియల్ రోడ్లతో అనుసంధానం చేయాలి. ఎస్‌టీఆర్ఆర్ ని చాలా ఏళ్ల క్రితమే నిర్మించాలని పథకం రూపొందించినప్పటికీ భూ స్వాధీన సమస్యలతో ఆలస్యమై నిర్మాణ, నిర్వహణ వ్యయం పెరిగింది. ఇక రానున్న 25 ఏళ్లలో సజావుగా ట్రాఫిక్ సాగాలంటే ఎక్కువగా సొరంగ మార్గాల రోడ్లను నిర్మించాలని నిపుణులు సూచించారు. మెట్రోరైలు, సిటీ బస్సులకు అనుసంధానం పెంచాలని అధ్యయనంలో పేర్కొన్నారు. దీంతోపాటు రోడ్ల పక్కన పార్కింగ్‌ను రద్దు చేయాలి. దీంతో రోడ్లపై వాహనాల సంచారం, ఫుట్‌పాత్ మార్గాల్లో పాదచారులు వెళ్లడం సాధ్యమౌతుంది. రవాణా నిపుణుడైన నేను బెంగళూరులో వాహనం నిలపడానికి ఒక రోడ్డు చూపించడంలో విఫలమైనట్లు శ్రీహరి ఐటీ సిటీ రోడ్ల గురించి విచారం వ్యక్తం చేశారు.

ఎన్ఐఏ అదుపులో ఉగ్ర అనుమానితులు

యశవంతపుర: బెంగళూరు నగరంలో పేలుళ్ల ద్వారా బీభత్సం సృష్టించేందుకు కుట్రచేసి పోలీసులకు చిక్కిన ఐదుమంది అనుమానిత ఉగ్రవాదులను విచారణ కోసం ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్ఐఏకు చెందిన ఐజీ స్థాయి అధికారి నగర పోలీసు కమిషనర్ దయానంద, సీసీబీ జాయింట్ కమిషనర్ శరణప్పలను కలిశారు. ఐదుమందిని అదుపులోకి తీసుకొని విచారించాలని ఎన్ఐఏ నిర్ణయించింది. స్వాధీనం చేసుకున్న గ్రెనేడ్లు, నాటు తుపాకీలు ఎక్కడి నుంచి వచ్చాయనేది ముఖ్యంగా మారింది. ఉగ్రవాదులకు నిధులు, ఆయుధాలను ఎవరు సరఫరా చేశారనేది ఎన్ఐఏ తెలుసుకోనుంది. విదేశాలలో తలదాచుకున్న జునైద్ అహ్మద్‌ను బెంగళూరుకు పిలిపించాలని ప్రయత్నాలు సాగుతున్నాయి. అతని కోసం సీసీబీ పోలీసులు లుక్‌ఔట్ నోటీసులిచ్చారు.

భార్య హత్య కేసులో భర్తకు జీవితఖైదు

బొమ్మనహళ్లి: భార్య హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు పడింది. బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ పట్టణంలోని 3వ అదనపు జిల్లా న్యాయమూర్తి కరబారి రవీంద్ర నిందితుడికి జీవితఖైదు విధిస్తూ తీర్పు చెప్పారు. ముత్తురాజు జీవితఖైదు పడిన వ్యక్తి. వివరాలు...ఆనేకల్ తాలూకా హెబ్బగోడి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కాచనాయకనహళ్లి గ్రామంలో నివాసం ఉంటున్న ముత్తురాజుకు ఇద్దరు భార్యలు. ఇద్దరిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరికి సంతానం లేదు. ఇద్దరి భార్యల్లో మాలా రాణి వ్యవహార శైలిపై ముత్తురాజుకు అనుమానం రావడంతో ఆమెను హెచ్చరించాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరిగేవి. ఇదే విషయంపై 2021 నవంబర్‌లో గొడవపడి చాకుతో పొడిచాడు. మాలారాణి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 2022 జనవరిలో మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని కోర్టుకు చార్జ్‌షీట్ సమర్పించారు. నేరం రుజువు కావడంతో ముత్తురాజుకు జీవితఖైదు, రూ. 50 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

బస్సుకు అడ్డుగా వచ్చిన గజరాజు

- వణికిపోయిన ప్రయాణికులు

మైసూరు: చామరాజనగర జిల్లా హనూరు తాలూకాలో ఓ ఏనుగు బస్సుపై దాడి చేయడానికి యత్నించింది. సోమవారం ఉదయం ప్రయాణికులతో కేఎస్ఆర్టీసీ బస్సు తాలూకాలోని మహదేశ్వర బెట్ట సమీపంలో ఉన్న తాళబెట్ట పొన్నాచీ వద్ద వస్తుండగా పొదల్లో నుంచి వచ్చిన ఓ భారీ ఏనుగు బస్సుకు అడ్డుగా నిలుచుంది. దీంతో ప్రయాణికులు భయపడిపోయారు. బస్సుపై దాడి చేయడానికి యత్నిస్తుండగా డ్రైవర్ సమయ స్ఫూర్తితో బస్సును రివర్స్‌లో స్పీడ్‌గా వెళ్లడంతో ప్రమాదం తప్పినట్లయింది. అనంతరం ఏనుగు అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయింది.

పెరిగిన గుండెపోటు ముప్పు

- ప్రముఖ వైద్యుడు మంజునాథ్



బనశంకరి: రాష్ట్రంలో ఇటీవలి రోజుల్లో చిన్న వయసులోనే మహిళలు కూడా గుండెపోటుకు గురవడం 8 శాతం పెరిగిందని ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ సీఏ మంజునాథ్ తెలిపారు. సోమవారం నటి స్పందన మృతిపై డాక్టర్ మంజునాథ్ మాట్లాడుతూ ఇటీవల జీవనశైలి, ఆహార పద్ధతులు మారాయని, దీంతో పాటు మానసిక శారీరక ఒత్తిడులు కూడా గుండెపోటుకు కారణమన్నారు.

40 ఏళ్లలోపు వారికి కూడా

- ఆయన ఏం చెప్పారంటే..ఒక అధ్యయనం ప్రకారం 40 ఏళ్ల లోపు వయసు వారికి గుండెపోటు రావడం 35 శాతం పెరిగింది.
- గతంలో మహిళల్లో గుండెపోటు కేసులు తక్కువగా ఉండేవి, ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. 40 ఏళ్లలోపు మహిళల్లో గుండెపోటు కేసులు 8 శాతం పెరగడం ఆందోళనకరం.
- దేశంలో యువత, మధ్య వయసువారిలో గుండెపోటు వచ్చే ముప్పు 28 శాతం పెరిగింది. ఈ కేసుల్లోనూ కార్డియాక్ అరెస్ట్ (గుండె స్తంభించడం) 90 శాతం ఉంది.
- కోవిడ్ మహమ్మారి తరువాత 3 నుంచి 5 శాతం గుండెపోటు కేసులు పెరిగాయి, ప్రతి ఒక్కరూ తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

సెప్టెంబరు 1న గజ పయనం

మైసూరు: ప్రపంచ ప్రసిద్ధి చెందిన నాడహబ్బ మైసూరు దసరా మహోత్సవాలను ఘనంగా జరపాలని సర్కారు నిర్ణయించిందని, ఇందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి హెచ్.సి.మహాదేవప్ప తెలిపారు. సోమవారం మైసూరులో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 1వ తేదీన ఏనుగుల మొదటి బృందం గజ పయనం ప్రారంభిస్తుందని చెప్పారు. ఘన స్వాగతానికి సన్నాహాలు చేయాలని సూచించారు. ఈ దఫా సంబరాల్లో 14 ఏనుగులు పాల్గొంటాయని, ఉత్సవాలను ఎవరిచే ప్రారంభోత్సవం చేయాలనేది ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.



దూసుకొచ్చిన మృత్యువు

- బైక్‌ను ఢీకొన్న కారు
- తండ్రి కుమారుడు దుర్మరణం
- పాదచారికి తీవ్ర గాయాలు
- తాగిన మత్తులో యువకుడి ఘోరం



మృతి చెందిన తండ్రి కొడుకు (ఫైల్)

యశవంతపుర: నగరంలో అర్ధరాత్రి మద్యం మత్తులో కారు నడుపుతూ ఓ వ్యక్తి బీభత్సం సృష్టించాడు. ఈ ఘోర ప్రమాదంలో తండ్రి కుమారుడు దుర్మరణం పాలయ్యారు. ఆదివారం అర్ధరాత్రి నగరంలోని సదాశివనగర రామయ్య ఆస్పత్రి సమీపంలోని ఇస్రో సర్కిల్ వద్ద ఈ ప్రమాదం జరిగింది. కువెంపునగరకు చెందిన తండ్రి కుమారుడు రఘు (65), చిరంజీవి (25)లు మృతి చెందారు.

వివరాలు...కోరమంగళలో పుస్తకాల దుకాణం నడుపుతున్న రఘు, చిరంజీవి దుకాణానికి తాళం వేసుకుని అర్ధరాత్రి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. సదాశివ నగర సమీపంలో తాగిన మత్తులో కారు నడుపుకుంటూ వచ్చిన ఓ యువకుడు ఆటోను ఢీకొన్నాడు. అదే వేగంత దూసుకెళ్లి మరో రెండు కార్లను , పాదచారిని ఢీకొని అనంతరం బైక్‌పై వెళ్తున్న తండ్రి కొడుకుని ఢీకొన్నాడు. దీంతో బైక్‌పై ఉన్న రఘు, చిరంజీవి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు కారును అడ్డగించి వాహనం నడుపుతున్న ఆకాశ్ అనే వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితుడు ఆకాశ్ మద్యం తాగి కారు నడపటం వల్ల ప్రమాదం జరిగినట్లు పోలీసులు తెలిపారు. పాదచారి పరిస్థితి కూడా ఆందోళనగా ఉన్నటు సమాచారం.

చిత్రసీమలో విషాదం

- నటుడు విజయ్ రాఘవేంద్ర భార్య స్పందన మృతి
- గుండెపోటుతో బ్యాంకాక్‌లో సంఘటన



స్పందన (ఫైల్)



విజయ్ రాఘవేంద్ర, స్పందన (ఫైల్)

యశవంతపుర: కన్నడ చిత్రసీమలో విషాదం సంభవించింది. ప్రముఖ నటుడు విజయ్ రాఘవేంద్ర భార్య స్పందన (41) గుండెపోటుతో కన్నుమూశారు. విషయం తెలుసుకున్న బెంగళూరులోని కుటుంబసభ్యులు కన్నీటి సంద్రంలో మునిగిపోయారు. దంపతులు, వారి కొడుకు థాయ్‌ల్యాండ్‌లోని బ్యాంకాక్ విహారానికి వెళ్లిన సమయంలో ఆదివారం రాత్రి గుండెపోటు రాగా తక్షణం ఆస్పత్రిలో చేర్చారు. ఆమె మరణించినట్లు వైద్యులు తెలిపారు. ఇది తెలిసి విజయ్ రాఘవేంద్ర కుటుంబ సభ్యులు బ్యాంకాక్‌కు వెళ్లారు. విశ్రాంత పోలీసు అధికారి బీకే శివరామ్ కూతురు స్పందన. ఇక కంఠీరవ రాజ్‌కుమార్ కుటుంబానికి విజయ్ రాఘవేంద్ర దగ్గరి బంధువు అవుతారు.

2007లో ప్రేమపెళ్లి

2007లో ఆమెను ప్రేమించి విజయ్ రాఘవేంద్రను పెళ్లి చేసుకున్నారు. వీరికి శౌర్య అనే కొడుకు ఉన్నాడు. ఈ టూర్‌లో శివరామ్ కూడా వారి వెంట వెళ్లారు. మృతదేహాన్ని బెంగళూరుకు తరలించి అంత్యక్రియలు చేసే ఏర్పాట్లలో బంధుమిత్రులు నిమగ్నమయ్యారు. అపూర్వ సినిమాలో స్పందన అతిథి పాత్రలో నటించారు. భర్త కోసం నిర్మాతగా మారి కిస్మత్ సినిమాను నిర్మించారు. ఇక రాఘవేంద్ర బాల నటునిగా కన్నడ సినీ రంగ ప్రవేశం చేశారు. నటుడు, దర్శకుడు, టీవీ వ్యాఖ్యాతగా పేరు గడించారు. ఆమె మృతికి అనేకమంది సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

వదంతులు ప్రచారం చేయొద్దు: బీకే హరి

శివాజీనగర: స్పందన మరణోత్తర పరీక్ష నివేదిక వచ్చేవరకు ఊహాగానాలు ప్రచారం చేయవద్దని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బీకే హరిప్రసాద్ కోరారు. సొంత సోదరుడు బీకే శివరామ్ కూతరు స్పందన ఆకస్మిక మరణంతో ఆయన హుటాహుటిన సోదరుని నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఇది చాలా బాధకరమైన సంగతి, ఆమె బంధువులతో కలిసి బ్యాంకాక్‌కు వెళ్లింది, సినిమా షూటింగ్ ఉండటంతో విజయ్ రాఘవేంద్ర ఆలస్యంగా వెళ్లి ఆదివారం కలుసుకొన్నారు. రాత్రి నిద్రపోయిన తరువాత లేవకపోవటంతో గుండెపోటు వచ్చిందనుకుని ఆమెను అక్కడి ఆసుపత్రిలో చేర్చగా, మృతి చెందినట్లు డాక్టర్లు వెల్లడించారు. సోమవారం శవపరీక్ష జరిగింది, మంగళవారం బెంగళూరుకు తీసుకొచ్చిన తరువాత అంత్యక్రియలు ఎక్కడ చేపట్టాలనేది నిర్ణయిస్తాం. స్పందన ముందు నుంచి కూడా బలహీనంగా ఉండేది అని చెప్పారు. తరువాత ఆయన బంధువులతో కలిసి బ్యాంకాక్‌కు బయల్దేరారు.

సౌజన్య కేసులో నోరు విప్పితే అంతే

- మాజీ ఎమ్మెల్యే ఆవేదన



అత్యాచారం, హత్యకు గురైన సౌజన్య (ఫైల్)

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లాలో పీయూసీ విద్యార్థిని సౌజన్య హత్య రహస్యాలను బయటపెడితే తనను కూడా హత్య చేసే అవకాశం ఉందని బెళ్తంగడి మాజీ ఎమ్మెల్యే వసంత బంగేర అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సౌజన్య అత్యాచారం, హత్య కేసును సీబీఐ దారి తప్పించింది. నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సీబీఐకీ అప్పగించాలని డిమాండ్ చేశాను. అప్పుడు ముఖ్యమంత్రిగా ఉన్న సిద్ధరామయ్య పిలిచి సీబీఐకి అప్పగించడం సాధ్యం కాదన్నారు. బెళ్తంగడిలో జరిగిన అనేక హత్యల గురించి కూడా సీఎంకు చెప్పాను, చివరకు సీబీఐ విచారణకు ఇచ్చారు. సౌజన్య హత్య గురించి ఏమైనా మాట్లాడితే తాను కూడా హత్యకు గురి కావచ్చని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

11 ఏళ్లుగా పెండింగ్ కేసు...

సౌజన్య హత్యాచారం ఘటన దక్షిణ కన్నడ జిల్లాలో కొన్నినెలలుగా మళ్లీ చర్చనీయాంశమైంది. పోటాపోటీగా ప్రదర్శనలు జరుగుతున్నాయి. 2012 అక్టోబరు 9న ఉజిరె పట్టణంలో కాలేజీకి వెళ్లిన సౌజన్య (17) మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. రాత్రంతా పోలీసులు, స్థానికులు గాలించగా ఇంటికి వెళ్లే దారిలో చిట్టడవిలో శవమై కనిపించింది. ఆమెను అత్యాచారం చేసి హత్య చేశారని విచారణలో తేలింది. సమీపంలో జీవించే సంతోష్ రావ్ (34) అనే ఒంటరి మనిషి ఈ హత్య చేశాడని అరెస్టు చేశారు, కానీ నేరం చేయలేదని తెలిసి కొన్నినెలలకు వదిలేశారు. జిల్లాలో బడా బాబులకు చెందిన పిల్లలే సౌజన్యపై అఘాయిత్యం చేసి హతమార్చారని ఆమె బంధువులు, ప్రజాసంఘాలు ఆరోపిస్తున్నాయి. సీబీఐ కూడా దోషులను కనిపెట్టలేకపోయింది.



డాక్టరేట్లను ప్రదానం చేస్తున్న గవర్నర్ గెహ్లోట్



అత్యధిక బంగారు పతకాలు సాధించిన కొందరు మహిళా పట్టభద్రులు

వైభవంగా పట్టాల పండుగ

తుమకూరు వర్సిటీలో సందడి

తుమకూరు: కల్పతరునాడు అయిన తుమకూరు నగరంలోని సోమవారం తుమకూరు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవం కనులపండువగా జరిగింది. 10,273 మంది డిగ్రీ, పీజీ, పరిశోధక పట్టభద్రులకు పట్టాలను ప్రదానం చేశారు. చాన్సలర్, గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ పాల్గొని వేడుకలను ప్రారంభించారు. డి.లిట్‌ను 78 మందికి, పీహెచ్‌డీ పట్టాలను 1,517 మందికి బహూకరించారు. గౌరవ డాక్టరేట్లను సినీ ప్రముఖుడు టి.ఎస్. నాగాభరణ, సామాజిక సేవకుడు ఆర్ఎల్ రమేష్‌బాబులకు అందజేశారు.

బంగారు పతకాల్లో అమ్మాయిల హవా

ఇక చదువుల్లో ప్రతిభ చూపిన 80 మందికి 99 బంగారు పతకాలను ప్రదానం చేశారు. వీరిలో ఎక్కువమంది అమ్మాయిలే కావడం విశేషం. కన్నడ ఎంఎలో డీసీ కావ్య 4 బంగారు పతకాలు, ఎంకాంలో ఎస్.సంధ్య 3 పతకాలు, బీకాంలో దీపిక డి.జైన్ 3 బంగారం పతకాలు, ఎంఎస్సీ గణితంలో ఎల్‌ఈ ఆశ 3 బంగారు పతకాలు, బీఏ కన్నడ, అర్థశాస్త్రంలో రమ్య ఆర్‌టి 3 పతకాలు చొప్పున అందుకున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల సంబరాలతో వర్సిటీలో పండుగ వాతావరణం అలముకొంది.

ఇంద్రధనుష్‌తో వ్యాధులకు చెక్

- రాష్ట్రంలో 1,65,127 మందికి చుక్కల మందు
- రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి దినేష్ గుండూరావు



జ్యోతి వెలిగిస్తున్న దినేష్ గుండూరావు, చిత్రంలో మరో మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే, అధికారులున్నారు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో గర్భిణులు, ఐదేళ్ల లోపు పిల్లలకు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణకు మిషన్ ఇంద్రధనుష్ 5.0ను దిగ్విజయం చేయాలని రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి దినేష్ గుండూరావు పిలుపు ఇచ్చారు. ఆయన సోమవారం నగరంలోని లాల్ బహద్దూర్ శాస్త్రినగర్‌లో రాష్ట్ర స్థాయి మిషన్ ఇంద్రధనుష్ 5.0, నమ్మ క్లినిక్‌లను జ్యోతి వెలిగించి ప్రారంభించి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. గతంలో ప్లేగు, తట్టు, క్షయ వంటి వ్యాధులను ప్రభుత్వం అరికట్టిందన్నారు. ప్రతి క్లినిక్‌లో 23 రకాల వ్యాధుల టీకాలు వేసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 1,65,127 మంది పిల్లలకు చుక్కల మందును వేయాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు తెలిపారు. నగరంలో 12,224 మంది పిల్లలు, రాష్ట్రంలో 42,917 మందితో పాటు నగరంలో 1808 మంది గర్భిణులు ఉన్నారన్నారు. మిషన్ ఇంద్రధనుష్‌లో రాయచూరు, బళ్లారి, కోలారు, బాగల్‌కోటె, బెళగావి, విజయపుర, దక్షిణ కన్నడ, బెంగళూరు నగర జిల్లాల్లో ఈ పథకంలో ఆగస్టు 7 నుంచి 12 వరకు, సెప్టెంబర్ 9 నుంచి 14 వరకు, అక్టోబర్‌లో 1 నుంచి 16వ వరకు ఉచితంగా చుక్కలు వేస్తారన్నారు.

నాలుగు జిల్లాల్లో ఆశా కిరణ్ పథకం అమలు

రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా నాలుగు జిల్లాల్లో ఆశా కిరణ్ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఉచితంగా కంటి చికిత్సలు, ఆపరేషన్, కంటి అద్దాల పంపిణీ పథకానికి త్వరలో రాయచూరు, చిక్కబళ్లాపుర, కోలారు, చిత్రదుర్గ జిల్లాల్లో శ్రీకారం చుడతారన్నారు. అనంతరం ఉత్తర కన్నడ, చామరాజ నగర్, బెంగళూరు గ్రామీణ జిల్లాలకు ఆశాకిరణ్ పథకం విస్తరిస్తారన్నారు. 23 పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బందిని నియమిస్తామన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరలకే ఆరోగ్యం లభించాలన్నదే సర్కార్ లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ అమలు పరచిన పథకాలకు ప్రజల మద్దతు ఉందన్నారు. సమావేశంలో చిన్న నీటిపారుదల శాఖా మంత్రి ఎన్‌ఎస్.బోసురాజు, ఎమ్మెల్యేలు బసనగౌడ, హంపయ్య నాయక్, రాష్ట్ర వైద్యాధికారులు ఇందుమతి, నవీన్ భట్, రంజిత్ కుమార్, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, ఎస్పీ నిఖిల్, అదనపు జిల్లాధికారి దురుగేష్, ఆరోగ్య అధికారి సురేంద్ర బాబులున్నారు.

ఎంసీహెచ్ ఆస్పత్రిని ప్రారంభిస్తాం

రాయచూరు రూరల్: నగరంలో తల్లీబిడ్డల(ఎంసీహెచ్) ఆస్పత్రిని త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి దినేష్ గుండూరావు పేర్కొన్నారు. సోమవారం వీఐపీ భవన్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నెలల క్రితం దేవదుర్గ తాలూకా గబ్బూరులో కేంద్ర మంత్రి అమిత్ షా వర్చువల్ ద్వారా ఆస్పత్రిని ప్రారంభించారన్నారు. రూ.15 కోట్లతో 60 పడకల ఆస్పత్రిని ప్రారంభించినా వైద్యులు, సిబ్బంది, అధికారులు, ఉద్యోగుల నియామకాలు చేపట్టలేదన్నారం. ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించుకోవాలని జిల్లాధికారికి సూచించారు. సమావేశంలో చిన్న నీటిపారుదల శాఖా మంత్రి ఎన్‌ఎస్.బోసురాజు, ఎమ్మెల్యేలు బసన గౌడ, హంపయ్య నాయక్, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, ఆరోగ్యాధికారి సురేంద్రబాబు, వైద్యాధికారులు ఇందుమతి, నవీన్ భట్, రంజిత్ కుమార్ ఉన్నారు.

ఇంద్రధనుష్ లబ్ధి పొందండి

కోలారు: ఇంద్రధనుష్ 5.0 లబ్ధిని ప్రతి ఒక్కరూ పొందాలని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. సోమవారం చెన్నయ్య రంగమందిరంలో వ్యాక్సినేషన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోని పిల్లలు, గర్భిణులకు టీకాలను తప్పనిసరిగా వేయించాలన్నారు. జిల్లాలోని అన్ని తాలూకాల్లో ఈ అభియాన్‌ను అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఇదే సమయంలో మిషన్ ఇంద్రధనుష్ 5.0 పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మెల్సీ అనిల్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ శంకర్ వణిక్యాళ్, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వీణా, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ జగదీష్, డాక్టర్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

పంట నష్టాన్ని అందించండి



అడవి పందులు నాశనం చేసిన పంటను చూపుతున్న రైతు

కంప్లి: అడవి పందులు మొక్కజొన్న పొలంలోకి చొరబడి పంటను నాశనం చేయడంపై రైతు శెట్రు శంకర వీరప్ప ఆవేదన వ్యక్తం చేశారు. తనకున్న రెండు ఎకరాల పొలంలో అప్పు చేసి మొక్కజొన్న నాటానని, మరికొద్ది రోజుల్లో కంకులు చేతికందే సమయంలో రాత్రికి రాత్రే అడవి పందులు పంటను నాశనం చేశాయని, తనకు పంట నష్టాన్ని అందించాలని ఒత్తిడి చేశారు.

కారు ఢీకొని ఇద్దరి మృతి

సాక్షి,బళ్లారి: దారి పక్కన నిలబడిన ఇద్దరిని కారు ఢీకొనడంతో మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. హావేరి జిల్లా శిగ్గావి తాలూకా నీరలగి గ్రామ సమీపంలో పుణె–బెంగళూరు జాతీయ రహదారిలో రోడ్డు పక్కన నిలబడిన విరుపాక్షప్ప(60), చిదానంద(53) అనే ఇద్దరు నీరలగి గ్రామం నుంచి శిగ్గావి పట్టణానికి వెళుతుండగా కారు ఢీకొని మరణించారు. దీంతో గ్రామస్తులు కోపోద్రిక్తులై జాతీయ రహదారిలో వాహన రాకపోకలను అడ్డుకొని నిరసన తెలిపారు. మృతదేహాలకు శిగ్గావి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించగా, అక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చిన్నారులకు బిస్కెట్ల పంపిణీ



బిస్కెట్లను పంపిణీ చేస్తున్న శకుంతల రెడ్డి

బళ్లారిఅర్బన్: సిద్దేశ్వర ధర్మ జాగృతి సంస్థ నిర్వాహకురాలు శకుంతల రెడ్డి సోమవారం పటేల్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సంస్థ నుంచి ఏటా విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

వేడుకగా చిన్న పీర్ల పండుగ



నగరంలో పీర్ల దేవుళ్ల ఊరేగింపు దృశ్యం

బళ్లారిఅర్బన్: నగరంలో సోమవారం సాయంత్రం వరకు మొహర్రం అనంతరం గత వారం రోజులుగా నిర్వహించిన చిన్నపీర్ల పండుగను వేడుకగా జరుపుకున్నారు. ఆయా వార్డుల్లో చావిళ్ల వద్ద ఏర్పాటు చేసిన పీర్లదేవుళ్లను ఆదివారం 9కుస్ నాటికి అగ్నిగుండం వేసి పానకాలు, బట్టలు, వెండి ఆభరణాలు, పూలు, చక్కెర చదివింపులు చేసి మొక్కులను తీర్చుకున్నారు. తెల్లవారు జామున అగ్నిగుండంలోకి దిగి భక్తులు అడిగిన కోర్కెలకు శాంతింపజేశారు. సాయంత్రం వీధుల్లో ఊరేగింపుగా దేవుళ్లను ఏటికి తరలించారు.

నడ్డాపై కేసు కొట్టివేత

హుబ్లీ: గత అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా 2023 మే 7న విజయనగర జిల్లా హరపనహళ్లిలో చేపట్టిన కర్ణాటక ఎన్నికల ప్రచార సభలో ఓటర్లను ఆకర్షించేలా ప్రసంగించిన ఆరోపణలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాపై ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ నమోదైన కేసును ధార్వాడ హైకోర్టు రద్దు చేసింది. ఆయనపై ఎన్నికల కమిషన్ అధికారుల ఫిర్యాదు మేరకు హరపనహళ్లి పోలీసులు నమోదు చేసిన కేసును రద్దు చేయాలని కోరుతూ జేపీ నడ్డా రిట్‌ను దాఖలు చేశారు. ధార్వాడ హైకోర్టు పీఠం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టిన న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న ఏకసభ్య ధర్మాసనం పైమేరకు ఆదేశాలిచ్చింది.

కాలువకు నీటి బంద్‌పై నిరసన



మాట్లాడుతున్న చామరస మాలిపాటిల్

రాయచూరు రూరల్: జిల్లాలోని దేవదుర్గ తాలూకాలో నారాయణపుర కుడి కాలువ ఆయకట్టు రైతులు కాలువకు నీరు బంద్ చేయడంపై రైతు సంఘం నేతలు ఆందోళన చేపట్టారు. సోమవారం దేవదుర్గలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు చామరస మాలిపాటిల్ మాట్లాడారు. కాలువపై 9వ మైలు వద్ద వడవాటి శాఖలో శావంతగల్ రైతులు కాలువ నీటిని ముందుకు పారకుండా అడ్డుకట్ట వేయడాన్ని ఖండిస్తూ రాస్తారోకో చేపట్టారు. పోలీసులు రైతులను అదుపులోకి తీసుకొనే ప్రయత్నం చేశారు. ఉప కాలువలైన 15, 16, 17, 18 కి.మీ. రైతులకు నేటికీ పరిహారం అందలేదన్నారు. నారాయణపుర కుడి కాలువ కింద భూయజమానులపై చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

కాలేజీ ముందు ఆత్మహత్యాయత్నం

- భార్య కోసం అకృత్యం



నిప్పు అంటించుకోవడంతో గాయాలైన హరిక్రిష్ణ

లేపాక్షి: భార్య కాపురానికి రాలేదనే బాధతో భర్త పెట్రోలు పోసుకుని నిప్పు అంటించుకోగా స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రమైన లేపాక్షిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా వున్నాయి. ఆమడగూరు మండలం ఆకువానిపల్లి గ్రామానికి చెందిన హరిక్రిష్ణ (23) అనే యువకుడు, చిలమత్తూరు మండలంలోని గాద్రాలపల్లికి చెందిన లలిత (20) రెండేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే సంవత్సరం క్రితం ఇద్దరి మధ్య గొడవలు జరిగి విడిపోయారు. అప్పటి నుండి హరిక్రిష్ణ బెంగళూరులో పని చేసుకుంటున్నాడు, భార్య లేపాక్షిలోని ప్రభుత్వ కళాశాలలో చదువుతోంది. సోమవారం ఉదయం భార్యను చూడాలని, కాపురానికి పిలుచుకెళ్లాలని హరిక్రిష్ణ వచ్చాడు. అతడు వచ్చిన విషయం తెలిసి లలిత కాలేజీ నుంచి బయటకు రాలేదు. దీంతో హరిక్రిష్ణ తెచ్చుకున్న పెట్రోలను శరీరం మీదకు పోసుకుని నిప్పు పెట్టుకునే యత్నం చేస్తుండగానే అక్కడున్న విద్యార్థులు నివారించారు. అయినప్పటికి కొంత మేర పెట్రోలు మంటలు అక్కడక్కడ పడడంతో స్వల్ప గాయాలు అయ్యాయి. పోలీసులు వచ్చి అతన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని తపాలా ఉద్యోగి మృతి

- భార్యకు తీవ్రగాయాలు





ఘటన స్థలంలోనే మృతి చెందిన రవికుమార్ (ఇన్ సెట్‌లో రవికుమార్ (ఫైల్)

రొళ్ల: తుమకూరు జిల్లా మధుగిరి తాలూకా బడవనహళ్లి హోబళి భీమనకుంట క్రాస్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అసిస్టెంట్ పోస్టుమాస్టర్ ఆర్.రవికుమార్ (33) అక్కడికక్కడే మృతి చెందారు. వివరాల్లోకి వెళితే మడకశిర నియోజకవర్గం రొళ్ల మండలంలోని హులికుంట గ్రామానికి చెందిన ఆర్.రవికుమార్ గుడ్డగుర్కి తపాల కార్యాలయంలో పనిచేస్తున్నారు. బడవనహళ్లిలో అద్దె ఇంట్లో ఉంటూ రోజు విధులకు వస్తారు. ఆయనకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. రోజు మాదిరిగానే బడవనహళ్లి నుంచి భార్య కృపతో కలిసి ద్విచక్ర వాహనంలో గుడ్డగుర్కికి బయలు దేరారు. మార్గమధ్యలో భీమనకుంట క్రాస్ వద్ద అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ఢీకొని అతనిపై నుంచి వెళ్లిపోయింది. రవికుమార్‌కు తల, ఎదపై పై బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. భార్య కృపకు కాళ్లు, చేతులకు బలమైన గాయాలు అయ్యాయి. భార్య కృపను మెరుగైన వైద్యం కోసం తుమకూరు తరలించారు. బడవనహళ్లి పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించి ట్రాక్టర్‌ను, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. పరిసర మండలాల తపాల సిబ్బంది సంతాపం తెలిపారు.

ఘరానా స్నాచర్ పట్టివేత



స్వాధీనం చేసుకున్న బంగారు గొలుసులు

బనశంకరి: గత ఏడేళ్లుగా 40 పైగా గొలుసు చోరీలకు పాల్పడిన ఘరానా చైన్‌స్నాచర్‌ను సోమవారం బనశంకరి పోలీసులు అరెస్ట్‌చేశారు. అతని వద్ద నుంచి రూ.9.40 లక్షలు విలువచేసే 4 బంగారు చైన్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. ధార్వాడకు చెందిన అచ్యుత్‌కుమార్ ఒంటరిగా నడిచి వెళ్లే మహిళలను టార్గెట్‌గా చేసుకుని బంగారుచైన్లు లాక్కెళ్లేవాడు. గత నెల 8వ తేదీ రాత్రి బనశంకరిలో ఇలాగే గొలుసు లాక్కెళ్లాడు. పోలీసులు గాలించి స్నాచర్‌ను అరెస్టు చేశారు. ఇతనిపై నగరవ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లలో 40 కి పైగా కేసులు నమోదైనట్లు గుర్తించారు. విడుదలై రాగానే మళ్లీ స్నాచింగ్‌లకు పాల్పడేవాడు.

మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం భేటీలు

శివాజీనగర: కాంగ్రెస్ పార్టీలో అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలను సమాధానపరిచేందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య సోమవారం ఆరు జిల్లాల ఎమ్మెల్యేలు, మంత్రులతో భేటీ జరిపి చల్లబరిచే ప్రయత్నం చేశారు. సీఎం నివాస కార్యాలయం కృష్ణాలో ఉదయం తుమకూరు, యాదగిరి, చిత్రదుర్గ జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలతో, మధ్యాహ్నం బాగలకోట, బళ్లారి, ధారవాడవారితో సమావేశమయ్యారు. మంత్రులు తమను పట్టించుకోవడం లేదని, బదిలీల సిఫార్సులను పరిగణించడం లేదని కొందరు ఎమ్మెల్యేలు ఆగ్రహం వెలిబుచ్చడం తెలిసిందే. ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్ ఈ సమావేశాల్లో పాల్గొన్నారు.

జోరుగా ఖరీఫ్ పనులు



తొలకరి వర్షాలకు పొలాల్లో విత్తనం వేస్తున్న రైతన్న



పొలంలో కలుపు నివారణకు గుంటక పొస్తున్న రైతన్న

కంప్లి: తుంగభద్ర జలాశయం నుంచి కాలువలకు నీటిని విడుదల చేయడంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. గత కొన్ని రోజుల క్రితం కురిసిన చెదురు ముదురు వర్షాలకు కొంత మంది రైతులు తమ పొలాల్లో జొన్న, మొక్కజొన్న తదితర విత్తనాలు నాటారు. ఇటీవల ఆ పంటలు క్రమంగా ఎదుగుతుండడంతో రైతాంగంలో ఆశలు చిగురిస్తున్నాయి. ఇక డ్యాం నుంచి ప్రధాన కాలువలకు సాగునీరు విడుదల చేయడంతో నీటి కొరత ఉండదని రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం పొలాల్లో పెరుగుతున్న పంటల్లో కలుపు నివారణకు జోడెద్దులతో గుంటక పొసే పనులు చేపడుతున్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై ధర్నా

- కలెక్టరేట్ ఎదుట బైటాయించిన బీజేపీ నాయకులు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగిన నేతలు



బళ్లారిలో కలెక్టరేట్ ముందు పార్టీ నేతల నిరసన



రాయచూరులో ఆందోళనలో పాల్గొన్న పార్టీ నేతలు

సాక్షి, బళ్లారి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు, విద్యుత్ చార్జీల పెంపుపై బీజేపీ రైతు మోర్చా నేతృత్వంలో సోమవారం కలెక్టరేట్ ముందు నేతలు ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నామన్నారు. రైతులు పండించిన పంటలను అమ్ముకునేందుకు ఏపీఎంసీ చట్టాన్ని రద్దు చేయడం అన్యాయమన్నారు. పలు పథకాలను రద్దు చేసి రైతులకు మోసగిస్తోందన్నారు. విద్యుత్ చార్జీలను పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తుంగభద్ర సమాంతర కాలువకు నిధులు మంజూరు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యలను పట్టించుకోవడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, జిల్లాధ్యక్షుడు మురారిగౌడ, ప్రముఖులు గురులింగనగౌడ, రామలింగప్ప, యర్రంగళి తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

రాయచూరులో...

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని బీజేపీ నేతలు మండిపడ్డారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో జిల్లా రైతు మోర్చా అధ్యక్షుడు సిద్దనగౌడ మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అమలు చేసిన ఏపీఎంసీ చట్టం, కోటి విద్యా పథకం, భూసిరి చట్టం రద్దు, జిల్లాకు కేటాయించిన గోశాల రద్దు, విద్యుత్ ధరల పెంపు, రైతుల జీవన జ్యోతి పథకాలను రద్దు చేశారన్నారు. పంచ గ్యారంటీల పేరుతో ఖజానాను లూటీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రద్దు చేసిన పథకాలను తిరిగి అమలు చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

అంబేడ్కర్ రాజ్యాంగంతో అందరికీ న్యాయం



మాట్లాడుతున్న పీడీఓ సురేష్

కంప్లి: సమాజంలో అందరికీ న్యాయం జరిగేలా డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారని పీడీఓ సురేష్ తెలిపారు. సణాపుర రోడ్డులోని ముస్లిం షాదీ మహల్‌లో ఏర్పాటు చేసిన ఒక రోజు శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు పొందేందుకు విద్య అవసరమన్నారు. కంప్లి అంబేడ్కర్ అనుచర బళగ అధ్యక్షుడు రమేష్ సుగ్గేనహళ్లి డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ జనకవి రమేష్ గబ్బూరు, హెచ్‌సీ.రాఘవేంద్ర, కేబీఎస్ గౌరవ అధ్యక్షులు చెన్నబసప్ప, ప్రధాన కార్యదర్శి టీ.శివప్ప, సుధాకర్, వీసీ అంజినప్ప, పీసీ ఉమేష్, పూజారి, తిమ్మప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలకు డిమాండ్



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: యాపలదిన్ని జీపీలో జరిగిన అగ్నిప్రమాదానికి బాధ్యులైన అధికారులపై చర్యలు చేపట్టాలని కర్ణాటక ప్రాంత రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు రమేష్ మాట్లాడారు. యాపలదిన్ని జీపీ కార్యాలయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కంప్యూటర్, రికార్డులు, ఫర్నీచర్ పూర్తిగా ధ్వంసమై రూ.3 కోట్ల విలువ చేసే సామగ్రి నష్టానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతి పత్రం సమర్పించారు.

ఏపీఎంసీలో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం



మాట్లాడుతున్న నరసింహ నాయక్

రాయచూరు రూరల్: దేవదుర్గ ఏపీఎంసీలో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతోందని రాష్ట్ర రైతు సంఘం జిల్లాధ్యక్షుడు నరసింహ నాయక్ అన్నారు. సోమవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండా దుకాణాలు వేసుకున్న వారి వద్ద నుంచి అధికారులు మార్కెట్ ధర రూ.6 లక్షలకు బదులుగా రూ.10 లక్షలు వసూలు చేశారని దుయ్యబట్టారు. అలాంటి అధికారులపై చర్యలు చేపట్టాలని, నారాయణపుర కుడి కాలువకు నీరు సక్రమంగా వదలాలని ఒత్తిడి చేశారు.

కోలారు వార్తలు...

ఖాలీ ఫ్లవర్

- నకిలీ విత్తన విక్రేతలపై చర్యలేవీ?



పంట నష్టాన్ని చూపుతున్న రైతు సంఘం పదాధికారులు

కోలారు: నకిలీ విత్తనాలు, మందులు, కీటనాశకాలను విక్రయిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రైతు సంఘం పదాధికారులు డిమాండ్ చేశారు. తాలూకాలోని ముదువత్తి గ్రామంలో నకిలీ విత్తనాలతో పంట నష్ట పోయిన రైతు శ్రీరామప్ప పొలాన్ని సోమవారం వారు సందర్శించిన అనంతరం మాట్లాడారు. తాలూకాకు చెందిన రైతు తన 4 ఎకరాల్లో కాలీఫ్లవర్ సాగు చేయగా దాదాపు రూ.10 లక్షల మేర నష్టం కలిగిందన్నారు. రైతుకు నష్టపరిహారం అందించడంతో పాటు నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, యారంఘట్ట గిరీష్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో బాలుర కళాశాల సత్తా



విజేత జట్టు విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

కోలారు: నగర, ఫిర్కా స్థాయి క్రీడా పోటీల్లో ఉత్తమ సాధనతో విజేతలుగా నిలిచిన బాలుర కళాశాల విద్యార్థులను ప్రిన్సిపాల్ రాధమ్మ, సిబ్బంది అభినందించారు. కళాశాల విద్యార్థి యూసుఫ్ హర్డిల్స్‌లో ప్రథమ, 400 మీటర్ల పరుగు పందెంలో ద్వితీయ స్థానం, హర్షిత్ బాబు లాంగ్ జంప్‌లో, హై జంప్‌లో ద్వితీయ స్థానం, ఎంసీ శశాంక్ 1500 మీటర్ల పరుగులో ద్వితీయ, ప్రశాంత్ తృతీయ, 3000 మీటర్ల పరుగు పందెంలో మనోజ్‌కుమార్ తృతీయ, ఎం.మనోజ్ వాలీబాల్‌లో ప్రథమ స్థానం సాధించారు. విజేత విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు కెంపేగౌడ, ముకుంద, నాజీమా, రమేష్, రహమత్ ఉన్నీసా, రాధ తదితరులు అభినందించారు.

విద్యతో పాటు ఆరోగ్యమూ ముఖ్యమే



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: ఉపాధ్యాయులు విద్యా ప్రగతితో పాటు ఆరోగ్యంపై కూడా దృష్టి పెట్టాలని బీఈఓ కన్నయ్య తెలిపారు. సోమవారం నగరంలోని పాత మాధ్యమిక పాఠశాల ప్రాంగణంలోని బీఈఓ కార్యాలయంలో నిర్వహించిన ఉపాధ్యాయులకు ఉచిత ఆరోగ్య పరీక్ష శిబిరం కార్యాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. చాలా మంది ఉపాధ్యాయులు విధి నిర్వహణ, సంసార ఒత్తిళ్లలో పడి ఆరోగ్యంపై దృష్టి పెట్టడం లేదన్నారు. ఇకనైనా ఉపాధ్యాయులు విధులతో పాటు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. భారత్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కెఎస్ గణేష్, రోటరీ సెంట్రల్ అధ్యక్షుడు ప్రకాష్, వైదేహి ఆస్పత్రి వైద్యులు డాక్టర్ లోకేష్, భరణి తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ వ్యక్తిత్వం అవసరం



మాట్లాడుతున్న డీసీపీ దేవరాజ్

కోలారు: విద్యార్థులు బాల్యం నుంచే ప్రామాణికతను, ఉదాత్త విలువలతో కూడిన ఆదర్శ వ్యక్తిత్వాన్ని అలవర్చుకోవాలని బెంగళూరు ఉత్తర డీసీపీ డీ.దేవరాజ్ తెలిపారు. ఆయన సోమవారం పార్శ్వగానహళ్లిలో ఏర్పాటు చేసిన ఫిర్కా స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించి మాట్లాడారు. గ్రామాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఉపాధ్యాయులు శ్రమించాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటముల కంటే పాల్గొనడమే ముఖ్యమన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలన్నారు. ఓటమితో కుంగిపోకుండా సోపానంగా చేసుకుని విజయాన్ని సొంతం చేసుకోవాలన్నారు. జీవితంలో తల్లిదండ్రులు, గురువులను ఎన్నటికీ మరువరాదన్నారు. జీపీ అధ్యక్షుడు నాగేంద్ర, జిల్లా వ్యాయామ విద్యాధికారి మంజునాథ్ పాల్గొన్నారు.

గద్దర్‌కు ఘన నివాళి



మాలూరులో గద్దర్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

కోలారు: హైదరాబాద్‌లో విప్లవకవి, పోరాట యోధుడు గద్దర్ మృతికి బస్టాండు సర్కిల్‌లో ఆయన చిత్రానికి సమాన మనస్కుల సమూహం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నివాళి అర్పించారు. సుబ్రమణి మాట్లాడుతూ గద్దర్ మరణం సమాజానికి తీరని లోటని అన్నారు. భౌతికంగా మన మధ్య లేకున్నా తన సాహిత్యం, పాటల ద్వారా లక్షల మంది మనసులో నిలిచి ఉన్నారన్నారు. కల్లూరు చలపతి, డిక్కి నారాయణస్వామి, వెంకటాచలపతి పాల్గొన్నారు.

మాలూరులో..

మాలూరు: పట్టణంలోని అంబేడ్కర్ ఉద్యానవనంలో సోమవారం గద్దర్ చిత్రానికి దళిత సంఘర్ష సమితి కార్యకర్తలు నివాళులు అర్పించారు. సమితి జిల్లా సంచాలకుడు ఆర్.వెంకటేష్, తాలూకా సంచాలకుడు ఎకె వెంకటేష్, తిమ్మరాజ్ పాల్గొన్నారు.

యూనిఫాం వితరణ



యూనిఫాం అందిస్తున్న ఎమ్మెల్యే నంజేగౌడ

కోలారు: మాస్తి గ్రామంలోని కర్ణాటక పబ్లిక్ పాఠశాలలో విద్యార్థులకు ఎమ్మెల్యే కె వై నంజేగౌడ సోమవారం యూనిఫాంను అందించారు. ప్రభుత్వ పాఠశాలలకు దాతలు పలు రకాలుగా విరాళాలు అందిస్తుండడం హర్షణీయమన్నారు. తాలూకా అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న తనకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలన్నారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. దాతల సహకారంతో తాలూకాలోని పబ్లిక్ పాఠశాలల్లో 24 అదనపు గదులను నిర్మిస్తున్నామన్నారు. ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు అక్రం పాషా, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం విజయ, కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీజేపీ ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నేతలు

తుమకూరు: రాష్ట్రంలో అధికార కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సోమవారం జిల్లా బీజేపీ అధ్యక్షుడు రవి శంకర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారి కార్యాలయం చేరుకుని అక్కడ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేపీ హయాంలో తీసుకొచ్చిన 17 పథకాలను పూర్తిగా నిలిపివేయడం తగదని నినాదాలు చేశారు.

మండ్యలో బీజేపీ ఆందోళన

మండ్య: రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతిని ఖండిస్తూ బీజేపీ రైతు మోర్చ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం మండ్య నగరంలో ధర్నా నిర్వహించారు. నగరంలో సర్‌ఎం.వి. విశ్వేశ్వరయ్య విగ్రహం వద్దకు చేరుకున్న బీజేపీ కార్యకర్తలు అక్కడ ధర్నా చేపట్టి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీఎంసీ చట్టాన్ని రద్దు చేయడం ద్వారా రైతుల ఆదాయానికి గండి కొడుతోందని మండిపడ్డారు.

పంపుసెట్ల పంపిణీ

గౌరిబిదనూరు: వెనుకబడిన వర్గాల వారు ప్రభుత్వ సౌలభ్యాలతో ఆర్థికంగా ఎదగాలని, సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ తెలిపారు. వీరు సోమవారం టీపీ ఆఫీసులో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో 16 మంది లబ్ధిదారులకు గంగా కళ్యాణ పథకం ద్వారా పంపు సెట్లు, మోటార్లను పంపిణీ చేశారు. ప్రభుత్వం వెనుకబడిన వర్గాల సంక్షేమానికై అనేక కార్యక్రమాలు చేపట్టింది. పంపుసెట్ల ద్వారా బోరుబావి జలాలతో మంచి పంటలను పండించాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో అనంతరాజు, వెంకటరామిరెడ్డి, చంద్రణ్ణ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాప్యంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి



విశ్రాంత ఉద్యోగులకు అభినందనలు చెబుతున్న దృశ్యం

గౌరిబిదనూరు: వృద్ధాప్యంలో ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని తాలూకా విశ్రాంత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దస్తగిరిసాబ్ తెలిపారు. ఆదివారం సాయంత్రం సంఘం కార్యాలయం ఆవరణంలో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సమావేశంలో సభ్యులకు జమా ఖర్చుల వివరాలను వెల్లడించారు. విశ్రాంత ఉద్యోగులకు సైతం ప్రభుత్వం అనేక సౌలభ్యాలను కల్పించిందని, వాటి ప్రయోజనాలను తెలుసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆగస్టులో జన్మించిన సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

గద్దర్‌కు నివాళి



శిడ్లఘట్ట: తెలంగాణ ప్రజా పోరాట గాయకుడు గద్దర్‌కు శిడ్లఘట్టలో అభిమానులు శ్రద్ధాంజలి ఘటించారు. చిక్కబళ్లాపురం జిల్లా సంఘటన సంచాలకుడు వెంకటేశ్ గద్దర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంజాయి సాగు, వ్యక్తి అరెస్ట్

మైసూరు: ఇంటి వెనుక భాగంలో ఉన్న తోటలో గంజాయి సాగు చేసిన సిద్ధాపుర సమీపంలోని గుడ్డురు చెన్నంగి గ్రామానికి చెందిన కిరణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. 31 కిలో గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు.

ఆనేకల్ చేరుకున్న పవిత్ర జలాలు



పూజలో పాల్గొన్న మహిళలు

బొమ్మనహళ్లి: శ్రీ రామామృత తరంగిణి అభియాన్ వేడుకల సందర్భంగా అయోధ్య నగరం నుంచి ఆనేకల్ నగరానికి దేశంలోని 16 పవిత్ర నదుల జలంతో పాటు మట్టిని సేకరించిన పీఠం వన్య మహిళా సంఘం లతాంగి, కుమారి సీతణ్ణ బృందానికి చెందిన మాతలు వచ్చి ఇక్కడి ఆదివారం ఆనేకల్ పట్టణంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

అందమైన పర్వతశ్రేణి కుద్రేముఖ్

- పర్యాటకులకు స్వర్గధామం
- ట్రెక్కింగ్, సాహసక్రీడలకు అనువైన స్థలం
- కనువిందు చేసే జలపాతలు
- వైవిధ్యమైన జంతుజాలం



కనువిందు చేస్తున్న జలపాతం



కుద్రేముఖ్ పర్వతశ్రేణుల మధ్య అంబాతీర్థనది ప్రవాహం

బనశంకరి: పచ్చదనంతో పెనవేసుకున్న పర్వతాలు, లోయలు, జలపాతాలు, దట్టమైన అడవులు, జీవ వైవిధ్యతకు నెలవు కుద్రేముఖ్ పర్వతశ్రేణులు. అపారమైన ఖనిజసంపద కొలువైన కుద్రేముఖ్‌లో వర్షాకాలం వచ్చిందంటే పర్యాటకుల సందడి అధికంగా ఉంటుంది. కుటుంబ సమేతంగా కేరింతలు కొట్టేందుకు పర్యాటకులు ఇక్కడికి వాలిపోతారు. కుద్రేముఖ్ చిక్కమగళూరుకు 95 కిలోమీటర్ల దూరంలో నైరుతిదిశలో ఉంది. ఇది ట్రెక్కింగ్ ప్రియులకు స్వర్గధామం. కన్నడ భాషలో కుద్రేముఖ్ అంటే గుర్రపు ముఖం అని అర్థం. ఈ పర్వతశ్రేణులు గుర్రపు ముఖం ఆకారంలో ఉండటం వల్ల కుద్రేముఖ్ అని పిలుస్తారు. కుద్రేముఖ్ పర్వతకేంద్రంలో కుద్రేముఖ్ నేషనల్ పార్కు ఉంటుంది. ఇక్కడ చిరుతపులి, ఎలుగుబంటి, మచ్చల జింకలు, అడవికుక్కలు, నక్కలు వంటి వన్యప్రాణులను వీక్షించవచ్చు.

జంతుజాలానికి నెలవు

చల్లటి వాతావరణం, దట్టమైన పచ్చదనం, వివిధ రకాల చెట్లు కలిగి ఎన్నో జంతువులకు నిలయంగా ఉంటుంది. చిరుత, పులి, లేడి, ఉడుతలు, అడవి పందులు, ముళ్లపందులు, అడవి ఎలుగుబంటి, ముంగీస మొదలైనవి సంచరిస్తూ ఉంటాయి. క్రూర జంతువులు, పులి, చారల పులి, నక్కలు, అడవి కుక్కల వంటివి కూడా అడవులలో సంచరిస్తాయి.

అపారమైన ఖనిజ సంపద

ఆరేబియాసముద్రం వైపు ఉన్న ఈ పర్వతశ్రేణుల పరంపర లోతైన లోయలు, ఎత్తైన శిఖరాలతో చాలా సుందరంగా ఉంటుంది. సముద్రమట్టానికి 1894 అడుగుల ఎత్తులో ఉన్న ఇక్కడ పర్వతకేంద్ర అపారమైన ఇనుపగనులకు నెలవు.

స్వచ్ఛమైన నీటి సవ్వడి

సైకిల్ సవారీ ప్రత్యేక అనుభూతి

కుద్రేముఖ్ కొండలపై సైకిల్ సవారీ మధురానుభూతి. పర్వతాలు, వృక్షాల మధ్యలో నిర్మించిన రోడ్డుమార్గంలో నడుస్తుంటే కలిగే ఆనందం మాటల్లో వర్ణించడం కష్టం. వర్షాకాలంలో ఇక్కడ కుద్రేముఖ్‌లోని లక్షాజలాశయం నీటితో కళకళలాడుతుంది. పొంగిపొర్లే నీటి అలలను కెమెరాల్లో బంధించేందుకు సందర్శకులు చేసే ప్రయత్నాలు ఆహ్లాదాన్ని అందిస్తుంది.

కుద్రేముఖ్ పరిసరాలు వర్షాకాలంలో అత్యంత సుందరంగా కనబడుతుంది. పర్వతశిఖరాలు కూడా పచ్చదనాన్ని సంతరించుకుంటాయి. షోలగడ్డి భూముల్లో ట్రెక్కింగ్ చేయడం ఎంతో ఆనందంగా ఉంటుంది. గడ్డి ప్రదేశాలపై సూర్యకిరణాలు పడి తళతళలాడుతుంటాయి. ఈ ప్రాంతంలో ఉదయం అందాలను తిలకించేందుకు సందర్శకులు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. అడవికి ఇరువైపుల ఉన్న రోడ్డు మార్గంలో నడుస్తుంటే పచ్చటి అరణ్యం స్వాగతిస్తున్నట్లు ఉంటుంది. కుద్రేముఖ్ ప్రదేశంలో అంబాతీర్థనదిలోని స్వచ్ఛమైన నీటి సవ్వడులు మనసును ఉత్తేజపరుస్తాయి అనడంలో ఎలాంటి సందేహం లేదు.



కుద్రేముఖ్ ప్రకృతి అందాలు



కుద్రేముఖ్‌లో అడవి దున్నలు



కుద్రేముఖ్ పర్వతశ్రేణుల్లో పర్యాటకులు ట్రెక్కింగ్



లక్షా జలాశయం వద్ద యువత సందడి

యువతతోనే దేశాభివృద్ధి

శివాజీనగర: దేశంలో 40 శాతం ఉన్న యువతను సరైన మార్గదర్శనంతో వారిని తీసుకెళ్తే సదృఢమైన దేశాన్ని నిర్మించేందుకు సాధ్యపడుతుందని క్రీడా కార్యకలాపాలు డైరెక్టర్ డీ.ఆర్.విజయసారథి అన్నారు. సోమవారం నగరంలో బీజీఎస్ ఆటల మైదానంలో వాసవి జ్ఞానపీఠ ఫస్ట్ గ్రేడ్ కాలేజీ ద్వారా చేపట్టిన 15 కాలేజీల ఇంటర్ కాలేజీ స్పోర్ట్స్ మీట్-2023 ప్రారంభించి మాట్లాడారు. నేటి యువత చెడు సహవాసాలకు బలవుతున్నారు. ఇది ఆందోళనకరమైన విషయం. యువత ఉత్తమ మార్గదర్శనలో సాగేందుకు విద్యతో పాటుగా క్రీడా కార్యకలాపాలు మనోస్థైర్యాన్ని పెంచేందుకు సహకారి అవుతోందని తెలిపారు. అంతర్ కాలేజీ క్రీడా పోటీల్లో 16కు పైగా కాలేజీలు పాల్గొన్నాయి. వాలీబాల్, క్రికెట్, త్రోబాల్ పోటీలు, గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. కాలేజీ ప్రిన్సిపాళ్లు పద్మ, రచన, రంగస్వామి, శోభా తదితరులు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్ర ధనుష్ అభియాన్ ప్రారంభం

బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికె, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్ ఇంద్రధనుష్ 5.0 అభియాన్‌ను సోమవారం డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ ఆస్టిన్‌టౌన్ ప్రసూతి ఆసుపత్రిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా శాంతినగర ఎమ్మెల్యే ఎన్ఏ.హ్యారీస్, బీబీఎంపీ పాలనాధికారి రాకేశ్‌సింగ్, కమిషనర్ తుషార్‌గిరినాథ్, ఆరోగ్యశాఖ బీబీఎంపీ ప్రత్యేక కమిషనర్ కేవీ.త్రిలోక్‌చంద్ర, జాయింట్ కమిషనర్ పల్లవి, ప్రధాన ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బాలసుందర్, డాక్టర్ నిర్మలాబుగ్గి పాల్గొన్నారు. అభియాన్‌ను 12 వరకు నిర్వహిస్తారు. ఐదేళ్లలోపు చిన్న పిల్లలు, గర్భిణులకు టీకా వేస్తారు.

11న తెలుగు పాస్టర్ల సమావేశం

శివాజీనగర: నగరంలోని శేషాద్రిపురంలో ఉన్న గ్లోరీ ప్రేయర్ హాల్‌లో ఈ నెల 11న శుక్రవారం కర్ణాటక తెలుగు క్రిస్టియన్ మినిస్ట్రీస్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో తెలుగు పాస్టర్ల సమావేశం జరుగనుంది. ఈ మేరకు కేటీసీఎంఎఫ్ సంస్థాపక అధ్యక్షుడు బిషప్ రెవరెండ్ ఎం.బెంజమిన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. బెంగళూరు నగర, బెంగళూరు గ్రామీణ, కోలార్, చిక్కబళ్లాపుర తదితర జిల్లాల్లో చర్చీలు ఏర్పాటు చేసి సేవలు అందజేస్తున్న పాస్టర్లను ఆధ్యాత్మికంగా బలపరచాలనే ఉద్దేశ్యంతో కేటీసీఎంఎఫ్ పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రసంగీకులు డాక్టర్ జాన్‌పాల్, డాక్టర్ రెవరెండ్ జేడీ మోజెస్ దైవ వర్తమాన్ని వినిపిస్తారని తెలిపారు.

ప్యాలెస్ పరిసరాల్లో డ్రోన్ నిషేధం

మైసూరు: మైసూరు నగరంలోని విశ్వ విఖ్యాత మైసూరు అంబా విలాస్ ప్యాలెస్ పరిసరాల్లో డ్రోన్ ఎగురవేయడాన్ని నిషేధించారు. అనుమతి ఉంటేనే డ్రోన్ ఎగుర వేయాల్సి ఉంటుందని ప్యాలెస్ అధికారులు తెలిపారు.

బ్రాండ్ బెంగళూరు కోసం విద్యార్థుల సలహాలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

బనశంకరి: బ్రాండ్ బెంగళూరు కోసం నగర ప్రజల నుంచి 10 వేల సలహాలు అందాయని వీటిని అధ్యయనం చేసి నివేదిక రూపొందిస్తామని ఆర్థిక శాఖ ప్రత్యేక కమిషనర్, బెంగళూరు నోడల్ అధికారి జయరామ్ రాయపుర తెలిపారు. సోమవారం బ్రాండ్ బెంగళూరు పథకం కింద వైబ్రెంట్ బెంగళూరు, జనహిత బెంగళూరుకు సంబంధించి సృష్టి మణిపాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ అండ్ టెక్నాలజీలో ఏర్పాటు చేసిన సెమినార్‌లో జయరామ్ మాట్లాడారు. సుందర బెంగళూరు కోసం బ్రాండ్ బెంగళూరు పథకం కింద 7 వివిధ విభాగాల్లో ప్రజల నుంచి అనేక సలహాలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో సృష్టి అధ్యక్షుడు డాక్టర్ అరిందమ్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

లా విద్యార్థి ఆత్మహత్య

యశవంతపుర: లా విద్యార్థి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన అన్నపూర్ణేశ్వరినగర పోలీసుస్టేషన్ పరిధిలో జరిగింది. హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన అర్యకుమార్ నడ్డా (23) నాగరబావిలోని ప్రైవేట్ కాలేజీలో మూడో సంవత్సరం ఎల్ఎల్‌బీ చదువుతున్నాడు. శ్రీగరిధకావలు సమీపంలో పీజీలో ఉంటున్నాడు. ఆదివారం స్నేహితులు బయట వెళ్లిన సమయంలో పీజీలోనే ఉరి వేసుకున్నాడు. తీవ్రమైన మైగ్రేన్‌తో అతను ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం.

హత్య కేసులో 11మంది అరెస్ట్

యశవంతపుర: బెంగళూరులో రౌడీషీటర్ సిద్ధాపుర మహేశ్ హత్య కేసులో పరప్పన ఆగ్రహార పోలీసులు 11 మంది నిందితులను అరెస్ట్ చేశారు. సిద్ధాపురకు చెందిన సునీల్, కణ్ణన్, వేలు, ప్రదీప్, మను, గ్రేస్ వాల్టర్, శ్రీనివాస అలియాస్ పాప, గోకుల్, సురేశ, కార్తీక్, వాలె ప్రవీణలను అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య

పబ్‌జీ గేమ్‌లో డబ్బులు పోగొట్టుకొని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన కలబురిగిలో జరిగింది. ప్రవీణ్ పాటీల్ (20) నగరంలోని దేవినగరలో ఇంటిలో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. బీటెక్ చదువుతున్న ప్రవీణ్‌కు పబ్‌జీకి బానిసయ్యాడు. గేమ్‌లో డబ్బులు పోగొట్టుకున్నాడు. దీంతో దిక్కుతోచని స్థితిలో ఉరి వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫొటోగ్రాఫర్‌కు పతకాల పంట



మైసూరు: మైసూరు నగరానికి చెందిన ఛాయాగ్రహకుడు అనురాగ్ బసవరాజ్ (ఎంఎస్.బసవణ్ణ) ఛాయచిత్రాలకు ఫోటోగ్రఫీ సొసైటీ ఆఫ్ అమెరికా సంస్థ రెండు బంగారు పతకాలతో పాటు మొత్తం 14 పతకాలను అందజేసింది. బసవరాజు నాగరహోళె అభయారణ్యంలో తీసిన ఆడవి పందిని వేటాడే పులి, ప్రజలను పరుగు పెట్టించిన చిరుత, మైసూరు దసరా ఏనుగుల తాలీము తదితర ఫొటోలకు అంతర్జాతీయంగా పతకాలను అందుకున్నాడు.

● లాల్‌బాగ్ కిటకిట



బనశంకరి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా లాల్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన ఫల పుష్ప ప్రదర్శన నాలుగో రోజు సోమవారం సందర్శకులతో కిటకిటలాడింది. ఫ్లవర్‌షో వీక్షించడానికి పెద్ద ఎత్తున నగరవాసులు తరలివచ్చారు. ఈసారి ఫ్లవర్‌షోను రూ.2.5 కోట్ల వ్యయంతో నిర్మించగా గ్లాజ్‌హౌస్ మధ్యభాగంలో విధానసౌధ థీమ్‌కు 7.2 లక్షల పుష్పాలతో తీర్చిదిద్దారు. ఆదివారం 67 వేల మంది సందర్శించగా రూ.47 లక్షలు టికెట్లు విక్రయం ద్వారా ఆదాయం వచ్చిందని ఉద్యానవనశాఖ జేడీ జగదీశ్ తెలిపారు.

మానవ జన్మ సర్వశ్రేష్టమైనది



కలశాల ఊరేగింపులో రాంబాబు తదితరులు



మరకత శివలింగానికి పూజలు చేస్తున్న దృశ్యం

- ఆశ్రమంలో ఘనంగా తపస్సిద్ధి వార్షికోత్సవం

బనశంకరి: అన్ని జన్మలకంటే మానవ జన్మ సర్వశ్రేష్టమైనదని, మానవుడు సార్థకం చేసుకోవాలని శ్రీ శివరుద్ర బాలయోగి మహరాజ్ అన్నారు. సోమవారం నగరంలోని జేపీనగర మూడో ఫేజ్ శ్రీ శివబాలయోగి మహరాజ్ ఆశ్రమంలో 62వ తపస్సిద్ధి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ ధార్మికతను అలవరచుకుని భగవంతుడిని స్మరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా శివరుద్రబాలయోగి మహారాజ్, ట్రస్టీ కార్యాధ్యక్షుడు డీ.రాంబాబు మరకత శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివబాలయోగి మహారాజ్ సమాధికి పూజలు చేసి స్వామీజీ చిత్రపటం, కలశాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. మధ్యాహ్నం పూర్ణాహుతి చేపట్టి శివబాలయోగి మహారాజ్ విగ్రహానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం మరకత శివలింగానికి అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ప్రవాసాంధ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజా కల్యాణ నృత్య రూపకం అలరించింది.

హోసూరు వార్తలు..

కలెక్టరేట్‌లో వినతుల వెల్లువ

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ శరయు అధ్యక్షతన జరిగిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో తాగు నీరు, ఇళ్లపట్టాలు, కుట్టుయంత్రాలు, వృద్ధాప్య పెన్షన్, రోడ్ల వసతి, ఆర్థిక సాయం తదితర సమస్యలపై 287 వినతులు అందజేశారు. వినతులను స్వీకరించిన కలెక్టర్ పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అధికారులు పన్నీర్‌సెల్వం, పద్మలత, రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు రైతుల ధర్నా



ఆందోళన నిర్వహిస్తున్న రైతు సంఘ కార్యకర్తలు

హోసూరు: కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన మేకెదాటు ఆనకట్ట నిర్మాణానికి అడ్డుకట్ట వేయాలని, దరఖాస్తు చేసుకొన్న రైతులకు తక్షణమే విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని సోమవారం ఉదయం హోసూరు విద్యుత్ శాఖ కారాయలయం ముందు తమిళగ రైతు సంఘం ఆందోళన చేశారు. క్రిష్ణగిరి జిల్లా అధ్యక్షుడు శ్రీరామరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు చిన్నస్వామి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుందరంలు ముఖ్య అతిథిలుగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో తత్కాల్ పథకం ద్వారా రూ. 2.50 లక్షల నుంచి రూ. 4 లక్షల వరకు రైతుల నుంచి వసూలు చేసిన ప్రభుత్వం ఆరు నెలలు గడిచినా కనెక్షన్లు ఇవ్వలేదని ఆరోపించారు. నకిలీ విత్తనాలు విక్రయాలతో రైతులు నష్టపోతున్నారని, వన్యప్రాణుల దాడుల్లో పంటలు ధ్వంసమౌతున్నాయని ఫిర్యాదులందజేసినా పట్టించుకొనే నాథుడే లేదని ఆరోపించారు. ధర్నాలో పెద్ద ఎత్తున రైతు సంఘ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

హోసూరు: డెంకణీకోట, ఉద్దనపల్లి ప్రాంతాల్లో ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. వివరాలు... డెంకణీకోట సమీపంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి సమీపంలోని లక్ష్మీపురంలో నివాసముంటున్న అమ్మమ్మ ఇంట్లో ఉంటూ ఈనెల 5న అదృశ్యమైంది. యువతి తండ్రి కెలమంగలం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఉద్దనపల్లి సమీపంలోని దేవసగానపల్లి గ్రామానికి చెందిన 19 ఏళ్ల యువతి ఈనెల 4వ తేదీ ఇంటి నుంచి బయట కెళ్లి అదృశ్యమైంది.

దోపిడీ దొంగలు అరెస్ట్

హోసూరు: హోసూరు, సూళగిరి, ఉద్దనపల్లి, డెంకణీకోట పోలీస్‌స్టేషన్ల పరిధిలో దోపిడీలకు పాల్పడుతున్న సూళగిరి ప్రాంతానికి చెందిన సతీష్, చిన్నతంబిలను ప్రత్యేక పోలీసులు అరెస్ట్ చేశారు. చోరీ సొత్తును స్వాధీనం చేసుకుని జైలుకు తరలించారు.

అటవీ సిబ్బంది చంపేశారని ధర్నా



రోడ్డును దిగ్బంధించిన దృశ్యం

కెలమంగలం: అటవీ ప్రాంతానికెళ్లిన రైతును అటవీ శాఖాధికారులు కొట్టడంతో చనిపోయాడని ఆరోపిస్తూ గ్రామస్థులు, మృతుని బంధువులు సోమవారం ఆందోళన చేయడంతో ఉద్రిక్తత ఏర్పడింది. మృతుని బంధువులు తెలిపిన మేరకు అంచెట్టి సమీపంలోని అట్టపల్లం గ్రామానికి చెందిన రైతు వెంకటేష్ (55). ఆదివారం రాత్రి మరో ఇద్దరితో కలిసి కుందేళ్ల వేటకెళ్లినట్లు, వారిలో ఇద్దరు పరారీ కాగా వెంకటేష్‌ను గస్తీ తిరుగుతున్న అటవీశాఖాధికారులు పట్టుకోగా గుండె పోటు రావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లగా చనిపోయాడని అటవీశాఖాధికారులు మృతుని బంధువులకు సమాచారం అందజేశారు. మేతకెళ్లిన పశువులను వెతుక్కొంటూ అటవీ ప్రాంతానికెళ్లి ఎలా మృతి చెందాడని, మృతిలో అనుమానం ఉందని, ఆరోపిస్తూ బంధువులు, గ్రామస్థులు అట్టపల్లం గ్రామం వద్ద ఆర్టీసీ బస్సును అడ్డగించి ఆందోళన చేపట్టారు. అంచెట్టి పోలీసులు, ఎస్పీ సరోజ్‌కుమార్ ఠాగూర్, డెంకణీకోట డీఎస్పీ మురళి, సబ్ కలెక్టర్ శరణ్య ఆస్పత్రికి చేరుకొని పరిశీలించారు. శవపరీక్ష రిపోర్టును బట్టి సంబంధిత అటవీశాఖాధికార్లపై చర్యలు చేపడతా మని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రామచంద్రన్ ఆస్పత్రికి చేరుకొని మృతుని బంధువులను పరామర్శించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న దృశ్యం

కెలమంగలం: డెంకణీకోట పట్టణ పంచాయతీలో అభివృద్ధి పనులకు సోమవారం పట్టణ పంచాయతీ అధ్యక్షుడు శ్రీనివాసన్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. పట్టణంలోని 17వ వార్డులో అభివృద్ధి పనులు చేపట్టి స్థానికులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ వచ్చారు. ఈ విషయంపై స్పందించిన పట్టణ పంచాయతీ అధ్యక్షులు విషయాన్ని సంబంధిత శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లి రూ. 9.5 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో సిమెంట్ రోడ్డు, మురికి కాల్వల ఏర్పాటుకు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాధుపశణిస్వామి, శ్రీనివాసన్, క్రిష్ణమూర్తి, నాగరాజ్, కలైసెల్వం, శేషు నారాయణన్, సురేష్, వసంతకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎం కరుణానిధికి ఘన నివాళి



కరుణానిధి చిత్రపటానికి నివాళి

హోసూరు, కెలమంగలం, క్రిష్ణగిరి: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత కరుణానిధి 5వ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం క్రిష్ణగిరి జిల్లా వ్యాప్తంగా డీఎంకే నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన నివాళులర్పించారు. హోసూరు పట్టణంలో క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా కార్యదర్శి, హోసూరు ఎమ్మెల్యే వై. ప్రకాష్ అధ్యక్షతన రామ్‌నగర్‌లోని అణ్ణా విగ్రహం వద్దకు చేరుకొని కరుణానిధి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డెప్యూటీ మేయర్ ఆనందయ్య, నాయకులు యువరాజ్, సుకుమార్, డీఎంకే కార్పొరేటర్లు, కార్యకర్తలు నల్ల చొక్కాలు ధరించి మౌన ఊరేగింపులో పాల్గొన్నారు.

బేళగొండపల్లిలో : తళి యూనియన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన డెంకణీకోట తాలూకా బేళగొండపల్లి గ్రామంలో కరుణానిధి వర్ధంతిని జరుపుకొన్నారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వై. ప్రకాష్ ముఖ్య అతిథిగా పాల్గొని కరుణానిధి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు.

సూళగిరిలో : సూళగిరిలో డీఎంకే పార్టీ యూనియన్ కార్యదర్శి భాగ్యరాజ్ నేతృత్వంలో కరుణానిధి వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంకే నాయకులు శ్రీనివాసన్, వీరారెడ్డి, అన్బుశేఖర్, షేక్‌రషీద్, భూషణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా సూళగిరి, కెలమంగలం, డెంకణీకోట, తళి, అంచెట్టి ప్రాంతాల్లో కరుణానిధికి నివాళులర్పించారు.

వ్యాపారవేత్తలతో మంత్రి కృష్ణ భైరేగౌడ సమావేశం

శివాజీనగర: రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని సింగపూర్ వ్యాపారవేత్తలకు మంత్రి కృష్ణభైరేగౌడ విజ్ఞప్తి చేశారు. సోమవారం వికాససౌధలో సింగపూర్‌కు చెందిన పెట్టుబడిదారులతో మంత్రి సమాలోచనలు జరిపారు. బెంగళూరుతో పాటు రాష్ట్రంలో కొన్ని నగరాల్లో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. అయితే సింగపూర్ ట్రాఫిక్ నిర్వహణ ఆదర్శనీయమైదని. బెంగళూరులోని ట్రాఫిక్ నిర్వహణపై పెట్టుబడి పెట్టవచ్చు. ప్రభుత్వం పెట్టుబడిదారులకు అన్ని విధాల సహకారం కల్పించనుందని భరోసానిచ్చారు. కర్ణాటకలో పెట్టుబడులు పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని వ్యాపారవేత్తలు తెలిపారు.

క్లుప్తంగా...

గద్దర్ మృతికి సోనియాగాంధీ సంతాపం

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ పక్షాన గద్దర్ భార్యకు లేఖ

సాక్షి, హైదరాబాద్: ప్రజాగాయకుడు గద్దర్ మృతి పట్ల సోనియాగాంధీ సంతాపం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ హోదాలో సోమవారం గద్దర్ సతీమణి విమలారావుకు ఆమె సంతాపలేఖ రాశారు. 'సమాజంలోని అణగారిన వర్గాల పక్షాన వారి పోరాటాలకు ఊతమివ్వడంలో తన సాంస్కృతిక కళ ద్వారా గద్దర్ కీలకపాత్ర పోషించారు.' అని లేఖలో సోనియాగాంధీ పేర్కొన్నారు. గద్దర్ ప్రస్థానంలో విమలారావు క్రియాశీల పాత్ర పోషించారని, కష్టకాలంలో ఆ కుటుంబానికి అండగా ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

రీ సర్వేలో దూకుడు

1.10 లక్షల చదరపు కిలోమీటర్లలో పూర్తయిన డ్రోన్ సర్వే

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో భూముల రీ సర్వే నిర్దేశించిన లక్ష్యం కంటే వేగంగా సాగుతోంది. సర్వే పూర్తికి మూలాధారమైన డ్రోన్, ఏరియల్ సర్వే దాదాపు పూర్తికావచ్చింది. మొత్తం 13,460 రెవెన్యూ గ్రామాల పరిధిలో 1.20 లక్షల చదరపు కిలోమీటర్లను డ్రోన్లు, విమానాలతో కొలవాల్సి వుండగా ఇప్పటివరకు 12,461 గ్రామాల పరిధిలో 1.10 లక్షల చదరపు కిలోమీటర్లను సర్వే బృందాలు కొలిచాయి. ఇంకా 999 గ్రామాల పరిధిలో 10 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలోనే డ్రోన్ సర్వే చేయాల్సి ఉంది. అతి త్వరలో మిగిలిన ఈ స్వల్ప సర్వేను కూడా పూర్తిచేసేందుకు సర్వే, రెవెన్యూ శాఖలు నిర్విరామంగా పనిచేస్తున్నాయి. కాగా, రీ సర్వే అన్ని దశల్లో పూర్తయినట్లు ప్రకటించే నెంబర్-13 నోటిఫికేషన్లను 3,479 గ్రామాలకు జారీచేశారు. ఆయా గ్రామాల సచివాలయాల్లో ఈ నోటీసులను అంటించారు. వీటిలో 3,364 గ్రామాలకు సంబంధించిన తుది రికార్డులు కూడా అందుబాటులోకి వచ్చాయి.

సగం నిండిన శ్రీశైలం

862.37 అడుగుల వద్ద 113.45 టీఎంసీల నిల్వ

సాక్షి, అమరావతి/శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్ సగం నిండింది. సోమవారం రాత్రి 7 గంటలకు ప్రాజెక్ట్‌లోకి 44,853 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 862.37 అడుగుల్లో 113.35 టీఎంసీలకు చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్ట్ నిండాలంటే ఇంకా 102.46 టీఎంసీలు అవసరం. కృష్ణా బేసిన్‌లో చెదురుమదురు వర్షాలు కురుస్తుండటంతో ఎగువన వరద పెరిగింది. ఆల్మట్టిలోకి 70 వేల క్యూసెక్కులు చేరుతుండగా.. గేట్లు ఎత్తి అదే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. నారాయణపూర్ డ్యామ్‌లోకి 70 వేల క్యూసెక్కులు వస్తుండగా.. విద్యుదుత్పత్తి చేస్తూ గేట్లు ఎత్తి 63 వేల క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్ట్‌లోకి వరద పెరగడంతో సోమవారం మళ్లీ గేట్లు ఎత్తారు. గేట్లు ఎత్తి, విద్యుదుత్పత్తి చేస్తూ 56,796 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. తుంగభద్ర నదిలో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. ప్రస్తుతం తుంగభద్ర డ్యామ్‌లో 85.61 టీఎంసీలు నిల్వ ఉన్నాయి.


ఎన్నిచోట్ల జనసేన పోటీ చేస్తుందో త్వరలో ప్రకటిస్తాం

నాదెండ్ల మనోహర్



గుంటూరు ఎడ్యుకేషన్ : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్ని స్థానాల్లో జనసేన పోటీ చేస్తుందనే విషయాన్ని త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తామని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని జనసేన నగర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ విముక్త రాష్ట్రంగా ఏపీని నిలపడమే లక్ష్యంగా జనసేన పనిచేస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జనసేన పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను జనసేన పార్టీ తరఫున తెనాలి నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని చెప్పారు.

ఎస్పీ రిషాంత్‌రెడ్డి పనిచెబుతా: లోకేశ్



సాక్షి, నరసరావుపేట: పుంగనూరులో మారణహోమానికి తెలుగుదేశం పార్టీ పన్నిన కుట్రను భగ్నం చేసిన చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డిపై టీడీపీ నేత నారా లోకేశ్ మండిపడ్డారు. 'నేను రాసుకుంటున్న రెడ్‌బుక్‌లో మొదటి పేరు చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డిదే.. ఆయనో పనికిమాలిన ఐపీఎస్. అధికారంలోకి రాగానే ఆయన పని చెబుతా' అంటూ హెచ్చరించారు. యువగళం పాదయాత్ర సోమవారం సాయంత్రం 4 గంటలకు పల్నాడు జిల్లా కారంపూడి శివారులో ఏర్పాటు చేసిన క్యాంప్ నుంచి ప్రారంభమైంది. అనంతరం పట్టణంలోని వీర్లగుడి సెంటర్‌లో నిర్వహించిన సభలో లోకేశ్ మాట్లాడుతూ 'అధికార పార్టీకి సహకరిస్తున్న అధికారులపై న్యాయ విచారణ జరిపించి జైలుకు పంపిస్తాం. మాచర్లలో అభివృద్ధి నాలుగేళ్లుగా నిలిచిపోయింది. పిన్నెల్లి బ్రదర్స్ ప్రజలను దోచుకుంటున్నారు. అధికారంలోకి వచ్చాక మాచర్లను అభివృద్ధి చేసే బాధ్యత నాదే.' అని అన్నారు. అనంతరం పాదయాత్ర గురజాల నియోజకవర్గం జూలకల్లు శివారులో ముగిసింది.

గుండె బరువుతో పాటకు సెలవు..

అధికారిక లాంఛనాలతో గద్దర్ అంత్యక్రియలు

- బౌద్ధమత ఆచారం ప్రకారం సమాధి
- ప్రజా గాయకుడి పార్థివ దేహానికి నివాళి అర్పించిన తెలంగాణ సీఎం కేసీఆర్
- రాజకీయ, సినీరంగాల ప్రముఖులు, ప్రజా సంఘాల నేతలు, కళాకారుల నివాళి
- ఎల్‌బీ స్టేడియం నుంచి అల్వాల్ వరకు అంతిమయాత్ర
- భారీగా తరలివచ్చిన అభిమానుల నడుమ కన్నీటి వీడ్కోలు



భారీ జనసందోహం మధ్య గద్దర్ అంతిమయాత్ర

సాక్షి, హైదరాబాద్: ప్రజా యుద్ధనౌక ఇక సెలవంటూ తరలివెళ్లింది. తన పదునైన గళంతో.. ఉగ్రరూపం లూగించే పాటలతో అర్ధ శతాబ్దం పాటు యావత్ సమాజాన్ని ప్రభావితం చేసిన సాంస్కృతిక యోధుడు, ప్రజా గాయకుడు గద్దర్ అంత్యక్రియలు సోమవారం సాయంత్రం అల్వాల్ భూదేవి నగర్‌లో ఆయన స్థాపించిన మహాబోధి పాఠశాలలో ముగిశాయి. వేలాదిమంది అభిమానులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, కవులు, కళాకారులు, ప్రజా సంఘాలకు చెందిన ప్రతినిధులు, వివిధ రంగాల ప్రముఖులు, కుటుంబసభ్యులు, బంధువులు ఆయనకు కన్నీటి వీడ్కోలు పలికారు. తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో క్రియాశీలమైన భూమిక పోషించి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం తనవంతు కృషి చేసిన గద్దర్ అంత్యక్రియలను రాష్ట్ర ప్రభుత్వం అధికార లాంఛనాలతో నిర్వహించింది. బౌద్ధమత సంప్రదాయం ప్రకారం గద్దర్ తనయుడు సూర్య అంత్యక్రియల క్రతువు నిర్వహించారు. బౌద్ధమత గురువులు పంచశీల సూత్రాలను పఠించారు. అనంతరం గద్దర్ పార్థివదేహాన్ని సమాధి చేశారు. పోలీసులు గౌరవసూచకంగా గాల్లోకి కాల్పులు జరిపారు. అంతకుముందు ముఖ్యమంత్రి కేసీఆర్ భూదేవి నగర్‌లోని గద్దర్ నివాసానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి నివాళులర్పించారు. గద్దర్ భార్య విమలను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. మంత్రులు మహమూద్ అలీ, హరీశ్‌రావు, తలసాని తదితరులు సీఎం వెంట ఉన్నారు. పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు కూడా అల్వాల్‌లో గద్దర్ భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ, తెలంగాణ మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సబిత ఇంద్రారెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు దానం నాగేందర్, టి.రాజయ్య, జీవన్‌రెడ్డి, మంచు మోహన్‌బాబు, మనోజ్, అలీ, నాగబాబు, నిహారిక, పరుచూరి గోపాలకృష్ణ, ఆర్.నారాయణమూర్తి, ప్రొఫెసర్ కోదండరాం, జయప్రకాశ్ నారాయణ, తమ్మినేని వీరభద్రం, కూనంనేని సాంబశివరావు, జూలకంటి రంగారెడ్డి, అనగాని సత్యప్రసాద్, జనార్దన్, పరిటాల శ్రీరామ్, వివేక్, మోత్కుపల్లి నరసింహులు తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

అంత్యక్రియలకు ప్రముఖులు

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్, మా భూమి చిత్ర దర్శకుడు నర్సింగ్ రావు, ప్రముఖ సినీనటుడు ఆర్.నారాయణమూర్తి, జనశక్తి నేతలు కూర రాజన్న, అమర్, విమలక్క, ప్రజాకవి గోరటి వెంకన్న, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ తదితరులు గద్దర్ అంత్యక్రియలకు హాజరయ్యారు. గద్దర్ అంతిమయాత్ర మహాజన ప్రభంజనాన్ని తలపించింది. ఎల్‌బీ స్టేడియం నుంచి అల్వాల్ వరకు రహదారులు జనసందోహంతో పోటెత్తాయి. సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు ఎల్‌బీ స్టేడియం నుంచి ప్రారంభమైన అంతిమయాత్ర గన్‌పార్క్, ట్యాంక్‌బండ్ (అంబేడ్కర్ విగ్రహం), సికింద్రాబాద్ మీదుగా సాయంత్రం 4 గంటలకు అల్వాల్‌కు చేరుకుంది. వాహనానికి జై భీం జెండాలతో పాటు బుద్ధుడి పంచశీల జెండాలను ఏర్పాటు చేశారు. గన్‌పార్కులోని అమరవీరుల స్థూపం వద్ద కళాకారులు పాటలతో శ్రద్ధాంజలి ఘటించారు. గద్దర్‌ను చివరిసారి చూసేందుకు రోడ్డుకు ఇరువైపులా ప్రజలు బారులు తీరారు. ఎక్కడికక్కడ వాహనాన్ని నిలిపివేసి ఆయన భౌతికకాయానికి నమస్కరిస్తూ నివాళులర్పించారు.

ఎల్‌బీ స్టేడియంలో ఘన నివాళులు

ఎల్‌బీ స్టేడియంలో పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు, ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు గద్దర్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, జస్టిస్ ఎన్వీ రమణ, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, మాజీ మంత్రి జానారెడ్డి, టీఎస్‌ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

అంతిమయాత్రలో విషాదం

సియాసత్ మేనేజింగ్ ఎడిటర్ కన్నుమూత

గద్దర్ అంతిమయాత్ర సందర్భంగా విషాదం చోటుచేసుకుంది. సియాసత్ ఉర్దూ దినపత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ అలీఖాన్ (63) అల్వాల్‌లో గుండెపోటుకు గురై మరణించారు. గద్దర్‌కు సన్నిహితుడైన జహీరుద్దీన్ ఆదివారం నుంచి ఆయన భౌతికకాయం వద్దే ఉన్నారు. అదే క్రమంలో అల్వాల్‌లో అంత్యక్రియలకు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా అస్వస్థతకు గురికావడంతో వెంటనే సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.



గద్దర్ భౌతికదేహం వద్ద నివాళి అర్పించి ఆయన సతీమణి విమలను ఓదారుస్తున్న తెలంగాణ సీఎం కేసీఆర్



గద్దర్ భౌతిక దేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ

అందరివాడు గద్దర్

సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘ ఉద్యమ ప్రస్థానం..పీడిత వర్గాల తరఫున ప్రభుత్వాలను ప్రశ్నించిన గొంతు అది..పోలీసులు ఎక్కుపెట్టిన తుపాకులను సైతం లెక్క చేయక నిలబడి కొట్లాడిన గళం అది.. అయినాసరే గద్దర్ అజాత శత్రువుగానే బతికారు. ఉద్యమం అంటే ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిపే పోరాటం కాదని, ప్రజల హక్కులను కాపాడుకోవడం అని ఎన్నోసార్లు తన విధానాన్ని సుస్పష్టం చేశారు. తన వ్యవహార శైలితో సమాజంలోని అన్ని వర్గాలకు దగ్గరయ్యారు. రాజకీయ పార్టీలకతీతంగా ప్రముఖ నాయకులందరితోనూ సాన్నిహిత్యాన్ని సంపాదించారు. కళాకారుడిగా, రచయితగా సినీరంగంతోనూ ఆయన అనుబంధం కొనసాగింది. గద్దర్ మరణ వార్తతో అన్ని రంగాల ప్రముఖులు, సామాన్యుల నుంచి అన్ని వర్గాల వారు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఇక సోమవారం జరిగిన గద్దర్ అంతిమయాత్ర ఆసాంతం ఆయన వ్యక్తిత్వానికి అద్దం పట్టింది. 1972 నుంచి 2012 వరకు నాలుగు దశాబ్దాల విప్లవ ప్రస్థానంలో పీడిత ప్రజల పక్షాన నిలబడ్డ గద్దర్ తన పాటలతో ఎన్నో ఉద్యమాలకు ఊపిరిలూదారు. ఎప్పుడూ ప్రజల పక్షాన పోరాట గొంతుకగా నిలిచారు. నిక్కచ్చిగా మాట్లాడే తత్వమే గద్దర్‌కు ఎంతో మందిని దగ్గర చేసింది. మావోయిస్టు ఉద్యమాలకు దశాబ్దాలుగా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆయన అందించిన తోడ్పాటును గుర్తుచేస్తూ మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ ఓ లేఖ విడుదల చేసింది. గద్దర్ మృతి తమను తీవ్రంగా బాధించిందని పేర్కొంది. మరోవైపు ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ఎన్నో సందర్భాల్లో ప్రశ్నించిన ప్రజాయుద్ధ నౌక అంత్యక్రియలు రాష్ట్ర ప్రభుత్వమే అధికార లాంఛనాలతో నిర్వహించింది. ఉద్యమ సమయంలో, అనేక ఎన్‌కౌంటర్ల సమయంలో పోలీసులతో ఎన్నో అంశాలపై కొట్లాడిన గద్దర్‌కు నివాళులర్పించేందుకు ఒకప్పటి ఎస్‌ఐబీ చీఫ్ సజ్జనార్ సైతం వచ్చారు. గద్దర్‌తో తన అనుబంధాన్ని ప్రత్యేకంగా గుర్తు చేసుకున్నారు. సినీ ప్రముఖులు సైతం సంతాపం తెలిపారు. ఆయన అభిమానులు, తోటి రచయితలు, అంతిమయాత్రలో పాదం కలిపారు. మావోయిస్టు ఉద్యమంతో దశాబ్దాలు గడిపిన గద్దర్‌కు చివరి గడియల్లో పోలీసు తుపాకులు గౌరవ వందనం సమర్పించడం..ఆయన అందరివాడన్న దానికి మరో నిదర్శనంగా నిలిచింది.

చంద్రబాబు హయాంలో గద్దర్ హత్యకు కుట్ర

- గద్దర్ మృతికి సంతాపం ప్రకటనలో మావోయిస్టు పార్టీ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: ప్రజా యుద్ధ నౌక గద్దర్‌పై గతంలో ఐదు రౌండ్లు కాల్పులు జరిగిన ఘటన వెనుక అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హస్తం ఉందన్న విషయం మరోమారు చర్చనీయాంశంగా మారింది. నాటి టీడీపీ ప్రభుత్వం ఎంతోమంది విప్లవకారులను క్రూరంగా హత్య చేయించిందన్న ఆరోపణలు ఉన్నాయి. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ బాహాటంగా ఈ విషయాలు పేర్కొనడం ఆ వాదనలకు మరింత బలం చేకూర్చినట్లయింది. ప్రజాగాయకుడు గద్దర్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా గద్దర్ మృతికి సంతాపంగా మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ సోమవారం ఓ లేఖను విడుదల చేశారు. అందులో గద్దర్‌తో మావోయిస్టు పార్టీ ఉద్యమానికి ఉన్న అనుబంధాన్ని ప్రస్తావిస్తూనే.. ఆయనపై కాల్పులు జరపడం ద్వారా చేసిన హత్యాయత్నం గురించి స్పష్టంగా పేర్కొన్నారు. 'చంద్రబాబు నేతృత్వంలో దోపిడీ పాలకవర్గ తెలుగుదేశం పార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉండగా విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి విప్లవ ప్రతిఘాతుక శక్తులతో నల్లదండు ముఠాలను పోలీసుల ద్వారా ఏర్పాటు చేశారు. ప్రజా సంఘాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్న అనేకమంది విప్లవకారులను నల్లదండు ముఠాలతో క్రూరంగా హత్యలు చేయించారు. అందులో భాగంగా 1997లో గద్దర్‌పై కూడా నల్లదండు ముఠా, పోలీసులు కలిసి కాల్పులు జరిపారు. ఐదు తూటాలు శరీరంలోకి దూసుకెళ్లినా గద్దర్ ప్రాణాలతో బయటపడ్డారు..' అని వివరించారు. తనపై జరిగిన కాల్పులకు సంబంధించి విచారణ పూర్తిచేసి దోషులను గుర్తించాలంటూ గద్దర్ ఎన్నో ఏళ్లపాటు ప్రభుత్వాలకు వినతిపత్రాలు ఇస్తూ వచ్చారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఓసారి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చి పాత సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ కూడా చంద్రబాబు నాయుడు ప్రభుత్వంలోనే తనపై హత్యకు కుట్ర జరిగిందని గద్దర్ చెప్పారు. చంద్రబాబునాయుడు ప్రభుత్వం ఒక స్పెషల్ టీంను పెట్టి దోషులను అతి త్వరలో పట్టుకుంటామని ప్రకటించినా అది జరగలేదని తెలిపారు. అంతకు ముందు సైతం గద్దర్ పలు వేదికలపై, మీడియా ఇంటర్వ్యూల్లో తనపై కాల్పుల వెనుక చంద్రబాబు ప్రభుత్వ కుట్ర ఉందని పేర్కొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్–టీచర్స్ సమావేశాలు

- పిల్లల ప్రగతిని తల్లిదండ్రులకు తెలిపేందుకే..
- ఎఫ్‌ఏ/ఎస్‌ఏ పరీక్షల అనంతరం నిర్వహణ
- 10న తొలి భేటీ



సాక్షి, అమరావతి: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ప్రగతి, తరగతిలో వారి పరిస్థితిని తల్లిదండ్రులకు తెలిపేందుకు పేరెంట్స్–టీచర్స్ సమావేశాలు నిర్వహించాలని పాఠశాల విద్యా శాఖ నిర్ణయించింది. ఇకపై ఫార్మేటివ్, సమ్మేటివ్ అసెస్‌మెంట్స్ అనంతరం తప్పనిసరిగా ఆయా పాఠశాలల్లో ఈ భేటీలను ఏర్పాటు చేయనుంది. ఇందులో భాగంగా తొలి సమావేశాన్ని ఈ నెల 10న నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చింది. అలాగే షెడ్యూల్‌నూ ఖరారు చేసింది. ఇటీవల విజయవాడలో పాఠశాల విద్యాశాఖ, అనుబంధ విభాగాల ఉన్నతాధికారులు, ఆర్జేడీలు, డీఈవోలు, సబ్జెక్టు నిపుణులు, ఉత్తమ ఉపాధ్యాయులు సదస్సు నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్యకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న నేపథ్యంలో విద్యార్థుల్లో వచ్చిన విద్యావిషయక మార్పులను, సాధించిన పురోగతిని ఉపాధ్యాయులే నేరుగా పిల్లల తల్లిదండ్రులకు వివరించాలని నిర్ణయించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సీబీఎస్ఈ విద్యా విధానం, ఇంగ్లిష్ మీడియం బోధన, టోఫెల్ పరీక్షల నిర్వహణ, పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనపైనా దృష్టిపెట్టారు. వీటిని సమర్థంగా అమలు చేయడంతో పాటు మెరుగైన ఫలితాలు సాధించాలంటే విద్యార్థుల తల్లిదండ్రుల భాగస్వామ్యం కూడా ఉండాలని నిర్ణయించారు.

పరీక్ష ముగిసిన వారం రోజుల్లో సమావేశం

ఫార్మేటివ్/ సమ్మేటివ్ అసెస్‌మెంట్స్ ముగిసిన వారం రోజుల్లోగా మూల్యాంకనం పూర్తిచేసి, అదే వారంలో అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా వారి పిల్లలు ఎలా చదువుతున్నారు? తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించనున్నారు. పేరెంట్స్ సలహాలు, సూచనలు కూడా తీసుకోనున్నారు. ఈ సమావేశాల ద్వారా బడిలో పిల్లలు ఎలా ఉంటున్నారో తల్లిదండ్రులకు, బడిబయట ఎలా ఉంటున్నారో ఉపాధ్యాయులకు తెలిసే అవకాశం ఉంటుంది. విద్యార్థులకు కూడా తమ అనుమానాలను, అపోహలను స్వేచ్ఛగా వ్యక్తం చేసేందుకు వీలు కల్పించారు.

పేరెంట్స్–టీచర్స్ సమావేశాలు ఇలా..

అసెస్‌మెంట్	తేదీ	సమావేశం
ఎఫ్‌ఏ 1	ఆగస్టు 1-4	ఆగస్టు 10న
ఎఫ్‌ఏ 2	అక్టోబర్ 3-6	అక్టోబర్ 13
ఎస్‌ఏ 1	నవంబర్ 4-10	నవంబర్ 17
ఎఫ్‌ఏ 3	జనవరి 3-6	జనవరి 8
ఎఫ్‌ఏ 4	ఫిబ్రవరి 23-27	మార్చి 6
పదో తరగతి ప్రీ ఫైనల్	ఫిబ్రవరి 23-29	మార్చి 6
ఎస్‌ఏ 2	ఏప్రిల్ 11-20	ఏప్రిల్ 23

బీసీలను అణచివేస్తున్న కేంద్రం

- హక్కుల సాధనే లక్ష్యంగా బీసీలు ఉద్యమించాలి
- ఏపీలో సామాజిక న్యాయం జరుగుతోంది
- జాతీయ ఓబీసీ మహాసభలో వక్తలు



జాతీయ ఓబీసీ మహాసభలో అభివాదం చేస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : దేశవ్యాప్తంగా 80 శాతం ఉన్న బీసీల అణచివేత దిశగా కేంద్రం వ్యవహరిస్తోందని, మండల్ సిఫార్సులను అమలు చేయడంలో దగా చేస్తోందని పలువురు వక్తలు, ఓబీసీ జాతీయ నేతలు ధ్వజమెత్తారు. బీసీల పట్ల కేంద్రం వైఖరిని వ్యతిరేకిస్తూ తిరుపతి మహతి కళాక్షేత్రంలో సోమవారం జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జాతీయ బీసీ కమిషన్ చైర్‌పర్సన్ హంసరాజ్ గంగారాం అహిర్, ఎంఐఎం పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, జాతీయ ఓబీసీ ఫెడరేషన్ అధ్యక్షుడు జస్టిస్ ఈశ్వరయ్య, తెలంగాణ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ అధ్యక్షుడు ప్రొఫెసర్ బబన్‌రావ్ తైవాడే, ప్రధాన కార్యదర్శి సచిన్ రాజూల్ ఖర్, బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, ప్రధాన కార్యదర్శి వండాడి వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. హంసరాజ్ గంగారాం అహిర్ మాట్లాడుతూ 75 ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో బీసీల అణచివేత ఇప్పటికీ కొనసాగడం దారుణమన్నారు. బీసీల హక్కులు యాచన కాదని, దేశ రాజకీయాలను శాసించే దిశగా ఓబీసీలు ఐక్యతతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు. ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ బీసీలు కోరుతున్న డిమాండ్లు న్యాయమైనవని, జనాభా ప్రాతిపదికన వారు అడుగుతున్న హక్కులను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే వారి డిమాండ్లు నెరవేర్చడంలో కేంద్రం విఫలమైందని విమర్శించారు. జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే మండల్ సిఫార్సులను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశంలో ఏపీ సీఎం వైఎస్ జగన్ బీసీలకు సామాజిక న్యాయం చేస్తున్నారని ప్రశంసించారు. ఏపీ క్యాబినెట్‌లో 17 మంది బీసీ, ఎస్సీ, ఎస్టీలకు మంత్రి పదవులిచ్చారని తెలిపారు. మొత్తం రాష్ట్రంలో 44 మంది ఎమ్మెల్సీల్లో 30 మంది బీసీలు ఉండటం గర్వకారణమని చెప్పారు.

ప్రాజెక్టులపై టీడీపీనే శ్రద్ధ పెట్టింది

- పట్టిసీమలో పోలవరంపై చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్



పోలవరం/ఏలూరు (ఆర్‌ఆర్‌పేట)/సాక్షి, రాజమహేంద్రవరం/దేవరపల్లి : ప్రాజెక్టులపై ఎక్కువ శ్రద్ధ పెట్టిన పార్టీ టీడీపీయేనని.. చింతలపూడి, పోలవరం ప్రాజెక్టులు పూర్తయితే రాష్ట్రం సస్యశ్యామలమవుతుందని టీడీపీ అధినేత చంద్రబాబు తెలిపారు. ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ గ్రామంలో సోమవారం ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తన హయాంలో జరిగిన పోలవరం పనులపై రైతులకు వివరించారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టు పూర్తికి కావాల్సిన అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. రూ.11,537 కోట్లు టీడీపీ ప్రభుత్వ హయాంలో ఖర్చుచేసి 72 శాతం పనులు పూర్తిచేశామన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రివర్స్ టెండరింగ్ అంటూ ప్రాజెక్టును నాశనం చేశారని ఆయన ఆరోపించారు. 22 నెలలు ప్రాజెక్టు పనులు చేయకపోవడంవల్ల డయాఫ్రమ్‌వాల్ దెబ్బతిందన్నారు. తనపై అనేక అవినీతి ఆరోపణలు చేసినా ఒక్కదాన్ని కూడా నిరూపించలేకపోయారని తెలిపారు.

పోలవరం ప్రాజెక్టు పరిశీలన

అనంతరం.. చంద్రబాబు ప్రాజెక్టు ప్రాంతానికి కాన్వాయ్‌తో వెళ్లారు. ముందుగా అనుమతించిన మేరకు మాత్రమే వెళ్లాలని పోలీసులు చెప్పినప్పటికీ టీడీపీ శ్రేణులు వినకపోవడంతో వీరి మధ్య వాగ్వాదం జరిగింది. చంద్రబాబు స్పిల్‌వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలను పరిశీలించి సెల్ఫీదిగారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ భవిష్యత్తులో పోలవరాన్ని జిల్లాగా ఏర్పాటుచేసి ముంపునకు గురయ్యే మండలాలన్నిటినీ ఆదుకుంటామని చెప్పారు. అంతకుముందు.. అన్నమయ్య, చిత్తూరు జిల్లాల నేతలు ఏలూరులో చంద్రబాబును కలిశారు. ఇటీవల పుంగనూరులో చంద్రబాబు పర్యటన సందర్భంగా పోలీసుల మీద జరిగిన దాడి ఘటనపై నమోదు చేసిన కేసుల గురించి వీరు చర్చించారు. కాగా, తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి బహిరంగ సభలో చంద్రబాబు ప్రసంగిస్తూ టీడీపీ అధికారంలోకి వస్తే ప్రపంచంలోని అన్ని కంపెనీలను మీ ఇంటి దగ్గరకే పేదరిక నిర్మూలనే తన ఆశయమన్నారు.

ప్రాజెక్టులపై చంద్రబాబు మొసలికన్నీరు

రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



పొదలకూరు: వ్యవసాయం దండగ.. ప్రాజెక్టులు నిర్మిస్తే ఎలాంటి రాబడి ఉండదు.. అని చెప్పిన మాజీ సీఎం చంద్రబాబు.. ఇప్పుడు ప్రాజెక్టుల నిర్మాణంపై మొసలి కన్నీరు కారుస్తున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ధ్వజమెత్తారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా పొదలకూరులో సోమవారం జరిగిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. 14 ఏళ్లు సీఎంగా పనిచేసిన చంద్రబాబు ప్రాజెక్టులను ఎందుకు పూర్తిచేయలేదో రైతులకు చెప్పాలన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు జిల్లాలో ఏ ప్రాజెక్టు పూర్తిచేసి ఎంత ఆయకట్టుకు నీరిచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు జిల్లాకు వచ్చి మైకేల్‌జాక్సన్ లెవల్లో నిలబడి కర్ర ఒకటి తీసుకుని ప్రాజెక్టులపై ఉపన్యాసం ఇచ్చారని, మధ్యలో కల్పించుకున్న మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి గాలితీశారని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్లే రైతులు ఎంతో నష్టపోయారని చెప్పారు. జిల్లాలో 80 శాతం ప్రాజెక్టులు పూర్తిచేశానంటూ చంద్రబాబు సిగ్గులేకుండా చెప్పారన్నారు. నెల్లూరు, సంగం బ్యారేజీలను తమ ప్రభుత్వం పూర్తిచేసి రైతులకు సాగునీరు ఇస్తోందని గుర్తుచేశారు. సమగ్ర సోమశిల లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ అభివృద్ధి పనులు చేయిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నీరు–చెట్టు పేరుతో టీడీపీ కార్యకర్తలకు దోచిపెట్టిన చంద్రబాబు.. ఆ పథకాన్ని తీసుకొచ్చిందే టీడీపీ కార్యకర్తల కోసమని చెప్పారని గుర్తుచేశారు. పేదలకు భూములు పంపిణీ చేస్తే ఆయనకు నచ్చడం లేదని, న్యాయస్థానాలకు వెళ్లి అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. కనుచూపు మేరలో గెలుపు అన్నదే కనిపించక చంద్రబాబు ఫ్రస్టేషన్‌తో మాట్లాడుతున్నారని చెప్పారు. చంద్రబాబు రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చేందుకు చూస్తున్నారని, నాయకులకు, ప్రజలకు రక్షణ కల్పించే పోలీసులపై టీడీపీ కార్యకర్తల ద్వారా దాడులు చేయిస్తున్నారని విమర్శించారు. ఇంత నీచ సంస్కృతి కలిగిన నాయకుడు దేశంలో ఎక్కడా ఉండరన్నారు. చంద్రబాబు పేదల అభివృద్ధిని అడ్డుకునే సైంధవుడిగా మారారని మంత్రి దుయ్యబట్టారు.

ప్రాజెక్టులు నిర్మించే సత్తా బాబుకు లేదు: కొడాలి నాని



గుడివాడ టౌన్: ప్రాజెక్టులను నిర్మించే సత్తా చంద్రబాబుకు లేదని, వాటిని పరిశీలించే అర్హత అంతకన్నా లేదని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) విమర్శించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఒక్క డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి మాత్రమే రాష్ట్రంలో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టారని తెలిపారు. వైఎస్ పోలవరం కాలువలు తవ్విస్తుంటే చంద్రబాబు ఆయన చెంచాగాడైన దేవినేని ఉమాతో కోర్టులో కేసులు వేయించి అడ్డుకున్నారని విమర్శించారు. అప్పట్లో ఎకరా రూ.6 లక్షలకు ప్రభుత్వం కొంటే, చంద్రబాబు అధికారంలోకి వచ్చాక ఎకరా రూ.50 లక్షలకు కొని, కమీషన్లు దండుకున్నారని చెప్పారు. 14 ఏళ్లు సీఎంగా చేసిన ఈ చవట దద్దమ్మ ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి చెయ్యలేదని, ఇప్పుడు అధికారం ఇస్తే ప్రాజెక్టులను పూర్తి చేస్తాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. చంద్రబాబు చేతకానితనం వల్లే పోలవరం ప్రాజెక్టును పూర్తి చెయ్యడం ఇప్పటికీ ఇబ్బందిగా మారిందన్నారు.

నోమాడ్ హిజాబీ రైడర్

ఇట్టే వస్తా, రానీ వెంటా
నీ బుల్లెట్టు బండెక్కి వచ్చేత్తా పా
డుగ్గు డుగ్గు డుగ్గు డుగ్గనీ
అందాల దునియానే సూపిత్త పా
చిక్కు చిక్కు చిక్కు చిక్కుబుక్కనీ.. పాడుతూ,
డ్యాన్స్ చేస్తూ, బైక్ ఎక్కే రోజుల నుంచి
గేర్లమీద గేర్లు మార్చుకుంటూ
రయ్యన దూసుకెళ్తున్నారు నేటి తరం అమ్మాయిలు.
సెల్ఫ్‌తో బండిని స్టార్ట్‌చేసి సుదూర ప్రాంతాలకు సోలోగా రైడ్ చేస్తూ దునియాని చుట్టేస్తూ ఆస్వాదిస్తున్నారు.
ఒక్కొక్కరు ఒక్కో రీతిలో రైడింగ్ చేస్తుంటే... మరింత ప్రత్యేకంగా హిజాబ్ ధరించి జాతీయ రహదారులే కాదండోయ్ దేశాలు దాటి మక్కా దాక బుల్లెట్ మీదే వెళ్తానంటోంది ముప్పై ఏళ్ల **నూర్ బీ.**



● నూర్ బీ

చెన్నైలోని పల్లవరానికి చెందిన అమ్మాయి నూర్‌బీ. సంప్రదాయ కుటుంబంలో పుట్టి పెరిగిన అమ్మాయి. ఇది చేయకు! అది చేయకు! అలా ఉండకు! ఇలా ఉండాలి! అంటూ ఎన్నో నిబంధనలు. అడుగు తీసి అడుగు వేయాలంటే ఆలోచించాలి. అయినా నూర్ బీకి మాత్రం బైక్ నడపడం అంటే ఎంతో ఇష్టం. ఆ ఇంట్లో అమ్మాయిలు బైక్‌లు అస్సలు నడప కూడదు. అయినా తన ఇష్టాన్ని మాత్రం వదులుకో లేదు. కాలేజీలో ఉండగానే మోటర్ సైకిల్ కొనుక్కోవాలనుకునేది. చదువు పూర్తయ్యాక బెంగళూరులోని ఐటీ కంపెనీలో హెచ్‌ఆర్ ఉద్యోగం వచ్చింది. నెలనెలా వచ్చే జీతంలో కొంత మొత్తాన్ని బండి కొనుక్కోవడానికి దాచుకునేది. ఇలా జమ చేసిన డబ్బులతో 2021లో రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350 మోడల్‌ను కొనుక్కుంది. బండి కొన్న వెంటనే ఉద్యోగం మానేసి రైడింగ్ షురూ చేసింది.

ఫస్ట్ రైడ్...

ఎన్నాళ్లుగానో వేచిచూస్తోన్న క్షణాలు వచ్చేశాయి. వెంటనే రైడింగ్‌కు ప్రణాళిక రూపొందించుకుంది నూర్. 2021 నవంబర్ 14 తొలి రైడింగ్ గేర్‌ను స్టార్ట్ చేసింది. ఈ రైడ్ గురించి కుటుంబ సభ్యులకు చెప్పలేదు. బెంగళూరు నుంచి మహారాష్ట్ర, డామన్ డయ్యూ, గుజరాత్, రాజస్థాన్ మీదుగా ఢిల్లీ చేరుకుంది. తల్లిదండ్రులకు చెప్పకుండా రహస్యంగా ఉంచినప్పటికీ మహారాష్ట్రలోని లోనావాలకు చేరుకునేటప్పటికి విషయం ఇంట్లో వాళ్లకు తెలిసింది. అయినా ఏమాత్రం వెనక్కి తగ్గలేదు నూర్. ఐదున్నర అడుగుల ఎత్తున్న నూర్ హిజాబ్ ధరించి బుల్లెట్ బండి మీద డుగ్గు డుగ్గు అని వెళ్తుంటే ఆమెను అంతా ఆసక్తిగా చూసేవారు. ఆ చూపులు నూర్‌కు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చేవి.

ఈసడింపులు, యాక్సిడెంట్ ఎదురైనప్పటికీ...

ప్రపంచం రోజురోజుకీ అప్‌డేట్ అవుతున్నప్పటికీ కొంతమంది ఇంకా 'అమ్మాయి ఏంటీ ఇలా చేస్తోంది? ఇదేం విడ్డూరం?' అని నోరు వెళ్లబెట్టిన వాళ్ల ఈసడింపులు నూర్‌కూ ఎదురయ్యాయి. అయినప్పటికీ రోడ్డు మీద గేర్‌లు మారుస్తూపోతూనే ఉంది. తన రైడ్‌ను ఎక్కడా ఆపలేదు. ఇదే దూకుడుతో... ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో ప్రయాణిస్తూ నేపాల్‌కు వెళ్లాలనుకుంది. బిహార్ సరిహద్దులోకి రాగానే చిన్న యాక్సిడెంట్ జరిగి రైడింగ్‌ను మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. అప్పుడు తన మోటర్ సైకిల్‌ను ట్రైన్‌లో చెన్నై పంపించాల్సిన పరిస్థితి. చాలా బాధ వేసింది. అయినా తప్పలేదు. 2022 మేలో యాక్సిడెంట్ అయితే జూలైలో కోలుకుని బెంగళూరు వచ్చేసింది. ఇంక బండిని అమ్మేయమని అంతా చెప్పారు. అయినప్పటికీ నూర్ రైడింగ్ ఆపలేదు. జాతీయ రహదారులేగాక అంతర్జాతీయ రహదారులపై రైడింగ్ చేస్తాను అంటోంది. వచ్చే సంవత్సరం బెంగళూరు నుంచి మక్కా, సౌదీ అరేబియా కూడా వెళ్తానని చెబుతోంది.



మనకంటూ కొన్ని రూల్స్ పెట్టుకోవాలి...

''నేను నోమాడ్ హిజాబీ రైడర్‌ని. దక్షిణ భారత దేశం నుంచి తొలి సోలోరైడర్‌ని నేనే అవుతాను. ఉత్తర భారతదేశంలోని గురుద్వారాలు, గుళ్లు, ఆశ్రమవాసులు నా మతం వేరైనప్పటికీ ప్రేమగా భోజన, వసతి సదుపాయాలను కల్పించేవారు. కొన్ని సేఫ్టీరూల్స్ పాటిస్తే తక్కువ బడ్జెట్‌లో ట్రిప్స్‌ను విజయవంతంగా పూర్తిచేయవచ్చు. సాయంత్రం ఐదు తరువాత ఎటువంటి రైడింగ్ చేయను. తెలియని వ్యక్తులతో అస్సలు మాట్లాడను.పెట్రోల్ బంకులు, ప్రార్థనా స్థలాలు, ఆశ్రమాల్లో రాత్రుళ్లు బస చేస్తూ, ఉదయం రైడింగ్ చేస్తున్నాను. ఈ స్పీడుతో మక్కాను చేరుకుంటాను ''అని నూర్‌బీ ధీమా వ్యక్తం చేస్తోంది.

సవాల్ అని తెలిసీ ఎంచుకున్నాను..

'అమ్మాయిలు పోస్ట్‌మార్టం చేయలేరు' ఈ అపోహ తప్పని నిరూపిస్తున్నారు ఈ రంగంలోకి వస్తున్న యువ డాక్టర్లు. నాలుగేళ్లలో వెయ్యికి పైగా మృతదేహాలకు పోస్ట్‌మార్టం చేసి, అమ్మాయిలూ చేయగలరు అని నిరూపిస్తున్నారు కర్ణాటకలోని కార్వార్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ **డాక్టర్ మహాలక్ష్మి**



● మెడికల్ స్టూడెంట్స్‌తో...

మన దేశంలో మొట్టమొదటి ఫోరెన్సిక్ సైంటిస్ట్‌గా డాక్టర్ రుక్మిణీ కృష్ణమూర్తి వార్తల్లో నిలిచారు. ముంబయ్‌లోని ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీలో 1974లో చేరిన ఆమె రిటైర్ అయ్యేంతవరకు వర్క్ చేశారు. ఆమె స్ఫూర్తితో ఆ తర్వాత ఈ రంగంవైపు ఆసక్తి చూపినవాళ్లు ఉన్నారు. కానీ, వేళ్లమీద లెక్కించదగిన సంఖ్యలోనే ఉన్నారు.

అనారోగ్యంతో ఉన్నవారిని చూడటం సాధారణం. కానీ, కాలిపోయిన శరీరాలు, ప్రమాదాలలో ఛిద్రమైన శరీరాలు, నీటిలో మునిగిపోయిన శరీరాలు చూడటం సాధారణం కాదు. విషం కారణంగా శరీరం నీలం రంగులోకి మారడం లేదా ఆత్మహత్య కారణంగా మృతదేహాలను చూడటం మరింత బాధాకరం. సున్నితమనస్కులైన మహిళలు ఈ ఛాలెంజ్‌ను స్వీకరించలేరనేది అందరూ అనుకునేమాట. అయితే, ఈ వృత్తిని తాను ఛాలెంజింగ్‌గా తీసుకున్నానని చెబుతున్నారు డాక్టర్ మహాలక్ష్మి.

చదువుకునే రోజుల్లో...

''అమ్మానాన్నలకు ఐదుగురం ఆడపిల్లలం. అందులో ముగ్గురం డాక్టర్లమే. ఒక అక్క డెంటిస్ట్, మరొకరు ఆయుర్వేద డాక్టర్. వాళ్లని చూసే నేనూ డాక్టర్ కావాలని కల కన్నాను. ఆయుర్వేద వైద్యురాలైన మా అక్క ఫోరెన్సిక్ డాక్టర్ కావాలనుకుంది. కానీ, తను ఆ దారిలో వెళ్లలేకపోయింది. నేను ఈ టాపిక్‌ను ఎంచుకున్నప్పుడు మా అక్క ఎంతో సపోర్టునిచ్చింది. మా నాన్న ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేసేవారు. అమ్మ గృహిణి. మా ఇంట్లో ఎప్పుడూ చదువుకే ప్రాధాన్యత ఉండేది.

రిస్క్ ఎందుకు అన్నారు..

చదువుకునే రోజుల్లో సీఐడీ సీరియల్ చూసేదాన్ని. అందులో ఫోరెన్సిక్ విభాగం నాకు చాలా ఆసక్తిగా అనిపించేది. ఎంబీబీఎస్ రెండో సంవత్సరంలోనే ఫోరెన్సిక్‌కు సంబంధించిన సమాచారం తెలుసుకోవడం మొదలుపెట్టాను. మా ప్రొఫెసర్లు కూడా నాకు ఆ విభాగానికి సంబంధించిన సమాచారాన్ని, నేర కథనాలను వివరించేవారు. ఇందుకు సంబంధించిన నవలలు కూడా చదివాను. మా క్లాస్‌మేట్ అబ్బాయిలు మాత్రం 'ఈ విభాగం వద్దు, అమ్మాయివి ఎందుకు రిస్క్. ఇది కేవలం మార్చురీ గురించి మాత్రమే కాదు, సాక్ష్యం కోసం కోర్టుకు వెళ్లాల్సి ఉంటుంది. పోలీసులతో కలిసి పనిచేయాలి. రాత్రి, పగలు ఎప్పుడు అవసరమున్నా చురుగ్గా పనిచేయాలి. లేడీస్‌కి అంత సులభం కాదు' అన్నారు. 'మా నాన్నగారు కూడా పెళ్లై, సంప్రదాయ కుటుంబంలోకి వెళితే ఇబ్బందులుగా మారతాయి' అన్నారు. కానీ, ఒక కేసు దర్యాప్తులో ఫోరెన్సిక్ నిపుణుల పాత్ర చాలా ముఖ్యం అని నాకు తెలుసు. ఈ ఫీల్డ్‌లో ఛాలెంజెస్ ఎక్కువ. నేను చేయగలను అని భావించే ఈ విభాగంలోకి వచ్చాను. ఇప్పుడు నా నిర్ణయాన్ని అంతా సమర్థిస్తున్నారు'' అని వివరించారు ఈ ఫోరెన్సిక్ డాక్టర్.



● డాక్టర్ మహాలక్ష్మి

అనేక పరిశోధనలు..

మేల్ డామినేటెడ్ వృత్తిలో ఎలా చోటు సంపాదించుకున్నావని నన్ను చాలామంది అడుగుతుంటారు. సవాళ్లు అంటే ఇష్టం అని చెబుతుంటాను. నేను పుట్టి పెరిగింది కర్ణాటకలోని ధార్వాడ్ జిల్లాలోని హుబ్లి నగరం. ప్రాథమిక విద్య వరకు బెల్గాంలో చదివాను. ఆ తర్వాత కాలేజీ చదువంతా హుబ్లిలోనే. 2007 నుండి 2017 మధ్యన బెల్గాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ నుండి ఎంబీబీఎస్ పూర్తి చేశాను. ఏడాది పాటు గ్రామీణ ప్రజలకు సేవ చేశాను. 2020లో ఫోరెన్సిక్ విభాగంలో చేరాను. అప్పటి నుండి అనేక పరిశోధనలను ఫోరెన్సిక్ నిపుణుల బృందంతో కలిసి పనిచేశాను. మెడికల్ స్టూడెంట్స్‌కు క్లాసులు తీసుకుంటున్నాను. ఈ విభాగంలో గోల్డ్ మెడల్ వచ్చింది.

– డాక్టర్ మహాలక్ష్మి

బ్యూటిప్స్

మచ్చలు తగ్గాలంటే...

కళ్ల కింద లేదా మోచేతుల భాగంలో నలుపు కనిపిస్తుంటుంది. ఈ సమస్య నివారణకు...



● టీ స్పూన్ నిమ్మ రసంలో స్పూన్ నీళ్లు వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంలో దూది ఉండను ముంచి చర్మం మీద రాయాలి. ఆరిన తర్వాత కడిగేయాలి. రోజూ ఈ విధంగా చేయడం వల్ల నలుపు తగ్గుతుంది.



● రోజ్‌వాటర్‌లో దూది ఉండను ముంచి. నలుపు ఉన్న చోట రాయాలి. అలాగే శనగపిండిలో కొన్ని చుక్కల రోజ్‌వాటర్ పోసి, పేస్ట్ చేసి రాయాలి. ఈ విధంగా రోజూ చేయాలి.



● అవకాడో పండును గుజ్జు చేయాలి. ఈ గుజ్జును కళ్లకింద ముఖమంతా రాసి, ఆరిన తర్వాత శుభ్రపరుచుకోవచ్చు, అవకాడోలో ఉన్న సహజ ఔషధ గుణం చర్మం పిగ్మెంటేషన్‌ను తగ్గిస్తుంది.

సాగుబడి
అశ్లేష కార్తె: ఆగస్టు 4 నుంచి

గుళి రాగి భళా!

● విత్తనాలు వెదజల్లకుండా నారు పెంచి, మొక్కలు నాటే 'గుళి' పద్ధతిలో రాగి సాగులో సత్ఫలితాలు
● ప్రకృతి సేద్యంలో ఎకరానికి 14-18 క్వింటాళ్ల దిగుబడి
● గుళి పద్ధతిలోనే రాగులతో పాటు సామలు, కొర్రలు కూడా

ఉత్తరాంధ్ర ప్రకృతి వ్యవసాయదారులు రాగులు, సామలు, కొర్రలు వంటి చిరుధాన్యాల సాగును దేశీ రకాలతోనే కొత్తపుంతలు తొక్కిస్తున్నారు. వెదజల్లే పద్ధతికి స్వస్తి చెప్పి.. నారు పెంచి మొక్కవేసే పద్ధతిలో ఒకటి, రెండు తడులతో సాగు చేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. దీన్నే 'గుళి పద్ధతి' అని పిలుస్తున్నారు.



గుళి రాగి సాగు పద్ధతిలో రాగి మొక్కలు బాగా దుబ్బు కట్టి అధిక దిగుబడినిస్తాయి. ఎక్కువ పిలకలు కట్టిన రాగి దుబ్బులను చూపుతున్న రైతులు

'గుళి' పద్ధతి అంటే?

గుళి అంటే కన్నడంలో గొయ్యి లేక గుంత అని అర్థం. గుంత తీసి రాగి మొక్క నాటుతారు కాబట్టి గుళి రాగి పద్ధతి అని పేరొచ్చిందని ఈ పద్ధతిని గత కొన్ని ఏళ్లుగా ప్రాచుర్యంలోకి తెస్తున్న సంజీవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు, ఏపీ రైతు సాధికార సంస్థ స్టేట్ రిసోర్స్‌పర్సన్ పచారి దేవుళ్లు 'సాక్షి సాగుబడి'కి తెలిపారు. గుళి రాగిని ఉత్తరాంధ్ర జిల్లాల రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో విస్తృతంగా సాగు చేస్తూ ఎకరానికి 14–18 క్వింటాళ్ల దిగుబడి పొందుతుండటం విశేషం. రాగులతో పాటు సామలు, కొర్రలను కూడా దేశీ వంగడాలతోనే గుళి పద్ధతిలో సాగు చేస్తున్నామని ఆయన వివరించారు. గుళి రాగి ప్రకృతి సేద్య పద్ధతి విశేషాలు ఆయన మాటల్లోనే..

11-18 రోజుల నారు..

విత్తనాలు వెదజల్లే పద్ధతిలో కన్నా నారు పోసి, మొక్క నాటే గుళి పద్ధతిలో చోడి (రాగులు) సాగులో దేశీ విత్తనాలు వాడితే మంచిది. ఉత్తరాంధ్రలో పెద్దచోడి, ముద్దచోడి రకాలు విరివిగా సాగులో ఉన్నాయి. ఎత్తుమడిని తయారు చేసుకొని బీజామృతంతో విత్తనశుద్ధి చేసి నారు మడి పోసుకోవాలి. 40 చదరపు అడుగుల నారు మడికి అర కేజీ విత్తనం సరిపోతుంది.

వారం రోజుల వ్యవధిలో వేర్వేరుగా రెండు నారు మడుల్లో నారు పోసుకోవాలి. దీని వల్ల వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా సరైన వయసు ఉన్న నారు అందుబాటులో ఉంటుంది. 11 నుంచి 18 రోజుల నారును మాత్రమే నాటుకోవాలి. రైతులు కొంతమంది కలసి ఒక చోట నారు మడులు వేసుకుంటే నారుమళ్ల నిర్వహణ సులభం అవుతుంది.

భూమిని 4 సార్లు బాగా కలియదున్ని ప్రధాన పొలాన్ని మొక్కవేతకు సిద్ధం చేయాలి. ఒక వైపు లోతుగా సాలు వచ్చే విధంగా చూసుకోవాలి. చివరి దుక్కిలో పశువుల ఎరువు లేదా ఘనజీవామృతం వేసి బాగా కలియదున్నాలి. వరుసల మధ్య, మొక్కల మధ్య ఒక అడుగు దూరం ఉండేలా తాడు లేదా మార్కర్ సహాయంతో మార్కింగ్ ఇచ్చుకొని నారు మొక్కలు నాటాలి.



రాగి నారు మడులు



వరుసల్లో రాగి నాట్లేస్తున్న మహిళలు



గుళి రాగి పంటకు 1,2 తడులు చాలు

గుళి రాగిలో అంతర పంటలు

గుళి రాగిలో అంతర పంటలు సాగు చేసుకోవాలి. 6 వరుసలు రాగి, 2 వరుసలు కంది/మొక్కజొన్న/ నువ్వులు వేసుకోవచ్చు. గుళిరాగిలో టమోటా, బీర, గోంగూరలను కూడా అంతర పంటలుగా వేసుకోవచ్చు.

మొక్క నాటిన 15 రోజులకు మొదటి విడత కలుపు తీయాలి. సైకిల్ వీడర్ ఉపయోగించి కలుపు తీసుకోవచ్చు. ఎద్దులున్న వారు ప్రతి 15 రోజులకు ఒక సారి కలుపు నివారించవచ్చు. కలుపు తీసిన ప్రతీసారీ పంటపై ద్రవజీవామృతం పిచికారీ చేయాలి. వర్షాలను బట్టి పంట కాలంలో అవసరం మేరకు రెండు లేదా మూడు సార్లు రక్షక తడులు ఇవ్వాలి.

రెట్టింపు దిగుబడి

గుళి రాగిని ఏక పంటగా, అంతర పంటలు, 365 రోజులు పంటలు సాగు చేసే పద్ధతిలో కూడా సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో అల్లూరి సీతారామరాజు, మన్యం జిల్లాల్లో వేస్తారు. శ్రీకాకుళం, విజయనగరం, అనకాపల్లి, కాకినాడ జిల్లాలో రబీలో ఎక్కువ మంది రైతులు వేస్తారు. ఒక్క అల్లూరి సీతారామ రాజు జిల్లాలోనే 4 వేల మంది రైతులు 3 వేల ఎకరాల్లో గుళి రాగి సాగు చేస్తున్నారు. లోకల్ రకాలైన పెద్దచోడి, పెద్ద సామ, బండకొర్ర రకాలు గుళ్లి పద్ధతిలో ఎక్కువ దిగుబడి వస్తున్నది. గుళి రాగిని ఉత్తరాంధ్ర జిల్లాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసి ఎకరానికి 14-18 క్వింటాళ్ల దిగుబడి పొందుతున్నారు. విత్తనం వెద పెట్టినప్పటి కన్నా దిగుబడి రెట్టింపయ్యింది. వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు కూడా ఈ దిగుబడులను నమోదు చేశారు.



- పచారి దేవుళ్ళు
(94401 19789),
స్టేట్ రిసోర్స్‌పర్సన్,
ఏపీ రైతు సాధికార సంస్థ,
ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్సిటీ బోర్డు సభ్యుడు.

గుళి రాగి సాగులో ప్రధానాంశాలు:

● బీజామృతంతో విత్తన శుద్ధి చేయాలి ● చివరి దుక్కిలో/ గుంతలో ఎరువు వేయాలి ● 11 నుంచి 18 రోజుల వయసు గల నారు నాటాలి ● సైకిల్ వీడర్ లేదా పశువులను ఉపయోగించి కలుపు తీయాలి ● కలుపు తీసిన తరువాత ప్రతి మొక్క వంగేలా దుంగను మొక్కలపై నుంచి లాగటం అవసరం ● కలుపు తీసిన ప్రతి సారీ ద్రవజీవామృతం పిచికారీ చేయాలి ● నేలలో తేమ ఆరిపోతే అవసరం మేరకు రక్షక తడులు ఇవ్వటం ● పురుగులు/తెగుళ్ళ నివారణకు నీమాస్త్రం, అగ్ని అస్త్రం వంటి కషాయాలు పిచికారీ చేయాలి ● ఇలా గుళి రాగి సాగు చేస్తే ఎకరానికి 14 నుంచి 18 క్వింటాళ్ళ రాగుల దిగుబడి సాధించవచ్చు.

12న జహీరాబాద్‌లో సాగుచేయని పంటల ప్రదర్శన

ఆకుకూరల్లో విత్తనం చల్లి సాగు చేసే రకాలు కొన్నయితే, వాటంతట అవే మొలిచేవి(అన్‌కల్టివేటెడ్ గ్రీన్స్) మరికొన్ని. ఈ కోవ కిందకు వచ్చేవే దొగ్గలి కూర, బచ్చలి కూర, జొన్నచెంచెలి కూర, బంకంటి కూర.. ఇంకా మరెన్నో. పోషక విలువలను అందించటంలో ఈ సాగు చేయని ఆకుకూరలు మామూలు ఆకుకూరలకు ఏమాత్రం తీసిపోవు. ఈ పంటలను ప్రచారంలోకి తేవడం కోసం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లోని డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రతి ఏటా నిర్వహించినట్లే ఈ ఏడాది కూడా ఆగస్టు 12(శనివారం)న 'అన్‌కల్టివేటెడ్ గ్రీన్స్ ఫెస్టివల్'ను నిర్వహిస్తోంది. మిల్లెట్ సోదరీమణుల పర్యావరణ వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, 30కి పైగా సంప్రదాయ ఆకుకూరల రకాల ప్రదర్శనను చూడవచ్చు. వీటి రుచులతో కూడిన మిల్లెట్ లంచ్ విందులో పాల్గొనవచ్చు. హైదరాబాద్ నుంచి వంద కి.మీ. దూరంలోని జహీరాబాద్ సమీపంలోని మహిళల పొలాల్లో ఈ కార్యక్రమం జరగనుంది. ఆగస్టు 10 లోగా ముందస్తు పేర్ల నమోదు తప్పనిసరి. వివరాలకు.. 040 27764577.

సేద్యం కన్నా ఆక్వా మిన్న

● చేపల హేచరీ రంగంలో విశేష కృషి చేసిన ఒడిశాకు చెందిన ఆక్వా రైతు శాస్త్రవేత్త
● రెండేళ్ల క్రితం పద్మశ్రీ పురస్కారం అందుకున్న సాహు

వ్యవసాయంలో కన్నా చేపల పెంపకం లాభదాయకంగా ఉందంటారు ఆక్వా రంగంలో ప్రసిద్ధుడైన బటక్రుష్ణ సాహు. ఒడిశాలోని ఖుర్దా జిల్లాలో పుట్టిన 73 ఏళ్ల సాహూ 40 ఏళ్ల క్రితమే చేపల పెంపకాన్ని ప్రారంభించి సరికొత్త ప్రయోగాలు చేసి విజయం సాధించారు. ప్రముఖ ఆక్వా రైతు శాస్త్రవేత్తగా ఎదిగారు. ఒడిశాలో తొలి ప్రైవేట్ హేచరీని నెలకొల్పారు. రెండేళ్ల క్రితం పద్మశ్రీ పురస్కారాన్ని సైతం తీసుకున్నారు.

భువనేశ్వర్‌లోని కేంద్రీయ మంచినీటి ఆక్వాసాగు పరిశోధనా సంస్థ (సిఫా), కేవీకేలలో శిక్షణ పొందిన సాహు ఆక్వా సాగును కొత్తపుంతలు తొక్కించారు. చేపల పెంపకందారులు స్పాన్‌ల సేకరణ, శిక్షణతో పాటు మార్గదర్శకత్వం కోసం సాహును నిరంతరం సంప్రదిస్తూ ఉంటారు. ఆయన ఏడాదికి సుమారు వెయ్యి మంది రైతులకు శిక్షణ ఇస్తారు.

1986లో చేపల పెంపకంలోకి రావడానికి ముందు 15 ఎకరాల సొంత పొలంలో వరి సాగు చేసేవారు. అది పెద్దగా లాభదాయకంగా లేదని భావించి చేపల పెంపకం నేర్చుకున్నారు. తన గ్రామానికి సమీపంలోని పంచాయతీ చెరువును లీజుకు తీసుకుని చేపల పెంపకాన్ని ప్రారంభించి, ఏడాదిలో దాదాపు రూ. 24 వేల నికర లాభం సంపాదించారు. చేపల పెంపకంలో పట్టుసాధించిన తర్వాత చేపల స్పాన్ ఉత్పత్తిలోకి దిగారు. ఇందులో ఆదాయం ఎక్కువ కనిపించేసరికి మరిన్ని ప్రయోగాలు చేశారు. ప్రభుత్వ రుణం తీసుకొని ఐదు చెరువుల్లో చేపల పెంపకాన్ని, స్పాన్ ఉత్పత్తిని చేపట్టారు. 1997 వరకు హాపా టెక్నిక్‌తో చేపల స్పాన్ ఉత్పత్తి చేసిన ఆయన తర్వాత వృత్తాకార కృత్రిమ హేచరీ(చైనీస్ హేచరీ) పద్ధతిని అనుసరించారు.

1998లో వృత్తాకార హేచరీ ట్యాంకులు నిర్మించడం ప్రారంభించాను. వర్షాలు, బలమైన గాలులు, జంతువుల కారణంగా చెరువుల్లో వ్యవహారాలను పెద్దగా నియంత్రించలేం. కాబట్టి, చేపలను రక్షించడానికి వృత్తాకార హేచరీలను ఉపయోగించడం ప్రారంభించాను అన్నారాయన. ఇప్పుడు ఆయనకు 22 చెరువులు ఉన్నాయి.





చేపల హేచరీ చెరువుల వద్ద పద్మశ్రీ పురస్కార గ్రహీత సాహు

10 రకాల మంచినీటి చేపలపై దృష్టి కేంద్రీకరించి స్పాన్ ఉత్పత్తి చేపట్టారు. చేపల పెంపకంపై ఏటా వెయ్యి మంది రైతులకు శిక్షణా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. సాహు అత్యాధునిక సాంకేతికతలతో స్పాన్ ఉత్పత్తిని ప్రవేశపెట్టడంలో అగ్రగామిగా పేరుగాంచారు. ప్రభుత్వ రంగానికే పరిమితం అయిన స్పాన్ ఉత్పత్తిని రైతుగా ఆయన చేపట్టి విజయం సాధించడం విశేషం. ప్రస్తుతం సాహు ప్రతి సంవత్సరం 4–5 కోట చేపల సీడ్ వ్యాపారం చేస్తూ ఏడాదికి రూ. 12 లక్షల కంటే ఎక్కువ సంపాదించగలుగుతున్నారు. వ్యవసాయంతో పోలిస్తే చేపల పెంపకంలో నష్టాలు చాలా తక్కువ అంటారాయన.

20న పశు హోమియో వైద్యంపై సదస్సు

గోశాలల నిర్వహణ, పశువ్యాధులకు హోమియోపతి వైద్యంపై 'రైతునేస్తం ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఈనెల 20 (ఆదివారం)న హైదరాబాద్ లక్డీకాపూల్ రెడ్ హిల్స్‌లోని ఫ్యాప్సీ భవన్‌లో ఉ.9–సా. 5 గం. వరకు ఉచిత అవగాహన సదస్సు జరగనుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గోశాలల నిర్వాహకులు, పాడి రైతులు, పశువైద్యులు పాల్గొనవచ్చు. కేంద్ర ప్రభుత్వ పశు సంవర్థక శాఖ కమిషనర్, వెటరినరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు ఈ సదస్సుకు అతిథులుగా విచ్చేస్తున్నారు. అతి తక్కువ ఖర్చుతో సమర్థవంతంగా పనిచేసే హోమియో పశువైద్య విధానంపై నిపుణులు అవగాహన కల్పిస్తారని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ వై.వెంకటేశ్వర రావు తెలిపారు. అందరూ ఆహ్వానితులే. పాల్గొనదలచిన వారు ఆగస్టు 15లోగా పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు.. 70939 73999, 95538 25532.

పాకిస్తాన్ చీఫ్ సెలెక్టర్‌గా ఇంజమామ్



దిగ్గజ క్రికెటర్ ఇంజమామ్ ఉల్ హఖ్ రెండోసారి పాకిస్తాన్ జట్టు చీఫ్ సెలెక్టర్‌గా నియమితుడయ్యాడు. ఈ మేరకు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) సోమవారం ప్రకటన విడుదల చేసింది. 53 ఏళ్ల ఇంజమామ్ గతంలో 2016 నుంచి 2019 వరకు ఈ పదవిలో ఉన్నారు. ఈ ఏడాది అక్టోబర్–నవంబర్‌లో భారత్ వేదికగా జరిగే వన్డే వరల్‌కప్‌లో పాల్గొనే పాక్ జట్టును ఎంపిక చేసే ప్రక్రియలో ఇంజమామ్ కీలకపాత్ర పోషించనున్నాడు.

హెచ్‌సీఏ ఎన్నికల అధికారిగా వీఎస్ సంపత్



హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ)లో ఎన్నికల నిర్వహణకు తొలి అడుగు పడింది. భారత ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్‌గా పని చేసిన వీరవల్లి సుందరం (వీఎస్) సంపత్ హెచ్‌సీఏ ఎన్నికల అధికారిగా నియమితులయ్యారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో హెచ్‌సీఏ వ్యవహారాలు పర్యవేక్షిస్తున్న మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) లావు నాగేశ్వరరావు దీనికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్‌సీఏ ఎన్నికల ప్రక్రియ మొత్తం వీఎస్ సంపత్ నేతృత్వంలోనే జరుగుతుంది.



సిరీస్ కాపాడుకునేందుకు...

నేడు వెస్టిండీస్‌తో భారత్ మూడో టి20
- తీవ్ర ఒత్తిడిలో టీమిండియా
- 3–0పై విండీస్ గురి
- రాత్రి గం.8 నుంచి డీడీ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్షప్రసారం

ప్రావిడెన్స్ (గయానా): ఏడేళ్ల తర్వాత వెస్టిండీస్ చేతిలో భారత్ వరుసగా రెండు టి20 మ్యాచ్‌లలో ఓడింది. ఇప్పుడు అదే తరహాలో సిరీస్ కూడా కోల్పోయే స్థితిలో టీమిండియా నిలిచింది. రోహిత్, కోహ్లి లేకపోయినా ఐపీఎల్ కారణంగా తగినంత టి20 అనుభవం ఉన్న భారత జట్టు తొలి రెండు మ్యాచ్‌లలో ప్రత్యర్థికి అనూహ్యంగా తలవంచింది. ఇప్పుడైనా హార్దిక్ పాండ్యా బృందం కోలుకొని తమ స్థాయికి తగ్గ ప్రదర్శన కనబరుస్తుందా అనేది కీలకం. మరోవైపు రెండు మ్యాచ్‌లు గెలిచిన ఉత్సాహంతో వెస్టిండీస్ సిరీస్‌పై కన్నేసింది. ఆ జట్టు ఇదే జోరు కొనసాగిస్తే మరో మ్యాచ్ గెలవడం కూడా కష్టం కాబోదు. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య నేడు మూడో టి20 మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. గత మ్యాచ్ జరిగిన వేదికపైనే ఈ మ్యాచ్ కూడా కావడంతో పిచ్ నెమ్మదిగా ఉండవచ్చు.

సూర్య చెలరేగేనా...

తొలి రెండు టి20ల్లోనూ భారత ప్రధాన బ్యాటర్లంతా విఫలమయ్యారు. బ్యాటింగ్‌కు గొప్పగా అనుకూలించని నెమ్మదైన పిచ్‌పై పరుగులు చేసేందుకు మనవాళ్లు తడబడుతున్నారు. ఇషాన్ కిషన్, గిల్, సంజు సామ్సన్, హార్దిక్ పాండ్యా ప్రభావం చూపలేకపోయారు. దీంతోపాటు టి20ల్లో అద్భుత రికార్డు ఉన్న సూర్యకుమార్ యాదవ్ కూడా తనదైన దూకుడు ప్రదర్శించలేదు. హైదరాబాద్ బ్యాటర్ తిలక్ వర్మ ఒక్కడే చక్కటి బ్యాటింగ్ ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. బౌలింగ్‌లో స్పిన్నర్ చహల్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోగా, అర్ష్‌దీప్, ముకేశ్ కుమార్ నిరాశపరిచారు. పాండ్యా కెప్టెన్సీ కూడా పేలవంగా ఉంది. గత మ్యాచ్‌లో అక్షర్ పటేల్‌కు బౌలింగ్ ఇవ్వకపోగా, కీలకదశలో చహల్‌కు బౌలింగ్ ఇవ్వకుండా విండీస్ గెలిచే అవకాశం సృష్టించాడు. ఈ తప్పులను దిద్దుకుంటేనే భారత్ గెలుపు బాట పట్టగలదు.

వారిద్దరిపై భారం...

వెస్టిండీస్ రెండుసార్లూ చక్కటి బౌలింగ్ ప్రదర్శనలతో మ్యాచ్‌లను సొంతం చేసుకోగలిగింది. పటిష్టమైన భారత లైనప్‌ను నిలువరించడంలో ఆ జట్టు సఫలమైంది. ముఖ్యంగా అకీల్ హొసీన్, మెకాయ్, జోసెఫ్‌లు నియంత్రణతో బౌలింగ్ చేస్తున్నారు. హోల్డర్ కూడా కీలక దశలో రాణించడం ఆ జట్టుకు సానుకూలాంశం. బ్యాటింగ్‌లో తన విలువేమిటో పూరన్ చూపించాడు. హెట్‌మైర్ కూడా జట్టు బ్యాటింగ్‌లో కీలకం. ఈ ఇద్దరు ఐపీఎల్ అనుభవం ఉన్న ఆటగాళ్లు జట్టును ఒంటిచేత్తో గెలిపించగల సమర్థులు. అదే తరహాలో మేయర్స్ కూడా రాణించాలని టీమ్ కోరుకుంటోంది. మొత్తంగా చూస్తే ఈ ఫార్మాట్‌లో అంత సులువుగా తలవంచమని చూపిన విండీస్ సిరీస్ గెలుపుపై దృష్టి పెట్టింది.

‘2011 పునరావృతం చేస్తాం’

సొంతగడ్డపై ప్రపంచకప్ గెలుస్తామన్న భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ



న్యూఢిల్లీ: స్వదేశంలో అభిమానుల మద్దతుతో వన్డే వరల్డ్ కప్ గెలవగలమని భారత కెప్టెన్ రోహిత్ శర్మ విశ్వాసం వ్యక్తం చేశాడు. గత రెండు ప్రయత్నాల్లో తాము ట్రోఫీకి దూరమైనా... ఈసారి 2011 ప్రదర్శనను పునరావృతం చేస్తామని అతను అన్నాడు. ఎమ్మెస్ ధోని నాయకత్వంలో 2011లో గెలిచిన భారత జట్టులో రోహిత్ శర్మ సభ్యుడు కాదు. ఆ తర్వాత 2015, 2019లలో అతను ఆడిన సందర్భాల్లో టీమ్ సెమీఫైనల్ చేరింది. పుష్కరకాలం క్రితంలాగే ఈసారి సొంతగడ్డపై అభిమానుల మద్దతు తమకు అదనపు బలం అవుతుందని అతను అభిప్రాయపడ్డాడు. ‘భారత జట్టు ఏ వేదికపై ఆడేందుకు వెళ్లినా పెద్ద సంఖ్యలో ఫ్యాన్స్ అండగా నిలుస్తారనడంలో ఎలాంటి సందేహం లేదు. 12 ఏళ్ల తర్వాత మళ్లీ భారత్‌లో వన్డే వరల్డ్ కప్ జరుగుతోంది. 2016 టి20 ప్రపంచకప్ జరిగినా వన్డే టోర్నీ ప్రత్యేకత వేరు. అభిమానులు ఎంతో ఉత్సాహంగా టోర్నీ కోసం ఎదురు చూస్తున్నారు. నేను ఇంత దగ్గరగా మొదటిసారి ట్రోఫీని చూస్తున్నాను. ఈసారి విజేతగా అందుకోవాలని కోరుకుంటున్నా’ అని రోహిత్ వ్యాఖ్యానించాడు. అమెరికాలో ఐసీసీ ప్రపంచకప్ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న రోహిత్ ఈ సందర్భంగా టోర్నీని సంబంధించి తన పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నాడు. ‘2003లో సచిన్ అద్భుతంగా ఆడటంతోపాటు భారత్ ఫైనల్ వరకు చేరడం, 2007లో మన జట్టు విఫలం కావడం గుర్తున్నాయి. 2011కు సంబంధించి ఆనందం, బాధ ఉన్నాయి. నేను లేకపోవడంతో ఒకదశలో మ్యాచ్‌లు చూడవద్దని అనుకున్నా. కానీ తర్వాత చూశా. మన జట్టు క్వార్టర్స్ నుంచి చాలా బాగా ఆడింది. ఇక సభ్యుడిగా రెండు టోర్నీల్లో భాగమయ్యా’ అని రోహిత్ చెప్పాడు.

భారత జూనియర్ బ్యాడ్మింటన్ జట్టు ప్రకటన

న్యూఢిల్లీ: వచ్చే నెలలో అమెరికాలో జరిగే ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. 16 మంది సభ్యులతో కూడిన భారత జట్టులో తెలంగాణ నుంచి ఐదుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. టీమ్, వ్యక్తిగత ఈవెంట్‌లో బాలుర సింగిల్స్‌లో లోకేశ్ రెడ్డి, బాలికల సింగిల్స్‌లో శ్రియాన్షి వలిశెట్టి ఉన్నారు. బాలికల డబుల్స్‌లో వెన్నెల–శ్రియాన్షి వలిశెట్టి... మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ రెడ్డి–వైష్ణవి ఖాడ్కేకర్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారు.

ఎదురులేని భారత్

3–2తో కొరియాపై గెలుపుతో సెమీస్‌లోకి



చెన్నై: ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నమెంట్‌లో ఎదురులేని భారత్ మూడో విజయాన్ని సాధించి సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. సోమవారం జరిగిన పోరులో టీమిండియా 3–2 గోల్స్‌తో దక్షిణ కొరియాపై గెలుపొందింది. భారత్ తరఫున నీలకంఠ శర్మ (6వ నిమిషంలో), హర్మన్‌ప్రీత్ సింగ్ (23వ ని.లో), మన్‌దీప్ సింగ్ (33వ ని.లో) తలా ఒక గోల్ చేశారు. కొరియా బృందంలో సంగ్‌హ్యాన్ కిమ్ (12వ ని.లో), జిహూన్ యంగ్ (58వ ని.లో) చెరో గోల్ చేశారు. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో 10 పాయింట్లతో భారత్ పట్టికలో అగ్రస్థానంలో ఉంది. రేపు తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో భారత్ ఆడుతుంది. ఇతర మ్యాచ్‌ల్లో పాకిస్తాన్ 2–1తో చైనాపై గెలుపొంది సెమీస్ ఆశల్ని నిలబెట్టుకుంది. మరోవైపు మలేసియా 3–1తో జపాన్‌ను ఓడించి సెమీఫైనల్‌కు అర్హత సంపాదించింది.

‘సడన్‌డెత్’లో హారిక విజయం



బకూ (అజర్‌బైజాన్): ప్రపంచకప్ చెస్ టోర్నమెంట్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక... ఓపెన్ విభాగంలో నిహాల్ సరీన్, విదిత్ సంతోష్ గుజరాతి నాలుగో రౌండ్‌లోకి ప్రవేశించారు. సోమవారం జరిగిన మూడో రౌండ్ టైబ్రేక్ పోటీల్లో హారిక 5.5–4.5తో లెలా జవఖిష్‌విలి (జార్జియా)పై... నిహాల్ 2.5–1.5తో డేనియల్ బొగ్డాన్ (రొమేనియా)పై... విదిత్ 5–4తో మథియాస్ బ్లూబామ్ (జర్మనీ)పై విజయం సాధించారు. ఆదివారం రెండు క్లాసికల్ గేమ్‌లు ‘డ్రా’ కావడంతో హారిక–లెలా మధ్య విజేతను నిర్ణయించేందుకు సోమవారం టైబ్రేక్ గేమ్‌లు నిర్వహించారు. వీరిద్దరు ముందుగా 25 నిమిషాల నిడివి గల రెండు ర్యాపిడ్ గేమ్‌లు ఆడారు. రెండూ ‘డ్రా’గా ముగియడంతో 2–2తో సమంగా నిలిచారు. దాంతో 10 నిమిషాలు నిడివిగల రెండు ర్యాపిడ్ గేమ్‌లు నిర్వహించారు. ఇందులో చెరో గేమ్‌లో గెలవడంతో స్కోరు 3–3తో సమమైంది. అనంతరం 5 నిమిషాల నిడివిగల రెండు ర్యాపిడ్ గేమ్‌లు ఆడించగా...రెండూ ‘డ్రా’ కావడంతో స్కోరు 4–4తో నిలిచింది. దాంతో విజేతను నిర్ణయించేందుకు ఆఖరుగా 3 నిమిషాల నిడివిగల ‘సడన్‌డెత్’ గేమ్‌లు మొదలయ్యాయి. ‘సడన్‌డెత్’లో ‘డ్రా’ అయితే విజేత తేలేవరకు గేమ్‌లు నిర్వహిస్తారు, గెలిస్తే మాత్రం వెంటనే ముగిస్తారు. ఇందులో హారిక, లెలా తొలి గేమ్ ‘డ్రా’కాగా... రెండో గేమ్‌లో హారిక 59 ఎత్తుల్లో నెగ్గి నాలుగో రౌండ్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది.

సన్‌రైజర్స్ హెడ్ కోచ్‌గా వెటోరి

బ్రియాన్ లారాపై వేటు





హైదరాబాద్: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో గత మూడేళ్లుగా పేలవ ప్రదర్శనతో ‘ప్లే ఆఫ్స్’కు అర్హత సాధించలేకపోయిన సన్‌రైజర్స్ హైదరాబాద్ ఈసారి కొత్త కోచ్‌తో తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. రాబోయే సీజన్ కోసం న్యూజిలాండ్ మాజీ కెప్టెన్, కోచింగ్‌లో విశేష అనుభవం ఉన్న డానియెల్ వెటోరీని సన్‌రైజర్స్ హెడ్ కోచ్‌గా నియమించింది. 2023 సీజన్‌లో చివరి స్థానానికే పరిమితమైన హైదరాబాద్ టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించిన దిగ్గజ బ్యాటర్ బ్రియాన్ లారాను తొలగిస్తున్నట్లు యాజమాన్యం ప్రకటించింది. ఆరు సీజన్ల వ్యవధిలో వెటోరి సన్‌రైజర్స్‌కు నాలుగో కోచ్ కావడం విశేషం. 2019, 2022లలో టామ్ మూడీ, 2020, 2021లలో ట్రెవర్ బేలిస్ కోచ్‌లుగా వ్యవహరించగా, ఈ ఏడాది లారా బాధ్యతలు నిర్వర్తించాడు. 2016లో విజేతగా నిలిచిన తర్వాత మరో నాలుగు సీజన్ల పాటు 2020 వరకు సన్‌రైజర్స్ కనీసం ‘ప్లే ఆఫ్స్’కు చేరింది. ఆ తర్వాత వరుసగా మూడేళ్ల పాటు 8వ, 8వ, 10వ స్థానాల్లో నిలిచింది. ఈ మూడు సీజన్లలో కలిపి సన్‌రైజర్స్ 13 మ్యాచ్‌లు మాత్రమే గెలిచి 29 మ్యాచ్‌లలో ఓటమిపాలైంది. 2023లోనైతే నాలుగే మ్యాచ్‌లు గెలిచి 10 ఓడింది. ఐపీఎల్‌లో ఐదేళ్ల పాటు (2014–18) వెటోరి రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) టీమ్‌కు కోచ్‌గా వ్యవహరించాడు. ఇందులో రెండుసార్లు ‘ప్లే ఆఫ్స్’ చేరిన టీమ్ 2016 ఫైనల్లో హైదరాబాద్ చేతిలోనే ఓడింది. ఆ తర్వాత బిగ్‌బాష్, సీపీఎల్, వైటాలిటీ బ్లాస్ట్, హండ్రెడ్ లీగ్‌లలో వేర్వేరు టీమ్‌లకు కోచ్‌గా పని చేసిన వెటోరి ప్రస్తుతం ఆస్ట్రేలియా జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు.

అనిత X సంజయ్

12న డబ్ల్యూఎఫ్‌ఐ ఎన్నికలు



న్యూఢిల్లీ: ఇన్నాళ్లు రెజ్లర్ల ఆరోపణలు, నిరసనలతో తరచూ వార్తల్లోకెక్కిన భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) ఇప్పుడు ఎన్నికల హడావిడిలో ఉంది. 2010 ఢిల్లీ కామన్వెల్త్ గేమ్స్ చాంపియన్ రెజ్లర్ అనిత షెరాన్ అధ్యక్ష పదవి కోసం నామినేషన్ వేయగా, వివాదాస్పద డబ్ల్యూఎఫ్‌ఐ చీఫ్ బ్రిజ్‌భూషణ్ తన వీర విధేయుడు సంజయ్ కుమార్ సింగ్‌ను బరిలో దించాడు. నామినేషన్ల దాఖలు గడువు ముగియడంతో అధ్యక్ష పోటీ ఇప్పుడు మాజీ రెజ్లర్ అనిత, బ్రిజ్‌భూషణ్ నమ్మిన బంటు సంజయ్‌ల మధ్యే నెలకొంది. నిరసన దీక్షలో పాల్గొన్న రెజ్లర్లకు వెన్నుదన్నుగా నిలిచి మాట్లాడిన 38 ఏళ్ల అనితకు రెజ్లర్ల మద్దతు ఉంది. ఇప్పటికే విడుదలైన ఎన్నికల షెడ్యూలు ప్రకారం ఈ నెల 12న ఓటింగ్, అదే రోజు ఫలితాలు విడుదలవుతాయి.

సినిమా

కథా కేళి కొత్త ప్రయత్నంలా ఉంది - ‘దిల్’ రాజు



● హరీష్ శంకర్, ‘దిల్’ రాజు, సతీష్ వేగేశ్న

‘‘సతీశ్ వేగేశ్న దర్శకత్వం వహించిన ‘శతమానం భవతి’ సినిమా మా బ్యానర్‌కి జాతీయ అవార్డును తీసుకొచ్చింది. ఇప్పుడు శతమానం భవతి ఆర్ట్స్ పేరుతో సతీశ్ బ్యానర్ పెట్టడం సంతోషంగా ఉంది. ‘కథా కేళి’ టీజర్ చూస్తుంటే సతీశ్ కొత్త ప్రయత్నం చేసినట్లు అనిపించింది. ఈ సినిమా మంచి విజయం సాధించాలి’’ అని నిర్మాత ‘దిల్’ రాజు అన్నారు. యశ్విన్, దినేశ్ తేజ్, అజయ్, బాలాదిత్య, పూజిత పొన్నాడ, నందిని, ఆయుషి, ప్రీతి, విరాట్ కీలక పాత్రల్లో నటిస్తున్న చిత్రం ‘కథా కేళి’. చింతా గోపాల కృష్ణారెడ్డి సమర్పణలో సతీశ్ వేగేశ్న దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ సినిమా లోగోను ‘దిల్’ రాజు విడుదల చేయగా, టీజర్‌ను డైరెక్టర్ హరీష్ శంకర్ రిలీజ్ చేశారు. సతీశ్ వేగేశ్న మాట్లాడుతూ– ‘‘నేను ఇండస్ట్రీకి వచ్చి పాతికేళ్లు అయ్యింది. ‘ప్రియా ఓ ప్రియా’ చిత్రంలో నా పేరుని మొదటిసారి స్క్రీన్ పై చూసుకున్నాను. ఆ రోజు నుంచి ఈరోజు వరకు రైటర్‌గా, డైరెక్టర్‌గా నిలబడ్డాను. ఈవీవీ సత్యనారాయణగారి మాటల స్ఫూర్తితోనే ఈ బ్యానర్ పెట్టాను. నేను స్టార్ట్ చేసిన ‘కోతి కొమ్మచ్చి, శ్రీశ్రీశ్రీ రాజావారు’ సినిమాలు ఆలస్యం అవుతుండటంతో ఈ గ్యాప్‌లో ఓ కాన్సెప్ట్ బేస్డ్ సినిమా చేద్దామని ‘కథా కేళి’ తీశా’’ అన్నారు.

వృషభ నాకో అందమైన జర్నీ - హాలీవుడ్ నిర్మాత నిక్ తుర్లో



● నంద కిశోర్, విశాల్ గుర్నాని, నిక్ తుర్లో

‘మూన్ లైట్ (2016), త్రీ బిల్ బోర్డ్స్ అవుట్ సైడ్ ఎబ్బింగ్, మిస్సోరీ’ (2017) వంటి పలు హాలీవుడ్ చిత్రాలకు నిర్మాతగా, సహనిర్మాతగా వ్యవహరించిన నిక్ తుర్లో తొలిసారి భారతీయ భాషా చిత్రానికి నిర్మాణ భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు. మోహన్ లాల్, రోషన్ మేక తండ్రీ కొడుకులుగా, శనయ కపూర్, జహ్రా ఖాన్ కీ రోల్స్‌లో నటిస్తున్న ‘వృషభ’ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు నిక్. ఈ సందర్భంగా నిక్ మాట్లాడుతూ – ‘‘వృషభ’ నా ఫస్ట్ ఇండియన్ మూవీ. నేను చేస్తున్న తొలి బహు భాషా సినిమా కూడా ఇదే. ‘వృషభ’ నాకో అందమైన జర్నీ అవుతుందని ఆశిస్తున్నాను’’ అన్నారు. నంద కిషోర్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని అభిషేక్ వ్యాస్, విశాల్ గుర్నాని, జుహి పరేఖ్ మెహతా, శ్యామ్ సుందర్, ఏక్తా కపూర్, శోభా కపూర్, వరుణ్ మథూర్, సౌరభ్ మిశ్రాలు నిర్మిస్తున్నారు. తెలుగు, మలయాళ భాషల్లో ఏకకాలంలో తెరకెక్కిస్తున్న ఈ చిత్రం హిందీ, కన్నడ, తమిళ భాషల్లోనూ రిలీజ్ కానుంది.

గద్దర్ మృతికి టీఎఫ్‌సీసీ, టీఎఫ్‌పీసీ సంతాపం

ప్రముఖ కవి, గాయకుడు గద్దర్ (గుమ్మడి విఠల్ రావు) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆయన మృతి పట్ల తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ (టీఎఫ్‌సీసీ), తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ (టీఎఫ్‌పీసీ) సంతాపం తెలిపాయి. ఈ మేరకు టీఎఫ్‌సీసీ అధ్యక్షుడు వి. వెంకటరమణా రెడ్డి (‘దిల్’ రాజు), గౌరవ కార్యదర్శి కేఎల్ దామోదర్ ప్రసాద్, టీఎఫ్‌పీసీ అధ్యక్షుడు కేఎల్ దామోదర్ ప్రసాద్, గౌరవ కార్యదర్శులు టి. ప్రసన్న కుమార్, వైవీఎస్ చౌదరి వేరు వేరు ప్రకటనలు విడుదల చేశారు. ‘‘తెలుగు సినిమాల్లో అభ్యుదయ గీతాలంటే గద్దర్ పేరు తలచుకోవాల్సిందే. ‘మా భూమి, భద్రం కొడుకో’ చిత్రాల్లో ఆయన పాడిన పాటలు చాలా పాపులర్ అయ్యాయి. ప్రతి పాటను సందేశంగా మలిచి ప్రజలను ఆకట్టుకొనేలా ఆడి, పాడడం సాధారణ విషయం కాదు’’ అన్నారు.

యాక్షన్‌కి సై

ఒకరు తుపాకీ పట్టుకున్నారు.. ఇంకొకరు ఫ్లయిట్ ఎక్కారు... ఫైట్ చేయడానికి రెడీ అయ్యారు. ‘యాక్షన్‌కి సై’ అంటూ బరిలోకి దిగారు. ప్రత్యర్థులను రఫ్ఫాడారు. సుకుమారంగా కనిపించే కథానాయికలు రఫ్‌గా మారిపోయి, విలన్లను ఇరగదీశారు. సమంత, త్రిష, కీర్తీ సురేశ్, దీపికా పదుకోన్, కత్రినా కైఫ్, ఆలియా భట్, కృతీ సనన్ వంటి నాయికలు సినిమాల్లో, వెబ్ సిరీస్‌ల్లో యాక్షన్ రోల్స్ చేస్తున్నారు. ఆ విశేషాలు తెలుసుకుందాం.



● దీపికా పదుకోన్ ● కంగనా రనౌత్



● త్రిష ● సమంత

పవర్‌ఫుల్ రీటా

ఓ వైపు హీరోయిన్‌గా అగ్రహీరోల సరసన నటిస్తూనే మరో వైపు కథానాయిక ప్రాధాన్యం ఉన్న చిత్రాలతో మెప్పిస్తున్నారు కీర్తీ సురేశ్. ప్రస్తుతం ఆమె లీడ్ రోల్‌లో నటిస్తున్న తమిళ చిత్రం ‘రివాల్వర్ రీటా’. చంద్రు దర్శకత్వం వహిస్తున్నారు. కామెడీ, థ్రిల్, యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రంలో కీర్తీ సురేశ్ యాక్షన్ సీన్స్ చేస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌లో రెండు చేతుల్లో రెండు రివాల్వర్స్ పట్టుకుని ఉన్న కీర్తి పోస్టర్‌కి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమా తెలుగులోనూ విడుదల కానుంది. కాగా ‘సైరన్, రఘు తాత, కన్ని వెడి’ వంటి చిత్రాలతో ఫుల్ బిజీగా ఉన్నారు కీర్తీ సురేశ్. వీటిలో ‘కన్ని వెడి’ లేడీ ఓరియంటెడ్ మూవీ. ‘రఘు తాత’ కూడా దాదాపు ఇలాంటి సినిమానే. ఇక చిరంజీవి చెల్లెలిగా కీర్తి నటించిన ‘భోళా శంకర్’ ఈ 11న విడుదల కానున్న విషయం తెలిసిందే.

బాలీ టు హాలీవుడ్

బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకోన్ ఈ మధ్య ఎక్కువగా యాక్షన్ సినిమాలకు పచ్చజెండా ఊపుతున్నారు. ఈ ఏడాది జనవరిలో విడుదలైన షారుక్ ఖాన్ ‘పఠాన్’ మూవీలో యాక్షన్ సీన్స్‌లో అదరగొట్టిన దీపిక ప్రస్తుతం ‘ఫైటర్’, ‘సింగం 3’ వంటి చిత్రాల్లో యాక్షన్ రోల్స్‌కి సై అన్నారు. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ‘ఫైటర్’ కోసం ప్రత్యేకంగా స్టంట్స్‌లో శిక్షణ తీసుకున్నారు దీపిక. అలాగే ‘సింగం’ ఫ్రాంచైజీలో భాగంగా ‘సింగం 3’ రూపొందనుంది. ‘సింగం’, ‘సింగం 2’ చిత్రాలు తెరకెక్కించిన రోహిత్ శెట్టి దర్శకత్వంలోనే ‘సింగం 3’ తెరకెక్కనుంది. ఈ మూడో భాగం హీరోయిన్ ఓరియంటెడ్‌గా సాగనుందట. ఇందులో దీపికా పవర్‌ఫుల్ పోలీస్‌గా కనిపించనున్నారు. ఈ చిత్రం త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనుంది. అలాగే ఓ హాలీవుడ్ మూవీలో ఏజెంట్‌గా కనిపించనున్నారట దీపిక. ఈ చిత్రంలోనూ ఆమె యాక్షన్ సీన్స్ చేయనున్నారని భోగట్టా. ఇలా బాలీవుడ్ టు హాలీవుడ్ యాక్షన్ రోల్స్ సైన్ చేసి జోరుగా దూసుకెళుతున్నారు దీపికా పదుకోన్.

టైగర్‌తో యాక్షన్

సల్మాన్ ఖాన్‌కి సమానంగా కాకపోయినా తనదైన శైలిలో ఫైట్స్ చేశారు కత్రినా కైఫ్. ‘టైగర్’ ఫ్రాంచైజీలో భాగంగా సల్మాన్ ఖాన్ టైటిల్ రోల్‌లో దర్శకుడు మనీష్ శర్మ తెరకెక్కిస్తోన్న చిత్రం ‘టైగర్ 3’. ఇందులో కత్రినా కైఫ్ హీరోయిన్. హీరో హీరోయిన్లు ఇద్దరూ గూఢచారుల పాత్రల్లో నటిస్తున్నారట. ఐఎస్ఐ ఏజెంట్ జోయా పాత్రలో కత్రినా కనిపించనున్నారని సమాచారం. ఈ హై ఓల్టేజ్ యాక్షన్ మూవీలో జోయాగా కత్రినా చేసిన ఫైట్స్ హైలైట్‌గా ఉంటాయని ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ ఫైట్స్ కోసం ప్రత్యేకించి సౌత్ కొరియాకు చెందిన స్టంట్ మాస్టర్ల దగ్గర 14 రోజులు శిక్షణ తీసుకున్నారట కత్రినా. ఈ చిత్రం నవంబర్ 10న రిలీజ్ కానుంది.



● కీర్తీ సురేశ్



● కత్రినా కైఫ్



● కృతీ సనన్



● ఆలియా భట్

వెబ్‌లో యాక్షన్

కొందరు కథానాయికలు వెండితెరపై యాక్షన్ రోల్స్ చేస్తుంటే త్రిష, సమంత వంటి తారలు వెబ్ సిరీస్‌లో ఈ తరహా పాత్రలు చేస్తున్నారు. రెండు దశాబ్దాల కెరీర్‌లో ఎన్నో గుర్తుండిపోయే పాత్రలను పోషించిన త్రిష తొలిసారి ‘బృందా’ అనే వెబ్ సిరీస్‌లో నటించారు. సూర్య వంగల్ దర్శకత్వం వహించిన ఈ వెబ్ సిరీస్‌లో త్రిష ఓ పవర్ పోలీసాఫీసర్ పాత్ర చేశారు. త్రిషలోని మాస్ ఇమేజ్‌ని బలంగా చూపించే పాత్ర ఇది. త్వరలో ఈ సిరీస్ స్ట్రీమింగ్ కానుంది. మరోవైపు ఆ మధ్య వరుసగా హీరోల సరసన నటించిన సమంత ఇటీవల లేడీ ఓరియంటెడ్ చిత్రాలు ఎక్కువగా చేస్తున్నారు. ఈ బ్యూటీ నటించిన తొలి వెబ్ సిరీస్ ‘ది ఫ్యామిలీ మేన్ 2’. దర్శక ద్వయం రాజ్–డీకే తెరకెక్కించిన ఈ సిరీస్‌లో సమంత యాక్షన్ రోల్‌లో అదరగొట్టారు. ప్రస్తుతం సమంతతోనే ఈ దర్శక–ద్వయం ‘సిటాడెల్’ అనే మరో వెబ్ సిరీస్ రూపొందిస్తున్నారు. ప్రియాంకా చోప్రా నటించిన అమెరికన్ సైన్స్ ఫిక్షన్ హిట్ డ్రామా ‘సిటాడెల్’ ఆధారంగా ఈ వెబ్ సిరీస్ తెరకెక్కుతోంది. గూఢచారి సాహసాల నేపథ్యంలో పూర్తి స్థాయి యాక్షన్ సిరీస్‌గా రూపొందుతోంది. ఇందులో సమంత యాక్షన్ సీన్స్‌లో అలరించనున్నారు. సెప్టెంబర్ నుంచి ఈ సిరీస్ స్ట్రీమింగ్ అయ్యే అవకాశం ఉంది.

యుద్ధ విమానం ఎక్కి..

దాదాపు లేడీ ఓరియంటెడ్ సినిమాలకే పరిమితమయ్యారు కంగనా రనౌత్. సర్వేష్ మేవారా దర్శకత్వంలో ఆమె లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం ‘తేజస్’. ఈ చిత్రంలో ఆమె యుద్ధ విమానాలు నడిపే పైలెట్ పాత్ర చేశారు. కంప్లీట్ యాక్షన్ ఓరియంటెడ్‌గా రూపొందిన ఈ చిత్రం కోసం పలు యుద్ధ విద్యలు కూడా నేర్చుకున్నారు కంగన. ఇందుకోసం దాదాపు నాలుగు నెలల పాటు ఆమె శిక్షణ తీసుకున్నారు. ఈ చిత్రం అక్టోబర్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంచితే.. కంగనా రనౌత్ లీడ్ రోల్‌లో నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో ‘ఎమర్జెన్సీ’ చిత్రం నిర్మించారు. భారత ప్రధాని ఇందిరా గాంధీ హయాంలో ఎమర్జెన్సీ (1975–1977) ఎందుకు విధించారు? ఆ పరిస్థితి ఎందుకు ఏర్పడింది? అనే అంశంతో ‘ఎమర్జెన్సీ’ని తెరకెక్కించారు. ఇందిరా గాంధీగా కంగన నటించిన ఈ చిత్రం నవంబరు 24న విడుదల కానుంది. అలాగే పి. వాసు దర్శకత్వంలో లారెన్స్ హీరోగా కంగన టైటిల్ రోల్‌లో రూపొందిన ‘చంద్రముఖి 2’ సెప్టెంబరు 19న విడుదల కానుంది.

హాలీవుడ్‌లో యాక్షన్

అందం, అభినయంతో ప్రేక్షకులను అలరిస్తున్న హీరోయిన్ ఆలియా భట్ కూడా యాక్షన్‌కి సై అన్నారు. టామ్ హార్పర్ దర్శకత్వం వహించిన హాలీవుడ్ చిత్రం ‘హార్ట్ ఆఫ్ స్టోన్’లో ఆలియా కీలక పాత్ర చేశారు. స్పై యాక్షన్ మూవీగా రూపొందిన ఈ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్ కోసం ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నారు ఆలియా భట్. ఈ నెల 11న ఈ సినిమా విడుదల కానుంది.

బైక్‌పై దూసుకెళుతూ...

ఇటీవల విడుదలైన ‘ఆది పురుష్’లో సుకుమారి సీతగా కనిపించిన కృతీ సనన్ ఇప్పుడు అందుకు పూర్తి విభిన్నంగా రూడ్‌గా మారిపోయారు. వికాస్ బాల్ దర్శకత్వం వహించిన ‘గణ్‌పథ్: పార్ట్ 1’లో ఆమె పవర్‌ఫుల్ రోల్ చేశారు. ఈ సినిమా కోసం కృతి అద్భుతమైన బైక్ స్టంట్స్ చేశారు. ఇందుకోసం బైక్ స్టంట్స్ నేర్చుకున్నారామె. అమితాబ్ బచ్చన్, టైగర్ ష్రాఫ్ నటించిన ఈ చిత్రం అక్టోబర్ 20న విడుదల కానుంది.

ఇంతేనా.. ఇంకొందరు కథానాయికలు యాక్షన్ రోల్స్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చి, తామేంటో నిరూపించుకోవడానికి రెడీ అవుతున్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
8-8-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	232	65,953
నిఫ్టీ ▲	80	19,597

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	13,941	▲	32
డోజోన్స్	35,441	▲	375
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,554	▼	10
డాక్స్	15,951	▼	1
షాంఘై	3,269	▼	19
నికాయ్	32,255	▲	62

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	59,327
బంగారం (99.5 స్వచ్ఛత)	59,089
వెండి (కిలో)	71,848

పేటీఎంలో విజయ్‌కు మరింత వాటా!

10.3 శాతం కొనుగోలుకు సై



న్యూఢిల్లీ: పేటీఎం బ్రాండు ఫిన్‌టెక్ దిగ్గజం.. వన్97 కమ్యూనికేషన్స్‌లో సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో విజయ్ శేఖర్ శర్మ వాటా పెరగనుంది. యాంట్‌ఫిన్(నెదర్లాండ్స్) హోల్డింగ్స్ నుంచి 10.3 శాతం వాటాను విజయ్ సొంతం చేసుకోనున్నట్లు పేటీఎం తాజాగా పేర్కొంది. ఇందుకు ఎలాంటి నగదు చెల్లింపు ఉండదని, ఆఫ్‌మార్కెట్ లావాదేవీ ద్వారా వాటా బదిలీ ఉంటుందని తెలియజేసింది. అయితే ఈ వాటా ఎకనమిక్ రైట్స్ యాంట్‌ఫిన్ వద్దనే కొనసాగుతాయని వెల్లడించింది. ఒప్పందం లో భాగంగా విదేశీ సొంత సంస్థ రెజిలియంట్ అసెట్ మేనేజ్‌మెంట్ బీవీ ద్వారా వాటాను శర్మ కొనుగోలు చేయనున్నట్లు వివరించింది. దీనికి బదులుగా మార్పిడికి వీలయ్యే(ఆప్షనల్లీ కన్వర్టిబుల్) డిబెంచర్లను యాంట్‌ఫిన్‌కు రెజిలియంట్ జారీ చేయనున్నట్లు పేర్కొంది. ఈ లావాదేవీ కారణంగా కంపెనీ యాజమాన్య నియంత్రణలో ఎలాంటి మార్పులు చోటుచేసుకోబోవని స్పష్టం చేసింది. సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం ఈ లావాదేవీతో పేటీఎంలో శర్మ వాటా 19.42 శాతానికి చేరనుంది. వెరసి కంపెనీలో అతిపెద్ద వాటాదారుగా నిలవనున్నారు. మరోపక్క యాంట్‌ఫిన్ వాటా 23.79 శాతం నుంచి 13.5 శాతానికి తగ్గనున్నట్లు తెలుస్తోంది. కాగా.. పేటీఎం బోర్డులో యాంట్‌ఫిన్ నామినీ ఉండబోరు. యాంట్‌ఫిన్.. చైనా దిగ్గజం యాంట్ గ్రూప్ అనుబంధ కంపెనీ అన్న సంగతి తెలిసిందే.

షేరు జూమ్

సంస్థ వ్యవస్థాపకుడు, సీఈవో విజయ్ శేఖర్ శర్మ వాటా పెరగనున్న వార్తల నేపథ్యంలో ఫిన్‌టెక్ దిగ్గజం పేటీఎం కౌంటర్లో లావాదేవీలు ఊపందుకున్నాయి. షేరు ఎన్ఎస్ఈ, బీఎస్ఈలలో 7 శాతం జంప్‌చేసి రూ. 851 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో దాదాపు 12 శాతం దూసుకెళ్లి రూ. 888కు చేరింది. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ రూ. 3,511 కోట్లు ఎగసి రూ. 53,957 కోట్లను అధిగమించింది.

టీవీఎస్ సప్లైచైన్@ రూ.187-197

ఈ నెల 10-14 మధ్య పబ్లిక్ ఇష్యూ

న్యూఢిల్లీ: టీవీఎస్ గ్రూప్ సంస్థ టీవీఎస్ సప్లైచైన్ సొల్యూషన్స్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 10న ప్రారంభం కానుంది. 14న ముగియనున్న ఇష్యూకి ధరల శ్రేణి రూ. 187-197. తద్వారా రూ. 880 కోట్లు సమీకరించనుంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో 1.42 కోట్ల షేర్లను కంపెనీ ప్రస్తుత ఇన్వెస్టర్లు ఆఫర్ చేయనున్నారు. ఇష్యూ తదుపరి టీవీఎస్ మోటార్స్ వాటా 10% తగ్గి 42%కి పరిమితం కానుంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 76 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేయాలి.

అదానీ గ్రీన్ ఎనర్జీలో క్యూఐఏకి వాటాలు

రూ. 3,920 కోట్లతో దాదాపు 2.5 శాతం పైగా వాటాల కొనుగోలు



న్యూఢిల్లీ: అదానీ గ్రీన్ ఎనర్జీ (ఏజీఈఎల్)లో ఖతార్‌కు చెందిన సార్వభౌమ నిధి ఖతార్ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (క్యూఐఏ) 2.5 శాతం పైగా వాటాలను కొనుగోలు చేసింది. ఇందుకోసం సుమారు రూ. 3,920 కోట్లు వెచ్చించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అదానీ ఎలక్ట్రిసిటీ ముంబై లిమిటెడ్ (ఏఈఎంఎల్)లో 2020లో 25.1 శాతం వాటాలు కొనుగోలు చేసిన క్యూఐఏ మళ్లీ అదానీ గ్రూప్‌లో ఇన్వెస్ట్ చేయడం ఇది రెండోసారి. స్టాక్ ఎక్స్ఛేంజీల డేటా ప్రకారం ప్రమోటర్ గ్రూప్ సంస్థ ఇన్ఫినిట్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ .. ఏజీఈఎల్‌లో సుమారు 4.49 కోట్ల షేర్లను (2.8 శాతం వాటా) షేరు ఒక్కింటికి రూ. 920 చొప్పున మొత్తం రూ. 4,131 కోట్లకు విక్రయించింది. క్యూఐఏ అనుబంధ సంస్థ అయిన ఐఎన్‌క్యూ హోల్డింగ్ 4.26 కోట్ల షేర్లను (దాదాపు 2.68 శాతం వాటా) కొనుగోలు చేసింది. సగటున రూ. 920 రేటు చొప్పున ఇందుకోసం మొత్తం రూ. 3,920 కోట్లు వెచ్చించింది.

జాలిమ్ లోషన్ బ్రాండ్ ప్రచారకర్తగా గోవిందా



హైదరాబాద్: జాలిమ్ లోషన్ తన బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ నటుడు గోవిందాను నియమించుకుంది. ''దేశవ్యాప్తంగా పేరున్న నటుడు మా బ్రాండ్‌కు ప్రచారకర్తగా నియమితులు కావడం సంతోషంగా ఉంది. విస్తృత ప్రచారం ద్వారా బ్రాండ్‌ను ప్రజలకు మరింత చేరువ చేస్తారు'' అని కంపెనీ ఎండీ నవీన్ ఝా తెలిపారు. ఉత్పత్తుల విక్రయాలు కూడా గణనీయంగా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల తమ ప్రొడెక్ట్ పేరుతో కొన్ని కంపెనీలు నకిలీ లోషన్‌ను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయని, వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నవీన్ కోరారు.

ఒలెక్ట్రా లాభం రూ.18 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ వాహన తయారీలో ఉన్న ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ జూన్ త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నికరలాభం అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.16.7 కోట్ల నుంచి రూ.18 కోట్లకు చేరింది. ఈపీఎస్ రూ.2.03 నుంచి రూ.2.20కి ఎగసింది. టర్నోవర్ రూ.283 కోట్ల నుంచి రూ.217 కోట్లకు పడిపోయింది. ఫలితాల నేపథ్యంలో బీఎస్ఈలో ఒలెక్ట్రా షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే సోమవారం 0.17 శాతం క్షీణించి రూ.1,136.90 వద్ద స్థిరపడింది.

రాణించిన ఫార్మా, ఐటీ షేర్లు

- 19,600 చేరువలో నిఫ్టీ
- సెన్సెక్స్ లాభం 232 పాయింట్లు
- సూచీలకు రెండోరోజూ లాభాలు



ముంబై: ఫార్మా, ఐటీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీలు రెండోరోజూ లాభపడ్డాయి. అయితే విదేశీ ఇన్వెస్టర్ల నిధుల ఉపసంహరణ మార్కెట్ భారీ ర్యాలీకి ప్రతిబంధకంగా మారింది. ఈ వారంలో ఆర్‌బీఐ ద్రవ్య విధాన వైఖరి, అమెరికా ద్రవ్యోల్బణ డేటాతో సహా పలు దేశాల కీలక స్థూల ఆర్థిక గణాంకాల వెల్లడి నేపథ్యంలో ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించారు. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం సానుకూలంగా మొదలయ్యాయి. ట్రేడింగ్ ఆద్యంతం పరిమిత శ్రేణిలో లాభ, నష్టాల మధ్య కదలాడుతూ ఊగిసలాట వైఖరిని ప్రదర్శించాయి. సెన్సెక్స్ ఉదయం 90 పాయింట్లు పెరిగి 65,811 వద్ద మొదలైంది. ట్రేడింగ్‌లో 65,748 వద్ద కనిష్టాన్ని, 66,068 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 232 పాయింట్లు పెరిగి 65,953 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 60 పాయింట్లు బలపడి 19,577 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ఇంట్రాడేలో 19,525 - 19,620 పరిధిలో కదలాడింది. ఆఖరికి 80 పాయింట్లు పెరిగి 19,597 వద్ద నిలిచింది. ఫార్మా, ఐటీతో పాటు ఇంధన, రియల్టీ, ఆటో షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ ఇండెక్సులు అరశాతం చొప్పున లాభపడ్డాయి. బ్యాంకులు, మెటల్, మీడియా, ఇంధన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,893 కోట్ల షేర్లను విక్రయించగా, సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,081 కోట్ల షేర్లను కొన్నారు. సెన్సెక్స్ 232 పాయింట్లు లాభపడటంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ మొత్తం కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.1.22 లక్షల కోట్లు పెరిగి రూ.305.38 లక్షల కోట్లకు చేరింది. అమెరికా బాండ్లపై రాబడులు పెరగడం, యూరోజోన్ స్థూల ఆర్థిక గణాంకాలు నిరాశపరచడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలో అధిక భాగం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- జూన్ క్వార్టర్‌లో నికర లాభం 56.04% వృద్ధి చెందడంతో మహీంద్రా అండ్ మహీంద్రా షేరు 4% లాభపడి రూ.1,527 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నాలుగున్నర శాతం దూసుకెళ్లి రూ.1,531 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. దీంతో కంపెనీ విలువ ఒక్క రోజులో రూ.7,673 కోట్లు పెరిగి రూ.1.90 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ సూచీలో అత్యధికంగా లాభపడిన షేరు ఇదే.
- యథార్థ్ హాస్పిటల్ అండ్ ట్రామా కేర్ సర్వీసెస్ లిమిటెడ్ షేరు లిస్టింగ్ రోజు 11% ర్యాలీ చేసింది. ఈక్విటీ మార్కెట్లలోని అస్థిరత పరిస్థితుల దృష్ట్యా బీఎస్ఈలో ఇష్యూ ధర(రూ.300)తో పోలిస్తే 2% స్వల్ప ప్రీమియంతో రూ.306 వద్ద లిస్టయ్యింది. ఒక దశలో 14% ఎగసి రూ.343 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 11% లాభంతో రూ.334 వద్ద స్థిరపడింది. ఎక్స్ఛేంజీలో మొత్తం 15.16 లక్షల ఈక్విటీ షేర్లు చేతులు మారాయి. కంపెనీ విలువ రూ.2,854 కోట్లుగా నమోదైంది.
- తొలి త్రైమాసిక ఆర్థిక ఫలితాలు అంచనాలను అందుకోవడంలో విఫలం కావడంతో బ్రిటానియా షేరు అమ్మకాల ఒత్తిడికి లోనైంది. ఎన్ఎస్ఈలో రెండున్నర శాతానికి పైగా నష్టపోయి రూ.4,670 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో నాలుగుశాతం క్షీణించి రూ.4618 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని దిగివచ్చింది. నిఫ్టీ-50 సూచీలో అత్యధికంగా నష్టపోయిన షేరు ఇదే కావడం గమనార్హం.

ఎలక్ట్రిక్ ఆటోపరికరాల తయారీకి కొత్త కంపెనీ

కైనెటిక్ వాట్స్ అండ్ వోల్ట్స్‌ను నెలకొల్పిన కైనెటిక్ ఇంజినీరింగ్



ముంబై: ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ పరికరాల తయారీ కోసం కొత్తగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు కైనెటిక్ ఇంజినీరింగ్ వెల్లడించింది. కైనెటిక్ వాట్స్ అండ్ వోల్ట్స్ పేరుతో 2022లో దీన్ని నెలకొల్పినట్లు తెలిపింది. ఇది మోటార్లు, కంట్రోలర్లు, బ్యాటరీలు మొదలైనవి తయారు చేస్తుందని పేర్కొంది. కొత్త కంపెనీలో మాతృ సంస్థకు 92 శాతం, ప్రమోటర్లయిన ఫిరోదియా కుటుంబానికి మిగతా 8 శాతం వాటాలు ఉంటాయి వ్యూహాత్మక/ఆర్థిక భాగస్వామికి 25 శాతం వరకు వాటాను విక్రయించేందుకు కూడా కంపెనీ సిద్ధంగా ఉన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. కేఈఎల్, కైనెటిక్ కమ్యూనికేషన్స్ కింద ఉన్న తమ ప్రస్తుత ఈవీ (ఎలక్ట్రిక్ వాహనాలు) వ్యాపారాన్ని కొత్త సంస్థలో విలీనం చేయనున్నట్లు కైనెటిక్ ఇంజినీరింగ్ ఎండీ అజింక్యా ఫిరోదియా తెలిపారు. తాము ఇప్పటికే ఎలక్ట్రిక్ వాహనాల కోసం గేర్‌బాక్సులు, ఛాసిస్‌లను తయారు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. దేశీయంగా 700 పైచిలుకు సంస్థలు ద్విచక్ర ఈవీలను ఉత్పత్తి చేస్తున్న నేపథ్యంలో తమకు భారీగా వ్యాపార అవకాశాలు ఉన్నాయని ఆయన ఫిరోదియా చెప్పారు.

టెస్లా సీఎఫ్‌వోగా వైభవ్



న్యూయార్క్: ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌గా భారత సంతతికి చెందిన వైభవ్ తనేజా (45) నియమితులయ్యారు. ప్రస్తుత సీఎఫ్‌వో జాకరీ కిర్‌కోర్న్ తప్పుకోవడంతో ఆ స్థానంలో తనేజా నియమితులయ్యారు. 2019 నుంచి తనేజా టెస్లా చీఫ్ అకౌంటింగ్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తున్నారు. అంతకుముందు 2016లో టెస్లా కొనుగోలు చేసిన సోలార్‌సిటీ కార్పొరేషన్‌లో ఫైనాన్స్, అకౌంటింగ్ విభాగాల్లో బాధ్యతలు నిర్వర్తించారు. దానికి పూర్వం 1999 నుంచి 2016 వరకు ప్రైస్‌వాటర్‌హౌస్‌కూపర్స్‌లో పని చేశారు.

ఐఓసీ చైర్మన్‌గా మరో ఏడాది శ్రీకాంత్ మాధవ్ వైద్య



న్యూఢిల్లీ: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) చైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్యకు ప్రభుత్వం పదవీ విరమణ తర్వాత ఒక సంవత్సరం పాటు బాధ్యతల పొడిగింపును ఇచ్చింది. ఒక ప్రభుత్వ రంగ సంస్థలో ఈ తరహా నిర్ణయం చాలా అరుదని అత్యున్నత స్థాయి వర్గాలు పేర్కొంటున్నాయి. నిజానికి సెప్టెంబర్ 1న వైద్య తన ప్రస్తుత బాధ్యత నుంచి పదవీ విరమణ చేయాల్సి ఉంది. శ్రీకాంత్ మాధవ్ వైద్య కాంట్రాక్ట్ విధానం ప్రాతిపదికన సంస్థకు మరో ఏడాది పాటు చైర్మన్‌గా కొనసాగుతారు.

2025 ఖరీఫ్‌కు పోల'వరం'

మన జీవనాడిపై కేంద్రానికి గట్టిగా అర్థమయ్యేలా చెప్పాం: సీఎం జగన్

- ఈ నెలాఖరుకు కేంద్ర కేబినెట్ ఆమోదంతో రూ.17 వేల కోట్లు రావచ్చు
- 41.5 కాంటూర్ పరిధిలో నీటి నిల్వ కోసం ఆర్ అండ్ఆర్ పూర్తిగా ఇస్తాం
- అల్లూరి, ఏలూరు జిల్లాల్లో వరద ప్రాంతాల్లో బాధితులను కలుసుకున్న సీఎం


అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరంలో వరద బాధితులతో సీఎం

సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'పోలవరం ప్రాజెక్టును 2025 ఖరీఫ్ కల్లా కచ్చితంగా పూర్తిచేసే పరిస్థితి వస్తుంది. 2025 జూలై, ఆగస్టులో 41.15 మీటర్ల పరిధిలో నీటిని నిల్వ చేసే పరిస్థితి కూడా ఉంటుంది' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టు, నిధులకు సంబంధించిన విషయాలపై కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తూ వారికి అర్థమయ్యే రీతిలో చెప్పామన్నారు. ఇవన్నీ చేసిన నేపథ్యంలో వారిలో కొంత కదలిక వచ్చి సానుకూల వాతావరణంతో ధరలను రివైజ్ చేసి ప్రాజెక్టును వేగంగా పూర్తిచేసేలా అడుగులు వేస్తున్నట్లు వివరించారు. పోలవరం ముంపు ప్రాంతం కాంటూరు లెవల్ 41.15 మీటర్ల పరిధిలో ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఎన్నికలకు ముందే ఆరేడు నెలల్లోగా నష్టపరిహారం అందుతుందన్న నమ్మకం ఉందని, ఆ దిశగా కేంద్ర ప్రభుత్వంపై గట్టిగా ఒత్తిడి తెస్తున్నామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం అల్లూరి సీతారామ రాజు, ఏలూరు జిల్లాల్లోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన ముఖ్యమంత్రి జగన్ బాధితులను స్వయంగా కలుసుకుని క్షేత్రస్థాయిలో అమలైన సహాయ చర్యలను పరిశీలించారు. కూనవరం, గొమ్ముగూడెంలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఏమన్నారంటే..

బుద్ధి లేకుండా బాబు సంతకాలు..

పోలవరం డ్యామ్‌ను మూడు సంవత్సరాల్లో మూడు దశల్లో పూర్తిగా నింపుతారు. అందులో మొదటి స్టేజ్.. మొదటి ఏడాది 41.15 మీటర్ల వరకు నింపుతారు. దశలవారీగా నింపడం ద్వారా ఒక్కో దశలో ఏవైనా లీకేజీలు ఉంటే వాటికి మరమ్మతులు చేసే అవకాశం ఉంటుంది. మూడు సంవత్సరాల్లో మూడు ఫేజ్‌ల్లో డ్యామ్‌ను నింపాలని సీడబ్ల్యూసీ నిబంధనల్లో ఉంది. 41.15 మీటర్ల వరకు నింపితే కటాఫ్ అయిపోయే గ్రామాలు ఇంకా ఉంటాయి. వాటిని ఫస్ట్ ఫేజ్‌లోకి తేకుంటే ఆ ఊళ్లకు వెళ్లటానికి ఇబ్బంది అవుతుంది. అందుకనే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి లైడార్ సర్వే నిర్వహించి 32 గ్రామాల్లో 48 హ్యాబిటేషన్లను (ఆవాస ప్రాంతాలు) మళ్లీ యాడ్ చేయించాం. దీనికి కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం కిందా మీదా పడుతున్నాం. మన ఖర్మకొద్దీ ఇదంతా ఎందుకు మొదలైందంటే గత ప్రభుత్వం 2013-2014 రేట్లతోనే పోలవరాన్ని పూర్తి చేస్తామని అండర్ టేకింగ్ ఇచ్చింది. దీంతో అంతకంటే ఎక్కువ డబ్బులివ్వమని, నాటి మీ ముఖ్యమంత్రే ఇందుకు ఒప్పుకుని సంతకం చేశారని కేంద్ర ప్రభుత్వం మొండికేసింది. నేను నేరుగా ప్రధాని, కేంద్ర మంత్రుల వద్దకు వెళ్లి వారికి అన్ని రకాలుగా నచ్చచెప్పా. 2013-14 రేట్ల ప్రకారం ఇప్పుడు ప్రాజెక్టు పూర్తి చేయాలంటే ఎలా సాధ్యం? ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు కూడా మారిపోతాయి. గత ప్రభుత్వంలో చంద్రబాబు బుద్ధి లేకుండా సంతకం చేశాడు గానీ మీరైనా ఆలోచన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించే కార్యక్రమం చేశా. శ్రీశైలం ప్రాజెక్టు ఎంతతో స్టార్ట్ చేశారు? ఎంతతో పూర్తైంది?

ఈ నెలాఖరు కల్లా శుభవార్త!

ఇవన్నీ వివరించిన తరువాత వారిలో (కేంద్రం) కొంత కదలిక వచ్చింది. సానుకూల వాతావరణం వచ్చింది. ఇప్పుడు ఉన్న రేట్లకు మళ్లీ రివైజ్ చేసి ప్రాజెక్టును పూర్తిచేసేలా అడుగులు వేశాం. ఇది జరగాలంటే కేంద్ర కేబినెట్ ఆమోదించాల్సి ఉంది. దీనికోసం పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ ఎస్టిమేట్స్ తయారు చేసి సెంట్రల్ వాటర్ కమిషన్‌కు ఇప్పటికే పంపించింది. వాళ్లు మరో వారంలో అప్రూవల్ ఇస్తారు. ఆ తర్వాత జల్‌శక్తి శాఖ వద్దకు వస్తుంది. అనంతరం కేబినెట్‌లో పెడుతుంది. దేవుడు ఆశీర్వదిస్తే నాకు తెలిసి బహుశా ఈ నెలాఖరు కల్లా కేబినెట్‌కు ఇది వచ్చే కార్యక్రమం జరుగుతుంది. కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపితే పోలవరం తొలి ప్రాధాన్యతా పనుల కోసం రూ.17 వేల కోట్లు మనకు ఇచ్చేందుకు ఆమోదం లభిస్తుంది. దీనివల్ల అత్యంత ప్రధానంగా పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన పనులన్నీ పూర్తవుతాయి. డ్యామ్ పూర్తి హైట్‌కు కంప్లీట్ అవుతుంది. 41.15 మీటర్ల వరకు నీళ్ల నింపేందుకు ఆర్ అండ్ ఆర్ పూర్తిగా అందుతుంది. లైడార్ సర్వే ద్వారా గుర్తించిన 48 ఆవాస ప్రాంతాలను కూడా మొదటి పునరావాస ప్రాధాన్యత కింద ఆమోదించాలని కోరాం. దాని తర్వాత రెండో ఏడాది సెకండ్ ఫేజ్, అనంతరం మూడో ఏడాది మూడో దశ ఉంటుంది. ఎందుకంటే ఈ ప్రాజెక్టును కేంద్ర ప్రభుత్వం కడుతోంది కాబట్టి! బహుశా జగనే కడితే మొదట మీకు (నిర్వాసితులకు) ఇచ్చి తర్వాత ప్రాజెక్టు గురించి ఆలోచన చేసేవాడినేమో! కేంద్ర ప్రభుత్వం డబ్బు లు ఇస్తోంది కాబట్టి ఫేజ్ ప్రకారం జరగాల్సిందే.

20 వేల కుటుంబాల తరలింపు!

నేను కూడా అనుకున్నంత వేగంగా చేయలేక పోయిన పని ఒకటి ఉంది. అది పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ ఇప్పించడం. అది నా చేతుల్లో ఉండే పని కాకపోవడంతో కష్టపడాల్సి వస్తోంది. ఈ విషయంలో ఢిల్లీ మీద ఆధార పడాల్సి వస్తోంది. వాళ్ల మీద ఒత్తిడి తెస్తూ అడుగులు ముందుకు వేస్తున్నా. ఏదైనా టైమ్ రావాలి. ఇవన్నీ జరిగేదాకా వారు డబ్బులివ్వరు. డబ్బులు ఇవ్వకపోతే పని జరగదు. పని జరగకపోతే, డబ్బులు ఇవ్వకపోతే మనం కూడా ఇవ్వలేం. ఈ వాస్తవాన్ని కూడా మనం మనసులో పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. ఈ నెలాఖరు కల్లా కేంద్ర కేబినెట్ ఆమోదం లభించి రూ.17 వేల కోట్లకు అప్రూవల్ వస్తే 41.15 మీటర్లకు, 48 హ్యాబిటేషన్లకు సంబంధించి రూ.5,200 కోట్లు పంపిణీ చేసే కార్యక్రమం చేస్తాం. గట్టిగా ఒత్తిడి తెచ్చి వచ్చే జనవరికల్లా ఆర్ అండ్ ఆర్ పూర్తయ్యేలా చూస్తాం. మన ప్రభుత్వం రాక ముందు కేవలం 3 వేల కుటుంబాలను మాత్రమే తరలించారు. గత నాలుగేళ్లలో ఇప్పటికే 12 వేల కుటుంబాలను షిఫ్ట్ చేశాం. మరో 8 వేల కుటుంబాలను అంటే మొత్తంగా 20 వేల కుటుంబాలను తరలిస్తున్నాం. తరలించాల్సిన 8 వేల కుటుంబాల కోసం రూ.800 కోట్లు డబ్బులు అవసరం. మనమే కిందమీద పడి ఎలాగో చేసేస్తాం. బహుశా ఈ నెలాఖరుకో లేకపోతే వచ్చే నెలకల్లా పూర్తి చేస్తాం.

కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు కొట్టు సత్యనారాయణ, తానేటి వనిత, పినిపే విశ్వరూప్, ఎంపీ కోటగిరి శ్రీధర్, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొన్నారు.

వారికి మిగతా రూ.3.5 లక్షలు ఇస్తాం

పోలవరం ప్రాజెక్టుకు తొలుత నాన్న (వైఎస్సార్) హయాంలో భూసేకరణ జరిగినప్పుడు రూ.లక్ష, రూ.లక్షన్నరకు కొనుగోలు చేశారు. దీనికి సంబంధించి నేను రూ.5 లక్షలు ఇస్తానని చెప్పా. ఆ మిగిలిన రూ.3.5 లక్షలు కచ్చితంగా ఇస్తాం. మీ బిడ్డ వల్ల నష్టపోయామనే మాట ఎక్కడా వినపడదని చెబుతున్నా. మీ బిడ్డ మంచే చేస్తాడు. చెడు మాత్రం ఎప్పుడూ చేయడని గుర్తు పెట్టుకోండి.

కేంద్రం రూ.6.8 లక్షలకు తోడు రాష్ట్రం రూ.3.2 లక్షల ప్యాకేజీ

ఇక ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.6.8 లక్షల ప్యాకేజీకి తోడు రూ.3.2 లక్షల ప్యాకేజీని రాష్ట్ర ప్రభుత్వం తరఫున మనమే ఇస్తాం. ఇప్పటికే జీవో జారీ చేశాం. దీనికి మీ బిడ్డ కట్టుబడి ఉన్నాడని తెలియజేస్తున్నా. దేవుడు ఆశీర్వదిస్తే కేంద్రం నుంచి జరగాల్సిన మంచి ఆరేడు నెలల్లోనే జరుగుతుందన్న నమ్మకం ఉంది. మీ బిడ్డ మీ కోసం కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాడు.

బాబు ఘోర తప్పిదాలు

గత ప్రభుత్వం చేసిన ఘోర తప్పిదం స్పిల్‌వే కట్టకుండా డయాఫ్రం వాల్ కట్టారు. మొదట స్పిల్‌వే పూర్తి చేసి నీళ్లు డైవర్ట్ చేసి ఆ తర్వాత కాఫర్ డ్యామ్ కట్టాలి. కాఫర్ డ్యామ్ కట్టిన తర్వాత డయాఫ్రం వాల్ తర్వాత వెనకాల కట్టాలి. అలా చేస్తే డ్యామేజ్ అనేది జరగదు. మన ఖర్మ కొద్దీ ఆ రోజుల్లో కేవలం కాంట్రాక్టర్లకు మంచి చేయడం కోసమే పనులు చేపట్టి ప్లానింగ్ లేకుండా ఇష్టమొచ్చినట్లు చేశారు. స్పిల్‌వే పనులు అసంపూర్తిగా వదిలేశారు. కాబట్టే నీళ్లు అటువైపు నుంచి డైవర్ట్ చేయలేకపోయారు. నీళ్లు డైవర్ట్ చేయలేకపోయారు. కాబట్టి అటువైపు పంపించలేకపోయారు. పైగా అది పూర్తి కాకుండానే మధ్యలో కాఫర్ డ్యామ్ మొదలు పెట్టారు. వరదలకు డయాఫ్రం వాల్ కోతకు గురైంది.

కొత్త డయాఫ్రం వాల్ నిర్మిస్తాం

ఇప్పుడు నిపుణులు అధ్యయనం చేసిన తర్వాత కొత్త డయాఫ్రం వాల్ కట్టాలని నిర్ణయం తీసుకున్నారు. ఈలోగా మనం కాఫర్‌డ్యాంలు పూర్తిచేశాం. స్పిల్‌వే పూర్తిచేసి దానిమీదుగా నీళ్లు పంపిస్తున్నాం. ఇవన్నీ మనం చేయగలిగాం. గత సర్కారు నిర్వాకాల కారణంగా ప్రాజెక్టు మనం అనుకున్నంత స్పీడ్‌లో ముందుకు వెళ్లలేకపోయింది. వీటన్నింటినీ అధిగమించి ఇప్పుడు దేవుడి దయ వల్ల గాడిలో పడింది. 2025 ఖరీఫ్‌కల్లా కచ్చితంగా పోలవరం పూర్తి చేసి నీళ్లు నిల్వ చేసే పరిస్థితి వస్తుంది.

టోఫెల్‌తో పిల్లలకు ఇంగ్లిష్ భాషా ప్రావీణ్యం

- ప్రత్యేక ప్రణాళిక రూపొందించిన ఎస్సీఈఆర్టీ
- వారంలో 3 రోజులు ప్రత్యేక శిక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రతి పేద విద్యార్థి అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలను అందుకోవాలన్నది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పం. విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలంటే ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం సాధించాలి. ఇందుకోసం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను టోఫెల్ (టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ యాస్ ఏ ఫారిన్ లాంగ్వేజ్) 'రెడీనెస్' పరీక్షకు అధికారులు సన్నద్ధం చేస్తున్నారు. అసలైన టోఫెల్ పరీక్షను సమర్థంగా ఎదుర్కొనేందుకు విద్యార్థులకు నవంబర్‌లో సన్నద్ధ పరీక్ష నిర్వహిస్తున్నారు. అందుకోసం ఇప్పటి నుంచే పిల్లలను సిద్ధం చేస్తున్నారు. అమెరికన్, యూరోపియన్ ఉచ్చారణలో పిల్లల్లో నైపుణ్యాన్ని పెంపొందించడంతో పాటు విదేశీ యాసను అర్థం చేసుకోవడం, చక్కగా మాట్లాడేలా వారంలో మూడు రోజులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. విద్యార్థులు అంతర్జాతీయ పరీక్షకు సన్నద్ధమవుతున్నామన్న ఒత్తిడి లేకుండా సాధారణ తరగతి పరీక్షల్లో అంతర్భాగంగానే టోఫెల్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల ఒకటి నుంచి నాలుగో తేదీ వరకు నిర్వహించిన ఫార్మెటివ్ అసెస్‌మెంట్-1 (ఎఫ్‌ఏ 1)లోనూ టోఫెల్‌ను ఇంగ్లిష్ పార్ట్-బిగా నిర్వహించారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో 42 లక్షల మంది విద్యార్థుల్లో 3 నుంచి 9వ తరగతి చదివే వారు 27,22,038 మంది ఉన్నారు. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులను టోఫెల్ ప్రైమరీ, 6 నుంచి 9వ తరగతి విద్యార్థులను టోఫెల్ జూనియర్ పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ఈ పరీక్షలను మనబడి నాడు-నేడులో వసతులు కల్పించి, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెళ్లు, స్మార్ట్ టీవీలు ఉన్న పాఠశాలల్లో టోఫెల్ శిక్షణను తప్పనిసరి చేసి, మిగిలిన పాఠశాలల్లో ఐచ్ఛికం చేశారు.

ప్రత్యేక సిలబస్‌ను రూపొందించిన ఎస్సీఈఆర్టీ

టోఫెల్‌కు అర్హులైన విద్యార్థుల కోసం స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్ (ఎస్సీఈఆర్టీ) విభాగం ప్రైమరీ, జూనియర్ విద్యార్థులకు వేర్వేరుగా ప్రత్యేక సిలబస్‌ను, సంసిద్ధత పరీక్ష సరళిని అమలు చేస్తోంది. ప్రతి మంగళ, గురు, శుక్ర/శని వారాల్లో టోఫెల్ తరగతులతోపాటు, ప్రాక్టీస్ టెస్ట్ నిర్వహించి విద్యార్థుల ప్రగతిని, ప్రతిభను అంచనా వేస్తున్నారు. పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయడంలో భాగంగా 3 నుంచి 5 తరగతులకు వారానికి మూడుసార్లు స్మార్ట్ టీవీల ద్వారా ఆడియో, వీడియో కంటెంట్, 6 నుంచి 10వ తరగతి పిల్లలకు ఐఎఫ్‌పీల ద్వారా వీడియోలు ప్రదర్శిస్తున్నారు. ఇటీవల నిర్వహించిన ఫార్మెటివ్ అసెస్‌మెంట్-1లో సాధారణ అకడమిక్ పరీక్షల్లాగానే ఇంగ్లిష్ పరీక్షలో పార్ట్-బిగా టోఫెల్ సన్నాహక పరీక్షను 15 మార్కులకు నిర్వహించారు. ఇదే విధానం నాలుగు 'ఎఫ్‌ఏ' పరీక్షల్లోనూ ఉంటుందని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ప్రతాప్‌రెడ్డి 'సాక్షి'కి తెలిపారు.

క్లుప్తంగా...

అనుమతి లేని విద్యాసంస్థల సర్టిఫికెట్లు చెల్లవు: యూజీసీ

సాక్షి, అమరావతి: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్, ఇతర ప్రభుత్వ అధీకృత సంస్థల అనుమతి లేని విద్యాసంస్థల సర్టిఫికెట్లు చెల్లుబాటు కావని యూజీసీ స్పష్టం చేసింది. విద్యాసంస్థల్లో చేరే ముందే వాటికి గుర్తింపు ఉందా.. లేదా.. అనేది పరిశీలించుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచించింది. ఈ మేరకు యూజీసీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. 'రాష్ట్ర చట్టం, కేంద్ర చట్టం, ప్రావిన్షియల్ చట్టం, యూజీసీ యాక్ట్–1956 నిబంధనల ప్రకారం ఏర్పాటైన విశ్వవిద్యాలయాలు, సంస్థలకు మాత్రమే డిగ్రీని ప్రదానం చేసే అధికారం ఉంటుంది. ఉన్నత విద్య కోసం ఏదైనా సంస్థలో చేరే ముందు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయాలు, సంస్థలు ఏవి? నకిలీ సంస్థలు ఏవి? అనే సమాచారం కోసం యూజీసీ వెబ్‌సైట్ 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.యూజీసీ.ఏసీ.ఐఎన్'లో పరిశీలించాలి. ఏదైనా యూనివర్సిటీ, విద్యాసంస్థ యూజీసీ చట్టానికి విరుద్ధంగా అకడమిక్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తే 'యూజీసీఏఎంపీసీ ఎట్ ద రేట్ జీమెయిల్.కామ్'కు ఈ–మెయిల్ ద్వారా ఫిర్యాదు చేయాలి' అని వివరించింది.

ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రాథమిక మెరిట్ జాబితా విడుదల



సాక్షి, అమరావతి: 2023–24 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో కాంపిటెంట్ కోటా సీట్లలో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న 13,765 మంది విద్యార్థులతో ప్రాథమిక మెరిట్ జాబితాను సోమవారం డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం విడుదల చేసింది. ఏమైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ధ్రువీకరణపత్రాలతో విద్యార్థులు ఈ నెల తొమ్మిదో తేదీ సాయంత్రం నాలుగు గంటలలోపు తెలియజేయాలి. https://ugcq. ysruhs.com-/Grievance/index.php వెబ్‌సైట్‌లో లాగిన్ అయి విద్యార్థులు తమ అభ్యంతరాలను నమోదు చేయవచ్చని వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు.

ఏఎన్‌యూకి జాతీయ స్థాయిలో 3వ స్థానం

- పేటెంట్ల విభాగంలో కైవసం




ఏఎన్‌యూ: ఇండియా టుడే పత్రిక 2023వ సంవత్సరానికి ఉన్నత విద్యాసంస్థలపై నిర్వహించిన సర్వేలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పేటెంట్ల విభాగంలో జాతీయ స్థాయిలో మూడవ స్థానాన్ని పొందింది. ఈ మేరకు యూనివర్సిటీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ఆచార్య పి.రాజశేఖర్ మాట్లాడారు. పేటెంట్ల విభాగంలో ఢిల్లీలోని జామియా మిలియా యూనివర్సిటీ మొదటి స్థానంలోను, హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ రెండవ స్థానంలో, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ మూడవ స్థానంలో నిలిచాయన్నారు.

కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల చర్చలు

సాక్షి, అమరావతి: విద్యుత్ సంస్థల యాజమాన్యాలతో ఉద్యోగుల చర్చలు కొనసాగుతున్నాయి. ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఏపీ జెన్‌కో ఎండీ చక్రధర్ బాబు, ట్రాన్స్‌కో జేఎండీ బి.మల్లారెడ్డి సోమవారం జేఏసీ, వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘ నాయకులతో చర్చించారు. అయితే చర్చల్లో ఎలాంటి పురోగతి లేదని యూనియన్ నేతలు తెలిపారు. మాస్టర్ స్కేల్ రూ.2.4 లక్షలు దాటిన వారికి పర్సనల్ పే, 7 శాతం ఫిట్‌మెంట్, క్యాడర్ స్కేల్‌కు కూడా పీపీ లిమిట్ కూడా పెడతామన్నారని, ఇంతకుమించి ఎక్కువ ఇవ్వలేమని యాజమాన్యాలు స్పష్టం చేశాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో మంగళవారం 'వర్క్ టూ రూల్' చేపడతామని ప్రకటించారు.

10న నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం

- 1.10 కోట్ల మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ



సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 10వ తేదీన నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం వైద్యశాఖ నిర్వహించనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా 1 నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లలు, కిశోర బాలల్లో నులిపురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయనున్నారు. అంగన్‌వాడీలు, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఉచితంగా మాత్రలు అందించనున్నారు. 1.10 కోట్ల మంది విద్యార్థులకు మాత్రల పంపిణీ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే 1.17 కోట్ల మాత్రలను వైద్యశాఖ జిల్లాలకు సరఫరా చేసింది. ఒకటి నుంచి రెండేళ్లలోపు పిల్లలు 400 ఎంజీ మాత్రలో సగం మాత్రను పొడి చేసి నీళ్లలో కలిపి తీసుకోవాల్సి ఉంటుంది. రెండు నుంచి మూడేళ్ల పిల్లలు అయితే ఒక మాత్రను పొడి చేసి నీళ్లలో కలిపి తాగాలి. మూడు నుంచి 19 ఏళ్ల పిల్లలు ఒక మాత్ర వేసుకోవాల్సి ఉంటుంది.

వాయువేగంతో వెలిగొండ

దాదాపుగా పూర్తి కావస్తున్న రెండో సొరంగం పనులు



సాక్షి, అమరావతి: ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల్లోని దుర్భిక్ష ప్రాంతాల ప్రజల దశాబ్దాల స్వప్నం వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ఫలాలను అందించే దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నారనడానికి మరో తార్కాణమిది. ప్రాజెక్టు మొదటి సొరంగాన్ని 2021 జనవరి 13న పూర్తి చేసిన రాష్ట్ర ప్రభుత్వం రెండో సొరంగం పనులను శరవేగంగా కొలిక్కి తెస్తోంది. ఇప్పటికే 17.924 కి.మీ. పొడవున సొరంగం తవ్వకం పనులు పూర్తి కాగా మిగతా 876 మీటర్ల పనులను అక్టోబర్‌లోగా పూర్తి చేసేలా ముమ్మరం చేసినట్లు సీఈ మురళీనాథ్‌రెడ్డి 'సాక్షి'కి వెల్లడించారు.

శ్రీకారం చుట్టిన వైఎస్సార్

ఈ ఏడాదే శ్రీశైలం ప్రాజెక్టు నుంచి కృష్ణా జలాలను వెలిగొండలో అంతర్భాగమైన నల్లమల సాగర్‌కు తరలించి తొలి దశ పూర్తి చేసే దిశగా పనులను ప్రభుత్వం వేగవంతం చేసింది. శ్రీశైలం నుంచి రోజుకు 11,584 క్యూసెక్కులను తరలించి 53.85 టీఎంసీల సామర్థ్యంతో నల్లమల సాగర్‌లో నిల్వ చేసి ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ జిల్లాల్లో 4,47,300 (తీగలేరు కెనాల్ ద్వారా 62 వేలు, తూర్పు ప్రధాన కాలువ ద్వారా 3,70,800, గొట్టి పడియ కాలువ ద్వారా 9,500, గుండ్ల బ్రహ్మేశ్వరం రిజర్వాయర్ ద్వారా 3,500, రాళ్లవాగు ద్వారా 1,500) ఎకరాల ఆయకట్టుకు నీళ్లందించడంతోపాటు 15.25 లక్షల మంది దాహార్తిని శాశ్వతంగా తీర్చే లక్ష్యంతో దివంగత వైఎస్సార్ 2004 అక్టోబర్ 27న వెలిగొండకు శ్రీకారం చుట్టారు. జలయజ్ఞంలో భాగంగా వెలిగొండ ప్రాజెక్టుకు రూ.3,581.57 కోట్లు ఖర్చు చేసి నల్లమల సాగర్‌తోపాటు సొరంగాల్లో సింహభాగం పనులను పూర్తి చేశారు. సొరంగాలను నల్లమల సాగర్‌తో అనుసంధానించి 11,585 క్యూసెక్కులను తరలించేలా ఫీడర్ ఛానల్ పనులను చేయించారు. తీగలేరు కెనాల్, తూర్పు ప్రధాన కాలువ, గొట్టిపడియ కెనాల్ పనులను చేపట్టారు.

ప్రజాధనాన్ని లూటీ చేసిన చంద్రబాబు..

ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి అధికారాన్ని చేజిక్కించుకున్నాక 1996 లోక్‌సభ ఎన్నికల గండాన్ని గట్టెక్కేందుకు ఆ ఏడాది మార్చి 5న గొట్టిపడియ వద్ద నాటి సీఎం చంద్రబాబు వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత 1995 నుంచి 2004 వరకూ ఈ ప్రాజెక్టు కోసం కేవలం రూ.పది లక్షలు మాత్రమే అదికూడా శంకుస్థాపన సభ ఏర్పాట్లు, ఖర్చుల కోసం వ్యయం చేశారు. 2014లో మళ్లీ అధికారంలో ఉండగా వెలిగొండను చంద్రబాబు కామధేనువులా మార్చుకున్నారు. రూ.1,414.51 కోట్లు ఖర్చు చేసినా పనుల్లో ఎలాంటి ప్రగతి లేకపోవడం గత సర్కారు లూటీకి నిదర్శనం. జీవో–22(ధరల సర్దుబాటు), జీవో 63 (పనుల పరిమాణం ఆధారంగా బిల్లుల చెల్లింపు)ని వర్తింపజేసి కాంట్రాక్టర్లకు అప్పనంగా రూ.650 కోట్లకుపైగా దోచిపెట్టారు. 2017 నాటికే వెలిగొండను పూర్తి చేస్తామని ప్రకటించి టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషీన్) మరమ్మతుల కోసం కాంట్రాక్టర్లకు రూ.66.44 కోట్లను ఇచ్చేసి కమీషన్లు రాబట్టుకున్నారు. 2018, 2019 నాటికి పూర్తి చేస్తామంటూ ఎప్పటికప్పుడు హామీలిచ్చిన చంద్రబాబు చివరకు రెండో సొరంగం పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌ను తొలగించి అంచనా వ్యయాన్ని పెంచేశారు. అనంతరం వాటిని అధిక ధరలకు సీఎం రమేష్‌కు కట్టబెట్టి కమీషన్లు వసూలు చేసుకుని ప్రాజెక్టు పనులను గాలికి వదిలేశారు.

స్వప్నాన్ని సాకారం చేస్తున్న సీఎం వైఎస్ జగన్

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దివంగత వైఎస్సార్ చేపట్టిన వెలిగొండను పూర్తి చేసే దిశగా చిత్తశుద్ధితో అడుగులు వేస్తున్నారు. మొదటి సొరంగం పనుల్లో మిగిలిన 2.883 కి.మీ. పనులను 2019 నవంబర్‌లో ప్రారంభించి కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ 2021 జనవరి 13 నాటికి పూర్తి చేశారు. శ్రీశైలం నుంచి మొదటి సొరంగం ద్వారా నల్లమలసాగర్‌కు నీటిని విడుదల చేసే హెడ్ రెగ్యులేటర్ పనులను అదే ఏడాది పూర్తి చేశారు.
- గత సర్కారు అంచనా వ్యయం పెంచిన రెండో సొరంగంలో మిగిలిన పనులను రద్దు చేసిన సీఎం జగన్ వాటికి రివర్స్ టెండరింగ్ నిర్వహించారు. నాడు టీడీపీ సర్కార్ నిర్దేశించిన ధరల కంటే రూ.61.76 కోట్లు తక్కువ వ్యయంతో పూర్తి చేసేందుకు ముందుకొచ్చిన 'మేఘా' సంస్థకు 7.698 కి.మీ. సొరంగం పనులను అప్పగించారు. తద్వారా చంద్రబాబు అక్రమాలను ప్రజల ముందు పెట్టారు.
- వైఎస్సార్ హయాంలోనే నల్లమల పర్వత శ్రేణుల్లో ప్రకాశం జిల్లాలో విస్తరించిన వెలిగొండ కొండల మధ్య సుంకేశుల, గొట్టిపడియ, కాకర్ల వద్ద కాంక్రీట్ ఆనకట్టలు నిర్మించి 53.85 టీఎంసీల సామర్థ్యంతో నల్లమల సాగర్‌ను పూర్తి చేశారు.
- శ్రీశైలం నుంచి సొరంగాల ద్వారా విడుదల చేసిన నీటిని నల్లమల సాగర్‌కు తరలించేందుకు వీలుగా 23 కి.మీ. పొడవున ఫీడర్ ఛానల్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి.
- వెలిగొండ పనులకు ఇప్పటిదాకా రూ.953.12 కోట్లను వ్యయం చేసి ప్రతి పైసా సద్వినియోగమయ్యేలా జాగ్రత్తలు తీసుకుని శరవేగంగా పూర్తి చేసేలా సీఎం జగన్ చర్యలు చేపట్టారు.
- రెండో సొరంగంలో కాలం చెల్లిన టీబీఎం (టన్నెల్ బోరింగ్ మెషీన్) స్థానంలో గతేడాది మనుషుల ద్వారా పనులను చేపట్టారు. మొదటి సొరంగం నుంచి రెండో సొరంగంలోకి 17.8 కి.మీ, 16.555 కి.మీ, 14.5 కి.మీ, 13.5 కి.మీ, 12.5 కి.మీ వద్ద మనుషుల ద్వారా సొరంగాన్ని తవ్విస్తున్నారు. ఇప్పటికే 6.822 కి.మీ. పనులను కాంట్రాక్టు సంస్థ మేఘా పూర్తి చేసింది. మిగిలిపోయిన మరో 876 మీటర్ల పనులు అక్టోబర్‌లోగా పూర్తవుతాయి.

వెలిగొండ సొరంగాల తవ్వకం పనులు ఇలా..

టన్నెల్	పొడవు కి.మీ.లలో	2004–2014 (వైఎస్సార్ హయాంలో)		2014–19 (టీడీపీ హయాంలో)		2019 నుంచి ఇప్పటివరకూ		మిగిలిన పని	
		పొడవు (కి.మీ.లలో)	వ్యయం (రూ.కోట్లలో)	పొడవు (కి.మీ.లలో)	వ్యయం (రూ.కోట్లలో)	పొడవు (కి.మీ.లలో)	వ్యయం (రూ.కోట్లలో)	పొడవు (కి.మీ.లలో)	వ్యయం (రూ.కోట్లలో)
టన్నెల్–1	18.800	11.586	469.37	4.331	284.36	2.883	181.47	–	10.00
(రోజుకు సగటున తవ్వకం మీటర్లలో)		5.53		2.41		4.12			
టన్నెల్–2	18.800	8.747	410.30	2.355	136.37	6.822	183.09	0.876	335.00
(రోజుకు సగటున తవ్వకం మీటర్లలో)		4.79		1.31		4.35			



కచ్చిడి చేప @ రూ.3.80 లక్షలు

కోనసీమ జిల్లా బలుసు తిప్పకు చెందిన మత్స్యకారుడి వలకు సుమారు 30 కిలోల కచ్చిడి మగ చేప చిక్కింది. దీన్ని సోమవారం ఉదయం కాకినాడ కుంభాభిషేకం రేవుకు తెచ్చి వేలం నిర్వహించగా ఒక వ్యాపారి ఆ చేపను రూ.3.80 లక్షలకు దక్కించుకున్నాడు. ఈ చేప పొట్టలోని బ్లాడర్ ఔషధాల తయారీకి ఉపయోగిస్తారు. అందుకే దీనికి అంత డిమాండ్ ఏర్పడింది. – కాకినాడ రూరల్



నేలకూలిన 200 ఏళ్లనాటి మర్రిచెట్టు

అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట –మదనపల్లె మార్గంలో సుమారు 200 ఏళ్ల వయసున్న మర్రిచెట్టు నేలకూలింది. ఈ చెట్టు సోమవారం ఉదయం 7:30 గంటల సమయంలో ఒక్కసారిగా కూలి రోడ్డుపై అడ్డంగా పడిపోయింది. ఆ సమయంలో రాకపోకలు లేకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. కాగా, లోకాయుక్త చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఆ చెట్టు కూలిన ప్రదేశం గుండా కొద్ది నిమిషాల ముందే కారులో వెళ్లారు. ఆయనకు కొద్దిలో ప్రమాదం తప్పింది. – బి.కొత్తకోట

అప్పిలేట్ ట్రిబ్యునల్ ఆదేశాలపై స్టే ఇవ్వం

- ఈడీకి తేల్చిచెప్పిన తెలంగాణ హైకోర్టు
- ఆస్తుల అటాచ్ చెల్లదంటూ ఇదే కోర్టు గతంలోనే తీర్పునిచ్చింది
- అయినా పిటిషన్లు ఎలా వేస్తారు?
- ఏడాది క్రితం ఇచ్చిన 'వాన్‌పిక్' తీర్పుపై ఇప్పుడు అప్పీల్ చేస్తారా?
- ఈడీ తీరును తీవ్రంగా తప్పుపట్టిన హైకోర్టు ధర్మాసనం
- విచారణ ఈ నెల 11కు వాయిదా



సాక్షి, హైదరాబాద్: జగతి పబ్లికేషన్స్ పెట్టుబడుల వ్యవహారంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఇతరుల ఆస్తులను జప్తు నుంచి విడుదల చేయాలని అప్పిలేట్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ పిటిషన్లు దాఖలు చేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కి తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. ఈడీ తీరును హైకోర్టు తప్పుపట్టింది. ట్రిబ్యునల్ ఆదేశాలపై స్టే ఇవ్వాలన్న ఈడీ అభ్యర్థనను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది. ఇప్పటికే ఇదే తరహా కేసులో వాన్‌పిక్ సంస్థ ఆస్తుల జప్తు చెల్లదని, వాటిని వెంటనే విడుదల చేయాలని హైకోర్టు గతంలోనే తీర్పునిచ్చిన విషయాన్ని గుర్తు చేసింది. అయినా పిటిషన్లు ఎలా వేస్తారని ప్రశ్నించింది. ట్రిబ్యునల్ ఉత్తర్వులను సవాలు చేస్తూ దాఖలు చేసిన పిటిషన్లలోనూ ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వబోమని తేల్చి చెప్పింది. వాన్‌పిక్ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీల్ చేయనున్నట్లు ఈడీ న్యాయవాది చెప్పగా.. తీర్పు వచ్చి ఏడాది దాటిందని, ఇప్పుడు అప్పీల్ చేయాలని చూస్తున్నారా అంటూ ప్రశ్నించింది. పార్టీయే కాని సిలికాన్‌బిల్డర్స్ ఆస్తులను ఎలా జప్తు చేస్తారని ఈడీపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈడీ అభ్యర్థన మేరకు తదుపరి విచారణను ఈ నెల 11కు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ శ్యామ్ కోషి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. మనీలాండరింగ్ నిరోధక చట్ట ప్రకారం దాఖలైన కేసులో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆస్తులు కొన్నింటిని ఈడీ అటాచ్ చేసింది. ఈడీ జప్తును సమర్థిస్తూ అడ్జ్యుడికేటింగ్ అథారిటీ ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ వైఎస్ జగన్ సహా పలువురు 2016లో అప్పిలేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన ట్రిబ్యునల్.. ఈడీ చర్యలను తప్పుపట్టింది. రూ.746.17 కోట్ల ఆస్తులను జప్తు నుంచి వెంటనే విడుదల చేయాలని 2019 జూలై 26న ఉత్తర్వులు ఇచ్చింది. క్విడ్ ప్రో కో కింద పెట్టుబడులు వచ్చినట్లుగా నిరూపించడంలో ఈడీ విఫలమైందని తేల్చింది. అలాగే నిమ్మగడ్డ ప్రసాద్ ఆస్తుల జప్తు విషయంలో కూడా ఈడీ చర్యలను ట్రిబ్యునల్ తప్పుపట్టింది. ఆ ఆస్తులను కూడా విడుదల చేయాలని ఈడీని ఆదేశించింది. బ్యాంకు గ్యారెంటీ చూపాలని నిమ్మగడ్డ ప్రసాద్‌ను ఆదేశించింది. ట్రిబ్యునల్ ఇచ్చిన ఈ ఉత్తర్వులన్నింటినీ సవాలు చేస్తూ ఈడీ తెలంగాణ హైకోర్టులో 2019, 2020 సంవత్సరాల్లో వేర్వేరుగా పలు పిటిషన్లు దాఖలు చేసింది. ఈ పిటిషన్లపై హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ శ్యామ్ కోషి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. ఈడీ పిటిషన్లకు ఎలాంటి విచారణార్హత లేదని, వాటిని కొట్టేయాలని జగన్, ఇతర కంపెనీల న్యాయవాదులు ఎస్. నవీన్ కుమార్, తరుణ్ జి.రెడ్డి కోరారు. అప్పిలేట్ ట్రిబ్యునల్ ఉత్తర్వులపై స్టే ఇవ్వాలని ఈడీ తరపు న్యాయవాది అనిల్ తివారీ కోరారు.



హెపటైటిస్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి

హెచ్ఐవీ బాధితులు, హైరిస్క్ వర్గాలకు టీకా పంపిణీ

1.53 లక్షల మందికి తొలి డోసు.. 1.23 లక్షల మందికి రెండో డోసు

16 ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో ఉచిత స్క్రీనింగ్, వైద్య సేవలు

సాక్షి, అమరావతి: దీర్ఘకాలిక వ్యాధుల్లో అత్యంత ప్రమాదకరమైన హెపటైటిస్ వ్యాధి నియంత్రణ, నివారణపై రాష్ట్ర వైద్యశాఖ ప్రత్యేక దృష్టిసారించింది. సైలెంట్ కిల్లర్‌గా ఆరోగ్యానికి తీవ్ర నష్టం చేకూరుస్తున్న ఈ వ్యాధిపట్ల ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో హెపటైటిస్ బీ, సీ వ్యాధి చాపకింద నీరులా వ్యాప్తిచెందుతోంది. ఈ వ్యాధి నియంత్రణా చర్యల్లో భాగంగా హెచ్ఐవీ బాధితులు, హైరిస్క్ వర్గాలకు హెపటైటిస్–బి నుంచి రక్షణ కల్పించే టీకా పంపిణీని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతోంది. రాష్ట్రంలోని 55 యాంటి రెట్రోవైరల్ థెరపీ (ఏఆర్‌టీ) కేంద్రాల్లో టీకాను అందుబాటులో ఉంచింది. హెచ్ఐవీ బాధితులు, హైరిస్క్ వర్గాలకు చెందిన ట్రాన్స్‌జెండర్లు, మహిళా సెక్స్ వర్కర్లు, పురుష స్వలింగ సంపర్కులు, ఇన్‌జెక్టింగ్ డ్రగ్ యూజర్లకు టీకా వేస్తున్నారు. ఇందులో భాగంగా.. ఇప్పటివరకూ 1,53,933 మందికి తొలిడోసు టీకా వేశారు. వీరిలో 1,23,876 మందికి రెండో డోసు టీకా కూడా పంపిణీ చేశారు. తొలి డోసు వేసుకున్న నెలకు రెండో డోసు, తరువాత రెండు నెలలకు చివరి డోసు టీకా వేస్తారు. మూడు డోసుల టీకా వేస్తే వ్యాక్సినేషన్ పూర్తవుతుంది. హెపటైటిస్ నియంత్రణలో భాగంగా ఇప్పటికే వైద్యులు, వైద్య సిబ్బందికి వందశాతం టీకా పంపిణీ చేశారు. కొత్తగా విధుల్లో చేరుతున్న వారికి కూడా టీకా వేస్తున్నారు.

రోజుకు రెండు వేల మందికి స్క్రీనింగ్

వైద్యశాఖ అంచనాల ప్రకారం రాష్ట్రంలో 2.3 శాతం జనాభా హెపటైటిస్–బీ, 0.3 శాతం హెపటైటిస్–సీతో బాధపడుతున్నారు. ఈ వ్యాధికి రాష్ట్రంలోని 16 ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో ఉచిత స్క్రీనింగ్ వైద్య సేవలు అందిస్తున్నారు. రోజుకు రెండు వేల మందికి ఆస్పత్రుల్లో స్క్రీనింగ్ నిర్వహిస్తున్నారు. గత నెల 24–30 తేదీల మధ్య హెపటైటిస్–బికు సంబంధించి 7,440 మందికి స్క్రీనింగ్ నిర్వహించగా 173 మందికి పాజిటివ్‌గా తేలింది. అదే విధంగా 7,031 మందికి హెపటైటిస్–సీ స్క్రీనింగ్ చేయగా 42 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. శృంగారం, రక్తమార్పిడి, సిరంజిలు, టూత్‌బ్రష్, రేజర్లు వంటి వివిధ రూపాల్లో హెపటైటిస్–బీ ఒకరి నుంచి ఒకరికి వ్యాపిస్తుంది.

తప్పనిసరిగా టీకా వేయించుకోవాలి

హెచ్ఐవీ బాధితులు, హైరిస్క్ వర్గాల వారు హెపటైటిస్–బీ బారిన పడటానికి ఎక్కువ అవకాశాలుంటాయి. అందువల్ల వీరు తప్పనిసరిగా టీకా వేయించుకోవాలి. దగ్గర్లోని ఏఆర్‌టీ కేంద్రానికి వెళ్లి స్క్రీనింగ్ చేయించుకుని టీకా వేయించుకోవాలి. హెపటైటిస్ పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారు తమ కుటుంబ సభ్యులకు కూడా పరీక్షలు చేయించుకుని, ముందస్తు జాగ్రత్తలు పాటించాలి.


– డాక్టర్ నీలిమా, రాష్ట్ర ప్రత్యేకాధికారి
హెపటైటిస్ వ్యాధి నియంత్రణా కార్యక్రమం

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

రాజ్యాంగానికి లోబడే ఢిల్లీ సర్వీసుల బిల్లు.. అందుకే మా మద్దతు

- రాజ్యసభలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు విజయసాయిరెడ్డి



సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ సర్వీసుల బిల్లు రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు లోబడే ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు విజయసాయి రెడ్డి చెప్పారు. అందుకే ఈ బిల్లుకు తమ పార్టీ మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ బిల్లుపై సోమవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగంలోని 239ఏఏ అధికరణం కింద పేర్కొన్న మూడు సబ్ క్లాజుల మేరకు.. కేంద్రపాలిత ప్రాంతమైన ఢిల్లీకి సంబంధించి ఎలాంటి చట్టాన్నైనా రూపొందించే అధికారం పార్లమెంట్‌కు ఉందని చెప్పారు. సుప్రీంకోర్టు చెప్పిన మేరకు ఢిల్లీ సర్వీసులపై సర్వాధికారాలు కేంద్ర ప్రభుత్వానికి ఉండేలా చట్టం చేసే అధికారం పార్లమెంట్‌కు ఉందని, ఢిల్లీ ప్రభుత్వ ఎగ్జిక్యూటివ్ అధికారాలకు కేంద్రం పరిమితులను విధించవచ్చని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 239ఏఏ అధికరణ కింద పేర్కొన్న క్లాజ్‌లను, సుప్రీంకోర్టు ఆదేశాలను కలిపి పరిశీలిస్తే ఢిల్లీ బిల్లుకు పూర్తి చట్టబద్ధత ఉన్నట్లేనని చెప్పారు. కొన్ని విపక్షాలు స్వప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ఈ బిల్లును వివాదాస్పదం చేశాయని తెలిపారు. బిల్లుకు మద్దతు తెలుపుతున్నందుకు ఆప్ సభ్యుడు రాఘవ్ చద్దా వైఎస్సార్‌సీపీ సహా ఎన్డీయేతర పక్షాలను వేలెత్తిచూపడం సరికాదన్నారు. ఈ బిల్లు పాసైతే ఆమ్ ఆద్మీ పార్టీ.. అబ్సల్యూట్ అనార్కీ పార్టీ (ఆప్) అవుతుందన్నారు. తానాషాహీ పార్టీ తమ స్వార్థ ప్రయోజనాలకు ఢిల్లీని వాడుకోజాలదని పేర్కొన్నారు. ఎవరో ఒత్తిడి చేయడం వల్లో, నిర్బంధంగానో ఈ బిల్లుకు మద్దతు తెలపడం లేదని చెప్పారు. నీతిలేని పాలన నుంచి ఢిల్లీని రక్షించడానికే తామంతా ఈ బిల్లుకు మద్దతు ఇస్తున్నట్లు స్పష్టం చేశారు.

డేటా లీక్ కాకుండా చూడాలి

కేంద్రం సేకరించే జాతీయస్థాయి సమాచారం బయట వ్యక్తులకు లీక్ కాకుండా చూడాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ వి.విజయ సాయిరెడ్డి కోరారు. సోమవారం రాజ్యసభలో జనన మరణాల రిజిస్ట్రేషన్ సవరణ బిల్లుపై ఆయన మాట్లాడుతూ.. ఏపీ సీఎం వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన గ్రామ సచివాలయాలు ఈ విషయంలో అద్భుతమైన ఫలితాలు ఇస్తున్నాయన్నారు. జాతీయ డేటా బేస్‌ను రాష్ట్రాలతో అనుసంధానం చేయాలన్నారు. బిల్లుకు వైఎస్సార్‌సీపీ తరఫున మద్దతు తెలిపారు.

జూన్ 2024 కల్లా కేఎస్‌పీఎల్ పూర్తి

జాతీయ గ్యాస్ గ్రిడ్‌లో భాగమైన కాకినాడ–విశాఖ–శ్రీకాకుళం సహజవాయు పైపులైను (కేఎస్‌పీఎల్) వచ్చే జూన్‌కల్లా పూర్తవుతుందని కేంద్ర పెట్రోలియం, సహజవాయువులశాఖ సహాయమంత్రి రామేశ్వర్ తేలి.. వైఎస్సార్‌సీపీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు జవాబిచ్చారు.

లోక్‌సభ

4 బిల్లులకు వైఎస్సార్‌సీపీ మద్దతు

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభలో సోమవారం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు బిల్లులకు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపింది. మీడియేషన్ బిల్లు–2021, ద ఫార్మసీ (సవరణ) బిల్లు, ద డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ బిల్లు–2023, అనుసంధాన్ నేషనల్ ఫౌండేషన్ (ఎన్‌ఆర్‌ఎఫ్) బిల్లు–2023లకు మద్దతు ఇచ్చింది. ఈ బిల్లులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ ఎంపీలు మాట్లాడారు. ఎన్‌ఆర్‌ఎఫ్ బిల్లుపై ఎంపీ తలారి రంగయ్య మాట్లాడుతూ దేశంలో శాస్త్రీయ పరిశోధనలను విప్లవాత్మకంగా మార్చడానికి ఈ బిల్లు ఎంతో దోహదపడుతుందని చెప్పారు. నిధులు నిర్ధారణ, జాతీయ లక్ష్యాలకు ప్రాధాన్యం ఇవ్వడం, పరిశోధకులు, ఆవిష్కర్తలను ప్రోత్సహించడం, వారిలో సామర్థ్యాన్ని వెలికితీయడానికి ఉపకరిస్తుందని పేర్కొన్నారు. పరిశోధకులు తమ ప్రాజెక్టులు ప్రారంభించడానికి సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరారు. మీడియేషన్ బిల్లుపై ఎంపీ ఎన్.రెడ్డెప్ప మాట్లాడుతూ సరైన సమయంలో వస్తున్న బిల్లుగా అభివర్ణించారు. కార్పొరేట్లకు సంబంధించి మధ్యవర్తిత్వ పరిష్కారాలను అనుమతించడం ద్వారా సులభతర వాణిజ్యాన్ని పెంపొందింపజేస్తుందని, పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని నింపుతుందని చెప్పారు. బిల్లులో లోటుపాట్లకు సహేతుక పరిష్కారాలు చూపాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఫార్మసీ బిల్లుపై ఎంపీ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ బిల్లుపై సభ్యులు లేవనెత్తిన సమస్యలు, ఆందోళనలు పరిష్కరిస్తే కచ్చితమైన ఫలితాలు వస్తాయని చెప్పారు. ఆర్థికవ్యవస్థను కూడా ముందుకు తీసుకెళ్లే అవకాశం ఉందన్నారు. దేశంలో ఈ–ఫార్మసీ మార్కెట్ సుమారు 45 శాతం వరకు ఉందని తెలిపారు. అయితే స్వతంత్ర చట్టం లేదని చెప్పారు. డిజిటల్ పర్సనల్ డాటా ప్రొటెక్షన్ బిల్లుపై ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ బిల్లులో రాష్ట్రాల వ్యక్తిగత డాటా దుర్వినియోగం చేయకుండా నిరోధించడానికి తగినంతగా తనిఖీలు ఉండాలని చెప్పారు. ప్రభుత్వ ఏజెన్సీలు నిర్వహించే డాటా ప్రాసెసింగ్ కార్యకలాపాలు నియంత్రించడానికి మార్గదర్శకాలు, పర్యవేక్షణ యంత్రాంగాల గురించి బిల్లులో చెప్పారన్నారు. అయితే జాతీయ భద్రత, చట్టం అమలు ప్రయోజనాల నిమిత్తం తగిన పరిమితులు ఉండాలని ఆయన కేంద్రానికి సూచించారు.

పీఎంకేవీవైలో 85,401 మందికి శిక్షణ

ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై)లో భాగంగా మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లోని 85,401 మంది శిక్షణ పొందారని కేంద్ర నైపుణ్యాభివృద్ధిశాఖ సహాయమంత్రి రాజీవ్ చంద్రశేఖర్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. పీఎంకేవీవై 2.0, 3.0, 4.0ల్లో భాగంగా ఏపీకి రూ.87.78 కోట్లు కేటాయించగా రూ.57.39 కోట్లు విడుదల చేశామని, రూ.51.30 కోట్లు ఖర్చయ్యాయని వివరించారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

పంట నష్టాన్ని అందించండి



ధ్వంసమైన పంటను చూపుతున్న రైతు

కంప్లి: అడవి పందులు మొక్కజొన్న పొలంలోకి చొరబడి పంటను నాశనం చేయడంపై రైతు శెట్రు శంకర వీరప్ప ఆవేదన వ్యక్తం చేశారు. తనకున్న రెండు ఎకరాల పొలంలో అప్పు చేసి మొక్కజొన్న నాటానని, మరికొద్ది రోజుల్లో కంకులు చేతి కందే సమయంలో రాత్రికి రాత్రే అడవి పందులు పంటను నాశనం చేశాయని, తనకు పంట నష్టాన్ని అందించాలని ఒత్తిడి చేశారు.

కారు ఢీకొని ఇద్దరి మృతి

సాక్షి,బళ్లారి: ఇద్దరిని కారు ఢీకొనడంతో మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. హావేరి జిల్లా శిగ్గాంవి తాలూకా నీరలగి గ్రామ సమీపంలో పుణె–బెంగళూరు జాతీయ రహదారిలో రోడ్డు పక్కన నిలబడిన విరుపాక్షప్ప(60), చిదానంద(53) అనే ఇద్దరు నీరలగి గ్రామం నుంచి శిగ్గాంవి పట్టణానికి వెళుతుండగా కారు ఢీకొని మరణించారు. దీంతో గ్రామస్తులు కోపోద్రిక్తులై జాతీయ రహదారిలో వాహన రాకపోకలను అడ్డుకొని నిరసన తెలిపారు. మృతదేహాలకు శిగ్గాంవి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించగా, అక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

చిన్నారులకు బిస్కెట్ల పంపిణీ



బిస్కెట్లను పంపిణీ చేస్తున్న శకుంతల రెడ్డి

బళ్లారిఅర్బన్: సిద్దేశ్వర ధర్మ జాగృతి సంస్థ నిర్వాహకురాలు శకుంతల రెడ్డి సోమవారం పటేల్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులకు బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ సంస్థ నుంచి ఏటా విద్యార్థులకు బిస్కెట్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

వేడుకగా చిన్న పీర్ల పండుగ



నగరంలో పీర్ల దేవుళ్ల ఊరేగింపు దృశ్యం

బళ్లారిఅర్బన్: నగరంలో సోమవారం సాయంత్రం వరకు మొహర్రం అనంతరం గత వారం రోజులుగా నిర్వహించిన చిన్నపీర్ల పండుగను వేడుకగా జరుపుకున్నారు. ఆయా వార్డుల్లో చావిళ్ల వద్ద ఏర్పాటు చేసిన పీర్లదేవుళ్లను ఆదివారం 9కస్ నాటికి అగ్నిగుండం వేసి పానకాలు, బట్టలు, వెండి ఆభరణాలు, పూలు, చక్కెర చదివింపులు చేసి మొక్కులను తీర్చుకున్నారు. తెల్లవారు జామున అగ్నిగుండంలోకి దిగి భక్తులు అడిగిన కోర్కెలకు శాంతింపజేశారు. సాయంత్రం వీధుల్లో ఊరేగింపుగా దేవుళ్లను ఏటికి తరలించారు.

కాలువకు నీటి బంద్‌పై నిరసన



మాట్లాడుతున్న చామరస మాలిపాటిల్

రాయచూరు రూరల్: జిల్లాలోని దేవదుర్గ తాలూకాలో నారాయణపుర కుడి కాలువ ఆయకట్టు రైతులు కాలువకు నీరు బంద్ చేయడంపై రైతు సంఘం నేతలు ఆందోళన చేపట్టారు. సోమవారం దేవదుర్గలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు చామరస మాలిపాటిల్ మాట్లాడారు. కాలువపై 9వ మైలు వద్ద వడవాటి శాఖలో శావంతగల్ రైతులు కాలువ నీటిని ముందుకు పారకుండా అడ్డుకట్ట వేయడాన్ని ఖండిస్తూ రాస్తారోకో చేపట్టారు. పోలీసులు రైతులను అదుపులోకి తీసుకొనే ప్రయత్నం చేశారు. ఉప కాలువలైన 15, 16, 17, 18 కి.మీ. రైతులకు నేటికీ పరిహారం అందలేదన్నారు. నారాయణపుర కుడి కాలువ కింద భూయజమానులపై తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

నడ్డాపై కేసు కొట్టివేత

హుబ్లీ: గత అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా 2023 మే 7న విజయనగర జిల్లా హరపనహళ్లిలో చేపట్టిన కర్ణాటక ఎన్నికల ప్రచార సభలో ఓటర్లను ఆకర్షించేలా ప్రసంగించిన ఆరోపణలపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాపై ఎన్నికల కోడ్ ఉల్లంఘించారంటూ నమోదైన కేసును ధార్వాడ హైకోర్టు రద్దు చేసింది. ఆయనపై ఎన్నికల కమిషన్ అధికారుల ఫిర్యాదు మేరకు హరపనహళ్లి పోలీసులు నమోదు చేసిన కేసును రద్దు చేయాలని కోరుతూ జేపీ నడ్డా రిట్‌ను దాఖలు చేశారు. ధార్వాడ హైకోర్టు పీఠం నుంచి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ చేపట్టిన జడ్జి జస్టిస్ ఎం.నాగప్రసన్న ఏకసభ్య ధర్మాసనం పైమేరకు ఆదేశాలిచ్చింది.

ఇంద్రధనుష్‌తో వ్యాధులకు చెక్

- రాష్ట్రంలో 1,65,127 మందికి చుక్కల మందు
- రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి దినేష్ గుండూరావు



జ్యోతి వెలిగిస్తున్న దినేష్ గుండూరావు, చిత్రంలో మరో మంత్రి బోసురాజు, ఎమ్మెల్యే, అధికారులున్నారు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో గర్భిణులు, ఐదేళ్ల లోపు పిల్లలకు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణకు మిషన్ ఇంద్రధనుష్ 5.0ను దిగ్విజయం చేయాలని రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి దినేష్ గుండూరావు పిలుపు ఇచ్చారు. ఆయన సోమవారం నగరంలోని లాల్ బహద్దూర్ శాస్త్రినగర్‌లో రాష్ట్ర స్థాయి మిషన్ ఇంద్రధనుష్ 5.0, నమ్మ క్లినిక్‌లను జ్యోతి వెలిగించి ప్రారంభించి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. గతంలో ప్లేగు, తట్టు, క్షయ వంటి వ్యాధులను ప్రభుత్వం అరికట్టిందన్నారు. ప్రతి క్లినిక్‌లో 23 రకాల వ్యాధుల టీకాలు వేసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 1,65,127 మంది పిల్లలకు చుక్కల మందును వేయాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్లు తెలిపారు. నగరంలో 12,224 మంది పిల్లలు, రాష్ట్రంలో 42,917 మందితో పాటు నగరంలో 1808 మంది గర్భిణులు ఉన్నారన్నారు. మిషన్ ఇంద్రధనుష్‌లో రాయచూరు, బళ్లారి, కోలారు, బాగల్‌కోటె, బెళగావి, విజయపుర, దక్షిణ కన్నడ, బెంగళూరు నగర జిల్లాల్లో ఈ పథకంలో ఆగస్టు 7 నుంచి 12 వరకు, సెప్టెంబర్ 9 నుంచి 14 వరకు, అక్టోబర్‌లో 1 నుంచి 16వ వరకు ఉచితంగా చుక్కలు వేస్తారన్నారు.

నాలుగు జిల్లాల్లో ఆశా కిరణ్ పథకం అమలు

రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా నాలుగు జిల్లాల్లో ఆశా కిరణ్ పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఉచితంగా కంటి చికిత్సలు, ఆపరేషన్, కంటి అద్దాల పంపిణీ పథకానికి త్వరలో రాయచూరు, చిక్కబళ్లాపుర, కోలారు, చిత్రదుర్గ జిల్లాల్లో శ్రీకారం చుడతారన్నారు. అనంతరం ఉత్తర కన్నడ, చామరాజ నగర్, బెంగళూరు గ్రామీణ జిల్లాలకు ఆశాకిరణ్ పథకం విస్తరిస్తారన్నారు. 23 పీహెచ్‌సీల్లో వైద్య సిబ్బందిని నియమిస్తామన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరలకే ఆరోగ్యం లభించాలన్నదే సర్కార్ లక్ష్యమన్నారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ అమలు పరచిన పథకాలకు ప్రజల మద్దతు ఉందన్నారు. సమావేశంలో చిన్న నీటిపారుదల శాఖా మంత్రి ఎస్ఎస్.బోసురాజు, ఎమ్మెల్యేలు బసనగౌడ, హంపయ్య నాయక్, రాష్ట్ర వైద్యాధికారులు ఇందుమతి, నవీన్ భట్, రంజిత్ కుమార్, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, ఎస్పీ నిఖిల్, అదనపు జిల్లాధికారి దురుగేష్, ఆరోగ్య అధికారి సురేంద్ర బాబులున్నారు.

ఎంసీహెచ్ ఆస్పత్రిని ప్రారంభిస్తాం

రాయచూరు రూరల్: నగరంలో తల్లీబిడ్డల(ఎంసీహెచ్) ఆస్పత్రిని త్వరలో ప్రారంభిస్తామని రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి దినేష్ గుండూరావు పేర్కొన్నారు. సోమవారం వీవీపీ భవన్‌లో అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నెలల క్రితం దేవదుర్గ తాలూకా గబ్బూరులో కేంద్ర మంత్రి అమిత్ షా వర్చువల్ ద్వారా ఆస్పత్రిని ప్రారంభించారన్నారు. రూ.15 కోట్లతో 60 పడకల ఆస్పత్రిని ప్రారంభించినా వైద్యులు, సిబ్బంది, అధికారులు, ఉద్యోగుల నియామకాలు చేపట్టలేదన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిపై నియమించుకోవాలని జిల్లాధికారికి సూచించారు. సమావేశంలో చిన్న నీటిపారుదల శాఖా మంత్రి ఎస్ఎస్.బోసురాజు, ఎమ్మెల్యేలు బసన గౌడ, హంపయ్య నాయక్, జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, ఆరోగ్యాధికారి సురేంద్రబాబు, వైద్యాధికారులు ఇందుమతి, నవీన్ భట్, రంజిత్ కుమార్ ఉన్నారు.

ఇంద్రధనుష్ లబ్ధి పొందండి

కోలారు: ఇంద్రధనుష్ 5.0 లబ్ధిని ప్రతి ఒక్కరూ పొందాలని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. సోమవారం చెన్నయ్య రంగమందిరంలో వ్యాక్సినేషన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ ఇంట్లోని పిల్లలు, గర్భిణులకు టీకాలను తప్పనిసరిగా వేయించాలన్నారు. జిల్లాలోని అన్ని తాలూకాల్లో ఈ అభియాన్‌ను అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఇదే సమయంలో మిషన్ ఇంద్రధనుష్ 5.0 పోస్టర్లను విడుదల చేశారు. ఎమ్మెల్సీ అనిల్‌కుమార్, డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ శంకర్ వణిక్యాళ్, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ వీణా, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ జగదీష్, డాక్టర్ ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

బస్టాప్‌లు లేక ప్రయాణికుల ఇబ్బందులు



బస్‌షెల్టర్ లేక ఫుట్‌బాల్ స్టేడియం ముందు బస్సు కోసం ఎండలోనే వేచి ఉన్న ప్రయాణికులు

బళ్లారిఅర్బన్: గనుల జిల్లాకు కేంద్రంగా పేరు గాంచిన నగరంలో అనంతపురం, ఉరవకొండ, గుంతకల్లు, ఆలూరు, ఆదోని, కర్నూలు, మంత్రాలయంకు వైపునకు వెళ్లే ప్రయాణికులకు బస్టాప్‌లు లేక రోడ్లపైనే బస్సుల కోసం నిలబడే పరిస్థితి నెలకొంది. రాయల్ సర్కిల్ నుంచి అనంతపురం బైపాస్ వరకు ఒక్క బస్టాప్ కూడా లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానిక ఫుట్‌బాల్ స్టేడియం ముందు, ఇందిరా సర్కిల్, జిల్లా ఆస్పత్రి ముందు, ఎంజీ సర్కిల్, బైపాస్ ప్రాంతాల్లో రోడ్డు వెడల్పు పనులు చేసినా ఒక్క బస్టాప్ కూడా నిర్మించక పోవడంతో ఎండనక, వాననక ఫుట్‌పాత్ పైనే నిలబడి బస్సు ఎక్కే పరిస్థితి నెలకొంది. తల్లీబిడ్డలు ఉన్న వారు మాత్రం నేలపై కూర్చోవాల్సిందే. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ప్రయాణికులకు బస్సు షెల్టర్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

పార్టీ బలోపేతానికి పిలుపు

సాక్షి,బళ్లారి: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, ఎమ్మెల్యేలు అందరూ కలిసికట్టుగా పని చేస్తూ జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సీఎం సిద్ధరామయ్య, డీసీఎం డీకే శివకుమార్ పేర్కొన్నారు. సోమవారం బెంగళూరులోని సీఎం కార్యాలయం కృష్ణాలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యేలు భరత్‌రెడ్డి, తుకారాం, నాగరాజు, గణేష్ తదితరులకు సీఎం, డీసీఎంలు ప్రత్యేక సూచనలు, సలహాలు, క్లాస్‌లు ఇచ్చారు. జిల్లా అభివృద్ధికి తమ వంతు పూర్తి సహకారం, నిధులను అందజేస్తామన్నారు. మీరు కూడా భేదాభిప్రాయాలు వీడి ప్రజల్లో పార్టీపై మరింత విశ్వాసం పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో దేశంలో ఇండియా పార్టీ అధికారంలోకి రావాలంటే మనందరం సైనికుల్లా పని చేయాలని సూచించారు. అందుకు మీరందరూ కలిసికట్టుగా ఇప్పటి నుంచే పని చేయాలని సూచించారు.అనంతరం మంత్రి నాగేంద్ర మాట్లాడుతూ తామందరం కలిసికట్టుగా పని చేస్తున్నామన్నారు. ఎలాంటి అసమ్మతి లేదన్నారు. ఖచ్చితంగా ప్రజల్లో మరింత నమ్మకాన్ని కలిగిస్తామని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పార్టీని గెలిపించి తీరుతామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.

కాలేజీ ముందు ఆత్మహత్యాయత్నం

లేపాక్షి: భార్య కాపురానికి రాలేదనే బాధతో భర్త పెట్రోలు పోసుకుని నిప్పు అంటించుకోగా స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల కేంద్రమైన లేపాక్షిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా వున్నాయి. ఆమడగూరు మండలం ఆకువానిపల్లి గ్రామానికి చెందిన హరిక్రిష్ణ (23) అనే యువకుడు, చిలమత్తూరు మండలంలోని గాడ్రాలపల్లికి చెందిన లలిత (20) రెండేళ్ల కిందట ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అయితే సంవత్సరం క్రితం ఇద్దరి మధ్య గొడవలు జరిగి విడిపోయారు. అప్పటి నుండి హరిక్రిష్ణ బెంగళూరులో పని చేసుకుంటున్నాడు, భార్య లేపాక్షిలోని ప్రభుత్వ కళాశాలలో చదువుతోంది. సోమవారం ఉదయం భార్యను చూడాలని, కాపురానికి పిలుచుకెళ్లాలని హరిక్రిష్ణ వచ్చాడు. అతడు వచ్చిన విషయం తెలిసి లలిత కాలేజీ నుంచి బయటకు రాలేదు. దీంతో హరిక్రిష్ణ తెచ్చుకున్న పెట్రోలును శరీరం మీదకు పోసుకుని నిప్పు పెట్టుకునే యత్నం చేస్తుండగానే అక్కడున్న విద్యార్థులు నివారించారు. అయినప్పటికి కొంత మేర పెట్రోలు మంటలు అక్కడక్కడ పడడంతో స్వల్ప గాయాలు అయ్యాయి. పోలీసులు వచ్చి అతన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

రైతు వ్యతిరేక విధానాలపై ధర్నా

- కలెక్టరేట్ ఎదుట బైటాయించిన బీజేపీ నాయకులు
- కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగిన నేతలు



బళ్లారిలో కలెక్టరేట్ ముందు పార్టీ నేతల నిరసన



రాయచూరులో ఆందోళనలో పాల్గొన్న పార్టీ నేతలు

సాక్షి, బళ్లారి: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలు, విద్యుత్ చార్జీల పెంపుపై బీజేపీ రైతు మోర్చా నేతృత్వంలో సోమవారం కలెక్టరేట్ ముందు నేతలు ధర్నా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నామన్నారు. రైతులు పండించిన పంటలను అమ్ముకునేందుకు ఏపీఎంసీ చట్టాన్ని రద్దు చేయడం అన్యాయమన్నారు. పలు పథకాలను రద్దు చేసి రైతులకు మోసగిస్తోందన్నారు.

విద్యుత్ చార్జీలను పెంచడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తుంగభద్ర సమాంతర కాలువకు నిధులు మంజూరు చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆత్మహత్యలను పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సోమలింగప్ప, జిల్లాధ్యక్షుడు మురారిగౌడ, ప్రముఖులు గురులింగనగౌడ, రామలింగప్ప, యర్రంగళి తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

రాయచూరులో...

రాయచూరు రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని బీజేపీ నేతలు మండిపడ్డారు. సోమవారం జిల్లాధికారి కార్యాలయం వద్ద చేపట్టిన ఆందోళనలో జిల్లా రైతు మోర్చా అధ్యక్షుడు సిద్దనగౌడ మాట్లాడారు.

బీజేపీ ప్రభుత్వం అమలు చేసిన ఏపీఎంసీ చట్టం, కోటి విద్యా పథకం, భూసిరి చట్టం రద్దు, జిల్లాకు కేటాయించిన గోశాల రద్దు, విద్యుత్ ధరల పెంపు, రైతుల జీవన జ్యోతి పథకాలను రద్దు చేశారన్నారు. పంచ గ్యారంటీల పేరుతో ఖజానాను లూటీ చేస్తున్నారన్నారు. ప్రభుత్వం రద్దు చేసిన పథకాలను తిరిగి అమలు చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

నోటి శుభ్రతను కాపాడుకోవాలి

- ప్రతిరోజూ రెండు సార్లు పళ్లు తోముకోవాలి
- పీడియాట్రిక్ విభాగ ప్రముఖుడు డాక్టర్ ప్రదీప్



జ్యోతిని వెలిగించి ప్రారంభిస్తున్న అతిథులు

బళ్లారి రూరల్: నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని మాజీ డైరెక్టర్, బెంగళూరు ప్రభుత్వ దంతవైద్యకళాశాల పీడియాట్రిక్ విభాగ ప్రముఖుడు డాక్టర్ ఏ.ఆర్. ప్రదీప్ తెలిపారు. బళ్లారి ప్రభుత్వ దంతవైద్య కళాశాల పీడియాట్రిక్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం విమ్స్ వైద్యభవన్‌లో ఏర్పాటు చేసిన ఓరల్ హైజీన్ డేలో పాల్గొని మాట్లాడారు. మానవ శరీరంలో నోరు ప్రధానమైందన్నారు. నోటి ద్వారానే శరీరానికి అవసరమైన ఆహారాన్ని తీసుకొంటామన్నారు. అలాంటి నోటిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోజూ ఉదయం, రాత్రి రెండు పూటలా బ్రష్ చేసుకొంటూ దంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాన్, గుట్కా, పొగాకు, సిగరెట్లు వాడరాదని తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు గ్రామాల్లో ఓరల్ హైజీన్ గురించి తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో విమ్స్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జున, దంతవైద్య కళాశాల ప్రిన్స్‌పాల్ డాక్టర్ భారతి, బెంగళూరు ప్రభుత్వ దంతవైద్యకళాశాల మాజీ ప్రొఫెసర్ డాక్టర్ రామచంద్ర ప్రసాద్, డీహెచ్ఓ డాక్టర్ జనార్థన్, డీఎస్ డాక్టర్ బసిరెడ్డి, బళ్లారి దంతవైద్య కళాశాల మాజీ ప్రిన్స్‌పాల్ డాక్టర్ దివాకర్, విమ్స్ ప్రిన్స్‌పాల్ డాక్టర్ కృష్ణస్వామి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖాలీ ఫ్లవర్

- నకిలీ విత్తన విక్రేతలపై చర్యలేవీ?



పంట నష్టాన్ని చూపుతున్న రైతు సంఘం పదాధికారులు

కోలారు: నకిలీ విత్తనాలు, మందులు, కీటనాశకాలను విక్రయిస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని రైతు సంఘం పదాధికారులు డిమాండ్ చేశారు. తాలూకాలోని ముదువత్తి గ్రామంలో నకిలీ విత్తనాలతో పంట నష్ట పోయిన రైతు శ్రీరామప్ప పొలాన్ని సోమవారం వారు సందర్శించిన అనంతరం మాట్లాడారు. తాలూకాకు చెందిన రైతు తన 4 ఎకరాల్లో కాలీఫ్లవర్ సాగు చేయగా దాదాపు రూ.10 లక్షల మేర నష్టం కలిగిందన్నారు. రైతుకు నష్టపరిహారం అందించడంతో పాటు నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులను నమోదు చేసి కఠినంగా శిక్షించాలని జిల్లా యంత్రాంగాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఈకంబళ్లి మంజునాథ్, యారంఘట్ట గిరీష్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

కళారంగంపై శిక్షణ ఇస్తాం



మాట్లాడుతున్న కళామందిరం పదాధికారులు

బళ్లారిఅర్బన్: నగరంలోని నాలుగు పాఠశాలలను దత్తత తీసుకొని కళారంగంపై ఆసక్తిగల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తామని రాఘవ మెమోరియల్ గౌరవ అధ్యక్షులు కనుగోలు చెన్నప్ప పేర్కొన్నారు. సోమవారం రాఘవ కళామందిరంలో విలేకరులతో వారు మాట్లాడారు. ఇటీవల రాఘవ జయంతి వేడుకలను రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించామన్నారు. సంగీతం, నాటకం, సాంస్కృతిక రంగాల్లో యువతకు శిక్షణను అందిస్తామన్నారు. సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి రూ.5 లక్షలను రాఘవ కళా మందిరం స్టేజ్ మరమ్మతులకు అందిస్తున్నట్లు తెలిపారు. రూ.10 లక్షల ఖర్చుతో ఈ మరమ్మతు పనులు చేస్తామన్నారు. మిగిలిన రూ.5 లక్షలను జిందాల్ వారిని కోరుతున్నట్లు తెలిపారు. మెమోరియల్ అధ్యక్షులు కే.కోటేశ్వరరావు, పదాధికారులు ఎస్.బసవరాజ్, ప్రసాద్, రామాంజినేయులు, రమణప్ప పాల్గొన్నారు.

స్పా సెంటర్ల ముసుగులో వ్యభిచారం

సాక్షి,బళ్లారి: నగరంలోని ప్రముఖ లాడ్జీలు, హోటళ్లలో స్పా సెంటర్ల పేరుతో అసాంఘీక కార్యకలాపాలు జరుపుతున్నట్లు పోలీసుల తనిఖీల్లో వెలుగులోకి వస్తోంది. ఆదివారం రాత్రి నగరంలోని ఇన్‌ఫ్యాంట్రీ రోడ్డులో వేశ్యవాటికపై కౌల్‌బజార్ పోలీసులు మెరుపుదాడి నిర్వహించారు. తనిఖీలు చేసి పలువురు మహిళలను రక్షించడంతో పాటు సెంటర్‌ను నిర్వహిస్తున్న ప్రభుగౌడతో పాటు మరో ఏడు మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నాగాల్యాండ్, ఢిల్లీ, వెస్ట్‌బెంగాల్, ఒడిశా తదితర రాష్ట్రాలకు చెందిన మహిళలను రక్షించి, అసాంఘీక కార్యకలాపాలు నిర్వహించే వారిని పట్టుకున్నారు. నగరంలో పలు స్పా(మసాజ్) సెంటర్ల పేరుతో లోపల అసాంఘీక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు నగరంలో జోరుగా ప్రచారం సాగుతోంది. పోలీసులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతోనే స్పా సెంటర్లలో అసాంఘీక కార్యకాలాపాలు జరుపుతూ నిర్వాహకులు జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. పూర్తి స్థాయిలో ప్రముఖ లాడ్జీలు, హోటళ్లలో నిర్వహిస్తున్న స్పా సెంటర్లను తనిఖీ చేస్తే పైన బోర్డులు మాత్రం మసాజ్ సెంటర్లు అని చూపుతూ లోపల మాత్రం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన మహిళలతో అసాంఘీక కార్యకలాపాలు జరుపుతున్నట్లు సమాచారం.

హిందీ ఉపాధ్యాయినికి వీడ్కోలు



ఉపాధ్యాయినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

హొసపేటె: టీబీ డ్యాం ప్రభుత్వ పీఎల్‌సీ పాఠశాల హిందీ ఉపాధ్యాయిని శోభకు వేరే పాఠశాలకు బదిలీ కావడంతో సోమవారం ఆమెకు పాఠశాలలో వీడ్కోలు, సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ముఖ్యోపాధ్యాయుడు శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజం అన్నారు. కానీ వృత్తిలో ఉన్నంత వరకు వారు చేసిన ఉత్తమ సేవలు ఎప్పుడూ గుర్తుంటాయన్నారు. ఉపాధ్యాయిని శోభ 21 ఏళ్లుగా విద్యార్థులకు సుదీర్ఘంగా సేవలందించారన్నారు. అనంతరం ఆమెను పాఠశాల సిబ్బంది బృందం సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు స్వర్ణకుమారి, నిర్మల, శ్వేత, ఈరప్ప, శ్రీనివాస్, రవికుమార్, హులిగమ్మ, నాగవేణి, భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా ఖరీఫ్ పనులు



తొలకరి వర్షాలకు పొలాల్లో విత్తనం వేస్తున్న రైతన్న



పొలంలో కలుపు నివారణకు గుంటక పాస్తున్న రైతన్న

కంప్లి: తుంగభద్ర జలాశయం నుంచి కాలువలకు నీటిని విడుదల చేయడంతో ఖరీఫ్ వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. గత కొన్ని రోజుల క్రితం కురిసిన చెదురు ముదురు వర్షాలకు కొంత మంది రైతులు తమ పొలాల్లో జొన్న, మొక్కజొన్న తదితర విత్తనాలు నాటారు. ఇటీవల ఆ పంటలు క్రమంగా ఎదుగుతుండడంతో రైతాంగంలో ఆశలు చిగురిస్తున్నాయి. ఇక డ్యాం నుంచి ప్రధాన కాలువలకు సాగునీరు విడుదల చేయడంతో నీటి కొరత ఉండదని రైతులు ఆశిస్తున్నారు. ప్రస్తుతం పొలాల్లో పెరుగుతున్న పంటల్లో కలుపు నివారణకు జోడెద్దులతో గుంటక పాసే పనులు చేపడుతున్నారు.

ఉన్నత స్థాయి సమావేశం కోసం ధర్నా



సర్కిల్‌లో ధర్నా చేస్తున్న దృశ్యం

కంప్లి: ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో రెవెన్యూ, ఆరోగ్య, వసతి, గ్రామీణాభివృద్ధి మంత్రులు, పోరాట ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేయాలని భూ వసతి, నివేశన వంచిత పోరాట సమితి సోమవారం అంబేడ్కర్ సర్కిల్ వద్ద ధర్నా నిర్వహించారు. పోరాట ప్రముఖులు కరియప్ప గుడిమని, నీలప్ప పెయింటర్ మాట్లాడుతూ అన్ని క్షేత్రాల్లో భూ మంజూరు సమితి ఏర్పాటు చేసి సమితిలో ఒక పోరాట సంస్థ ప్రతినిధిని నియమించాలన్నారు. మంజూరు ప్రక్రియ సరళ, త్వరితగతిలో ఉండాలన్నారు. అర్జీలు అందించిన వారి పట్ల నిర్లక్ష్యం చూపకుండా హక్కు పత్రాలను అందించాలన్నారు. 5 ఎకరాల కన్నా తక్కువ ఆక్రమించుకున్న ప్రభుత్వ అటవీ భూముల్లో ఉన్న ఎలాంటి అర్జీదారులను అక్రమణల పేరిట తొలగించరాదన్నారు. గత 40–50 ఏళ్లుగా సాగు చేస్తూ అర్జీ అందించిన నగరసభ, పురసభ, మహానగర పాలికె, పట్టణ పంచాయతీ చట్టంలో భూరహితులకు పరిహారాత్మక తీర్మానం చేపట్టాలన్నారు. దీని కోసం ఈనెల 14, 15 తేదీల్లో ఫ్రీడం పార్క్‌లో ఖాళీ కడుపుతో పోరాటం జరపనున్నామన్నారు. దీనిపై కరపత్రాలు విడుదల చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు జడెప్ప, వసంతరాజ్ కహళె, ఈ.ధనుంజయ, శాంతప్ప, పూజార్ దేవి, మౌలాబి, నిరంజనస్వామి పాల్గొన్నారు.

అంబేడ్కర్ రాజ్యాంగంతో అందరికీ న్యాయం



మాట్లాడుతున్న పీడీఓ సురేష్

కంప్లి: సమాజంలో అందరికీ న్యాయం జరిగేలా డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారని పీడీఓ సురేష్ తెలిపారు. సణాపుర రోడ్డులోని ముస్లిం షాదీ మహల్‌లో ఏర్పాటు చేసిన ఒక రోజు శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు పొందేందుకు విద్య అవసరమన్నారు. కంప్లి అంబేడ్కర్ అనుచర బళగ అధ్యక్షుడు రమేష్ సుగ్గేనహళ్లి డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చరిత్రను వివరించారు. కార్యక్రమంలో ప్రముఖ జనకవి రమేష్ గబ్బూరు, హెచ్‌సీ.రాఘవేంద్ర, కేబీఎస్ గౌరవ అధ్యక్షులు చెన్నబసప్ప, ప్రధాన కార్యదర్శి టీ.శివప్ప, సుధాకర్, పీసీ అంజినప్ప, పీసీ ఉమేష్, పూజారి, తిమ్మప్ప, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలకు డిమాండ్



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: యాపలదిన్ని జీపీలో జరిగిన అగ్నిప్రమాదానికి బాధ్యులైన అధికారులపై చర్యలు చేపట్టాలని కర్ణాటక ప్రాంత రైతు సంఘం డిమాండ్ చేసింది. సోమవారం కలెక్టరేట్ వద్ద చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి అధ్యక్షుడు రమేష్ మాట్లాడారు. యాపలదిన్ని జీపీ కార్యాలయంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో కంప్యూటర్, రికార్డులు, ఫర్నీచర్ పూర్తిగా ధ్వంసమై రూ.3 కోట్ల విలువ చేసే సామగ్రి నష్టానికి కారకులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానికాధికారికి వినతి పత్రం సమర్పించారు.

ఏపీఎంసీలో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం



మాట్లాడుతున్న నరసింహ నాయక్

రాయచూరు రూరల్: దేవదుర్గ ఏపీఎంసీలో ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతోందని రాష్ట్ర రైతు సంఘం జిల్లాధ్యక్షుడు నరసింహ నాయక్ అన్నారు. సోమవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుమతి లేకుండా దుకాణాలు వేసుకున్న వారి వద్ద నుంచి అధికారులు మార్కెట్ ధర రూ.6 లక్షలకు బదులుగా రూ.10 లక్షలు వసూలు చేశారని దుయ్యబట్టారు. అలాంటి అధికారులపై చర్యలు చేపట్టాలని, నారాయణపుర కుడి కాలువకు నీరు సక్రమంగా వదలాలని ఒత్తిడి చేశారు.